ఇంటర్మీడియట్ - మొదటి సంవత్సరం

## ద్వితీయ భాష

# తెలుగు

## అమరధామం

పాఠ్యపుస్తకం

&

## కథానందనం

ఉపవాచకం

ఇంటర్మీడియట్ విద్యామండలి, ఆంధ్రప్రదేశ్

తెలుగు & సంస్కృత అకాడమి, ఆంధ్రప్రదేశ్

# Intermediate

First Year Text Book

# TELUGU

Pages : xviii + 158 + iv

© Board of Intermediate Education
Andhra Pradesh.

**Reprint**
**2023**

**Copies : 24000**

- Published by Telugu and Sanskrit Akademi, Andhra Pradesh under the Centrally Sponsored Scheme of Production of Books and Literature in Regional Languages at the University level of the Government of India in the Ministry of Human Resource Development, New Delhi.

- All rights whatsoever in this book are strictly reserved and no portion of it may be reproduced by any process for any purpose without the written permission and prescribed by Board of Intermediate Education A.P. Vijayawada of the Copyright Owners.

**Rate : 87.00**

Printed in India

Laser Typeset by : **Telugu and Sanskrit Akademi, A.P.**

*Published and Printed by*

**M/s. GBR Offset Printers and Publishers**
Surampalli, Krishna Dist.

on behalf of **Telugu and Sanskrit Akademi**, Andhra Pradesh



శ్రీ. వై.యస్.జగన్‌మోహన్ రెడ్డి

అమరావతి

ముఖ్యమంత్రి
ఆంధ్రప్రదేశ్

**తెలుగు & సంస్కృత అకాడమికి అభినందనలు...**

చదువే నిజమైన ఆస్తి. చదువు ఎవరూ ఎత్తుకుపోలేని సంపద. ఇప్పుడు బడుల్లో, కాలేజీల్లో చదువుతున్న పిల్లలు ఆ చదువుల పునాదులమీదే తమ భవిష్యత్తును నిర్మించుకుంటారు. ప్రపంచమే ఒక కుగ్రామంగా మారిపోతున్న ఈ రోజుల్లో, ఈ తరం పిల్లలు ఎదిగాక ఏకంగా ప్రపంచంతోనే పోటీపడాల్సి ఉంటుంది. ఈ తరం పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే మంచి చదువు, మంచి గురువులు, మంచి విద్యా విధానం ఎంతో ముఖ్యం.

ఈ విషయాలన్నింటి మీదా శ్రద్ధ పెట్టిన మనందరి ప్రభుత్వం విద్యా విధానంలో ఎన్నో మార్పులు తీసుకువచ్చింది. మరెన్నో మార్పులకు శ్రీకారం చుట్టింది. పిల్లల్ని చదివించే అమ్మలకు ప్రోత్సాహకంగా అమ్మ ఒడి, పెద్ద చదువులు చదువుకుంటున్న పిల్లలకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చే జగనన్న విద్యా దీవెన, పెద్ద చదువులు చదువుకుంటున్న పిల్లల బోర్డింగ్ లాడ్జింగ్ ఖర్చుల కోసం జగనన్న వసతి దీవెన, బడి పిల్లలకు కుట్టుకూలితో సహా మూడు జతల యూనిఫాంలు. స్కూల్ బ్యాగ్. టెక్స్ట్ పుస్తకాలు, నోట్ బుక్స్, వర్క్ బుక్స్, బెల్టు, షూస్, సాక్సులు ఇచ్చే జగనన్న విద్యా కానుక, మధ్యాహ్న భోజనం పథకం మెనూ మార్చి పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు అవసరమైన పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలతో జగనన్న గోరుముద్ద; ఆరేళ్ళ లోపు పిల్లలకు పోషకాహారం అందిస్తూ, ఇంగ్లీష్ మీడియం ప్రీ ప్రైమరీ విద్య చెప్పించే విధంగా అంగన్‌వాడీల ఏర్పాటు; మొత్తంగా ప్రభుత్వ బడుల స్వరూపాన్నే మార్చేసే మనబడి నాడు–నేడు.... బడి పిల్లలకు సీబీఎస్ఈ సిలబస్ తో కూడిన ఇంగ్లీష్ మీడియం చదువులు, తప్పనిసరి సబ్జెక్టుగా తెలుగులో విద్యా బోధన... ఇలా అనేక కార్యక్రమాలను చేపట్టింది. వీటన్నింటితోపాటు అకాడమిని మళ్ళీ పునరుద్ధరించటం కూడా మనందరి ప్రభుత్వ హయాంలోనే జరిగింది.

అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 06.08.1968న తెలుగు అకాడమిని ప్రారంభించారు. తక్కువ కాలంలోనే అకాడమి ఆధ్వర్యంలో విస్తృతంగా పాఠ్య పుస్తకాలను, గ్రంథాలను ప్రచురించటం ద్వారా తెలుగు భాషాభివృద్ధికి, పోటీపరీక్షలకు, మానసిక–వ్యక్తిత్వ వికాసానికి అకాడమి ఎంతగానో కృషి చేసింది.

రాష్ట్ర విభజన తరవాత, అకాడమి నిర్లక్ష్యానికి గురి కావటంతో సంస్థ కార్యకలాపాలు మన రాష్ట్రంలో దాదాపు నిలిచిపోయాయి. మనందరి ప్రభుత్వం ఏర్పడ్డాక విద్యార్థులకు, ఉద్యోగార్థులకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలను అందుబాటులోకి తేవాలని సంస్కృత భాషను కూడా చేర్చి తిరుపతి ప్రధాన కేంద్రంగా తెలుగు & సంస్కృత అకాడమిని ఏర్పరచడం జరిగింది.

ఈ పరిణామాలన్నింటి తరవాత, 2021–22 విద్యా సంవత్సరం నుండి పాఠ్యపుస్తకాల ముద్రణతో మన అకాడమి కార్యకలాపాలను ప్రారంభిస్తున్నందుకు నా హృదయపూర్వక అభినందనలు. త్వరలోనే అకాడమి తన పూర్వవైభవాన్ని సంతరించుకోవాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలియజేస్తున్నాను.

(వై.యస్.జగన్‌మోహన్ రెడ్డి)

**డా॥ నందమూరి లక్ష్మీపార్వతి**
ఎమ్.ఎ., ఎమ్.ఫిల్., పి.హెచ్.డి.

అధ్యక్షులు (కేబినెట్ మంత్రి హోదా)

**తెలుగు & సంస్కృత అకాడమి**

## తెలుగు & సంస్కృత అకాడమి అధ్యక్షుల వారి సందేశం

ఇంటర్మీడియట్ విద్యామండలి, ఉన్నత విద్యామండలి, ఎస్.సి.ఇ.ఆర్.టి. వారు రూపొందించే సిలబస్ ఆధారంగా వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలల నుంచి ఉన్నత ప్రమాణాలు కలిగిన ఆచార్యులను (Professors), శాఖాధిపతులను, అధ్యాపకులను రచయితలుగా, సంపాదకులుగా నియమించి వారిచే అత్యంత నాణ్యత ప్రమాణాలతో కూడిన పాఠ్యపుస్తకాలు రూపొందించి, అవసరమైన సంఖ్యలో, సకాలంలో ముద్రించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగాగల అకాడమి ప్రాంతీయ కేంద్రాల ద్వారా పంపిణీకి చర్యలు చేపట్టడం జరుగుతోంది.

పైన తెలిపిన పాఠ్యపుస్తకాలతోపాటు మోనోగ్రాఫ్‌లు, నిఘంటువులు, మాండలికాలు, ప్రశ్నల నిధులు, సంప్రదింపు గ్రంథాలు, జనరంజక గ్రంథాలు, వ్యాసావళులు, భాషాశాస్త్ర గ్రంథాలు, పాఠశాలస్థాయి నిఘంటువులు, పదకోశాలు, పారిభాషిక పదకోశాలు వంటి పాఠ్యేతర గ్రంథాలు కూడా ఎప్పటికప్పుడు ఆధునికీకరించి, ముద్రించి విద్యార్థులకు అందుబాటులో ఉంచుతుంది.

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ వారు నిర్వహించే పోటీ పరీక్షలకు, వివిధ విశ్వవిద్యాలయాలు నిర్వహించే ప్రవేశ పరీక్షలకు అకాడమి ప్రచురణలలో ఉండే అంశాలనే ప్రామాణికమైన అంశాలుగా నిర్ణయిస్తారు. కాబట్టి విద్యార్థులంతా ఉన్నత ప్రమాణాలు కలిగిన అకాడమి పాఠ్యపుస్తకాలు వినియోగించుకొని మీ భవిష్యత్తు స్వర్ణమయం చేసుకోవాలని తెలుగు & సంస్కృత అకాడమి అధ్యక్షురాలిగా నేను కోరుకుంటున్నాను.

నందమూరి లక్ష్మీపార్వతి
అధ్యక్షురాలు, తెలుగు & సంస్కృత అకాడమి, ఎ.పి.

**జె. శ్యామలరావు**, ఐ.ఎ.ఎస్.,
ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి

ఉన్నత విద్యాశాఖ
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

## సందేశం

తెలుగు మరియు సంస్కృత అకాడమి స్థాపించిన అతి తక్కువ కాలంలోనే విద్యార్థులకు కావలసిన పుస్తకాలు తెలుగు, ఆంగ్ల మాధ్యమాలలో సకాలంలో ముద్రించి విద్యార్థులకు అందుబాటులోకి తెస్తున్నందుకు మొదట తెలుగు మరియు సంస్కృత అకాడమికి శుభాభినందనలు తెలుపుతున్నాను.

ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని విద్యార్థులు మరియు పరీక్షార్థుల కోసం తెలుగు మరియు సంస్కృత అకాడమి ప్రశ్నలనిధులు, పాఠ్యపుస్తకాలు, పోటీ పరీక్షల గ్రంథాలు, సంప్రదింపు గ్రంథాలు, మోనోగ్రాఫులు, వ్యాసావళులు, అనువాదాలు సరళమైన భాషలో రూపొందించి అందుబాటులోకి తేవడం జరుగుతోంది.

తెలుగు మరియు సంస్కృత అకాడమి పాఠ్యపుస్తకాలలో పొందుపరచే సమాచారం అత్యంత ప్రామాణికమైంది. కాబట్టి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యనభ్యసించే విద్యార్థులంతా తెలుగు మరియు సంస్కృత అకాడమి పుస్తకాలను వినియోగించుకొని తమ భవిష్యత్తును ఉజ్జ్వలంగా తీర్చిదిద్దుకోవలసిందిగా ఆకాంక్షిస్తున్నాను.

శ్యామలరావు

(శ్యామలరావు)

# భారత రాజ్యాంగ ప్రవేశిక

**భారతదేశ ప్రజలమైన మేముభారతదేశాన్ని**

**సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర**

రాజ్యముగ నిర్మించుకోవడానికి పౌరులందరికి

సాంఘిక, ఆర్థిక, రాజకీయ **న్యాయాన్ని**

ఆలోచన, భావప్రకటన, విశ్వాసము,

ధర్మము, ఆరాధనలలో **స్వేచ్ఛను**

అంతస్తు (హోదా)లోను,అవకాశములోను **సమానత్వమును**

చేకూర్చుటకు మరియు వారందరిలో

వ్యక్తి గౌరవమును, జాత్యైక్యతను మరియు

అఖండతను తప్పక సంరక్షిస్తూ **సౌభ్రాతృత్వాన్ని**

పెంపొందించుటకు సత్యనిష్ఠాపూర్వకముగ తీర్మానించుకొని

**26 నవంబరు 1949న**

మన రాజ్యాంగపరిషత్తులో పరిగ్రహించి

శాసనంగా రూపొందించుకొన్న

ఈ రాజ్యాంగాన్ని మాకు మేము సమర్పించుకుంటున్నాము.

## ప్రధాన సంపాదకులు

**ఆచార్య మేడిపల్లి రవికుమార్**

శాఖాధ్యక్షులు, తెలుగు అధ్యయన శాఖ
శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి

## సంపాదకులు

**డా॥ మన్నం నరసింహులు**

అసిస్టెంటు ప్రొఫెసరు, శాఖాధ్యక్షులు
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నగరి
చిత్తూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్

## సంపాదక సభ్యులు/రచయితలు

**ఆచార్య జి. యోహానుబాబు**

తెలుగుశాఖ, ఆంధ్రవిశ్వవిద్యాలయం,
విశాఖపట్టణం

**డా॥ టి. మాలకొండయ్య**

అసిస్టెంటు ప్రొఫెసరు, శాఖాధ్యక్షులు,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నగరి, చిత్తూరు జిల్లా.

**డా॥ పోతుగుంట్ల విజయకుమార్**

అసిస్టెంటు ప్రొఫెసరు, శాఖాధ్యక్షులు,
సిల్వర్‌జూబ్లి ప్రభుత్వ కళాశాల (స్వ),
కర్నూలు

**డా॥ మన్నం నరసింహులు**

అసిస్టెంటు ప్రొఫెసరు, శాఖాధ్యక్షులు,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నగరి,
చిత్తూరు జిల్లా.

**డా॥ నారాయణం శేషుబాబు**

ఉపన్యాసకులు
ప్రభుత్వ జూనియర్ కళాశాల,
పిట్టలవానిపాలెం, గుంటూరు జిల్లా.

**డా॥ మొయిద హనుమంతరావు**

ఉపన్యాసకులు
ప్రభుత్వ జూనియర్ కళాశాల,
డెంకాడ, విజయనగరం జిల్లా.

**డా॥ అరవ సుబ్రమణ్యం రెడ్డి**

ఉపన్యాసకులు
ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు)
చంద్రగిరి, చిత్తూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్

## ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్యా మండలి సమన్వయ సంఘం

**శ్రీ ఎం. వి. శేషగిరిబాబు,** ఐ.ఎ.ఎస్.

కార్యదర్శి

ఇంటర్మీడియట్ విద్యామండలి, ఆంధ్రప్రదేశ్

## విద్యా విషయక పరిశోధన, శిక్షణ విభాగం (పాఠ్యపుస్తకాలు)

**డా. ఎ. శ్రీనివాసులు**

ప్రొఫెసర్

**శ్రీ ఎం. రవిశంకర్ నాయక్**

అసిస్టెంట్ ప్రొఫెసర్

**డా. ఎం. రమణారెడ్డి**

అసిస్టెంట్ ప్రొఫెసర్

**శ్రీ జె.వి. రమణ గుప్త**

అసిస్టెంట్ ప్రొఫెసర్

## తెలుగు & సంస్కృత అకాడమి సమన్వయ సంఘం

**శ్రీ వి.రామకృష్ణ,** ఐ.ఆర్.ఎస్.
సంచాలకులు

**డా॥ ఎం. కోటేశ్వరమ్మ,** ఎం.కాం. పిహెచ్.డి.
రీసెర్చ్ ఆఫీసర్

**డా॥ ఎస్.ఎ.టి. రాజ్యలక్ష్మి ,** ఎం.ఎస్‌సి., బి.ఎడ్., ఎం.ఎ., పిహెచ్.డి
రీసెర్చ్ అసిస్టెంట్

**డా॥ కె.గ్లోరి సత్యవాణి,** ఎం.ఎస్‌సి., పిహెచ్.డి., ఎం.ఎడ్.
రీసెర్చ్ అసిస్టెంట్

# భూమిక

ఇంటర్మీడియట్‌లో ద్వితీయ భాషగా మాతృభాష అయిన 'తెలుగు'ను ఎంపిక చేసుకున్న విద్యార్థులకు నా అభినందనలు.

మానవ పరిణామ క్రమంలో భాష పుట్టుక ఒక కీలకమైన ఘట్టం. ఒక మనిషి మరొక మనిషికి అర్థమయింది ఈ భాష మూలంగానే. భాష నుంచే సాహిత్యం అభివృద్ధి చెందింది. సమాజం సంస్కారవంతం కావడానికి ఈ సాహిత్యం గొప్ప ఉత్ప్రేరకంగా పని చేస్తుంది. సంస్కారం మూలంగా మానవ సంబంధాలు మెరుగుపడతాయి. ప్రపంచీకరణ పవనాలు నలుదిశలా అలుముకుంటున్న వర్తమాన కాలంలో మానవ సంబంధాల మనుగడ ప్రశ్నార్థకమౌతూ ఉంది. ఈ పరిస్థితుల్లో ఉత్తమ సాహిత్యాన్ని విద్యార్థి దశ నుంచే అధ్యయనం చేయవలసిన అవసరం పెరిగింది.

ఇందులోని పాఠ్యాంశాలన్నీ వైవిధ్యభరితమైనవి. అయినప్పటికీ మొత్తంగా చూసినప్పుడు ఒక సంపూర్ణత్వాన్ని కలిగి ఉంటాయి. ఇంటర్మీడియట్ విద్యను విజయవంతంగా పూర్తి చేసుకున్న విద్యార్థులు వేరువేరు కోర్సుల్లో చేరతారు. వేరువేరు విభాగాలలో స్థిరపడతారు. ఆయా రంగాలలో విజయాలు సాధించాలంటే సమాజం పట్ల మనిషికి సహానుభూతి కావాలి. అందుకు అనుగుణమైన పాఠ్యాంశాలను ఎంపికచేసి, శాస్త్రీయ పద్ధతులతో ఈ పాఠ్యపుస్తకాన్ని రూపొందించిన సంపాదక మండలిని అభినందిస్తున్నాను.

2021-22 విద్యాసంవత్సరం నుండి తెలుగు అకాడమి ద్వారా ఇంటర్మీడియట్ పుస్తకాలు ముద్రించడం అభినందనీయం. ఎంతో పేరున్న ఈ సంస్థకు సంచాలకులుగా ఉండటం అదృష్టంగా భావిస్తున్నాను.

**శ్రీ వి. రామకృష్ణ,** ఐ.ఆర్.యస్.

సంచాలకులు, తెలుగు & సంస్కృత అకాడమి

ఆంధ్రప్రదేశ్

# విషయసూచిక

## పద్య భాగం


| | | | |
|---|---|---|---|
| 1. | ధర్మ పరీక్ష | తిక్కన | 1 - 10 |
| 2. | తిన్నని ముగ్ధ భక్తి | ధూర్జటి | 11 - 18 |
| 3. | నందీశ్వరుని శాపం | కంకంటి పాపరాజు | 19 - 27 |
| 4. | శ్మశానవాటి | గుఱ్ఱం జాషువా | 28 - 31 |
| 5. | చేయెత్తి జైకొట్టు తెలుగోడా! | వేములపల్లి శ్రీకృష్ణ | 32 - 36 |
| 6. | కపాలమోక్షం | శ్రీరంగం నారాయణబాబు | 37 - 46 |


## గద్యభాగం


| | | | |
|---|---|---|---|
| 1. | హాసము - హాస్యము | మునిమాణిక్యం నరసింహారావు | 49 - 54 |
| 2. | అప్పుడు పుట్టి ఉంటే... | దేవులపల్లి కృష్ణశాస్త్రి | 55 - 60 |
| 3. | మహిళోద్యమ జనకుడు : కందుకూరి | మల్లాది సుబ్బమ్మ | 61 - 67 |
| 4. | కలవారి కోడలూ కలికి కామాక్షి | యస్వీ భుజంగరాయశర్మ | 68 - 73 |
| 5. | గాన సుధాకరుడు : మంగళంపల్లి | కొడవటిగంటి కుటుంబరావు | 74 - 83 |
| 6. | మాటతీరు | యార్లగడ్డ బాలగంగాధరరావు | 84 - 90 |

## వ్యాకరణాంశాలు - నైపుణ్యాలు


| | | | |
|---|---|---|---|
| 1. | సంధులు | ............................ | 93 - 96 |
| 2. | సమాసాలు | ............................ | 97 - 100 |
| 3. | లేఖారచన | ............................ | 101 - 105 |
| 4. | పదదోషాలు | ............................ | 106 - 107 |
| 5. | స్థూల అవగాహన | ............................ | 108 - 110 |
| 6. | అనువాదం | ............................ | 111 - 112 |


## ఉపవాచకం (కథా నందనం)


| | | | |
|---|---|---|---|
| 1. | కుంకుడాకు | చాగంటి సోమయాజులు | 115 - 120 |
| 2. | అంపకం | సత్యం శంకరమంచి | 121 - 124 |
| 3. | ఊతకర్ర | పులికంటి కృష్ణారెడ్డి | 125 - 130 |
| 4. | సౌందర్యం | వాసిరెడ్డి సీతాదేవి | 131 - 138 |
| 5. | ఎచ్చరిక | బోయ జంగయ్య | 139 - 147 |
| 6. | దహేజ్ | శశిశ్రీ | 148 - 155 |
| | | ...... | |
| | | **మాదిరి ప్రశ్న పత్రం** | 156 - 158 |

# పద్య భాగం


| | | |
|---|---|---|
| 1. | ధర్మ పరీక్ష | 1 - 10 |
| 2. | తిన్నని ముగ్ధ భక్తి | 11 - 18 |
| 3. | నందీశ్వరుని శాపం | 19 - 27 |
| 4. | శ్మశానవాటి | 28 - 31 |
| 5. | చేయెత్తి జైకొట్టు తెలుగోడా! | 32 - 36 |
| 6. | కపాలమోక్షం | 37 - 46 |

1

# ధర్మ పరీక్ష



- తిక్కన

## కవి పరిచయం

ఈ పాఠ్యభాగం తిక్కన రచించిన ఆంధ్ర మహాభారతం లోని మహా ప్రస్థానిక పర్వం (ఏకాశ్వాసం) లోనిది.

కవిత్రయంలో ఒకరైన తిక్కన 13వ శతాబ్దికి చెందిన కవి. ఇంటిపేరు కొట్టరువు. యజ్ఞం చేసి సోమయాజి అయ్యాడు. తిక్కన నెల్లూరును పరిపాలించిన మనుమసిద్ధి ఆస్థానకవి. తొలుత నిర్వచనోత్తర రామాయణాన్ని రచించి మనుమసిద్ధికి అంకితమిచ్చాడు. సంస్కృత వ్యాస భారతంలోని నాల్గవదయిన విరాట పర్వం మొదలుకొని స్వర్గారోహణ పర్వం వరకూ 15 పర్వాలను ఒంటి చేతితో జాతికందించాడు. భారతాన్ని ఆంధ్రావళి మోదాన్ని పొందేటట్లు రచించి, హరిహరనాథునికి అంకితమిచ్చాడు.

కేతన తన దశకుమార చరిత్రను, తిక్కనకు అంకితమిస్తూ– తిక్కన వంశ వివరాలను, కవిత్వ విశేషాలను, వ్యక్తిత్వ గుణాలను కొన్నింటిని తెలిపాడు. తిక్కన మహాభారతాన్నే కాక 'విజయసేనము' అనే ప్రబంధాన్నీ, 'కవి వాగ్బంధము' అనే ఛందోగ్రంథాన్నీ, కృష్ణశతకాన్నీ రచించాడని అంటారు. కాని అవి లభించలేదు. తిక్కన సోమయాజికి కవిబ్రహ్మ, ఉభయ కవిమిత్రుడు అనే బిరుదులున్నాయి. ఇతని కవిత్వంలో 'అల్పాక్షరముల అనల్పార్థరచన'; నాటకీయతలు ప్రాధాన్యం వహిస్తాయి.

## పాఠ్యభాగ సందర్భం

కురుక్షేత్రయుద్ధ విజేత అయిన ధర్మరాజు హస్తినాపుర రాజ్య పాలన సాగిస్తున్నాడు. కాలంతో వచ్చిన మార్పుల్ని గమనిస్తున్నాడు. కొంత కాలానికి ఉత్తమ గతిని పొందాలని సంకల్పించాడు. అందుకు మహాప్రస్థానమే అత్యుత్తమ సాధనంగా తోచింది. అందుకోసం తమ్ములను ఒప్పించాడు. పరీక్షిత్తుకు పట్టం కట్టి, తన బరువు బాధ్యతల నుండి విడుదల పొందాడు. రాజ భోగాలు వదిలాడు, నారచీరలు కట్టి, తమ్ములతో సహా మహా ప్రస్థానానికి బయలు దేరాడు. ద్రౌపది వారి వెంట నడిచింది. వారికి తోడుగా ఒక శునకమూ వచ్చింది.

ఇలా పాండవులు, ద్రౌపది, కుక్క ఈ ఏడుగురూ హస్తినాపురం వదిలి ఎంతో దూరం ప్రయాణించారు. హిమాద్రిని దాటి, మేరు పర్వత ప్రాంతాలకు చేరారు. ఈ సందర్భంలో ఈ పాఠ్యభాగం మొదలవుతుంది.

## పాఠ్యభాగ సంగ్రహం

యోగ సాధన పరులయిన వారు తమ ప్రయాణంలో ఒక్కొక్కరు తమ శరీరాలు విడిచిపెట్టారు. ద్రౌపది, సహదేవుడు, నకులుడు, అర్జునుడు, భీమసేనుడు క్రమంగా నేల కొరిగారు. భీముడు తమ పతన హేతువులను అడిగాడు. ధర్మజుడు వాటిని విశదీకరించాడు. చివరకు కుక్క మాత్రమే ధర్మరాజుకు తోడుగా నిలిచింది.

ఇంతలో అమరావతీ పురాధీశుడు ఇంద్రుడు వచ్చాడు. తన లోకానికి రమ్మని ధర్మజుణ్ణి కోరాడు. అపుడు ధర్మజుని మాటలలో సోదర ప్రేమ మాత్రమే కాక, తోటి బాటసారులుగా వారి పట్ల చూపిన ఆదరణ వ్యక్తమైంది. తనువును వదలిన తమ్ముళ్ళీ, ద్రౌపదినీ స్వర్గంలో చూడవచ్చనీ; తనతో రమ్మనీ ఆహ్వానించాడు ఇంద్రుడు. శునకం విషయమై వీరిద్దరికీ ధర్మచర్చ జరిగింది. దేవతాధిపతి ఇంద్రుడు, సమవర్తి అయిన యమధర్మరాజు పెట్టిన ధర్మ పరీక్షలో ధర్మరాజు నిలిచాడు. శునకం యమధర్మరాజుగా మారి, ధర్మజుని ఋజువర్తనను కొనియాడింది. ఇంద్రాది దేవతలందరూ ధర్మరాజును దివ్యరథంలో స్వర్గలోకానికి తీసుకొని వెళ్ళారు.

ఈ పాఠ్యభాగంలోని భీముని ప్రశ్నలు – ధర్మరాజు సమాధానాలు విద్యార్థులకు ఉత్సుకతనూ, ఆసక్తినీ కల్గిస్తాయి. అంతేకాక, వారి మనోవికాసానికీ, మూర్తిమత్వం ఇనుమడించడానికి దోహదపడతాయి. పాండవుల పతనకారణాలైన లోపాలు ఎవరిలోనూ ఉండరాదనీ, ధర్మప్రవర్తనే మనిషికి ఉత్తమగతిని చూపిస్తుందనీ తెలియజేయడం ఈ పాఠ్యభాగం ఉద్దేశం.

## పాఠ్యభాగం

చ. అటఁజని యచ్ఛమంబున హిమాచలమున్ సమతిక్రమించి వా
రటవులు భూములున్ నదులు నద్రులునుం గడుఁ బెక్కు లంచితో
త్కటదృఢయోగసేవననితాంతనిరాకులవర్తనంబు నొం
దుట గతఖేదులై కడచి తూలక మేరుసమీప భూమికిన్. 1

సీ. చనునప్పు డయ్యేద్వురును నతిస్థిరయోగ
సాధన పరులయి సత్వరముగఁ
బోవంగఁ బాంచాల భూపపుత్రిక యోగ
మెడలిన మేదినిఁ బడియె నధిప
పడిన సమీరణుకొడుకు గనుంగొని
యన్నతోఁ జెప్పి యయ్యతివవలనఁ
గాన మెన్నఁడు ధర్మ హాని యిట్లగుటకు
నరయంగఁ గత మేమి యని విషణ్ణుఁ
తే. డగుచు నడిగిన నాతఁ డిమ్మగువ యింద్ర,
తనయు దెసఁ బక్షపాతిని దానఁజేసి
సుకృతములు ఫలియింపమిఁ జూవె **దీని**
**కిట్టి దురవస్థ వాటిల్లె నీద్యచరిత.** 2

క. అని పలికి సమాధానము
దనబుద్ధిం దిరము సేసి ధైర్య స్థైర్యం
బున వికృతి లేనిగతి నా
వనిత శవము విడిచి కౌరవ విభుండేఁగెన్. 3

సీ. భూవర యమ్మెయిఁ బోవంగ సహదేవుఁ
డపగత ప్రాణుఁ డై యవనిఁ బడినఁ
గని వాయుజుఁడు ధర్మ తనయున కెఱిఁగించి
యితఁ డనహంకారుఁ డెపుడు నీకు
నతిభక్తి శుశ్రూష యాచరించుచు నుండు
మాలోన నెల్ల సన్మార్గవర్తి
యితనికి నేలొకో యిద్దెస వాటిల్లె
ననిన నమ్మనుజేంద్రుఁ డతనితోడ
తే. వీఁడు దనకంటెఁ బ్రాజ్ఞుండు లేఁడు జగతి
నెందు నని సంతతమ్ముఁదా నెడ్డఁదలఁచు
దాన నిట్లయ్యె నంచుపేక్షానిరూఢ
బుద్ధి నరుగుచు నుండె నప్పురుషవరుఁడు. 4

క. అనిలజుఁడు నరుఁడు నకులుఁడు,
శునకంబును దోన నరుగ సుస్థిరమతి యై
మనుజేంద్రవర్య యట్ల
జ్జనపతి సన నకులుతనువు జగతిం బడియెన్. 5

క. విను ద్రుపద నందనయుఁ దన
యనుజన్ముఁడు నంత నంత నవనిఁ బడుటఁ దాఁ
గని ధృతి దూలినయట్లు వ
డిన నకులునిఁ జూచి యడలు డెందముతోడన్. 6

సీ. అనిల సూనుఁడు ధర్మతనయున కెఱిఁగించి
యవ్విభుతో సుందరాకృతియును
శౌర్యంబు ధైర్యంబు సౌజన్యమును గురు
సంఘమునన కాదు జగతి నెందు
నితనికిఁ బోలె నహీనత మెఱయునే
యెవ్వరి కైనను నిట్టిపుణ్యుఁ
గుత్సితదశ యెట్లొకో పొందె నక్కట
యనవుడు నక్కొరవాగ్రగణ్యుఁ

తే. దతని కిట్లను నీతండు నాత్మసదృశుఁ,
డఖిల జగముల లేఁడు రూపాతిశయము
తనక కలదని యెపుడుఁ జిత్తమునఁ దలఁచు
నయ్యహంకృతి నిట్టి కీడయ్యెఁజువ్వె. 7

క. అని ధృతిసారంబూఁది య
తని తనువు నుపేక్షఁ గూర్చి ధర్మతనూజుం
డనఘ చనుచుండెఁదక్కటి
యనుజులు గుర్కురముఁదోన యరుగుచునుండన్. 8

సీ. ద్రౌపది పాటును దనయనుజన్ముల
పడుటయుఁ గనుఁగొని పార్థుఁ డాత్మ
యలమట మునిఁగిన నిల విగతాసుఁడై
పడినఁ గుందుచుఁ జూచి బక విరోధి
యన్నకుఁ జూపి యీ యమలచరిత్రుని
యం దెన్నఁడును నసత్యంబుఁ గాన
మిటు వడుటకుఁ గత మేమి నావుడు నీతఁ
డక్కౌరవుల నెల్ల నొక్కనాఁడ

తే. యాహవంబునఁ దెగ టార్తు ననియె నట్లు
సేయఁడయ్యెఁ **బల్కొక్కటి సేఁత యొకటి**
**యగుట చాల దోషము** విను మదియుఁ గాక
యెల్ల కోదండధరుల గర్హించుచుండు. 9

ఉ. దానను దాన నిట్లగుట దప్పునె యంచుఁ దదీయమైన య
మ్మానిత దేహమున్ విడిచి మానవ నాథుఁడు దాల్మిఁ జేసి బ
ద్ధానిరతాత్ముఁడై యరిగె నత్తఱి వాయుజుఁ డార్తి నెంతయున్
దీనతఁ బొంది ధైర్యలత ద్రెవ్విన నేలకు వ్రాలె భూవరా. 10

క. అప్పుడు దగ నిట్లను నతఁ
డప్పౌరవ వరునకో ధరాధిప కనుఁగొ
మ్మిప్పా టేమిట వచ్చెం
జెప్పు మెఱుఁగుదేనిఁ గరుణ చిగు రొత్తంగన్. 11

చ. అన విని యాతఁ డిట్లనియె నాతనితో భవదీయ మైన భో
జన మతిమాత్ర ముద్ధతిఁ బ్రచండుఁడ వై భుజశక్తి నెవ్వరిం
గొనక కడంగి రజ్జు పలుకుల్ గడుఁ బెక్కులు పల్కు దెప్డు నీ
వనుపమ శౌర్య యిప్పుడుట కత్తెఱఁగుల్ గతమెల్లఁ జెప్పితిన్. 12

క. అని పలికి నిరీక్షింపక
చనుచుండె నితండు ధైర్యసారోదారుం
డును నిశ్చయ మహితుఁడునయి
వెనుక శునక మధిక భక్తి విడువక చనఁగన్. 13

తే. ఆసమంచిత సారమేయంబు పాండు
ధరణినాయకు నగ్రిమతనయుపిఱుఁద
నధిక భక్తి యుక్తంబుగ నరుగు చునికి
పలుమఱును నీకుఁ జెప్పితిఁ దలఁచియుండు. 14

వ. అని పలికి వైశంపాయనుండు జనమేజయున కిట్లను నట్లు నిష్ఠాగరిష్ఠుండయి
యుధిష్ఠిరుండరుగు చుండ. 15

సీ. దివ్య దేహోద్ధత దీప్తిసంతానంబు
దిశలు పదింటను దీటు కొనఁగ
రథ సమాగమన సంరావంబు మేరు గ
హ్వరములఁ బ్రతిరవోత్కరము నీన
నచ్చటి సిద్ధసాధ్య మునీంద్ర గణముల
నానావిధ స్తోత్రనాద మెసఁగఁ
దత్ప్రదేశంబు బోధస్ఫీత కల్ప వృ
క్షంబులు పుష్ప వర్షములు గురియ

తే. నింద్రుఁ డేతెంచి యాదర మెసక మెసగ
నక్కురు క్షితిపాలున కగ్ర భాగ
వర్తి యగుటయు నతఁ డభివందనంబు
సేసె సవినయ భక్తి విశేష మొప్ప. 16

వ. అట్లు ప్రణతుండయిన నభినందించి యప్పురందరుండతని దివ్యస్యందనంబెక్కుమని
పలికిన నతండు శోక సంతప్తుండగుచు నతని కిట్లనియె. 17

*శా. తోడంబుట్టువులందఱుం బడిన యా దుఃఖంబు చిత్తంబు సం
పీడం బెట్టెడు సౌకుమార్యవతి దప్పిం గూలెఁ బాంచాలి వా
ర్ధోడై వచ్చిరి వారు లేక యిట మీతో రాను వారెల్ల నా
తోడం గూడఁగ వచ్చునట్లుగఁ గృపాధుర్యాత్మ కావింపవే. 18

చ. అన విని యింద్రుఁడిట్లనియె నక్కురు భర్తకు శోకమేల నీ
యనుజులు ద్రౌపదీసహితులై తనువుల్ దిగఁద్రావి చన్న వా
రనఘ యమర్త్య లోకమున కక్కడఁ గాంచెదు గాక వారలం
దనువు దొఱంగఁ గావలదు ధర్మమయాత్మక నీవు రావనా. 19

సీ. అనుటయు ధర్మజుండమరేంద్రుతో నన్ను
నత్యంత దృఢభక్తి నాశ్రయించి
పుర మేను వెడలునప్పుడు మొదల్గాఁ దోన
చనుదెంచెనీ భవ్యసారమేయ
మిది యట రావలదే నా మనంబు ని
ష్ఠుర వృత్తికోర్వ దస్తోక పుణ్య
నిరతాత్మ నావుడు దరహాస మొప్ప న
బ్బల వైరి యిట్లంట పాడియే య
తే. మర్త్యభావము కుక్క కేమాడ్కిఁ గలుగు
ననఘ నీ చింత తెఱఁగశక్యంబు దీని
విడిచి చనుటేల నిష్ఠుర వృత్తియయ్యె,
**నిచటఁ దడయంగ నేటికి నెక్కు రథము.** 20

వ. అనిన నమ్మనుజేంద్రుం డింద్రునితోడ నవార్యంబును దుష్కరంబును నగు కార్యం
బేనియు నార్యుండును బ్రభుండును నైన నీయట్టి సత్పురుషుండు సంశ్రితులకై
సంఘటింప వలదె భక్త పరిత్యాగంబు సేసి పడయు సిరి నాకు నెంత యింపయ్యెడు
ననుటయు నయ్యనిమిష నాథుండు. 21

చ. అలుక హరించు ధర్మముల నట్లగుటం గురువంశవర్య నీ
వలుగక విన్ము కుక్కలకు నావసథంబు త్రివిష్టపంబునం
గలుగునె నీకు నిష్ఠురత గల్గదు దీనిఁ బరిత్యజించినం
జలము కొనంగనేల **శుభ సంగమనంబెడసేఁత కృత్యమే.** 22

సీ. అనవుడు ధర్మనందనుఁ డమ్మహాత్ముతో
వినుభక్తియుక్తుని విడుపు బ్రహ్మ
హత్యఁ బోలెడి పాపమని చెప్పుదురు పెద్ద
లట్లు గావున దీని నఖిలధర్మ
సారజ్ఞ విడుచుట సనదు దివ్య సుఖంబు
నకుఁ గాఁగఁ బాపంబునకుఁ జొరంగఁ
జాల నావుడును వాసవుఁడు వ్రతస్థుండు
కుక్క నంటిన వారి కోరి చేయు

తే. సుకృతమునకు నాశంబగు సువ్రతాత్మ
యింత యొప్పని నిర్బంధ మేల చెపుమ
విడువుమీ శునకము దీని విడువఁబడుట
నాక లోక సౌఖ్యంబు నొనర్చు నీకు. 23

*చ. జనులు నుతింపఁగా సుకృత సంపదఁజేసి యమర్త్య భావముం
గనియును జెందకిట్లునికి కార్యమె ద్రౌపది భీమసేను న
ర్జునుఁ గవలం దృజించుటకు సువ్రత చాలితి చాల వయ్యె దీ
శునకము విడ్వ **నిత్తెఱఁగు సూరి నుతుం డగు నీకు నర్హమే** 24

సీ. అన విని ధర్మజుం డఖిలలోకములకుఁ
బతివి ధర్మమునకుఁ బ్రభువ విట్టి
నీ కంటె నెఱుఁగుదునే సదసత్ప్రకా
రము లట్లుఁ గాక వాదము మహాత్ము
లయిన వారలతోడ నగునె చేయంగ నై
నను విన్నవింపఁ దగిన తెఱంగు
విన్నవించుట దోష విధము గా
దనియెడు బుద్ధిఁ జేసెద నేను బూని విన్న

తే. పంబు భీమ ముఖ్యులును ద్రౌపదియుఁ జచ్చి
రేను వారల విడువక యేడ్చుచున్న
వత్తురే తోడ వచ్చి చావని శునకము
విడువ కుండుట తప్పుగా నుడువఁదగునె 25

చ. అనఘ చరిత్ర విన్ము శరణాగతుఁ జేకొన కున్కి శుద్ధ మి
త్రునియెడఁ జేయు ద్రోహము వధూటి వధించుట విప్రు నర్థముం
గొనుట యనంగఁ గల్గునివి గూడి సమంబగు నాకుఁ జూడ భ
క్తు ననపరాధునిన్ విడుచు దోషముతో నిది యోర్వ వచ్చునే 26

ఉ. కావున నాక లోకపు సుఖంబటు లుండఁగ నిమ్ము దేవ నీ
భావము నిల్పు నా దెసఁ గృపా భరితంబుగ సారమేయ సం
భావనసేఁత దోసముగఁ బట్టమి నాకు వరంబు నీవు వొ
మ్మీ వనభూమి నుండెద సమిద్ధ తపంబుల నిన్న కొల్చుచున్ 27

వ. అని పుయిలోడక పలికెఁ బౌరవోత్తమా యాకర్ణింపుము. 28

సీ. అట్లతి దృఢనిశ్చయంబుగఁ బలికిన
తనపుత్త్రుఁ గనుఁగొని ధర్ముఁడధిక
సంప్రమోదముఁ బొంది సారమేయాకృతిఁ
బాసి తానాత్మ రూపంబుఁ దాల్చి
పరమ సంభ్రమకృత ప్రణతియు నానంద
భరితుండునగు నాన్నపాలు తోడ
నీ పుణ్యవృత్తంబు నిర్మల మేధయు
నఖిలభూతంబులయందుఁ గలుగు

తే. దయయు నాదు చిత్తముఁ బ్రమదమునఁ దేల్చె
**వత్స! భూలోకమున నిట్టివారుఁ గలరె**
తొల్లియును ద్వైత వనమున దోష దూర
మయిన నీ మనమున తెఅంగరసి నాఁడ 29

# అభ్యాసం

## I. వ్యాస రూప సమాధాన ప్రశ్నలు

1. ద్రౌపది, పాండవుల పతన కారణాలను వివరించండి?
2. ధర్మజునికి – ఇంద్రునికి శునకం విషయంగా జరిగిన చర్చను విశ్లేషించండి?

## II. సంక్షిప్త రూప సమాధాన ప్రశ్నలు

1. సహదేవుడెట్టివాడు?
2. నకులుని గుణాలను పేర్కొనండి?
3. పార్థుని మరణ కారణాలేవి?
4. తిక్కన గురించి వివరించండి?

## III. ఏక వాక్య / పద రూప సమాధాన ప్రశ్నలు

1. 'ధర్మ పరీక్ష' పాఠ్యభాగ రచయిత ఎవరు?
2. 'ధర్మపరీక్ష'ను ఏ గ్రంథం నుండి స్వీకరించారు?
3. తిక్కన ఎవరి ఆస్థాన కవి?
4. తిక్కన తన భారతాన్ని ఎవరికి అంకితమిచ్చాడు?
5. కేతన దశకుమార చరిత్రను ఎవరికి అంకితమిచ్చాడు?
6. పాంచాల రాజకుమార్తె ఎవరు?
7. 'బక విరోధి' ఎవరు?
8. త్రివిష్టపం అంటే ఏమిటి?
9. సారమేయ రూపాన ఉన్నదెవరు?

## IV. సందర్భ సహిత వ్యాఖ్యలు

1. దీనికిట్టి దురవస్థ వాటిల్లె నీద్యచరిత!
2. పల్కొక్కటి సేత యొకటి యగుట చాల దోషము
3. ఇచట తడయంగ నేటికి నెక్కురథము
4. శుభ గమనంబెడ సేఁత కృత్యమే
5. ఇత్తెఱఁగు సూరి సుతుండగు నీకు నర్హమే
6. వత్స! భూలోకమున నిట్టి వారుఁగలరె

## V. సంధులు

| | |
|---|---|
| రూపాతిశయము | శోకమేల |
| చిగురొత్తు | మునీంద్ర |
| నీయనుజులు | అమరేంద్రుడు |
| డప్పింగూలె | దేహోద్ధతి |
| తూలినయట్లు | అత్యంత |
| రూపంబుదాల్చి | నుదువంc దగునె |
| ధుర్యాత్మ | మహాత్మ |
| అట్లుగావున | |

## VI. సమాసములు

| | |
|---|---|
| సిద్ధసాధ్యులు | ధర్మహాని |
| నాకలోక సుఖములు | విగతాసుడు |
| భక్తియుక్తుడు | అసత్యము |
| ధైర్యలత | దివ్యస్యందనము |
| పుష్పవర్షము | ధైర్య స్థైర్యములు |
| కోదండ ధరుడు | |

### గమనిక


❖ 26వ పద్యంలోని 'విప్రునర్థముంగొనుట' అనే వాక్యాన్ని 'పరద్రవ్యాన్ని హరించుట' అనే అర్థంలో స్వీకరించగలరు.

### కార్యాచరణ

❖ ఉపాధ్యాయులు మహాభారత ప్రాశస్త్యాన్ని విద్యార్థులకు తెలియచేయగలరు. కవిత్రయంలో తిక్కన విశిష్టతను కూడా వివరించగలరు.

❖ ❖ ❖

# 2 తిన్నని ముగ్ధ భక్తి



**- ధూర్జటి**

## కవి పరిచయం

ఈ పాఠ్యభాగం ధూర్జటి రచించిన 'శ్రీకాళహస్తి మాహాత్మ్యము' లోని తృతీయాశ్వాసం నుండి గ్రహించబడింది. ధూర్జటి తల్లి సింగమ, తండ్రి నారాయణుడు. గురువు మహాదేశిక సార్వభౌముడు. ధూర్జటి అంటే శివుడని అర్థం. ధూర్జటి గొప్ప శివ భక్తుడు.

ధూర్జటి 16వ శతాబ్దంలో విజయనగరాన్ని పరిపాలించిన శ్రీకృష్ణదేవరాయల 'అష్టదిగ్గజ' కవులలో ఒకడు. "స్తుతమతియైన యాంధ్రకవి ధూర్జటి పల్కులకేల గల్గెనో యతులిత మాధురీ మహిమ" అని రాయలు ప్రశంసించాడు. రాయలచేత ధూర్జటి అనేక గౌరవాలు పొందాడు.

ధూర్జటి 'శ్రీకాళహస్తి మాహాత్మ్యమే' కాక, 'శ్రీకాళహస్తీశ్వర శతకము'ను కూడా రచించాడు. ఇవి ధూర్జటికి శ్రీకాళహస్తీశ్వరుడైన శివునిపై గల భక్తిని తెలియచేస్తాయి. 'శ్రీకాళహస్తి మాహాత్మ్యము' క్షేత్ర మాహాత్మ్యాన్ని తెలియచేసే ప్రబంధం. ఇది 756 గద్య పద్యాలతో కూడిన నాలుగు ఆశ్వాసాల చంపూ ప్రబంధం. మూలకథ స్కాంద పురాణం నుండి గ్రహించబడింది. ఈ ప్రబంధంలో సాలె పురుగు (శ్రీ), పాము (కాళము), ఏనుగు (హస్తి)ల వృత్తాంతం, వశిష్ఠుని వృత్తాంతం, బ్రహ్మ వృత్తాంతం, తిన్నడను కన్నప్ప కథ, నత్కీరుని కథ, వేశ్యాపుత్రికల కథ మొదలైన ఉపాఖ్యానాలు ఉన్నాయి. ధూర్జటి 'శ్రీకాళహస్తి మాహాత్మ్యము'ను కాళహస్తీశ్వరునికే అంకితం ఇచ్చాడు.

## పాఠ్యభాగ సందర్భం

బాహుదానది ఒడ్డున పూర్వం 'పొత్తపినాడు' అనే ప్రాంతంలో 'ఉడుమూరు' అనే బోయపల్లె ఉండేది. ఆ పల్లె రాజు నాథనాథుడు. అతని భార్య తందె. వీరికి జన్మించిన కొడుకు తిన్నడు. ఒకనాడు తిన్నడు వేటకు వెళ్ళాడు. వేటాడి, అలసిపోయి ఒక పొగడ చెట్టు కింద నిద్రపోయాడు. అతనికి కలలో శివుడు సాక్షాత్కరించాడు. ఈ సందర్భంలో ఈ పాఠ్యాంశం మొదలవుతుంది.

## పాఠ్యభాగ సంగ్రహం

అడవిలో వేటాడి అలసి నిద్రించిన తిన్ననికి జంగమ రూపంలో శివుడు కనిపించాడు. కేతకీ నది ఒడ్డున ఉన్న శివలింగాన్ని సేవించమని కోరాడు. తిన్నడు శివలింగం దగ్గరికి వెళ్ళి దట్టమైన అరణ్యంలో ఒంటరిగా ఉండటం ఎందుకు? అని శివుణ్ణి ప్రశ్నించాడు. తన బోయపల్లెలో అన్ని రకాల ఆహార

పదార్థాలున్నాయనీ, కావలసినంత మంది సేవకులున్నారనీ తన పల్లెకు రమ్మని శివుణ్ణి బ్రతిమాలాడు. అయినా శివుడు తన ఊరికి రాలేదని అలిగిన తిన్నడు కూడా అక్కడే ఉండిపోయాడు. చాలాసేపటి తర్వాత తిన్నని ఊరి బోయలు తిన్నని వెతుకుతూ వచ్చి అక్కడికి చేరారు. తిన్నని స్థితిని గమనించి మాట్లాడకుండా ఎందుకున్నావనీ, ఇంటి దగ్గర తల్లిదండ్రులు వేచి చూస్తున్నారనీ, ఇంటికి రమ్మనీ ప్రాధేయపడ్డారు. తిన్నడు వారితో 'నాకు తల్లిదండ్రులు, స్నేహితులు, బంధువులు అందరూ ఈ దేవుడే' అంటూ; తాను ఇక్కడే ఉంటానని గట్టిగా చెప్పాడు. వారు చేసేది లేక ఇంటి దారి పట్టారు.

తిన్నడు శివలింగాన్ని నిజమైన దేవునిగా భావించడం, శివలింగంతో మాట్లాడటం; శివలింగం నుంచి ఎటువంటి బదులు రాకపోవటంతో; ఇల్లు, ఊరు, తల్లిదండ్రులను వదలిపెట్టి అక్కడే శివుని సేవలో గడపడం ఈ పాఠ్యభాగ సారాంశం.

అమాయకత్వం, నిరాడంబరత, నిశ్చలబుద్ధి గలవాడు తిన్నడు. ఆచారాలు, అనాచారాలు మనసుకు లేవనీ; నిరాడంబర భక్తికి చిత్తశుద్ధి సోపానమనీ తిన్నని కథ తెలియచేస్తుంది. అమాయకత్వంతో కూడిన ఈ భక్తి విశేషాన్ని ముగ్ధభక్తి అంటారు. ఈ ముగ్ధభక్తితో పాటు నిరాడంబర భక్తినీ, నిశ్చల బుద్ధినీ, చిత్తశుద్ధినీ పరిచయం చేయడమే ఈ పాఠ్యభాగం ఉద్దేశం.

## పాఠ్యభాగం

మ. ఒడలందెల్ల విభూతిపూఁత, పులితోలొడ్డాణ, మల్లాడు కెం
జడ, లాత్మైక విచార నిశ్చలదృగబ్జాతంబు, లచ్చైన క
చ్చడ మంసంబున, రుండమాల గళదేశస్థాణువుం గ్రాలఁగా
నొడయం డొక్కరుఁ, డక్కుమారుకలలో నుద్యత్కృపా మూర్తియై 1

క. బాలక! యిచట శిలావట
మూలంబునఁ, గొండదండ, మొగలేటి దరిన్
శైల సుతాపతి, భక్తుల
పాలిటి పెన్నిధి, వసించు భక్తిం గొలుమీ 2

క. అని యంతర్ధానము సే
సినఁ, దిన్నండదరి పడుచు, శీఘ్రంబున మే
ల్కని, నలు దిక్కులు వెదకుచు
**మనమున నాశ్చర్య రస నిమగ్నుం డగుచున్** 3

శా. ఈలల్పీఁకెలు దిక్కులం జెలఁగఁ, దామెచ్చో మృగ శ్రేణిపై
గాలిం బోవక, సన్న దప్పుటయు, రొక్కారొక్కముల్ దిట్టి, శా
ర్దూల క్రోడ మృగాదుల న్వలలకుం దోలంగఁ, దిన్నండు త
త్కేలీలోల రవంబు దన్నపుడు బోధింపంగ నేతెంచినన్ 4

మ. వలకుం జేరక, ప్రోఁగులుం దెరలు త్రెవ్వంద్రొక్కి, యా ఖేటక
స్థల ముల్లంఘన సేసి, లుబ్ధకుల యత్నంబెల్ల వారించి, ది
క్కులు దద్ఘుర్ఘురఘుర్ఘుర ధ్వనులచే ఘూర్ణిల్లఁగా, నొక్క యే
కల మేగం గని, తిన్నఁ డప్పుడు ధనుఃకాండోల్లసత్పాణియై 5

మ. జవమొప్ప న్వెనువెంట నంటి తఱుమ న్సంవర్ధిత శ్రాంతి ను
ద్దవిడిం బాఱఁగలేని చందమునఁ జెంతం జేరఁగా నిల్చి యే
య విచారించిన, దూఁటి దాఁటుకొని, తన్నాశాశలం ద్రిప్పి పా
శ విముక్తుండగు యోగిభావన యదృచ్ఛావృత్తి వర్తించుచున్ 6

క. అలయించుచుఁ, దిన్నఁడు దన
కల లోపలఁ గన్న శివునిఁ గనుఁగొనుదాఁకన్
జలమునఁ గొని చనెనయ్యే
కల మప్పు డదృశ్యమైనఁ గడుఁజోద్యమునన్ 7

క. కలలోఁ జెప్పిన యొడయం
డెలయించుక వచ్చినట్టి యేకలము, హిమా
చల తనయాధిప మాయా
విలసనములు గాఁగ నపుడు వివరించి మదిన్ 8

శా. సంతోషంబునఁ గాంచెఁ దిన్నఁడు, సమస్త వ్యాపకానంత వే
దాంత స్థాపిత చిన్మయాంగము నవిద్యాధ్వాంత సంతాన సం
క్రాంత స్వాంత నిశాంత జంతు సుఖమార్గ ప్రాపకాభంగ రు
క్కాంతాపాంగము దివ్యలింగము వివిక్తధ్యేయ నిర్లింగమున్ 9

తే. కాంచి, రోమాంచకంచుకోదంచితాంగుఁ
డగుచు, నానంద బాష్పంబు లతిశయిల్ల
నమ్మహా లింగమునకు సాష్టాంగనతులు
సేసి, ముకుళిత హస్తుఁడై చేరఁబోయి 10

*శా. ఓసామీ! యిటువంటి కొండ దరిలో నొంటిం బులుల్ సింగముల్
గాసింబెట్టెడి కుట్ర నట్టడవిలోఁ, గల్జువ్వి క్రీనీడ, నే
యాసంగట్టితి వేటిగడ్డ నిలు? నీ వాఁకొన్నచో కూడు నీ
శ్భేసుట్టంబులు దెచ్చిపెట్టెదరు? నీకిందేఁటికే లింగమా! 11

ఉ. కొండల గానలం దిరిగి, క్రొవ్విన పందుల లేళ్ళ దుప్పులన్
జెండినఁ బెక్కుచందములఁ జిన్నక పెద్దక గారు కమ్మఁగా
వండుదు రట్ల పిట్టలను వండుదు రిచ్చటనుండ నేల? నా
కొండొకటానతీక, యుదుమూరికి రాఁగదవయ్య! లింగమా! 12

క. ఓ లింగమ! విను నివ్వరి
ప్రాలును, నొడిపిళ్లు, గునుకుఁబ్రాలును, వెదురుం
బ్రాలును, సవరపు మెకముల
పాలును, గల వచట నీకుఁ బాయసమునకున్ 13

తే. పుట్టతేనియ పెరతేనె పుట్టజున్ను
తొట్టితేనియ గల వందుఁ దోఁచి తోఁచి
కాలిదులదులనై పిండిపోలె రాలు
నట్టి నింజెట్లు గలవు నీకారగింప 14

సీ. నేరేడు పండులు నెలయూటి పండులుఁ
గొండమామిడి పండ్లు దొండ పండ్లు
బాలపండులు నెమ్మిపండులు బరివంక
పండులుఁ జిటిముటిపండ్లుఁ గలివె
పండులుఁ దొడివెందపండ్లుఁ దుమ్మికిపండ్లు
జాన పండులు గంగరేను పండ్లు
వెలఁగ పండులు పుల్ల వెలఁగ పండులు మోవి
పండ్లు నంకెన పండ్లు బలుసు పండ్లు

తే. బీర పండ్లును బిచ్చుకబీర పండ్లుఁ
గొమ్మి పండ్లీత పండ్లును గొంజి పండ్లు
మేడి పండ్లును మొదలుగాఁ గూడిమాడి
చెంచెతలు దెత్తు రిత్తు విచ్చేయుమయ్య! 15

*శా. ఇల్లో, ముంగిలియో, యనుంగుఁజెలులో, యీడైన చుట్టంబులో,
యిల్లాలో, కొడుకో, ధరింప వశమే, యే పోఁడుముల్లేక? మా
పల్లెంగోరిన వెల్లనుం గలవు తెప్పల్గాఁగ, నీకిచ్చెదన్
జెల్లంబో! యిట నొంటినుండ కటువిచ్చేయంగదే లింగమా! 16

తే. చుఱుకుఁ జూపునఁ గాలిన కొఱత నుఱుకు
నుఱుకుఁ జూపులఁ బుట్టించు నెఱుకువారి
యిఱుకు వలిగుబ్బపాలిండ్ల యిగురుఁబోండ్ల
సేవకిచ్చెద నీకు విచ్చేయుమయ్య! 17

మ. నను మన్నించెదవేని, నీవిపుడు రా నా వెంట, రాకుండినన్
నిను నేఁబాసి చనంగ నోప, నిచటన్నీతోడిదే లోకమై
మనువాడం; గనువాడ నీకరుణ; నీమౌనంబు చిత్తంబు వ
చ్చినచో మానెదుఁగాక, నిన్నిపుడు కస్తింబెట్ట నాకేటికిన్ 18

వ. అని యమ్మహాదేవు నుడుమూరికి రమ్మనుచుం బ్రార్థించినం బలుక కుండినం, దదీయ
భక్తి పరవశుండై, సంపెంగతావి బ్రుంగుడైన భృంగంబు తెఱంగుననున్న యవసరంబునం,
దిన్నండొంటి పంది వెంటందగిలి యొంటి నెక్కడఁబోయెనో? యని బోయలు
చొప్పురోయం దివిరి యడుగుల వెంబడింబడి తప్పక చనుదెంచి, కాంచి యిట్లనిరి. 19

శా. అన్నా! నిన్నలయించి తెచ్చిన వరాహం బెందుఁ బోయె? న్మము
న్గన్న న్మన్ననఁజూడవేటికి? వడిన్ గన్నీరు గాఱంగ నే
మన్నన్బల్కవదేమి కారణమొ? వేఁటాడంగ నేతెంచి, యిట్లు
న్నం **దల్లియుఁ దండ్రియు న్మఱుఁగరే యుల్లంబులో నక్కటా!** 20

తే. నీడుగాలికిఁ బసివట్టి, నిట్టనీల్గి,
పట్టెడల బిగఁబట్టిన మట్టువడక,
నిలువకేతెంచి, వేఁట కుక్కలు కుమార!
చుట్టుక గునిసి యాడంగఁ జూడవేమి? 21

సీ. వలలును దెరలుఁ బ్రోగులఁ జుట్టఁగా లేదు,
పోటుకోలొకటియుఁ బుచ్చ లేదు,
తెగిన మెకంబులఁ దేలేదు, విడివేఁట
పిట్టలకును మేఁతపెట్టలేదు,
చెంచులేరికినేమి సేదదేఱఁగ లేదు,
చెడకుండ మెకములఁ జేయలేదు,
కుక్క లిఱ్ఱులు సివంగులు మేపుగొనలేదు,
బలివెట్టి కాట్రేనిఁ గొలువలేదు,

తే. వేఁటలాడంగ వచ్చిన వేడుకెల్ల
నక్కటా! తండ్రికెఱిఁగింప నంపలేదు,
మ్రానుపడియుండ నేఁటికి మేనుమఱచి?
యేల మాజాలి మాన్పవే; యెఱుక పఱచి? 22

శా. ఓ తండ్రీ! నిను డించిపో మనసు మాకొక్కింతగా నేర్చునే?
మీ తోఁబుట్టులుఁ దల్లిదండ్రులు చెలుఁ లీమ్రెల్ల 'నేతేరఁగా,
మా తిన్నం డిపుడెందుఁబోయె? ననిన, న్మాప్రాణముల్పోవె'? రా
వే తిట్టింపక, పల్లెలోన, మముఁ దేవే వన్నెయు న్వాసియున్? 23

తే. ఎంత యలమటఁబడిన, మమ్మేలచూడ?
వింతయు నెఱుకు ఱేనికి నెఱుక పఱుపఁ
బోయెదము; చెప్పవలసిన బుద్ధి చెప్పి
యనుపు; మని పాదములు పట్టుకొనిన, నతఁడు 24

వ. ఎట్టకేలకు శివలింగ సంగతాభంగుర హృదయాంతరంగుఁడగు శబర పుంగవుండు
కృపాపాంగుండై చిఱునవ్వు నవ్వి యవ్వనచరుల కిట్లనియె. 25

క. ఈ లింగములోఁ బ్రాణముఁ
గాలము గడదాఁక **నోడగట్టిన దూలం**
**బై లంకెనుండఁ జేసితి;**
నేలా తుందుడుకు? పల్లె కేఁగుడు మీరల్ 26

క. నా వెంట నితఁడు వచ్చిన,
నే వచ్చెద మిమ్ముఁగూడి యిప్పుడు, లేదా,
యేవంక నభవుఁడుండిన,
నావంకనె, తోడునీడయై వసియింతున్ 27

*శా. నాకుం జుట్టము తల్లిదండ్రులు జెలు ల్నాథుండు నీ దైవమే,
మీ కిచ్చోఁ బనిలేదు కస్తిపడఁగా మీ పల్లెకుం బోండు; కా
రా కూరంబులు చేసినం, గదలి నే రా; నిచ్చటం బ్రాణముల్
పోకార్తుందుది నాదు వేలుపునకై; బొంకన్నిజం బింతయున్ 28

క. అని శివుఁ గ్రమ్మఱఁ దిన్నఁడు
మనమున నిలుపుకొని, తనువుమఱచిన బుద్ధిన్
మునుపటి తెఱఁగున నుండిన
**వనరుచు, వనచరులు చనిరి వలసిన రీతిన్** 29

## అభ్యాసం

### I. వ్యాస రూప సమాధాన ప్రశ్నలు

1. తిన్నడు శివుణ్ణి తన ఊరికి రమ్మని పిలచిన తీరును తెల్పండి?
2. తిన్నని చూసి బోయలు ఏ విధంగా దుఃఖించారు?

### II. సంక్షిప్త రూప సమాధాన ప్రశ్నలు

1. ధూర్జటికవి గురించిన విశేషాలేమిటి?
2. తిన్నడు తెలిపిన పండ్ల రకాలను పేర్కొనండి?
3. ఇంటికి రమ్మని పిలచిన బోయలకు తిన్నడిచ్చిన సమాధానాన్ని తెల్పండి?

### III. ఏక వాక్య / పద రూప సమాధాన ప్రశ్నలు

1. ధూర్జటి అంటే అర్థమేమిటి?
2. తిన్నని గ్రామం పేరేమిటి?
3. ఈశ్వరుని మూడవ కంటికి దగ్ధమయింది ఎవరు?
4. ధూర్జటి రచించిన శతకం పేరేమిటి?
5. 'శ్రీ కాళహస్తి మాహాత్మ్యము' కావ్యానికి మూలమేది?
6. కాళము అంటే అర్థమేమిటి?

## IV. సందర్భ సహిత వ్యాఖ్యలు

1. మనమున నాశ్చర్య రస నిమ్మగ్నుండగుచున్
2. కూడు నీళ్ళే సుట్టంబులు దెచ్చిపెట్టెదరు
3. తల్లియుఁ దండ్రియున్మఱఁగరే యుల్లంబులో
4. ఓడగట్టిన దూలంబై లంకెనుండఁ జేసితి
5. వనచరులు చనిరి వలసిన రీతిన్

## V. సంధులు

| | |
|---|---|
| ఒడలందెల్ల | ఆత్మైక |
| బలివెట్టి | వేడుకెల్ల |
| ఇట్లనియె | చేరఁబోయి |
| వ్యాపకానంత | కంచుకోదంచిత |
| అదేమి | కోరినవెల్ల |

## VI. సమాసాలు

| | |
|---|---|
| నలుదిక్కులు | మృగశ్రేణి |
| శార్దూలక్రోడములు | ఆనందబాష్పములు |
| మహాలింగము | ఇగురుబోండ్లు |
| వేటకుక్కలు | నేరేడుపండ్లు |
| తల్లి దండ్రులు | |

## కార్యాచరణ

❖ తెలుగు సాహిత్యంలోని క్షేత్ర మాహాత్మ్య కావ్యాలను గురించీ; ప్రబంధ ప్రక్రియను గురించి వివరించగలరు.

❖ ❖ ❖

# 3 నందీశ్వరుని శాపం

**- కంకంటి పాపరాజు**

## కవి పరిచయం

ఈ పాఠ్యభాగం కంకంటి పాపరాజు రచించిన 'ఉత్తర రామాయణము' తృతీయాశ్వాసం లోనిది. కంకంటి పాపరాజు 17వ శతాబ్దికి చెందిన కవి. నరసమాంబ, అప్పయమంత్రి ఈతని తల్లిదండ్రులు. పాపరాజు చతుర్విధ కవితా నిపుణుడు. యోగ, గణిత శాస్త్ర ప్రావీణ్యుడు. సంస్కృతాంధ్ర భాషల్లో పండితుడు.

"పుణ్యకరమైన రామకథ హైన్యము మాన్పదే యెట్టివారికిన్" అని విశ్వసించిన కవి పాపరాజు. వాల్మీకి రామాయణం నుంచి ఉత్తర కాండను గ్రహించి ఒక స్వతంత్ర ప్రబంధంలాగా, సర్వాంగ సుందరంగా ఉత్తర రామాయణాన్ని తీర్చిదిద్దాడు. ఎనిమిది ఆశ్వాసాలు కలిగిన ఈ కావ్యాన్ని కంకంటి సముచితమైన వర్ణనలతో నింపాడు. రాజనీతిజ్ఞతను ఈ కావ్యంలో రంగరించి పోశాడు. పద్య ధారణకు అనుకూలమైన సరళశైలితో రూపొందించాడు. ఈ కవి 'విష్ణుమాయా విలాసము' అనే యక్షగానాన్ని కూడా రచించాడు. ఈ రెండు గ్రంథాలను తన ఇష్టదైవమైన మదనగోపాల స్వామికే అంకితమిచ్చాడు.

## పాఠ్యభాగ సందర్భం

బ్రహ్మచేత వరాలను పొంది బలగర్వితుడైన రావణుడు జైత్రయాత్రలు చేశాడు. గంధర్వులు, కిన్నరులు, సిద్ధులు మొదలైనవారందరిపై దండెత్తి, ఓడించి, బాధించాడు. అతని దురాగతాలను కొంతకాలం గమనించిన కుబేరుడు తమ్మునికి దూత ద్వారా నీతిని పాటించమని సందేశం పంపాడు. రావణుడు ఆ దూతని చంపి, అలకాపురిపై దండెత్తి వచ్చాడు. కుబేరుని సైన్యం రావణుడి ధాటికి నిలువలేక పోయింది. అపుడు స్వయంగా కుబేరుడే యుద్ధరంగానికి వచ్చి రావణునికి బుద్ధులు చెప్పే సందర్భంలో ఈ పాఠ్యభాగం మొదలౌతుంది.

## పాఠ్యభాగ సంగ్రహం

మారీచుడు, ప్రహస్తుడు, ధూమ్రాక్షుడు వంటివారు రావణుని పక్షానికి చెందిన వారు. వీరు కుబేరుని ముందు యుద్ధంలో నిలవలేక పోయారు. అపుడు రావణాసురుడే స్వయంగా కుబేరునితో యుద్ధానికి తలపడ్డాడు. మాయా యుద్ధం ద్వారా కుబేరుణ్ణి మూర్ఛిల్లేలా చేసి, పుష్పక విమానాన్ని కైవసం చేసుకున్నాడు. మారీచాదులను దానిపైన అధిరోహింప చేసి, రావణాసురుడు కైలాసానికి బయలుదేరాడు.

అయితే, కైలాసాన్ని సమీపించిన రథం అక్కడ కదలకుండా నిలిచి పోయింది. దశకంఠునికి విపరీతంగా కోపం వచ్చింది. తనను నిలువరించ గలిగేటంతటి శక్తి మంతుడా శంభుడు? అని పటపటమని పళ్ళు కొరుకుతూ,

రెట్టించిన అహంకారంతో ఈశ్వరుణ్ణి అవహేళన చేసాడు. ఇదంతా గమనిస్తున్న నందీశ్వరుడు వెంటనే ఆయుధ ధారి అయ్యాడు. మరో హరుడా అన్నట్లుగా రావణుని ఎదురుగా నిలబడ్డాడు. "వానర ముఖంతో ఉన్న నీవెవడవురా?" అని రావణుడు నందీశ్వరుణ్ణి చూసి పకపకా నవ్వాడు. అపుడు, అపర శివుడైన ఆ నందీశ్వరుడు కోపంతో "ఓ రావణా! కపి ముఖంతో ఉన్న నన్ను అవమాన పరచి, పరిహసించావు. నా వంటి ముఖాలు కలిగి, తమ గోళ్ళు ఆయుధాలుగా చేసుకొన్న వానర మూకలు నిన్నూ, నీ వంశాన్నీ సర్వనాశనం చేస్తాయి. సర్వమూ కోల్పోతావు" అని శపించాడు. దేవతలు పుష్పవర్షం కురిపించారు.

లంకాధీశుడైన రావణాసురుడు మహాతపస్వి. అంతేకాదు, తేజోసంపన్నుడు కూడా. అయినప్పటికీ తన అహంకారం మూలంగా పూర్తిగా పతనమయ్యాడు. ఎంత గొప్ప వారికైనా అహంకారం ఉంటే, అదెంతటి చేటు కలిగిస్తుందో గుర్తింప చేయడం ఈ పాఠ్యభాగం ఉద్దేశం.

## పాఠ్యభాగం

ఉ. తమ్ముఁడవంచు నీ కొకహితం బెఱిఁగింపఁగ దూతఁ బంచినన్
వమ్మొనరించి నాపలుకు వానిని జంపి ననున్ జయింప రే
ద్రిమ్మరి గుంపుతోడ నరు దెంచితి నిన్నన నేల నీకు డెం
దమ్మున మేలు గాఁ దలఁచు నన్నె యనన్ దగుఁగాక దుర్మతీ 1

ఉ. రోగికి భక్ష్యభోజ్యముల రోగము హెచ్చుగతిన్ బటు క్రుధా
యోగికి నీకు మాదృశ హితోక్తులఁ గ్రోధము మించు మాటికిన్
నీ గుణచర్య లేటికివి నింద యొనర్పఁగ నీకె తెల్లమౌ
రాఁగల మృత్యువుం బొరసి రౌరవబాధలఁ బొందుచున్నెడన్ 2

ఉ. ఆపద లావహించు దురహంకృతి నీగతి మూర్ఖుఁడుగ్రపుం
బాపము లాచరించి విష పాన మొనర్చి శరీర మంతయున్
వ్యాపక మైనఁ జింతిలు జడాత్మువలెన్ యమపాశ బద్ధుఁడై
పాప ఫలంబుఁ జెందు నెడఁ బాపముఁ జేసితి నంచు వందురున్ 3

*ఉ. అన్నకుఁ దండ్రికిన్ గురున కాపద యెవ్వఁ డొనర్చు వానిఁ గ
న్గొన్న మహోగ్రపాతక మగున్ దనువస్థిరమృత్యు వెప్పుడున్
సన్నిహిత స్థితిన్ మెలఁగు సంపద పుణ్యవశంబటంచు లో
నిన్నియు నెంచి **ధర్మము వహించు జనుండు కృతార్థుఁ డెయ్యెడన్** 4

చ. కలఁగక బుద్ధి పూర్వకముగా జనుఁ డేక్రియఁ జేయుఁ దక్రియా
ఫల మనుభూతిగా నిది శుభంబశుభం బిది యంచు రెంటినిన్
దెలిసి సుకర్మమున్ సలుప దేవతలందఱు మెత్తు రందునన్
గలిమియు బల్మి యిచ్చుటనె కల్గు సుఖంబె లభించు నచ్చుటన్ 5

చ. ధన మణి వస్తు వాహ వనితా జనతాదులు బల్మి సంతరిం
చిన యవి యంచు ధర్మములు సేయక యుండిన నేమి యంచు న
య్యనిమిషు లందఱున్ బగతురంచు మహాపదలొంద నున్న ని
న్ననుజుఁడ నన్నఁ గల్గు నిరయంబు రయంబున రమ్ము పోరికిన్ 6

క. అని తమదొర దూఱెడు ధన
దుని మారీచ ప్రహస్త ధూమ్రాక్ష శుకా
ద్యనిమిషరిపుమంత్రులు మా
ర్కొని నిలువఁగ లేక చనిరి కోఁచతనమునన్ 7

చ. అని నిటులాత్మ మంత్రులు ధనాధిపుకోల్తల కోర్వలేమి న
ద్దనుజవరేణ్యుఁ డుగ్రనిశిత ప్రదరంబుల వాని ముంచినన్
గనలుచు డాసి కిన్నర శిఖామణి వాని కిరీట పంక్తి ఖం
గున రొద సేయ భూరిగదఁ గైకొని బెట్టుగ మోఁది యార్చినన్ 8

*మ. కడుఁ గోపించి దశాననుం డతని వక్షః పీఠమున్ జొచ్చి పో
యెడునట్లుగ్రశరంబు వేయుటయు యక్షేశుండు ధీరత్వ మే
ర్పడఁ గోదండ గుణారవంబఖిల దిగ్భాగంబులన్ నిండ న
ప్పుడు వహ్న్యస్త్రము వైవ వాఁ డడఁచెనంభోబాణ వేగంబునన్ 9

మ. శర సంధాన దృఢాపకర్షణకృతుల్ జ్యాఘోషణంబుల్ పర
స్పర ధిక్కారములొక్క చందమున మించన్ విశ్రవఃపుత్రు లి
ర్వురుఁ గ్రొన్నెత్తుటఁ దోఁగుచున్ గెరలుచున్ రోషించుచున్ డాయుచున్
హరియుగ్మం బన నిద్దఱిద్దఱయి శౌర్యస్ఫూర్తిఁ బోరాడఁగన్ 10

క. రణమున వివిధాయుధ ధా
రణమున సరి పోరు యక్ష రాక్షసవరులన్
బ్రణుతించిరమరుల సురా
గ్రణియున్ మాయఁగొని న్యాయ్యరణవిముఖుండై 11

సీ. ఒకసారి మేఘమై యుడువీథిఁ గనుపించుఁ
గనుపించి పిడుగు లుగ్రముగఁ గురియు
నొక తేప సింహమై యుద్వృత్తిఁబఱతెంచుఁ
బఱతెంచి కహకహార్భటి వహించు
నొక తూరి కొండయై యురులీల నెదిరించు
నెదిరించి యెగసి బిట్టదరఁ జేయు
నొక మాటు వార్ధియై యూర్ములతో మించు
మించి రోదసి యెల్ల ముంచి వైచు

తే. నొక్క పరి వ్యాఘ్రమైవచ్చు నొక్క సారి
దంష్ట్రియైతోఁచు నొక మరి దారుణాహి
కరణి గనిపించు నొక మాఱు గానిపింప
కడఁగు మాయా నిరూఢినయ్యసురవరుఁడు 12

చ. ఇటువలెఁ బెక్కుమాయల ధనేశ్వరునిన్ భ్రమియించి విక్రమో
ద్భటగతి మించి నిష్ఠురగదన్ దల మోఁదినఁ గ్రొత్తనెత్తురుల్
జొటజొటఁ గాఱఁ బూచిన యశోకము గాలికిఁ గూలు చాడ్పునన్
దటుకున వ్రాలెఁ దేరిపయి దానవ సైన్యములుల్లసిల్లఁగన్ 13

మ. ధనదుండీగతి మూర్ఛఁ జెంది పడ నంతన్ సూతుఁ డత్తేరు గ్ర
క్కున నందాతటినీ సమీపమునకున్ గొంపోయె యక్షుల్ భయం
బున వృక్షంబులు వ్రాఁకియున్ గిరి బిలంబుల్ సొచ్చియున్ విచ్చి కా
ననముల్ దూఱియుఁ గోనలన్ బడియు దైన్యం బొంది రెంతేనియున్ 14

తే. మూర్ఛ మునిఁగినధనదు సమ్ముఖముఁ జేరి
శంఖ పద్మాది నిధులు విశ్రాంతి మాన్పె
నంత దశ కంధరుఁడు నిట్టులన్నఁ గెలిచి
సొలయకాతని నగరంబుసొచ్చి యచట 15

సీ. శాతకుంభ స్తంభ సాహస్రములు గల్గి
వైదూర్య తోరణావళులు గల్గి
నవ్య మౌక్తిక వితానవితానములు గల్గి
శశికాంత వేదికాచయము గల్గి
సొగసైన మగఱాల సోపానములు గల్గి
కప్పుఱాలోవల యొప్పు గల్గి
కామితార్థము లిచ్చు ఘన వృక్షములు గల్గి
వికచకల్హార దీర్ఘికలు గల్గి

తే. మానస జవంబు గల్గి కామగతి గల్గి
కామ రూపంబులు వహించు గరిమ గల్గి
ప్రబలు పరమేష్ఠిరజత పుష్పకముఁ గాంచి
యందు పైనెక్కి యతఁడు తారాద్రి కరిగె 16

మ. తరళోత్తుంగ తరంగఘుంఘుమరవోద్యద్దివ్యనందార విం
ద రజోబృంద మరంద తుందిల మిళింద ధ్వాన సంబంధ గం
ధ రమాబంధుర మంథరానిలునిచేతన్ శ్రాంతి వాయన్ ధనే
శ్వరుఁడున్ దెప్పిటి భీతి సేనఁగొని లజ్జన్ జేరె వీ డయ్యెడన్ 17

ఉ. ఆజ తనూజ వింటివె దశాననుఁ డిట్టులఁ బుష్పకంబుతో
నాజి జయంబునున్ బొదసి యావలఁ బోవుచుఁ జూచె ముందటన్
రాజత శైలమున్ దపనరథ్యనిరోధకృదత్యుదగ్రతా
రాజిత సాలమున్ దటచరత్కరిసింహతరక్షుకోలమున్ 18

తే. చూచి యచ్చోటి వింతలు చూడవలసి
బలసియిరువంకలను దైత్యభటులు గొలువఁ
జెలువ మొలికెడు నమ్మహా శిఖర మెక్కి
యక్క డఁజరింప మారీచుఁ డతని కనియె 19

మ. కలధౌతాచల దీధితి ప్రచయమో గంగా ప్రవాహాంతరో
జ్జ్వల డిండీరనికాయమో శబర యోషాధన్వ ముక్తాస్త్రని
ర్గళిత ప్రాంచిత చామర వ్రజమొ నా రంజిల్లు రెండాఱుచే
తులఱేఁ దుండిన తెల్లుటిల్లుఁ గనుమా దోషాచరగ్రామణీ 20

సీ.	శైలజా సహచరోజ్జ్వల రుద్ర కన్యకా
		చరణ లాక్షాపంక మొరసి నదియొ
	యిది నగం బనుపేర నింపొందుఁ గావున
		విపులంబుగాఁ బల్లవించినదియొ
	తనగిరీశత్వ మందఱకుఁ దోఁప నభంబు
		మించు పెంజడలు వహించినదియొ
	సానుభాగ చరద్భుజంగ భోగమణీ స
		మంచితప్రభ నాక్రమించినదియొ

తే.	లేక ధననాథు గెలిచి త్రిలోక విజయ
	వాంఛ నరుదెంచు దేవరవారిదోః ప్ర
	తాప మిట నుండినదియొ నాఁదరుణతరణి
	కిరణగతిగైరికముల నిగ్గిరి వెలింగె		21

చ.	తిరముగ జైత్రయాత్ర చనుదెంచిన నిన్ గని యీకుభృత్తు ని
	ర్ఝరములఁబాద్య మిచ్చి రవిసంజ్వలితార్క మణీ విభాపరం
	పరల నివాళి సేసి వనభవ్య శుకాది విహంగమోక్తి వై
	ఖరి నుతి సల్పెడిన్ రజత కాంతుల వెల్లదనంబుఁ జూపుచున్		22

సీ.	చిగురు జొంపముల రంజిల్లె నీ యెలదోఁట
		చెలువ పర్ణకు వేడ్క సేయు నేమొ
	విరిగల్వ విరులచే వెలసె నిక్కొల నిందుఁ
		జంద్రజూటుఁడు గేళి సల్పు నేమొ
	సంతాన కుసుమవాసన లూనె నిక్కోన
		దేవ కన్యకలు వర్తింతు రేమొ
	పువ్వుఁబుప్పొడి దుమ్ము పొదలె నిప్పొదలలో
		విద్ధాళు లెపుడు వసించు నేమొ

తే.	తనరె బహు బిల్వ రుద్రాక్ష తరువు లిచటఁ
	**ప్రమథవర్యుల కివి రచ్చపట్టు లేమొ**
	యనుచు మారీచుఁ డెఱిఁగింప నచట నచట
	నయ్యసురభర్త విహరించునవసరమున		23

సీ. చిమ్మచీఁకటి గ్రమ్ము క్రొమ్మావిగుమి నల్లి
బిల్లి రుద్రాక్ష పందిళ్ల నడుమ
వడిఁ బాఱువిరి తేనెవాఁకల దరుల వెం
బడి ఘుమ్ముమను మృగమదము తావిఁ
బొలుపొందు విరవారి పొదలలోఁ గుప్పలు
వడు సురపొన్న పుప్పొడి దుమార
మొలసిన లేఁదెమ్మెరలయెమ్మె గనుకమ్మ
బంగరుఁబూఁదోఁటపజ్జ నమరు

తే. మరకత నిబద్ధ భూముల మలయు రేవె
లుంగు ఱాతిన్నియలఁజెన్నెసంగు పొగడ
మ్రావి నీడలఁ దగునొక్క కోనలోనఁ
బుష్పక విమాన మటు సాగి పోక నిలిచె 24

చ. నిలిచినఁ బంక్తి కంధరుండు నివ్వెఱఁ గంది యిదేల యిచ్చటన్
నిలిచెను శక్తుఁడే యొకఁడు నిల్పఁగ దీనికి దుర్గమ స్థలం
బులు గలవోటు చూడుఁడటఁ బొండని మంత్రులఁ బంప వార ల
క్కెలఁకుల సంచరించి పరికించియు హేతువు గాన కయ్యెడన్ 25

మ. అల మారీచుఁడు దేవ వింటె యిది యక్షాధ్యక్షునిన్ గాని య
న్యులఁ బైనూని చరింపదో యతఁడు క్రోధోద్రేకి యై నిల్పెనో
తెలియుండం చనునంతలో వికటుఁడై దీప్తాస్యుఁడై కుబ్జుఁడై
బల ధుర్యుండగు నంది యందుఁగని యప్పౌలస్త్యుతో నిట్లనున్ 26

చ. నిలిచె విమాన మంచు రజనీచర నివ్వెఱఁ గంద నేల యీ
నెలవున దేవితో హరుఁడు నేఁడు విహారము సేయుచున్న వాఁ
డల గరుడోరగామరవియచ్చరు లోడుదు రీడఁ జూడ నిం
దుల కరుదెంచి నీ బలముతోఁ జెడి పోక తొలంగు నావుడున్ 27

చ. పటపట పండ్లు గీటుకొని పంక్తి ముఖాసురభర్త పుష్పకం
బటు డిగి శంభుఁ డెవ్వఁ డహహా నను నిల్పెడునంత వచ్చెనే
యిట నిను నీ శివున్ నిలువ నిచ్చిన నట్టుల కాదె యంచుఁ ద
త్తటమున నుండి యగ్గిరివతంసము క్రిందికి వచ్చి చెచ్చెరన్ 28

క. ఉరుశూలముఁ గొని రెండవ
హరునివలెను దీప్త విగ్రహము మీఱఁగ వా
నర ముఖమొందిన నందిని
**బరికించి దశాననుండు పకపక నగియెన్** 29

తే. ఇవ్విధంబునఁ దనుఁజూచి నవ్వుచున్న
యతి విమూఢుని దశకంఠు నట్టె చూచి
యపర శివుఁడైన నందీశుఁ డాగ్రహము వ
హించి కటతటమదరఁగా నిట్టులనియె 30

*చ. కపివదనుండనైన ననుఁ గన్గొని నీవవమాన దృష్టితో
నిపుడు హసించినాఁడ విట నీ దృశవక్త్రముఖుల్ నఖాయుధుల్
**కపు లిఁక నీ కులం బడపఁ గల్గెద రంతటఁ గండగర్వమున్**
దపమునఁ బుట్టు బెట్టిదముఁ దామె యడంగెడు రాక్షసాధమా 31

శా. శాపోక్తుల్ పచరింప కున్న నెదిరించన్ రాదె యంటేని నిం
దాపారంపరి మున్నుగా మృతుఁడవే నా కిట్టి పీనుంగుపై
నేపున్ జూపఁగ నర్హ మౌనె యిదిగాకీ చేయు పాపంబుచే
నాపద్వార్ధి మునింగి పోవఁ గల వేలా యింక నిన్ నొంచఁగన్ 32

క. అని యా నంది శపించిన
విని యానందించి సురలు విరులు గురిసి ర
వ్వీను వీథి దేవ దుందుభు
లును మొరసెన్ బెరసె సుఖము లోకము లెల్లన్ 33

## అభ్యాసం

### I. వ్యాస రూప సమాధాన ప్రశ్నలు

1. కుబేరుడు రావణునికి చేసిన హితబోధను వివరించండి?
2. దశకంఠుడు మాయా యుద్ధంలో ధనదుణ్ణి గెలిచిన విధానాన్ని తెలపండి?

### II. సంక్షిప్త రూప సమాధాన ప్రశ్నలు

1. పుష్పక విమాన విశేషాలేమిటి?
2. రావణుడు ఏవిధంగా కైలాసానికి వెళ్ళాడు?

3. నందీశ్వరుడు రావణుణ్ణి ఎందుకు శపించాడు?

4. కంకంటి పాపరాజు రచనలను, కవితా శైలిని తెలపండి?

## III. ఏక వాక్య / పద రూప సమాధాన ప్రశ్నలు

1. కంకంటి పాపరాజు ఏ శతాబ్దానికి చెందినవాడు?
2. పాపరాజు రాసిన యక్షగానం పేరేమిటి?
3. ఉత్తర రామాయణం ఎన్ని ఆశ్వాసాల కావ్యం?
4. పాపరాజు తన రచనలను ఎవరికి అంకితం ఇచ్చాడు?
5. కుబేరుడితో మాయాయుద్ధం ఎవరు చేశారు?
6. నంది ఎవరి వాహనం?
7. పౌలస్త్యుడు ఎవరు ?

## IV. సందర్భ సహిత వ్యాఖ్యలు

1. ధర్మము వహించు జనుండు కృతార్థుఁడెయ్యెడన్.
2. ప్రమథవర్యులకివి రచ్చపట్టు లేమొ.
3. పరికించి దశాననుండు పకపక నగియెన్.
4. కపులిఁక నీ కులంబడపఁ గల్గెదఁరంతటఁ గండగర్వమున్.

## V. సంధులు

| | |
|---|---|
| హితోక్తులు | రోదసియెల్ల |
| మహోగ్ర | నగరంబుసొచ్చి |
| తారాద్రి | ఆద్యనిమిషులు |
| కృతార్థుడు | వహ్న్యస్త్రము |

## VI. సమాసాలు

| | |
|---|---|
| భక్ష్య భోజ్యములు | రౌరవబాధలు |
| పాపఫలము | ధనాధిపుడు |
| దశాననుండు | ఉగ్రశరంబు |
| యక్ష రాక్షసులు | క్రొత్త నెత్తురు |
| రజనీచరులు | రాక్షసాధముడు |

## కార్యాచరణ

❖ రామాయణ విశేషాలను విద్యార్థులకు తెలియచేయగలరు. వివిధ కవులు, కవయిత్రులు రచించిన రామాయణాలను కూడా పరిచయం చేయగలరు.

❖ ❖ ❖

# 4 శ్మశానవాటి



- గుఱ్ఱం జాషువా

## కవి పరిచయం

తెలుగు పద్యానికి సుమధుర సౌరభాన్ని అద్దిన కవుల్లో ప్రముఖులు గుఱ్ఱం జాషువా. వీరు గుంటూరు జిల్లా వినుకొండలో 28.09.1895న జన్మించారు. లింగమాంబ, వీరయ్య జాషువా తల్లిదండ్రులు.

జాషువా ఉభయభాషా ప్రవీణులు. ప్రాథమికోపాధ్యాయునిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. కొంత కాలం మూకీ చలన చిత్రాల వ్యాఖ్యాతగా పనిచేశారు. మరికొంత కాలం ద్వితీయ ప్రపంచ సంగ్రామంలో యుద్ధ ప్రచారకునిగా తన సేవలందించారు. ఇంకొంత కాలం ఆకాశవాణిలో తెలుగు కార్యక్రమాల రూపకర్తగా కూడా వ్యవహరించారు.

సామాజిక, సాహిత్య అననుకూల వాతావరణంలో వికసించిన కవి కుసుమం జాషువా. తెలుగులో ఖండకావ్య ప్రక్రియకు అఖండ ఖ్యాతిని సంతరింప చేసిన జాషువా తెలుగు జాతి గుండెల్లో మెండుగా నిండిపోయారు. జాషువా రచించిన అనేక కావ్యాలూ, ఖండ కావ్యాలూ ఆధునిక తెలుగు కావ్యావరణంలో సరికొత్త వాతావరణానికి ఊపిరులూదాయి. గబ్బిలం, ఫిరదౌసి, ముంటాజ మహల్, కాందిశీకుడు, క్రీస్తు చరిత్ర, ముసాఫరులు వంటివి జాషువాకు ఎనలేని గౌరవాన్ని సంతరింప చేశాయి.

జాషువా కవితావస్తువు సమకాలీన కవుల వస్తువుకంటే భిన్నమైంది. అంశం వర్తమానమైనా, గతకాలమైనా; సామాజికమైనా, చారిత్రకమైనా జాషువా ఆ వస్తు తత్వాన్ని దర్శించే చూపు ప్రత్యేకమైంది. ఆవిష్కరించే తీరు విశిష్టమైంది. అందుకే ఎన్నో గౌరవాలూ, బిరుదులూ జాషువాను వరించాయి. కవి కోకిల, కవితా విశారద, కవి దిగ్గజ, నవయుగ కవిచక్రవర్తి, మధుర శ్రీనాథ, విశ్వకవి సమ్రాట్, కళాప్రపూర్ణ, పద్మభూషణ్ వంటివి వాటిలో కొన్ని. గండపెండేరాలు, కనకాభిషేకాలు, గజారోహణలు, పల్లకీలో ఊరేగింపులు, స్వేచ్ఛా పౌరసత్వం వంటి విశేష గౌరవాలు కూడా జాషువా వశమయ్యాయి. ఆధునిక తెలుగు కవిత్వానికి ఒక ప్రత్యేకమైన రంగు, రుచి, వాసనలను కల్పించిన జాషువా 24.07.1971 న కన్నుమూశారు.

## పాఠ్యభాగ సారాంశం

ప్రస్తుత పాఠ్యభాగం శ్మశానవాటి. ఇది ఖండకావ్య కవిగా గుఱ్ఱం జాషువాకు ప్రత్యేక గుర్తింపు తెచ్చి పెట్టిన విశిష్ట ఖండిక. ఇది వైరాగ్యాన్ని బోధించేది కాదు. జీవిత తాత్త్వికతను సామాజికతతో ముడిపెట్టి చెప్పిన లోతైన ఖండిక. శ్మశానవాటి అంటే లౌకిక స్థితిలో ఉండే అనేకానేక సామాజిక అంశాలకూ, అసమానతలకూ, హెచ్చు తగ్గులకూ, వివక్షలకూ, పీడనలకూ, ఆధిక్య అనాధిక్య భావనలకూ తావులేని తలం. అందరినీ సమానంగా

అక్కున చేర్చుకునే నిశ్చల స్థలం, జీవిని లౌకిక జగత్తు నుండి అలౌకిక జగత్తుకు స్వాగతించే మహా ప్రస్థాన స్థానం. జీవిత ప్రస్థానంలోని ఈ తాత్త్విక వాస్తవాన్ని కావ్య ముఖంగా విద్యార్థులకు అందించడం ఈ పాఠ్యభాగం ఉద్దేశం. ఈ పాఠ్యభాగాన్ని మనసు ఫౌండేషన్ ప్రచురించిన 'జాషువ సర్వలభ్య రచనల సంకలనము' నుండి స్వీకరించడమైంది.

## పాఠ్యభాగం

*శా. ఎన్నోయేండ్లు గతించి పోయినవి గానీ, యీ శ్మశాన స్థలిన్
గన్నుల్ మోడ్చిన మందభాగ్యుఁ డొకఁడైనన్ లేచిరాఁ డక్కటా!
యెన్నాళ్ళీ చలనంబు లేని శయనం బే తల్లు లల్లాడిరో!
కన్నీటంబడి క్రాఁగిపోయినవి నిక్కంబిందు పాషాణముల్! 1

శా. ఆకాశంబును కాఱుమబ్బుగములాహారించె, దయ్యాలతో
ఘూకంబుల్ జెరలాడసాఁగినవి, వ్యాఘోషించె నల్దిక్కులన్
గాకోలంబులు, గుండె ఝల్లుమనుచున్నంగాని, యిక్కాటియం
దాకల్లాడిన జాడ లేదిచట **సౌఖ్యంబెంత క్రీడించునో!** 2

సీ. ఇచ్చోటనే సత్కవీంద్రుని కమ్మని
కలము నిప్పులలోనఁ గఱఁగిపోయె
యిచ్చోటనే భూములేలు రాజన్యుని
**యధికార ముద్రిక లంతరించె**
యిచ్చోటనే లేఁతయిల్లాలి నల్ల పూ
సల సౌరు గంగలోఁ గలసి పోయె
యిచ్చోటనే నెట్టి పేరెన్నికం గొన్న
చిత్రలేఖకుని కుంచియ నశించె

తే.గీ. ఇది పిశాచులతో నిటాలేక్షణుండు
గజ్జె గదలించి యాడు రంగస్థలంబు
యిది మరణదూత తీక్షణదృష్టు లొలయ
నవని బాలించు భస్మ సింహాసనంబు 3

చం. ముదురు తమస్సులో మునిఁగి పోయిన క్రొత్తసమాధి మీదఁ బైఁ
బొదలు మిణుంగురుంబురువు పోలిక వెల్గుచునున్న దివ్వె ఆ
ముద ముడివోయినన్ సమసి పోవుట లేదది దీప మందుమా?
హృదయము సుమ్మి నిల్పి చనియెన్ గతపుత్రక యే యభాగ్యయో! 4

చం. కవుల కలాలు, గాయకుల కమ్మని కంఠములీశ్మశాన పుం
గవులఁ ద్రొక్కి చూచెడి నొకానొఁకనాఁ డలకాళిదాస భా
రవుల శరీరముల్, ప్రకృతి రంగమునం దిపుడెంతలేసి రే
ణువులయి, మృత్తికం గలిసెనో! కద? కుమ్మరివాని సారెపై 5

శా. ఆలోకించిన గుండియల్గఱగు నాయా పిల్ల గోరీలలో
నే లేబుగ్గల సౌరు రూపఱియెనో! **యేముద్దు నిద్రించెనో!**
యే లీలావతి గర్భగోళమున వహ్నిజ్వాల జీవించునో!
యీ లోకంబున వృద్ధిగాఁదగిన యే యే విద్యలల్లాడెనో! 6

*మ. ఇట నస్పృశ్యత సంచరించుటకుఁ దావే లేదు, విశ్వంభరా
నటనంబున్ గబళించి, గర్భమున విన్యస్తంబు గావించి, యు
త్కటపుం బెబ్బులితోడ మేఁక నొఁక ప్రక్కన్ జేర్చి జోకొట్టి, యీ
ఱటఁ గల్పించునభేద భావమును, ధర్మం బిందుఁ గారాడెడిన్ 7

ఉ. వాకొనరాని గొప్పధనవంతుని నిద్దపుఁబాలఱాతి గో
రీ కడఁ బారవేయఁబడి, ప్రేలికలం బొరలాడుప్రేత మే
యాకఁటి చిచ్చునన్ గుమిలి, యార్చి, గతించిన పేదవాని దొ
నో కద! **వానికై వగవఁ డొక్కఁడు,** దాచదు కాటినేలయున్. 8

## అభ్యాసం

### I. వ్యాస రూప సమాధాన ప్రశ్న

1. 'శ్మశాన వాటి' పాఠ్యభాగ సారాంశాన్ని రాయండి?

### II. సంక్షిప్త రూప సమాధాన ప్రశ్నలు

1. గుఱ్ఱం జాషువా రచనలను పేర్కొనండి?
2. 'సౌఖ్యం బెంత క్రీడించునో' అని జాషువా ఎందుకన్నాడు?
3. శ్మశానంలోని అభేద భావాన్ని తెలపండి?

### III. ఏక వాక్య / పద రూప సమాధాన ప్రశ్నలు

1. 'శ్మశానవాటి' పాఠ్యభాగ రచయిత ఎవరు?
2. జాషువా జన్మస్థలమేది?
3. జాషువా బిరుదులేవి?
4. ఖండ కావ్యాలకు అఖండఖ్యాతిని తెచ్చిన కవి ఎవరు?

5 సత్కవీంద్రుని కమ్మని కలము ఎక్కడ కరిగింది?

6. నిటాలేక్షణుడు ఎవరు?
7. అస్పృశ్యత సంచరించుటకు తావులేని స్థలమేది?

### IV. సందర్భ సహిత వ్యాఖ్యలు

1. సౌఖ్యంబెంత క్రీడించునో.
2. అధికార ముద్రికలంతరించె.
3. ఏ ముద్దు నిద్రించెనో.
4. వానికై వగవడొక్కడు.

### V. సంధులు

| | | | |
|---|---|---|---|
| కవీంద్రుడు | లేదిచట | పేరెన్నిక | విన్యస్తంబుగావించి |
| పారవేయఁబడి | కదలించియాడు | అవనిఁబాలించు | |

### VI. సమాసాలు

| | | | |
|---|---|---|---|
| కారుమబ్బులు | కమ్మని కలము | నల్లపూసలు | ప్రకృతి రంగము |
| అభాగ్యము | నల్దిక్కులు | కాళిదాస భారవులు | |

### గమనిక

❖ ఖండకావ్యాలలో పద్యాలకు సాధారణంగా ఛందస్సు సూచించకపోవడం ఒక లక్షణం. అయితే విద్యార్థుల సౌకర్యార్థం ఈ పాఠంలో ఛందస్సును సూచించడం జరిగింది.

❖ ఈ పాఠ్యాంశం శీర్షిక 'శ్మశానవాటి' అనే కాక, 'శ్మశానవాటిక' అని కూడా ప్రచారంలో ఉంది. జాషువా జీవించి ఉన్న కాలంలోనే తొలి నాటి ప్రతుల్లో 'శ్మశానవాటి' అని ఉండటం చేత జాషువా కూడా ఆ శీర్షికనే ప్రయోగించాడని భావించి 'శ్మశానవాటి' అనే శీర్షికను స్వీకరించడమైంది.


### కార్యాచరణ

❖ ఖండకావ్యాలను గురించి పరిచయం చేయండి. జాషువా 'శ్మశానవాటి' పద్యాలు 'సత్య హరిశ్చంద్ర' నాటకం ద్వారా బహుళ ప్రచారం పొందాయి. వివిధ కళాకారులు ఆలపించిన ఈ పద్యాలు కేసెట్ల రూపంలో అందుబాటులో ఉన్నాయి. వాటిని సేకరించి విద్యార్థులకు వినిపించగలరు. పద్యాలు ఆలపించే విద్యను విద్యార్థులలోనూ ప్రోత్సహించగలరు.

❖ ❖ ❖

# 5 చేయెత్తి జైకొట్టు తెలుగోడా!

- వేములపల్లి శ్రీకృష్ణ



## కవి పరిచయం

అతి తక్కువ గీతాలు రాసి, అఖండ ఖ్యాతినార్జించిన తెలుగు కవుల్లో వేములపల్లి శ్రీకృష్ణ ఒకరు. గుంటూరు జిల్లా, రేపల్లె దగ్గర ఉన్న బేతపూడి గ్రామంలో 01-07-1917 న శ్రీకృష్ణ జన్మించారు. మాణిక్యమ్మ, వెంకట్రామయ్య వీరి తల్లిదండ్రులు. రేపల్లె, గుంటూరులలో విద్యాభ్యాసం చేసిన శ్రీకృష్ణ విద్యార్థి దశలోనే విద్యార్థి ఉద్యమాలలో క్రియాశీలకంగా పాల్గొన్నారు. గిరీశం, సాక్షి అనే కలం పేర్లతో కాగడా, నగారా అనే పత్రికల్లో అనేక వ్యాసాలు రచించారు. 'చేయెత్తి జైకొట్టు తెలుగోడా' అనే పాటతో పాటు 'జాయేంగే కయ్యూరు', 'చెంచుపాట', రెడ్ ఆర్మీ, రండీ దేశ సేవకు, అన్నాచెల్లెలు, రావోయి అనే గీతాలను కూడా శ్రీకృష్ణ రచించారు. ఇవన్నీ 'అరుణ గీతాలు' అనే సంకలనంలో చోటు చేసుకున్నాయి.

వేములపల్లి శ్రీకృష్ణ కేవలం రచయితగానే కాక, కొన్ని ఇతర రంగాలలోనూ క్రియాశీలక పాత్ర వహించారు. బాపట్ల (1952), మంగళగిరి (1962, 1972) నియోజక వర్గాలనుండి మూడుసార్లు శాసన సభ్యులుగా ఎన్నికయ్యారు. సమర్థుడైన ప్రతిపక్ష నాయకునిగా వ్యవహరించారు. విశాలాంధ్ర దినపత్రిక ప్రధాన సంపాదకులుగా కొంతకాలం పనిచేశారు. మూడు దశాబ్దాలు రాష్ట్ర స్థాయిలో 'శాంతి – స్నేహం' సంఘాల బాధ్యతలను నిర్వహించారు. అంతేకాక 'శాంతి – స్నేహం' అనే మాస పత్రికకు కూడా సంపాదకులుగా పనిచేశారు. 'చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్' కార్యదర్శిగా జీవితాంతం సేవలందించారు. ఆ సంస్థకు చెందిన వృద్ధాశ్రమం వేములపల్లి నిర్వహణలోనే గొప్ప ప్రాచుర్యం పొందింది. సోవియట్ యూనియన్, తూర్పు జర్మనీ వంటి దేశాలను వీరు సందర్శించారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ కోణాలలో వారి విదేశీ పర్యటన అనుభవాలను వ్యాసాల రూపంలో తెలుగు పాఠకులకు అందించారు. సుదీర్ఘకాలం తెలుగు జాతి సామాజిక రాజకీయ పురోగతి కోసం అవిశ్రాంత కృషి సల్పిన వేములపల్లి శ్రీకృష్ణ 08-04-2000 తేదీన కన్ను మూశారు. శ్రీకృష్ణ ఆకాంక్ష మేరకు ఆయన మరణానంతరం వారి కుటుంబ సభ్యులు వేములపల్లి కళ్ళను హైదరాబాదులోని ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. గొప్ప ఆదర్శశీలి వేములపల్లి శ్రీకృష్ణ. ఈ పాఠ్యభాగాన్ని 'తెలుగు తల్లి' కవితా సంకలనం నుండి స్వీకరించడమైంది.

## పాఠ్యభాగ నేపథ్యం

విశాలాంధ్ర ఉద్యమానికి గొప్ప స్ఫూర్తినిచ్చిన గేయం 'చేయెత్తి జైకొట్టు తెలుగోడా'. తెలుగు మాట్లాడే వారందరికీ ఒక రాష్ట్రం కావాలన్న ఆలోచన 1940 దశకంలో ఉద్యమరూపం దాల్చింది. ఆ సందర్భంలో తెలుగు వారందరికీ జాతీయగీతం ఒకటి కావాలని ఉద్యమకారులు భావించారు. ఉత్తమ గీతానికి బహుమతి

కూడా ఇస్తామని ప్రకటించారు. అయితే ఈ పోటీతో సంబంధం లేకుండానే వేములపల్లి శ్రీకృష్ణ అప్పటికే విశాలాంధ్ర ఉద్యమ నేపథ్యంలో 'చేయెత్తి జైకొట్టు తెలుగోడా!' గీతాన్ని రచించారు. ఇతర గేయాలు ఎన్ని ఉన్నా తెలుగు జాతి అస్తిత్వాన్నీ, ఆత్మగౌరవాన్నీ ఆకాశమెత్తున రెపరెపలాడించిన గీతం ఇది. సుప్రసిద్ధ ప్రజానాట్యమండలి కళాకారులు నాజర్, బొడ్డు గోపాలం వంటి వారి గళంలో ఈ గేయం ఆబాల గోపాలం చేయెత్తి జైకొట్టింది. 1952 లో విడుదలైన 'పల్లెటూరు' చిత్రంలోనూ ఘంటసాల బాణి, వాణి మూలంగా పల్లెటూళ్ళ నుంచి పట్టణాలదాకా మారు మ్రోగింది. ఈ గేయం విశాలాంధ్ర ఉద్యమ నేపథ్యంలో పుట్టినా; ఈనాటికీ వివిధ సందర్భాలలో తెలుగు జాతి కీర్తి పతాకను ఎగురవేస్తూనే ఉంది. ఈ గీతం అవసరం తెలుగు జాతికి నానాటికీ పెరుగుతూనే ఉంది. ప్రస్తుతమున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల్లో ఈ గేయాన్ని పునర్మూల్యాంకనం చేస్తూ, విద్యార్థి లోకానికి మరోసారి సరికొత్త స్ఫూర్తిని అందించడమే ఈ పాఠ్యభాగం ఉద్దేశం.

## పాఠ్యభాగం

చేయెత్తి జైకొట్టు తెలుగోడా
గతమెంతొ ఘనకీర్తి కలవాడా

సాటిలేని జాతి
ఓటమెరుగని కోట
నివురు గప్పి నేడు
నిదుర పోతుండాది

జైకొట్టి మేల్కొలుపు తెలుగోడా!
గతమెంతొ ఘనకీర్తి కలవాడా!

వీర రక్తపు ధార
వారపోసిన సీమ
పలనాడు నీదెరా
వెలనాడు నీదెరా

బాలచంద్రుడు చూడ ఎవరోడోయ్
తాండ్ర పాపయ కూడ నీవోడోయ్.

నాయకీ నాగమ్మ
మల్లమాంబా మొల్ల
మగువ మాంచాల నీ
తోడ బుట్టిన వాళ్లె

వీర వనితల గన్న తల్లేరా
**ధీర మాతల జన్మ భూమేరా**

గతములో నీ కీర్తి
కతలల్లి సెప్పారు
పసయేడ దాచావు
వుసిలేక పోయెరా

బ్రతుకె బరువై యుంటి వీనాడు
శతపోరి సాధించు తొలిపేరూ

నాగార్జునుని కొండ
అమరావతీ స్తూప
భావాల పుట్టలో
జీవకళ పొదిగావు

అల్పుడను కానంచు తెల్పావు
శిల్పివంటిరి దేశదేశాలు

రాజ్యమంటే వీర
భోజ్య మన్నాడు మన
తిక్క నార్యునిమాట
ధీరులకు బాటరా

పూర్వ పౌరుష మెరిగి బ్రతకాలోయ్
**కార్యశూరులు నేడు కావాలోయ్!.**

దేశమంటే వట్టి
మట్టి కాదన్నాడు
మనుషులన్నా మాట
మరువబోకన్నాడు

అమరకవి గురజాడ నీవోడూ
ప్రజల కవితను బాడి చూపేడోయ్.

రాయలేలిన సీమ
రతనాల సీమరా
దాయగట్టి పరులు
ధార తీస్తుండారు

నోరెత్తి అడగరా దానోడా
వారసుడ నీవెరా, తెలుగోడా!

కల్లోల గౌతమీ
వెల్లువల కృష్ణమ్మ
తుంగభద్రా తల్లి
పొంగి పారిన చాలు

ధాన్యరాసులు పండు దేశాన
కూడు గుడ్డకు కొదవ లేదోయ్

పసిడి పాతర నీది
పరుల నోరూరెనోయ్
నీలొ నీకే పెట్టి
నెత్తి చే యెట్టారు

దేశాన్ని దిగమింగి పోయారోయ్
**మోసాన్ని గుర్తెరిగి కాపాడోయ్.**

ఉత్తరాదీ మొదలు
దత్తమండల మంత
తెలగాణ ప్రాంతముతొ
చెలిమి గలిగించాలె

కలిసి మెలిసే నేడు పోవాలోయ్
కలిమి బలిమి గూర్చుకోవాలోయ్.

ముక్కోటి బలగమోయ్
ఒక్కటై మనముంటె
యిరుగు పొరుగులోన
వూరు పేరుంటాది

తల్లి ఒక్కతె నీకు తెలుగోడా!
**సవతి బిడ్డల పోరు మనకేలా**

పెనుగాలి వీచింది
అణగారి పోయింది
నట్ట నడి సంద్రాన
నావ నిలుచుండాది

చుక్కాని బట్టరా తెలుగోడా!
నావ దరి జేర్చరా మొనగాడా!

## అభ్యాసం

**I. వ్యాస రూప సమాధాన ప్రశ్నలు**

1. వేములపల్లి శ్రీకృష్ణ పేర్కొన్న పూర్వపు 'తెలుగోడి' వైభవాన్ని వివరించండి?
2. వేములపల్లి శ్రీకృష్ణ ఏవిధంగా ఆంధ్రరాష్ట్రాన్ని అభివృద్ధిబాటలో నిలపాలన్నాడు?

**II. సంక్షిప్త రూప సమాధాన ప్రశ్నలు**

1. వేములపల్లి పేర్కొన్న వీరత్వాన్ని తెలుపండి?
2. ఐకమత్యాన్ని ఏవిధంగా సాధించాలని వేములపల్లి కోరాడు?
3. వేములపల్లి శ్రీకృష్ణ సాహిత్య, రాజకీయ జీవితాన్ని సంగ్రహంగా తెలపండి?

**III. సందర్భ సహిత వ్యాఖ్యలు**

1. ధీరమాతల జన్మభూమేరా.
2. కార్యశూరులు నేడు కావాలోయ్.
3. మోసాన్ని గుర్తెరిగి కాపాడోయ్.
4. సవతి బిడ్డల పోరు మనకేలా!

**IV. ఏక వాక్య / పద రూప సమాధాన ప్రశ్నలు**

1. విశాలాంధ్ర ఉద్యమానికి గొప్ప స్ఫూర్తినిచ్చిన గేయం ఏది?
2. వేములపల్లి శ్రీ కృష్ణ పేర్కొన్న అమర కవి ఎవరు?
3. 'చేయెత్తి జైకొట్టు తెలుగోడా' గేయం ఏ చిత్రంలో ఉంది?

**V. సంధులు**

| | | |
|---|---|---|
| గతమెంతో | నోరెత్తి | అల్లి సెప్పారు |
| తోడఁబుట్టిన | వారసుడవీవు | |

**VI. సమాసాలు**

| | | |
|---|---|---|
| ఘనకీర్తి | ముక్కోటి | తుంగభద్రానది |
| కార్యశూరులు | పెనుగాలి | |

### విశేషాంశాలు

❖ **ముక్కోటి:** ఇటీవలి కాలంలో ఈ గేయాన్ని గానంచేస్తున్న వారంతా 'ఆరుకోట్లు' అని ఆలపిస్తున్నారు. ఈ గేయం 1940 దశకంలో రాయబడింది. అప్పటికి ఆంధ్రుల జనసంఖ్య మూడుకోట్లు గానే పరిగణించబడేది. కవి కూడా 'ముక్కోటి ఆంధ్రులు' అనే ప్రయోగించారు. సినిమా కోసం పాడిన ఘంటసాల గొంతు లోనూ 'ముక్కోటి' అనే వినగలం. ఈ నాటి ఆంధ్రుల జనాభా ప్రకారం 'ఆరుకోట్లు' కూడా తప్పవుతుంది. కాబట్టి రచనాకాలాన్ని స్పష్టపరిచే, కవి ప్రయోగమే పాఠంలో స్వీకరించ బడింది.

## కార్యాచరణ

❖ ఆధునిక భారతంగా ప్రసిద్ధికెక్కిన పలనాటి యుద్ధం కథను విద్యార్థులకు పరిచయం చేయగలరు. తెలుగు ప్రాంతాలలో ప్రవహిస్తూ, ఈ గేయంలో ప్రస్తావించబడిన నదుల ప్రాశస్త్యాన్ని వివరించగలరు.

❖ ❖ ❖

# 6

# కపాలమోక్షం



**- శ్రీరంగం నారాయణబాబు**

## కవి పరిచయం

సంప్రదాయ శిఖరాలమీద ఆధునిక కవితా పతాకను ఎగురవేసిన తెలుగు కవి శ్రీరంగం నారాయణబాబు. 17.05.1906న వీరు జన్మించారు. తల్లిదండ్రులు రమణమ్మ, సుందర నారాయణ. నిజానికి నారాయణబాబు ఇంటిపేరు అతి. తండ్రి సుందర నారాయణ విజయనగరానికి చెందిన 'శ్రీరంగం' వారి ఇంటికి దత్తత వెళ్ళడం వల్ల ఇంటిపేరు శ్రీరంగంగా మారిపోయింది. నారాయణబాబుకి మహాకవి శ్రీశ్రీ తమ్ముని వరుస.

1928 నుండి నారాయణబాబు రచనలు ప్రచురితం అయ్యాయి. 1930 దాకా భావకవిత్వపు ప్రవాహంలో మునిగినా, తరువాత కాలంలో గొప్ప అభ్యుదయ కవిగా స్థిరపడ్డారు. మాటల్లో మంటలు రగిలించారు. 'రుధిరజ్యోతిర్ జ్వలనా లలనా ప్రియుండ, విప్లవ రుషిని, విద్రోహ కవిని' అని తనకు తాను ప్రకటించుకున్నారు. జ్వలిత, రుధిరజ్యోతి, మౌనశంఖం, కపాల మోక్షం, గడ్డిపరక వంటి అనేక ఖండికలు నారాయణబాబు కవితా దృక్పథానికి అద్దం పడతాయి. ఈ కవితలన్నీ 'రుధిరజ్యోతి' పేరుతో 1972లో ప్రముఖ కవి ఆరుద్ర గారి నేతృత్వంలో సంకలనంగా వెలువడ్డాయి.

నిత్యజీవన పోరాట సమస్యలు నారాయణబాబు కవితా వస్తువులు. స్వీకరించిన వస్తువును భిన్నంగా చూడటం; విభిన్నమైన పదాలు, పదచిత్రాలు ప్రయోగించడం వీరి ప్రత్యేకత. క్లుప్తత, గాఢ తాత్త్వికత, ప్రతీకాత్మక అభివ్యక్తి నారాయణబాబు కవిత్వంలో చూడగలం.

నారాయణబాబు కేవలం కవే కాక, కథకులు, నాటకకర్త కూడా. ఎర్రబుస్కోటు, అఖిలాంధ్ర దొంగల మహాసభ వంటి కథలు; మల్లమ్మదేవి కూతురు, పాలవాన వంటి నాటికలు నారాయణబాబు ఇతర రచనలు.

నారాయణబాబు మంచిగాయకుడు, నటుడు కూడా. 1943లో విడుదలైన 'భక్త కబీరు' చిత్రంలో వీరభోగమల్లు పాత్రలో నటించారు. సంగీత శాస్త్రంలోనే కాక; మనస్తత్త్వ శాస్త్రంలోనూ ప్రగాఢమైన ప్రవేశమున్న నారాయణబాబు 02.10.1961న మరణించారు.

## పాఠ్యభాగ నేపథ్యం

భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో సర్దార్ భగత్ సింగ్ (22.9.1907-23.3.1930) పాత్ర ఎంతో కీలకమైంది. జీవించింది కొద్దికాలమే అయినా; చరిత్రలో ఆయనపేరు చిరస్థాయిగా నిలిచి పోయింది. లాహోరు

కుట్ర కేసులో మొదటి ముద్దాయిగా అరెస్టు చేయబడిన భగత్‌సింగ్‌ను 23.03.1931 తేదీన బ్రిటీషు ప్రభుత్వం రహస్యంగా ఉరితీసింది. ఈ ఘటన దేశంలోని ఎందరో మేధావులనూ, రచయితలనూ, కళాకారులనూ కలచి వేసింది. వీరిలో చాలామంది భగత్‌సింగ్ ప్రభావంతో సోషలిస్టు పంథాను అనుసరించారు. అలాంటి వారిలో శ్రీరంగం నారాయణబాబు కూడా ఒకరు. ఆనాడు దేశంలో భారతీయ భాషల్లో భగత్‌సింగ్‌పై అనేక స్మృతి గేయాలు, కవితలు వెలువడ్డాయి. ప్రస్తుత పాఠ్యభాగం 'కపాలమోక్షం' ఆ వరుసలో వెలువడిన ఒకానొక స్మృతి ఖండిక. అయితే ఇది ఇతర స్మృతి కవితల కంటే విలక్షణమైంది. దేశభక్తి, చైతన్యం, త్యాగం, ధైర్య సాహసాలు వంటి అభ్యుదయకర అంశాలతో 'కపాలమోక్షం' తీర్చిదిద్దబడింది. భగత్‌సింగ్ ఒక సామాన్య వ్యక్తిగా కాక; ఒక పురాణ పురుషుడిగా, ఒక కారణ జన్ముడిగా ఈ ఖండికలో ఆవిష్కరించబడ్డాడు. పౌరాణిక ప్రతీకలు, ఆధునిక శిల్పరీతులు, అభివ్యక్తి నవ్యతలు ఈ కవితలో సంగమించి ఉంటాయి.

పారమార్థిక భూమిక ప్రగాఢంగా కలిగిన పదజాలం ఆధునిక వస్తువును బలంగా ఆవిష్కరించడానికి ఎంతగా వినియోగపడుతుందో నిరూపించిన ఖండిక 'కపాలమోక్షం'. పౌరాణిక అంశాల పట్ల నారాయణబాబుకున్న లోతైన అవగాహనకు ఈ ఖండిక ఒక నిలువుటద్దం. 1938లో తొలిసారిగా ప్రచురించబడిన ఈ ఖండిక 'రుధిరజ్యోతి' సంకలనం నుండి గ్రహించబడింది.

## పాఠ్యభాగ సారాంశం

శివుడు నిత్యకల్ప సమాధిలో మునిగి ఉన్నాడు. ప్రకృతిలో ప్రకంపనలు మొదలయ్యాయి. ఓంకారం హూంకరించగా చరాచరాలు చలించాయి. భూతాలు ఉద్రేకించగా అనంతకోటి జీవరాశులు హాహాకారం చేశాయి. శివుడు తపస్సమాధినుండి బైటకొచ్చాడు. ఆకలి విపరీతంగా ఉంది. భిక్షాపాత్ర కోసం చేయి సాచాడు. అప్పటికే శివుని ఉగ్రతపస్సుకి బ్రహ్మకపాలం కాలిపోయి ఉంది. శివునికి కొత్త భిక్షాపాత్ర కావలసి వచ్చింది. అది బ్రహ్మ కపాల మంతటిదై ఉండాలి. ఎవరి కపాలానికి అంతటి శక్తి ఉంటుంది? భూలోకంలోని సకల శ్మశానాలలోని కపాలాలన్నీ వికవిక నవ్వాయి. శివునికి ఆకలి పెరిగి పోతూ ఉంది. మరికొంత ఆలస్యమైతే ప్రకృతి విలయం సంభవించే ప్రమాదం ఉంది. శివుని చేతిలో భిక్షాపాత్రగా ఉండటానికి అర్హత కలిగిన కపాలమొకటి తక్షణమే కావలసి ఉండగా, అందుకోసం ఒక శక్తిసంపన్నుడైన వ్యక్తి అవతరించబోతున్నాడు. ఆ కారణజన్ముడే సర్దార్ భగత్ సింగ్.

ఈ ఖండికలో నారాయణబాబు అనేక పౌరాణిక ఘట్టాలను ప్రస్తావించారు. అవన్నీ అగ్నికీ, శివునికీ, శివుడి నేత్రాగ్నికీ సంబంధించినవి. భగత్‌సింగ్ నిప్పులాంటి మనిషి. నిప్పైన మనిషి, కాబట్టే కవి కొన్ని నిప్పులాంటి ప్రతీకల ద్వారా భగత్‌సింగ్‌ను ఒక కొత్త నిప్పులాంటి పౌరాణిక వీరుడిగా ఆవిష్కరించారు. భగత్‌సింగ్ నేపథ్యంలోంచి విద్యార్థి లోకంలో జాతీయతా స్ఫూర్తినీ, దేశభక్తినీ మరొకసారి నింపాలన్నదే ఈ పాఠ్యభాగం ఉద్దేశం.

# పాఠ్యభాగం

నిర్వికల్ప సమాధి
నిమీలితాక్షుడు
వేదసన్నిహితు
ఆది శంకరు
తపస్సమాధిని
ఓంకారమ్మే
హుంకరించినది

చలించినవి
చరాచరమ్ములు
భూతా లుద్రేకించినాయి
కాటుక పెట్టిన
నయనేంద్రియమై
కర్మసాక్షియే
చీకటు లురిలాడు

అభ్ర గంగలో
శుభ్ర వీచికల
హాలాహలమే
తల ఎత్తింది
శేషుని ఫణాల
మణుల కాంతులు
వీసరవోయినవి

పూదోటలు
లేనేలేవు
వసంతములు
రానేరావు
ముల్లోకమ్ముల
తబిసి మిన్నలు
ముర్మురించినారు

అనంతకోటి

జీవరాశులు

హాహాకారం

చేశాయి

"హరోం! హరా!" యని

"పాహి! పాహి!" యని

ప్రణమిల్లాయి!

ఆర్ద్రమైనది

ఆ మహామహుని

అంతఃకరణ

అంతట అక్షులు విప్పి

'ఆకలి! ఆకలి' అంటూ

భిక్షాపాత్రకు

చేయి చాపినాడు

ఉగ్ర తపస్సున

మ్రగ్గినది

వేడికంటికి

సూడిద వెట్టిన

బ్రహ్మకపాలం

పట పట

పళ్ళుకొరికినాడు

నటరాజు!

**భూతపిశాచాల్**

**బొబ్బరిల్లినవి**

వందిమాగధులు

వణికారు

భయపడి బసవడు

రంకె వేసినాడు

భూలోకమ్మున
తురకల గోరీలందున
క్రైస్తవుల సమాధులందున
హిందూ శ్మశానవాటుల
కపాలమ్ములు
వికవిక నవ్వినవి
పునుకలు
పులకరించినవి
కంకాళమ్ములు
ఘల్లున మ్రోగినవి!

శ్వేతపర్వతపు
శిఖరాంచలముల
కనక భాండమే
కదిలింది.

స్వాహా వల్లభు
సువర్ణగర్భం
సళుపరించినది
కళవళించినది.

గంగ వక్షమే
పాలపోటుతో
కళవళపడ్డాది

సింధుగర్భమున
గంగకడుపులో
లవణసాగరపు లోతుల్లో
దాగిన నేత్రాగ్ని
**మానవరూపం దాల్చింది**
మన్నే వెలిగించింది
మిన్నే పొగచూరింది!

మంటల్లోనే పుట్టాడు!
**మంటల్లోనే పెరిగాడు!!**
మంటల్లోనే మడిశాడు!!!

అగ్నివీణయై
భగ్నకంఠమై
భగ్నగీతియై
తారక మంత్రం
పరంజ్యోతిగా
వీరశైవుడు!

భారత వీరుని
కపాల మొక్కటి
కపర్ది చేతిని
రివ్వున వాలింది!
కెవ్వున కేకేశాడు
కంఠేకాలుడు!
ఫాల నేత్రమే
స్పందించింది
అండ పిండ బ్రహ్మాండమంతా
తాండవ నృత్యం చేసింది
ఆనందాశ్రుల నించింది.

శేషుని ఫణాల మెత్తని శయ్య
పుడమి ఒత్తిగిలింది.
ఎడారి పుష్పించింది!
ఎందరు పుట్టలేదు
ఇంకెందరు గిట్టలేదు
అందరికీ లభియిస్తుందా
హాలాహల మంటిన
హస్తస్పర్శ!
పెదవుల చుంబనం!

కపాలమోక్షం!
కపాలమోక్షం!!

## అభ్యాసం

### I. వ్యాస రూప సమాధాన ప్రశ్న

1. 'కపాలమోక్షం' పాఠ్యభాగ సారాంశాన్ని రాయండి?

### II. సంక్షిప్త రూప సమాధాన ప్రశ్నలు

1. శ్రీరంగం నారాయణబాబును గురించి రాయండి?
2. భగత్‌సింగ్‌ను గురించి రాయండి?

### III. ఏక వాక్య / పద రూప సమాధాన ప్రశ్నలు

1. శ్రీరంగం నారాయణబాబుకు శ్రీశ్రీ ఏమవుతాడు?
2. 'కపాలమోక్షం' ఏ కవితా సంపుటి నుండి గ్రహించబడింది?
3. 'కపాలమోక్షం' పాఠ్యభాగ రచయిత ఎవరు?
4. 'రుధిరజ్యోతి' సంపుటి ఎవరి నేతృత్వంలో వెలువడింది?
5. స్వాహా వల్లభుడెవరు?
6. మానవరూపం దాల్చిందేమిటి?

### IV. సందర్భ సహిత వ్యాఖ్యలు

1. భూత పిశాచాల్ బొబ్బరిల్లినవి.
2. మానవరూపం దాల్చింది.
3. మంటల్లోనే పెరిగాడు!!

### V. సంధులు

| | |
|---|---|
| చరా చరమ్ములు | సూడిద వెట్టిన |
| నయనేంద్రియం | శిఖరాంచలము |
| వీసరవోయినవి | కపాల మొక్కటి |

### VI. సమాసాలు

| | |
|---|---|
| ముల్లోకములు | అగ్నివీణ |
| బ్రహ్మకపాలం | కంఠేకాలుడు |
| స్వాహావల్లభుడు | కపాలమోక్షం |

## విశేషాంశాలు

- **బ్రహ్మకపాలం:** ఇది శివుని భిక్షాపాత్ర. బ్రహ్మకు చతుర్ముఖుడని పేరు. నిజానికి ఆదిలో బ్రహ్మకు ఐదు తలలుండేవి. ఒకనాడు ముల్లోకాలకు అధిపతి ఎవరన్న మీమాంస తలెత్తింది. ఈ విషయమై బ్రహ్మ, విష్ణువు వాదులాడుకుంటుండగా శివుడు అక్కడికొచ్చాడు. అపుడు బ్రహ్మ శివుని లింగాకృతిలో మొదటి భాగం చూశానని అబద్ధం చెప్పాడు. అంతేకాక, బ్రహ్మ ఐదోతల శివుణ్ణి దూషించింది. అందుకు శివుడు ఆ ఐదో తలను నరికి వేశాడు. అది శివుని చేతికి అతుక్కు పోయింది. అపుడు బ్రహ్మ ఆ కపాలంతోనే భిక్షాటన చేసి బతకమని శివుణ్ణి శపించాడు. అదే బ్రహ్మకపాలం అయింది. మిగిలిన నాలుగు తలలతో బ్రహ్మ చతుర్ముఖుడయ్యాడని ఐతిహ్యం.
- **గంగా నది :** ప్రసిద్ధమైన పవిత్రమైన నది. సాక్షాత్తూ విష్ణుమూర్తి పాదాల దగ్గర గంగానది పుట్టిందని ప్రతీతి.
- **లవణ సాగరం :** సప్త సముద్రాలలో ఒకటి. ఇక్షు సముద్రం, సురా సముద్రం, సర్పి సముద్రం, దధీ సముద్రం, క్షీర సముద్రం, జల సముద్రం అనేవి తక్కినవి.
- **తాండవ నృత్యం :** నృత్య రీతుల్లో తాండవ నృత్యం ఒకటి. నృత్యరీతులన్నింటిలోనూ తాండవం ఉద్ధత నృత్యం. పరమ శివుని నాట్యం తాండవ నృత్యంగా ప్రసిద్ధం.
- **చరాచరమ్ములు :** స్థావర జంగమాలు, చరములు, అచరములు; కదిలేవి, కదలనివి. చరములు ఐదు రకాలు. అవి – ఖేచరులు, భూచరులు, వనచరులు, జలచరులు, ధీచరులు. వీటిని చర పంచకం అంటారు. పర్వతాలు వంటివి అచరములు.
- **ముల్లోకములు :** మూడు లోకాలు – భూలోకం, స్వర్గలోకం, పాతాళలోకం అనేవి ముల్లోకాలుగా ప్రసిద్ధి. మనుష్యలోకం, పితృలోకం, దేవలోకాలను కూడా ముల్లోకాలుగా వ్యవహరించడం ఉంది.
- **కపర్ది :** శివుని నామాంతరం – రుద్రులు పదకొండుమంది. వీరినే ఏకాదశరుద్రులంటారు. కపర్ది వారిలో ఒకడు.
- **కనక భాండం :** బంగారు కుండ – అగ్ని దేవుని భార్య స్వాహాదేవి. ఒకసారి అగ్ని మునిపత్నులను చూసి మోహించాడు. ఆ విషయం తెలుసుకున్న అగ్ని భార్య ముని పత్నుల వేషాలు ధరించి అగ్నితో సంగమించింది. అతడి వీర్యాన్ని ఒక కనక భాండంలో సేకరించి మంచుకొండ అయిన కైలాస పర్వతం మీద నిక్షిప్తం చేసింది. ఆ కనక భాండమే ఇప్పుడు కదిలిందట.
- **గంగ వక్షము :** ఒకసారి శివపార్వతులు ఏకాంతంగా ఉన్నారు. వారి ఏకాంతాన్ని భగ్నం చేయాలని దేవతలు భావించారు. వీరి ప్రోద్బలం వల్ల అగ్నిదేవుడు శివపార్వతుల ఎదుట నిలబడ్డాడు. పార్వతి ఇబ్బంది పడింది. అగ్నిని శపించింది కూడా. ఈ శాపం మూలంగా శివుని వీర్యాన్ని అగ్ని ధరించవలసి వచ్చింది. అతడు దానిని భరించలేక, గంగానదీ గర్భంలో భద్రపరిచాడు. ఇపుడా గంగ వక్షము పాలపోటుతో కళవళ పడుతూంది. అంటే, గంగ గర్భంలోని శివుని వీర్యం మానవ రూపం పొందడానికి సమాయత్తమైందట.

- **నేత్రాగ్ని :** శివుడు ఫాలనేత్రుడు. ఫాలభాగంలో మరో నేత్రం కలవాడు. ఈ మూడో కంటి నుంచి చూపులు ప్రసరించవు. అగ్ని కురుస్తుంది. అది మామూలు అగ్ని కాదు, తీవ్రమైంది. తీక్షణమైంది కూడా. ఎంతటివారినైనా ఇట్టే దహించి వేయగలదు. నేత్రాగ్ని అంటే ఇదే.

  ఒకనాడు ఇంద్రుడు శివుణ్ణి ఎదిరించడానికి సిద్ధపడ్డాడు. ఫాలనేత్రుడికి కోపం వచ్చింది. మూడోకన్ను తెరిచాడు. ప్రజ్వరిల్లిన జ్యోతికి ఇంద్రుడు బూడిదయ్యాడు (వేరే సందర్భంలో ఇంద్రుడు మళ్ళీ బ్రతికాడు). ఇంద్రుణ్ణి భస్మం చేయగా మరికొంత నేత్రాగ్ని మిగిలింది. దానిని శివుడు మూడు భాగాలు చేశాడు. ఒక భాగాన్ని సింధూనది కడుపులో, మరో భాగాన్ని గంగానది గర్భంలో, ఇంకో భాగాన్ని లవణ సాగరం అడుగు భాగాన దాచి పెట్టాడు. ఇప్పుడు సమష్టిగా ఆ నేత్రాగ్ని మానవాకృతిని పొందింది. అతడే విప్లవ వీరుడు సర్దార్ భగత్‌సింగ్‌గా కవి ఆవిష్కరించాడు.

- **నిర్వికల్ప సమాధి :** నిర్వికల్పం అంటే లోకాతీతమై అద్వితీయంగా ప్రకాశించే జ్ఞానం. ఒకానొక సమాధి స్థితి. సమాధి అనేది యమం, నియమం వంటి అష్టాంగ యోగాలలో ఆఖరిది. దేనిని ధ్యానిస్తున్నారో దానికీ తనకూ భిన్నత్వం నశించడం, అభేదం సిద్ధించడం సమాధి. లోకాతీతమైన జ్ఞాన సముపార్జన కోసం ఏదైనా ఒక విషయంలో తాను లయం కావడం, చిత్తాన్ని ఆ విషయం మీద నిలపడం నిర్వికల్ప సమాధి. అనగా జీవుడి బాహ్య వృత్తులూ, ఆంతర వృత్తులూ నశించి పోయి బ్రహ్మ జ్ఞానం కలగడం. ఈ స్థితికి మరో పేరు అసంప్రజ్ఞాత సమాధి. సవికల్ప సమాధి, లేదా సంప్రజ్ఞాత సమాధి నిర్వికల్ప సమాధికంటే భిన్నమైంది. అక్కడ ధ్యేయవస్తువు ఎరుకలో ఉంటుంది.

- **ఓంకారం :** ఓంకారమంటే సాక్షాత్తూ పరబ్రహ్మ స్వరూపమైన బీజాక్షరం. నిత్య శుద్ధమైన బీజాక్షరం. పారమార్థిక పరిభాషలో దీనినే ప్రణవం అని వ్యవహరిస్తున్నాం.

- **భూత పిశాచాలు :** లౌకిక వ్యవస్థలో దయ్యాలూ, భూతాలూ అనే సామాన్యార్థంలో ఈ పదాలను వ్యవహరిస్తాం. కానీ, ఇక్కడ భూతాలు అంటే పంచ భూతాలు. పృథ్వి, ఆకాశం, వాయువు, నీరు, నిప్పు అనేవి. అలాగే పిశాచాలు మూడు – అధోముఖం, ఊర్ధ్వముఖం, తిర్యఙ్ముఖం అనేవి పిశాచాలు.

- **అంతఃకరణం :** అంతః కరణంలో నాలుగు అంశాలుంటాయి. మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం. వీటినే అంతఃకరణ చతుష్టయం అంటారు. 'అంతరంగం' అంతః కరణలో ఒక భాగం. అది అంతరాత్మకు అంటే మనస్సుకు సంబంధించింది. మనస్సు యుక్తా యుక్తాల గురించీ, ధర్మా ధర్మాలగురించీ ఆలోచించేటప్పుడు మనిషిని మంచి వైపుకు మరలించే అంతరింద్రియం.

- **తారక మంత్రం :** 'తారము' అంటే తరింప చేసేది అని అర్థం. 'తారకము' అంటే సంసార బంధాల నుంచి తరింప చేసేది. అంటే, ఓంకారం లేదా ప్రణవం. 'మంత్రం' అంటే కొన్ని ప్రత్యేక అక్షరాల సముదాయం. ఈ అక్షరాలకు ఒక అర్థం ఉండొచ్చు; ఉండకపోవచ్చు. మంత్రంలోని ఈ వర్ణాలలో కొన్ని బీజాక్షరాలు కూడా ఉంటాయి. కొన్ని పదాలు కూడా ఉండవచ్చు. దేవతల అనుగ్రహాన్ని సంపాదించడానికీ, ఆధ్యాత్మిక ఉన్నతికీ ఈ మంత్రాలను జపించడం వేదకాలం నుంచీ ఉన్నదే. ఈ మంత్రాలలో, ఉపకారం చేయడం

కోసమేకాక, విధ్వంస సాధనాలుగా వినియోగించేవికూడా ఉన్నాయి. ఈ విధ్వంస ఆయుధాలను తాంత్రిక మంత్రాలంటారు. తారక మంత్రాదులు దేవతల అనుగ్రహసాధనాలు.

❖ **పరంజ్యోతి :** 'పరమ'జ్యోతే పరంజ్యోతి. 'పరం' అంటే ఇహం కానిది, మోక్షం. అదే – పరలోకం. 'పరమం' అంటే 'ఓం'కారం. అందుకే పరమాత్మను పరబ్రహ్మ అనీ, పరమ పురుషుడనీ వ్యవహరిస్తాం. ఈ పరమాత్మ సంబంధమైన మోక్షాన్నీ, లేదా కైవల్యాన్నీ పొందే ప్రశస్తమైన స్థానాన్ని 'పరమ పదం' అని భావిస్తున్నాం. జ్యోతి అంటే వెలుగు, జ్ఞానం, కాలచక్రం. కాలచక్రాన్ని తన అధీనంలో ఉంచుకున్న సూర్యుడు జ్యోతిష్మంతుడు. పారమార్థికంగా ఒక సాత్త్వికమైన చిత్త స్థితిని పొందింపచేసే జ్ఞానం పరంజ్యోతి. అదే – పరమాత్మ. అదే – ప్రణవం. అదే – ఓంకారం.

❖ **అండ పిండ బ్రహ్మాండం :** అండమూ, పిండమూ మొదలు బ్రహ్మాండ పర్యంతమూ ఉన్న సమస్తమూ కలిపి అండ పిండ బ్రహ్మాండం. అండం అంటే గుడ్డు. పిండం అంటే మాతృగర్భంలో దేహధారణ చేస్తున్న దశలోని రూపం. బ్రహ్మాండం అంటే భూమి. గ్రహాలూ, నక్షత్రాలూ, వియన్మండలం వంటి సమస్తం ఇందులో అంతర్భవించి ఉంటాయి. ఈ సామాన్యార్థాలే కాక ఈ పదాలకు పారమార్థిక అర్థాలు కూడా ఉన్నాయి. అండం అంటే భూమి. పిండం అంటే స్థావర జంగమాత్మకమైన ప్రపంచం. గుడ్డు, గుడ్డు నుండి బిడ్డ పుట్టడం అనేది పంచమహాభూతాలతో కూడిన ఒక సృష్టి. ఇక్కడ స్థూల శరీరం అండం. జీవాత్మ పిండం. జీవాత్మతో కూడిన పరమాత్మ – అండపిండ బ్రహ్మాండం.

❖ **కపాల మోక్షం :** కపాలం అంటే పుర్రె. కొన్ని రకాల యజ్ఞ ద్రవ్యాలను తయారు చేయడానికి వినియోగించే పాత్రను కూడా 'కపాలం' అని వ్యవహరించడం ఉంది. బ్రహ్మ కపాలధారి శివుడు. అందుకే 'కపాలమాలి' అన్నది శివునికి మరోపేరు.

'మోక్షము' అంటే కైవల్య సిద్ధి. స్వస్వరూపానందాన్ని పొందడమే మోక్షం. ఎవరు కర్తృత్వ భావన లేకుండా; కర్మలను చేసి, సకల ప్రాణుల పట్ల దయగా వ్యవహరిస్తూ; నిత్యానిత్య వస్తు వివేకం, ఐహికాముష్మిక ఫల భోగ విరాగం, శమ దమాది పల్కు సంపత్తి, ముముక్షుత్వం అనే సాధన చతుష్టయాన్ని అనుసరించిన వారు మోక్షసాధనకు అర్హులు. పరమపురుషుని చేతిలో తాను కపాలంగా మారి కైవల్యసిద్ధిని పొందడం కపాలమోక్షం.

## కార్యాచరణ


❖ పరాయి పాలన నుండి సంకెళ్ళను తెంచి దేశానికి స్వాతంత్ర్యాన్ని తెచ్చి పెట్టడంలో భగత్‌సింగ్‌తోపాటు ఎంతోమంది దేశ భక్తులు ధన, మాన, ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారు. వారి అసమాన ధైర్య సాహసాలను, త్యాగాలను విద్యార్థులకు వివరించగలరు.

❖ ❖ ❖

# గద్య భాగం


| | | |
|---|---|---|
| 1. | హాసము - హాస్యము | 49 - 54 |
| 2. | అప్పుడు పుట్టి ఉంటే... | 55 - 60 |
| 3. | మహిళోద్యమ జనకుడు : కందుకూరి | 61 - 67 |
| 4. | కలవారి కోడలూ కలికి కామాక్షి | 68 - 73 |
| 5. | గాన సుధాకరుడు : మంగళంపల్లి | 74 - 83 |
| 6. | మాటతీరు | 84 - 90 |

# 1 హాసము - హాస్యము



**- మునిమాణిక్యం నరసింహారావు**

## రచయిత పరిచయం

తెలుగు సాహిత్యంలో పేరెన్నికగన్న హాస్య రచయితలలో మునిమాణిక్యం నరసింహారావు ఒకరు. వీరు 15-03-1898న గుంటూరు జిల్లా, తెనాలి దగ్గర ఉన్న సంగం జాగర్లమూడిలో జన్మించారు. తల్లి వెంకాయమ్మ, తండ్రి సూర్యనారాయణ. మునిమాణిక్యం ఇంటర్ విద్య తెనాలిలో చదివారు. డిగ్రీ చదివే స్థోమత లేక పోతే దేశభక్త కొండా వెంకటప్పయ్యగారి సహాయంతో బి.ఏ పూర్తి చేశారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు పండిత శిక్షణ కళాశాలలో ప్రధానాచార్యుడు గానూ, ఆకాశవాణి లోనూ కొంతకాలం ఉద్యోగం చేశారు. ఈయన భార్యపేరు కాంతం.

మునిమాణిక్యం రాసిన 'కాంతం కథలు' తెలుగు సాహిత్యంలో ఒక మణిహారం. 'దాంపత్యోపనిషత్తు, గృహప్రవేశం, హాస్య కుసుమావళి, తెలుగు హాస్యం, రుక్కుతల్లి, తిరుమాళిగ, దీక్షితులు, కాంతం కైఫీయత్తు వంటివి వీరి ఇతర రచనలు. 'టీకప్పులో తుఫాను' మునిమాణిక్యం మొదటి నవల. మధ్యతరగతి సంసారంలోని సరిగమల్ని ఎన్నింటినో మునిమాణిక్యం తన రచనల్లో వినిపించారు. కాంతం కథలకు వీరి భార్యే ప్రేరణ, స్ఫూర్తి. నిజ జీవితం లోని దాంపత్య సన్నివేశాలనూ, చిన్న చిన్న సంఘటనలనూ ఆధారంగా చేసుకొని 'కాంతం కథలు' రాశారు. కాబట్టే ఇప్పటికీ కాంతం కథలు నిత్య నూతన మనిపిస్తాయి. అలాగే 'మన హాస్యం' గ్రంథంలో హాస్యంలోని రకాలను, జీవితంలో హాస్యం అవసరాన్ని, హాస్యం వల్ల కలిగే ఆనందాలను, అనుభూతులను గురించి వివరించారు. లోకాన్ని ఇంతగా ఆనందపరచిన మునిమాణిక్యం 4.2.1973 న మరణించి, లోకాన్ని దుఃఖంలో ముంచారు.

ప్రస్తుత పాఠ్యభాగం 'హాసము - హాస్యము' అనే వ్యాసం డా॥ వెలగా వెంకటప్పయ్య సంపాదకత్వంలో వెలువడిన 'హాస్య భారతి' అనే గ్రంథం నుండి గ్రహించబడింది.

## పాఠ్యభాగ నేపథ్యం

నవరసాల్లో హాస్యానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. అసందర్భోచిత నవ్వు గురించి 'నవ్వు నాలుగు విధాల చేటు' అని ఉండవచ్చు. కానీ సందర్భోచిత హాస్యం గురించి అయితే 'నవ్వు నాల్గు విధాల మంచిది' అనాలి. 'ఆనందో బ్రహ్మ' అన్నారు. ఆనందంవల్ల మనసు తేలిక పడుతుంది. మా'నవ' జీవనంలో నవ్వు ప్రధాన భూమిక పోషిస్తోంది. ఎప్పుడూ శ్రమ ఒత్తిడిలో జీవించే మానవ జీవితంలో అప్పుడప్పుడూ నవ్వుల జల్లులు కురిపించడం అవసరం. లేకపోతే నిరాశా, నిస్పృహలు ఆవహించి జీవితం అంధకారమయ్యే ప్రమాదం ఉంది.

అసలైన హాస్యం గురించి, అపహాస్యం గురించి ఈ పాఠ్యభాగం తెలియ చేస్తుంది. ఒత్తిడికి లోనవుతున్న విద్యార్థుల జీవితాల్లో మానసోల్లాసాన్ని కలిగించడం, తద్వారా వారిలో జ్ఞాపక శక్తిని మరింత ఇనుమడింప చేయడం ఈ పాఠ్యభాగం ఉద్దేశం.

# పాఠ్యభాగం

## హాసము

**హా**సము అంటే నవ్వు. ఆ నవ్వు పుట్టించేది హాస్యము. ఏది నవ్వు పుట్టిస్తుంది? అసహజము విపరీతము అయినది ఏదైనాసరే దాన్ని చూచి నవ్వుతాము. వేషము విపరీతంగా ఉంటే నవ్వుతాము. చేష్టలు విపరీతంగా ఉంటే నవ్వుతాము. మాటలు వంకరగా ఉంటే తప్పక నవ్వుతాము. నవ్వు మానవుడు క్రొత్తగా నేర్చుకొన్నది కాదు. ఏడుపు ఎంత మానవ సహజమో నవ్వూ అంతే. బ్రహ్మదేవుడు సృష్టి కార్యక్రమం అంతా పూర్తిచేసి, తాను చేసిన పనిని ఒకసారి చూచుకొన్నాడు.

ఎన్ని పక్షులు! ఎన్ని జంతువులు! ఎన్ని చెట్లు! ఎన్నిరకాల పూలు! ఇవన్నీ చూచి, నవ్వుకొని ఉంటాడు. గాడిద, ఏనుగు, ఒంటె మొదలగు జంతువులలో ఉండే రూపవైవిధ్యం చూస్తే ఆయనకే నవ్వు వచ్చి ఉంటుంది. కుక్క మొరిగింది. గాడిద ఓండ్రపెట్టింది. ఏనుగు గీ పెట్టింది. ఈ శబ్దాలలో ఉండే స్వరవైవిధ్యం చూచి, మళ్లీ ఒకసారి నవ్వుకొని ఉంటాడు. యాడం, ఈవులు ఒకరిని చూచి ఒకరు నవ్వుకొనే ఉంటారు. నవ్వు సృష్టిలోనే ఉంది. పరిమళంతో కూడిన పుష్పాలనూ, మధుర ధ్వనులు చేసే పక్షులనూ, నాట్యంచేసే నెమళ్ళనూ చూచినప్పుడు ఆయన ఒడలు ఆనందంతో గగుర్పాటు పొంది ఉంటుంది.

అట్టి ఆనందం కలుగగానే సరస్వతి వీణ తీసుకొని పాడడం ఆరంభించింది. నారదుడు మహతి తీగెలు మీటి, ఈ మనోహరమైన సృష్టి చేసిన చతుర్ముఖుని స్తుతించడం ప్రారంభించాడు. దేవ దుందుభులు మ్రోగినవి. ఆ నిమిషంలోనే సర్వకళలు సముద్భవించినవి. అన్ని కళలు ఆనందంలో ఆవిర్భవించినవే. సర్వ ప్రపంచమూ, ఆనంద తరంగములలో ఉయ్యాల లూగింది. ఆ ఆనందం తాలూకు బాహిరరూపమే హాస్యము.

## హాస్యము

మళ్లీ మొదటికొద్దాము. హాసమునకు కారణభూతమైనది హాస్యము. నవ్వించేది హాస్యము. సహృదయుడూ, ఆరోగ్యవంతుడూ, సంస్కృతమతీ, నాగరికుడూ అయినవాణ్ణి నవ్వించేదే హాస్యము. అంటే ఉత్తమ హాస్యము. అయితే, అసంస్కృతుణ్ణి, అనాగరికుణ్ణి నవ్వించే విషయాలుకూడా ఉన్నవన్నమాట! ఎందుకులేవూ ఉన్నవి! అట్టి విషయాలు చాలా ఉన్నవి. ఒకటో రెండో ఇచ్చట ఉదాహరిస్తాను.

మనిషికి సహజముగా అంగ వైకల్యము ఉండవచ్చు. కుంటితనము, గుడ్డితనము, అనాకారితనమూ, ముక్కొంకర, మూతివంకర ఇల్లాంటివి ఉండవచ్చును. అట్టి అంగవైకల్యాన్ని చూచి నవ్వడము సభ్యత అనిపించుకోదు. అటువంటి విషయాలను జూచి నవ్వడము ప్రాకృత సహజము, నాగరిక లక్షణము కాదు. అయితే ఒకటి. కుంటిగా నడవాలని నడచిన నటకుని జూచి నవ్వవచ్చు. ఒకడు కాలుజారి పడతాడు. ఆ పడ్డవానిని జూచి జాలి పడవలెగాని నవ్వడము సభ్యత అనిపించుకోదు. కడుపు నొప్పితో బాధపడుతున్నవ్యక్తి, వికృత చేష్టలు చేస్తాడు.

మెలికలు తిరుగుతాడు, తన్నుకుంటాడు. ముఖం వికారంగా పెడతాడు. ఆ దృశ్యాన్ని జూచి నవ్వేవాడు, సంస్కృతీ సభ్యతా తెలిసినవాడు కాడు.

## హాస్య లక్షణాలు

హాస్యము అంటే ఏమిటి అని అడిగితే నవ్వు పుట్టించేది హాస్యము అని చెప్పాలిసి వస్తుంది. అయితే ఎవరికి నవ్వు పుట్టించేదీ అని మళ్ళీ ప్రశ్న. ఆరోగ్యవంతునికి సహృదయునికి నవ్వు పుట్టించేది హాస్యము అని అంటే ఒకవిధంగా సరిపోతుంది. సహృదయుడు అంటే బోలెడు తెలిసినవాడు. ముఖ్యంగా నవ్వతగిన విషయాలేవో, నవ్వకూడని విషయాలేవో తెలిసినవాడే సహృదయుడు. ఆ విషయాన్నే ఇక్కడ కొంచెం పరామర్శ చేద్దాం.

**అసహజత్వము :** ఒక విషయములో ఉండే అసహజత్వము (Incongruity), వైపరీత్యము నవ్వు పుట్టిస్తుంది. మనిషి రెండు కాళ్ళపైన నడవడము సహజము. ఒంటి కాలుమీద నడవడము అసహజం. విధి వశాత్తు ఒకకాలు ఏ యుద్ధంలోనో పోయి, ఒంటికాలుమీద నడుస్తూవుంటే నవ్వురాదు. కాని, ఒకడు తమాషాకు ఒక కాలుతో నడచినా, తల క్రిందపెట్టి, కాళ్లు పైకెత్తినా చూచేవాళ్ళకు నవ్వువస్తుంది. మనుష్యులు గుఱ్ఱాలను ఎక్కితే బాగానే ఉంటుంది. కాని గుఱ్ఱము మనుష్యుల పైకెక్కితే విరగబడి నవ్వాల్సి వస్తుంది. సహజంగా జరగవలసిన పని అట్లా జరక్క ఇంకొక విధంగా జరిగితే విపరీతంగా ఉండి నవ్వుతాము. మంచిగాని చెడ్డగాని మన సంఘంలో పత్నికి పతి దైవ సమానం అనేమాట బహుజన నమ్మకం అయిపోయింది. పత్నియే పతికి దైవము అంటే వైపరీత్యము ఉదయించి నవ్వుకు కారణం అవుతుంది. ఒక పరమ సత్యాన్ని ఒక సామాన్య విషయాన్ని విపరీత విషయంగా పరామర్శచేస్తే అప్పుడూ, ఆ కథనము అసహజము విపరీతమై హాస జనకము అవుతుంది.

'అర్ధరాత్రి దొంగలు పడ్డారు. కన్నం వేసే లోపల ప్రవేశించారు, ఇది సామాన్య విషయము. ఇందులో ఆశ్చర్యపడవలసిన సంగతి ఏమీ లేదు. అయినా ఒకడు ఆ సంగతి విని చచ్చేటంతటి ఆశ్చర్యాన్ని ప్రకటించి, "రాత్రా! అర్ధరాత్రా! అందరూ నిద్రపోతున్నప్పుడు వచ్చారన్న మాట! దొంగలు! అందులో కన్నంలో నుంచి! అరే! కన్నంలో నుంచి ఎట్లా ప్రవేశించారో!" అని ఆశ్చర్యాన్ని ప్రకటిస్తే మనము ఆ మనిషి అట్లా విస్తుపోవడాన్ని చూచి నవ్వుతాము. ముందుముందు ఈ విషయం ఎట్లాగూ చర్చకువస్తుంది గాబట్టి ప్రస్తుతం ఈ పరామర్శ ఈ ఒక్క ఉదాహరణతో వదిలేస్తాను.

అయితే ఒక్కవిషయం. సహజమైన విషయాన్ని అసహజమైన వృత్తాంతంగా ప్రదర్శించడంలో రచయిత ప్రతిభ కనబడుతుంది. చిలకమర్తివారి ప్రహసనాల్లో చెవిటివాళ్ల సంభాషణా, నత్తివాళ్ళ సంభాషణా హాస్యజనకం కావడానికి కారణం ఆ సంభాషణ అసహజం కావడమే! ఇది normal కాదు. ఉదాహరణకు పానుగంటివారి బధిర విధవా ప్రహసనము చూడండి.

**ఆశ్చర్యము (Surprise) :** ఒక సంగతి వింటూ ఉంటాము. కథో, ఉపన్యాసమో అల్లాంటిది. దాని పర్యవసానము ఇల్లా ఉంటుందని మన ఊహకు తడుతుంది. కథాంతంలో మనము అనుకొన్న దానికి వ్యతిరేకంగా

గాని, భిన్నంగా గాని, జరిగితే మనకు ఆశ్చర్యం కలుగుతుంది. ఆశ్చర్యం వలన ఆనందం కలుగుతుంది. ఆకస్మికా నందానుభూతి వలన నవ్వు వస్తుంది. మాకు ఒక అధ్యాపకుడు ఉండేవాడు. ఆయన గ్రీకు చక్రవర్తి అయిన అలగ్జాండరును గురించి ఉపన్యాసం ఇస్తున్నాడు. చక్రవర్తి గ్రీసు మొదలుకొని బియాస్ నది వరకు గల దేశాన్ని జయించాడనీ, ఎషీరియా, పరిష్యా, ఇరాక్ దేశాల ధరణీ పతులను పరాభవించాడనీ, తనకు ఎదురు తిరిగిన పట్టణాలను నిర్ధూమధామం చేశాడనీ, ఆయన మెట్టని దేశంలేదు అనీ, ఆయనకు తలవంచని భూపతి లేడు అనీ, గంభీరంగా, కొండవీటి జలపాతంలాగ ఉపన్యాసం నడిపి, "చివరకు, ఆయన ఏంజేశాడంటే" అని ఒక్కక్షణం ఆగేసరికి విద్యార్థులమంతా ఆ చక్రవర్తి ఏదో మహత్కార్యము చేసివుంటాడని నోరు తెరుచుకొని చూస్తుంటే ఈ వాక్యంతో ఆయన ఉపన్యాసాన్ని ముగించాడు. ఆ వాక్యం ఏమిటంటే "ఆ మహాచక్రవర్తి ఆకస్మికంగా ఎవ్వరికీ చెప్పకుండా 'ఢాం' అని చచ్చాడు" క్లాసంతా గొల్లుమన్నది.

ఆ ధోరణిలో అంత స్వల్పవిషయాన్ని మహద్విషయంగానూ అద్భుత విషయంగానూ చెప్పడంవల్ల ఆశ్చర్యం కలిగి నవ్వు వచ్చింది. ఆయన ఉపన్యాసం ఇస్తున్నంతసేపూ ఆ క్రమమూ, ఉత్సుకతా, ఉద్వేగమూ, తీవ్రత మొదలైన భావములచే మనస్సులో గాంభీర్యము స్థాయియై ఉండగా చటుక్కున ఆ భావాలకు భిన్నమైనదీ, అతి సామాన్యమైనదీ, పేలవమైనదీ అయిన భావమును ఆ వరుసలో నిలిపే సరికి, ఆ వృత్తాంతమంతా వికృతమై అసహజమై ఫక్కున నవ్వు వస్తుంది. అసహజత్వము, ఆశ్చర్యమూ ఈ రెండూ హాస జనకములే. ఈ రెండూ వికృతిని కలిగించేవే. ఎక్కడ అయితే వికృతి ఉంటుందో, ఎక్కడ అసహజత్వము ఉంటుందో అక్కడ హాస్యజనక వృత్తాంతము ఉంటుంది. ఒక హఠాత్ జనితమైన ఊహ లేక సంభవము తలవని తలంపుగా జరిగే సంఘటన ఒక ప్రసంగంలో పూర్వభాగమునకు భిన్నమైన ముగింపు, ఆశ్చర్యాన్ని కలిగించి నవ్వును పుట్టిస్తున్నది.

ఆశ్చర్యమును కలిగించి హాస్యము సాధించినట్లే ఒకమాటకు ఉన్న అర్థమునకు భిన్నమైన వేరొక అర్థమును సాధించిగాని లేక స్ఫురింపజేసిగాని మృదుమధుర మందహాస పరిమితమైన హాస్యమును సాధించవచ్చు. మొదటి అర్థానికి సాధికమైన అర్థము వ్యతిరేకమేకాక నిర్హేతుకము, నిర్నిరీక్షితము అయినపుడే నవ్వు వస్తుంది.

క్షురకుడు క్షవరం చేస్తున్నాడు. ముఖంమీద గాట్లు పడుతున్నవి. రక్తం వస్తున్నది. బాధ తగ్గించడానికి క్షురకుడు ఆ మనిషిని మరో సంభాషణలోనికి దింపి "బాబూ మీరెప్పుడైన ఇదివరకు మా షాపుకు వచ్చారా" అని అడిగాడు క్షురకుడు. క్షవరితుడు "లేదు ఆ చెయ్యి యుద్ధములో తెగిపోయిందయ్యా" అన్నాడు. క్షురకుడి అసమర్థతవలన ఆయనకు కలిగిన మనఃక్లేశము ధ్వని నిక్షిప్తమై క్షురకుడికి తలవంపులు కలిగించినా నవ్వడానికి తగిన పదార్థము ఇందులో లేకపోలేదు. ఇక్కడ కూడా ఆశ్చర్యం కలిగే మనకు నవ్వువస్తున్నది.

**సందర్భశుద్ధి లేకపోవడము :** సందర్భశుద్ధిలేని ప్రసంగములలో ఉండే వికృతి (Impropriety) నవ్వుకు కారణం అవుతుంది. "తాటి చెట్టు ఎందుకు ఎక్కావురా" అంటే "దూడకు పచ్చగడ్డి కోసం" అన్నాడట. శుభమైన పెళ్ళి జరుగుతున్న సమయంలో "వచ్చిపోయెడు వారు వక్కలాకుల కేడ్వ, గుగ్గిళ్లకై పెళ్ళి గుఱ్ఱమేడ్వ, పెద్ద మగడని

పెళ్లి కూతురు ఏడ్వ, కట్నంబుకై గ్రామకరణమేడ్వ" మొదలగు అవాకులూ, చవాకులూ వింటే నవ్వురాకపోదు. ఆ నవ్వు నిర్మలమూకాదు, రసజనకమైన చిత్తవృత్తిని ఆశ్రయించినదీ గాదు. అయినా అది హాస్యమే. సందర్భశుద్ధి లేకపోవడము హాస్యానికి కారణము.

**అప్రియమును ప్రియముగా మలచుట (Distortion):** కష్టం కలిగించే విషయమును మెత్తని మాటలతో చెప్పడంవల్ల కూడా వికృతి జనిస్తుంది. అప్రియమును ప్రియమైనదానివలెనూ, అసత్యమును సత్యమువలెనూ; దుఃఖమును సుఖమువలెనూ, సుఖమును దుఃఖమువలెనూ మలచడము, నేర్పుతో వికృతిని సాధించడము అన్నమాట. దీనిని distortion అనవచ్చు.

ఒక ఊళ్లో భూకంపాలు తరుచుగా వస్తున్నవి. ఒక పిల్లలుగల ఆసామీ తన పిల్లలను మరో గ్రామంలో ఒక స్నేహితుని ఇంటికి పంపాడు ఎందుకైనా మంచిదని. నాలుగైదు రోజులున్న తరువాత ఆయన దగ్గర నుండి టెలిగ్రాం వచ్చింది పిల్లల తండ్రికి. ఏమనీ? "పిల్లలను నీ దగ్గరకే పంపివేస్తున్నాను. భూకంపాలను మాఊరు తోలేశెయ్యి" అని. ఎంతో అప్రియమైన విషయాన్ని ఎంతో సుకుమారంగా చెప్పాడు. అప్రియత్వమూ, సౌకుమార్యమూ, భిన్న భిన్నవిషయాలు. ఒకచోట చేరడంవల్ల వికృతి జనించి హాస్యానికి ఆలంబన అయింది.

**అతిశయోక్తి :** అతిశయోక్తి (Exaggeration) కూడా హాస్యసాధనకు ఒక మార్గము. అయితే ఆ విషయం నిజంగా అతిశయోక్తి అయితేనే హాస జనకము అవుతుంది. పరమ సత్యము అయితే నవ్వురాదు. ఈ కథ చూడండి.

"ఒకామె నల్లని నలుపట. ఎంత నలుపూ అంటే ఆమెకు చెమట పోసినపుడు ఆ చెమటను గుడ్డతో అద్ది గాజు బుడ్డిలో పిండి కావలసినంత నల్ల సిరా తయారు చేసుకోవచ్చునట" ఇది అతిశయోక్తి. అంటే అభూత కల్పన. సత్యమైన విషయము ఎప్పుడూ అతిశయోక్తి కాదు, హాసజనకమూ కాదు. అయితే అతిశయోక్తులలాగ కనపడేవి, నిజంగా అతిశయోక్తులా సత్యమైన గాథలా అని నిశిత దృష్టితో పరిశీలించాలె. ఒక హిందీ పుస్తకంలో ఈ క్రింది విషయం ఉంది.

"అగస్త్యుడు సప్తసముద్రాలను అపోశన పట్టడమూ, ఆంజనేయుడు సంజీవి పర్వతాన్ని అరచేతిలో పెట్టుకొని తీసుకొని రావడమూ, ఈ వృత్తాంతాలు కడుపుబ్బ నవ్వు పుట్టిస్తవి" అని. ఆ కథలను కవి హాస్య కల్పనకై వ్రాయలేదు. ఆ విషయం సులభంగా ఊహించవచ్చు. కవి ఉద్దేశంలో అవి పరమ సత్యాలు. సత్యమైన వృత్తాంతంలో వికృతీలేదు. వైపరీత్యుక్తుల మాహాత్మ్యాన్ని మనము గ్రహించాలని కవి ఉద్దేశం. కాని, వానిని కల్పనాకథలుగా, హాస్య వృత్తాంతాలుగా భావించమనికాదు. "అవి నిజంకాదు. అంతెత్తున అతిశయోక్తులు కట్టాడనండి". – అని మనము అనగలిగితే మంచి మనోహరమైన హాస్యపు పలుకులు అవుతవి అని. అతిశయోక్తి హాస్యజనకం కావాలంటే దాని పునాదులు అసత్యం మీద వేయాలె. అప్పుడే అది నవ్వు పుట్టించే శక్తిగల అతిశయోక్తి అవుతుంది.

## ఏది హాస్యం కాదు

భయంకరమైన దృశ్యములు; జుగుప్సాకరమైనవి, దుఃఖహేతువులైనవి అయిన వృత్తాంతములూ, ఆ సందర్భముగా వచ్చిన వర్ణనలూ హాస్యవంతములుకావు. తాటకి ముక్కూ చెవులూ కోయడము బీభత్సరసాన్ని పుట్టిస్తుంది కాని హాస్యజనకం ఎట్లాఅయిందో నాకు అర్థం కాలేదు. అది నవ్వుపుట్టించే విషయంగా భావించేవాడు పసిపిల్లవాడు అయినా అయివుండవలె, పిచ్చివాడయినా అయివుండవలె. అల్లాగే లంకా దహనదృశ్యం భయంకరమైనది. రసము బీభత్సమూ, భయానకమూనూ. రాక్షసుల గృహాలే అయినా తగులబడి పోతుంటే నవ్వు రాదు. మన దేవుడు రాముడు. ఆయనకు రాక్షసులు విరోధులు. విరోధుల ఇండ్లు తగలబడుతున్నాయని కొంత తృప్తి ఉంటే ఉండవచ్చును మనస్సులో. కాని విరగబడి నవ్వడం ఎల్లా సంభవం!

### అభ్యాసం

**I. వ్యాస రూప సమాధాన ప్రశ్నలు**

1. హాస్యం యొక్క లక్షణాలను తెలపండి?
2. హాస్యం అంటే ఏమిటో తెలిపి సోదాహరణంగా వివరించండి?

**II. సంక్షిప్త రూప సమాధాన ప్రశ్నలు**

1. సందర్భశుద్ధి లేకపోవటం వల్ల కలిగే హాస్యం గురించి తెలపండి?
2. 'హాస్యమునకు ఒక ముఖ్య కారణం ఆశ్చర్యం' వివరించండి?
3. అసహజత్వం వల్ల కలిగే హాస్యాన్ని గురించి తెల్పండి?
4. మునిమాణిక్యం నరసింహారావును గురించి రాయండి?
5. అపహాస్యం గురించి సంక్షిప్తంగా వివరించండి?

**III. ఏక వాక్య / పద రూప సమాధాన ప్రశ్నలు**


1. 'కాంతం కథలు' రాసిందెవరు?
2. హాసము అనగా ఏమిటి?
3. హస్యము అంటే ఏమిటి?
4. సప్త సముద్రాలను ఆపోశన పట్టింది ఎవరు?
5. రామాయణంలో సంజీవి పర్వతాన్ని తెచ్చినది ఎవరు?
6. నారదుని వీణ పేరు ఏమిటి?
7. 'హాసము - హాస్యము' పాఠ్యభాగ రచయిత ఎవరు?

### విశేషాంశాలు

❖ **యాదం, ఈవులు :** ఆడం / యాదం, ఈవులనే మనం అవ్వ, ఆదాములని వ్యవహరిస్తున్నాం. క్రైస్తవ మత గ్రంథమైన బైబిల్ ప్రకారం మానవ జాతిలో ఆది పురుషుడు, ఆది స్త్రీ ఈ ఆడం, ఈవులు.

❖ ❖ ❖

# 2 అప్పుడు పుట్టి ఉంటే...



**- దేవులపల్లి కృష్ణశాస్త్రి**

## రచయిత పరిచయం

ఆధునిక తెలుగు కవుల్లో పరిమళభరితమైన కవిత్వాన్ని అందించిన వారిలో దేవులపల్లి కృష్ణశాస్త్రి ప్రముఖులు. తూర్పు గోదావరి జిల్లా, పిఠాపురం దగ్గర ఉన్న రామచంద్రపాలెంలో 01.11.1897న కృష్ణశాస్త్రి జన్మించారు. సీతమ్మ, తమ్మన్నశాస్త్రి వీరి తల్లిదండ్రులు.

పిఠాపురం లోనూ, విజయనగరం లోనూ విద్య గడించిన దేవులపల్లి కొంతకాలం శాంతినికేతన్ లోనూ గడిపారు. ఉపాధ్యాయ వృత్తిని చేపట్టిన కృష్ణశాస్త్రి ఆ తరువాత రఘుపతి వెంకయ్య నాయుడు గారి ప్రోత్సాహంతో సంఘసంస్కరణ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు. హరిజనాభ్యుదయ గీతాలను ప్రచారం చేశారు. 1930లో పిఠాపురంలో 'వేశ్యా వివాహ సంస్థ'ను స్థాపించారు. కొందరు వేశ్యలకు వివాహాలు కూడా జరిపించారు.

భావకవుల్లో కృష్ణశాస్త్రిది భీముని వాటా. కృష్ణపక్షం, ప్రవాసం, ఊర్వశి, పల్లకి వంటి అనేక ఖండ కావ్యాలను దేవులపల్లి ప్రకటించారు. కొన్ని యక్షగానాలనూ, మరికొన్ని భక్తి నాటికలనూ, ఇంకొన్ని గేయ నాటికలనూ కూడా కృష్ణశాస్త్రి అందించారు. కేవలం కవిగానే కాక. కొన్ని విమర్శనా వ్యాసాలను కూడా రచించి, విమర్శకునిగా కూడా మంచి గుర్తింపు పొందారు.

'ఆంధ్రా షెల్లీ'గా ప్రస్తుతించబడిన కృష్ణశాస్త్రిని ఆంధ్ర విశ్వవిద్యాలయం 'కళా ప్రపూర్ణ' తోనూ, భారత ప్రభుత్వం 'పద్మభూషణ్' తోనూ సత్కరించాయి. 'దిగిరాను దిగిరాను దివినుండి భువికి' అని ప్రకటించుకున్న దేవులపల్లి 24.02.1980 తేదీన దివంగతుడయ్యారు. ప్రస్తుత పాఠ్యభాగం 'కృష్ణశాస్త్రి కృతులు' అనే వ్యాస సంకలనం లోని 'అప్పుడు పుట్టి ఉంటే...' అనే వ్యాసానికి సంక్షిప్త రూపం.

## పాఠ్యభాగ నేపథ్యం

కృష్ణశాస్త్రి గొప్ప భావుకులు. రాయలకాలంలో కవులకు జరిగిన సన్మానాల గురించి తెలుసుకొని ఆనంద పరవశులయ్యారు. రాచరిక వ్యవస్థ ఉన్న రోజుల్లో కవి పండిత పోషకుడైన శ్రీకృష్ణదేవరాయల కాలంలో సాహిత్యం ఎలా అందలం ఎక్కిందో, కవులకు ఎంత గౌరవం దక్కిందో మన కళ్ళముందు ఉంచుతూ చక్కని వచనంలో ఈ పాఠ్యభాగాన్ని రచించారు. ఈ వ్యాసం ద్వారా మనకు కూడా ఆ కాలపు అనుభూతిని పొందే అవకాశాన్ని కల్పించారు.

శ్రీకృష్ణదేవరాయలు క్రీ.శ. 1509–1529 మధ్య కాలంలో విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలించాడు. వీరి పాలనా కాలం స్వర్ణయుగంగా చరిత్ర కెక్కింది. వీరి సామ్రాజ్యం మత సామరస్యానికే కాక; కళలకూ, కవులకూ నిలయంగా ఉండేది. ఆనాటి ఆ వైభవాన్ని విద్యార్థులకు పరిచయం చేయడమే ఈ పాఠ్యభాగం ఉద్దేశం.

## పాఠ్యభాగం

**ఈ**యేడు మహర్నవమినాడు రాయలవారు భువన విజయంలో మనుచరిత్ర మందుకుంటున్నారన్న వార్త సామ్రాజ్యం మారుమూలలకీ పాకిపోయింది.

అటు కళింగం నుంచీ, గౌతమీ తీరాన్నుంచీ, ఇటు కావేరినుంచీ, మధురనుంచీ, కవీశ్వరులేమి, గాయకులేమి, విద్వాంసులేమి, ఎక్కడెక్కడివారూ విజయనగరానికి కొన్ని దినాలకి ముందుగానే వచ్చి విడిది చేశారు. ప్రభాత సమయంలోనూ, ప్రదోష కాలంలోనూ, తుంగభద్రాతీరాన్నీ విఠలస్వాముల కల్యాణ మండపంలోనున్నూ వీరందరి గోష్ఠులూ ఎంతో కలకలం చేస్తున్నాయి.

ఇక, వచ్చిన కవులలో సగంమంది పెద్దన్న గారి ఇంటనే దిగారు. పింగళిసూరన్న ఎప్పుడు విజయనగరం వచ్చినా, తాతగారి ఇంటనే దిగడమూ, తన కవిత్వ ధోరణి ఆయనకు వినిపించి రంజింప జేయడమూ ఉండనే ఉంది. ఆనాటి ఉదయంనుంచీ అతడు వాకిట్లోనుంచి లోపలికీ, లోపలి నుంచి వాకిటిలోకీ తిరుగుతూనే ఉన్నాడు.

*** *** ***

అంతలోనే వీథి మొగను కాహళధ్వనులు మోగుతాయి గుఱ్ఱపు గిట్టల ధ్వనులతో కలిసి.

అంతలో, ముందు ఇద్దరూ, వెనకాల శకటంలో అప్పాజీ, మహాకవి మందిర ప్రాంగణంలో దిగుతారు.

సూరన్న ఆవేశానికీ, సంతోషానికీ మేర లేదు.

పెద్దన్న గారు వాకిట్లోకి వస్తారు. గడియకో, మరో గడియకో రాయలవారు అక్కడికి వేంచేస్తున్నారనిన్నీ, ఊరేగింపు మహోత్సవం అక్కడినుంచి తరలి ఆ కొలువు కూటందాకా సాగుతుందనిన్నీ, మహాకవులతో అప్పాజీ మనవి చేస్తాడు.

బంగారు కుండలాలూ, జలతారు సేలువలూ సవరించు కొని, కవులూ, పండితులూ రాయలవారి రాకకై మొగసాలలో ఎదురు చూస్తుంటారు.

ఇంతలో మంగళవాద్య ధ్వనులు మరీ మోగి పోతాయి.

మహారాజ ప్రాసాదం నుంచి రాయలవారు బయలు దేరినట్లు, కొంతదూరం వచ్చినట్లు, మరికొంత సమీపించినట్లు, సేవకులు పరుగెత్తివచ్చి చెప్తూంటారు.

మరి ఇక కొంత సమీపించినట్లు, మొదట వర్షామేఘ గర్జనలాగ, తరువాత మహాసముద్ర ఘోషలాగ, విజయనగర ప్రజలు చేసే జయజయ ధ్వానాలు దగ్గిరగా దగ్గిరగా వినబడతాయి.

అంతలో వీధి ముఖాన సందడి. ఒక కనురెప్పపాటు నిశ్శబ్దం.

రాజాధిరాజ వీరప్రతాప రాజపరమేశ్వర మూరు రాయరగండ శ్రీకృష్ణదేవ రాయలు అల్లసాని పెద్దనామాత్యుల గృహాంగణంలో, మంత్రి సామంతులతో వేంచేసి ఉంటారు. ముందు అప్పాజీ అచ్యుతదేవ రాయలూ నంది తిమ్మన్నా, మాదయ్యగారి మల్లన్నా నడుస్తుంటే, పింగళి సూరన్న చెయ్యి అందుకుని వచ్చి బంగారపుటడ్డల పల్లకీలో పెద్దన్న గారు కూర్చుంటారు.

మంగళ వాద్యాలు మ్రోగుతూనే ఉంటాయి.

అంతలో కవిరాజరాజు శ్రీకృష్ణదేవ రాయలు ముందు నిలబడి, పల్లకీ తన చేతితో ఎత్తుతాడు.

తక్షణం కొందరు సామంతులూ, కొందరు కవులూ పల్లకీ బొంగులకు భుజాలు తగిలిస్తారు.

“ఆహా, ఏఁవి మహాప్రభువు! ఓహో, భోజుడేనా ఇలాగ చేశాడని విన్నామా! విద్వజ్జనుల పరిశ్రమ విద్వాంసులకే తెలుస్తుందన్నట్లు, మహాకవుల గొప్పతనం మహా కవులకే తెలుస్తుంది,” అంటూ, నంది తిమ్మన్నా ధూర్జటీ మొదలైన కవీశ్వరులు ఆ గౌరవం తమకి జరిగినట్లే సంతోషిస్తారు.

సందడిలో కొంత వెనక్కి జరిగి, దిట్టలైనవారే కొందరు కవులు పెదవి విరిచి ధుమధుమ లాడుతూ ఉంటారు. వారిలో సంకుసాల నృసింహకవి ఉన్నాడా? అయినా, ఈ ఆనంద సమయంలో వాళ్ళ పేర్లు ఇప్పుడు చెప్పను.

*** *** ***

ఆహా! ఏమి ఊరేగింపు.

ముందు వందలకొద్దీ రౌతులు. తర్వాత సుఖంగా, చల్లగా పాడే తంజాపురి సన్నాయి కూటం. ఆ తరవాత, ఒకసారి నరాలకి వేడెక్కించీ, ఒకసారి కళ్ళల్లో మెరుపులు పుట్టించే, భట్టుకవుల స్తుతిపాఠాలు. పిమ్మట కంచినుంచి వచ్చిన కామసుందరిమేళం ఆ వెనక వేదమంత్రాలు పఠించే వైదికబృందం ఆ వెంటనే మంత్రులతో, సామంతులతో దండ నాథులతో, కవులతో, పండితులతో, గాయకులతో రాయబారులతో, శ్రీకృష్ణదేవరాయలు.

వారిలో, అడుగో, ఆ వృద్ధతేజస్వి అప్పాజీ, నిప్పు కణాలలాగ,కత్తిమొనలలాగ ధగధగలాడే రెండు కళ్లూ, వేయికళ్లుగా నాలుగువైపులా పరికిస్తూ!

కోటేసినట్లు చక్కనిముక్కూ, పండుతములపాకువంటి శరీరచ్ఛాయా, కర్పూరపుతాంబూలం బుగ్గలో ఉంచే, రాయల వారితో మాట్లాడుతూ నడుస్తున్నవాడు నంది తిమ్మన్న.

ఆ ప్రక్కన నిష్కలంకమూ, నిశ్చలమూ అయిన చల్లని ముఖంతో ధూర్జటి.

అతని వెనకాలనే, మొలలోనుంచి బంగారపు పొడుం కాయ తీస్తున్న వాడు మాదయగారి మల్లన.

ఆయనకి ఎడమవైపున ఆ అపరంజికుండలాలూ, ఆకు పచ్చ సేలువా రామభద్రుడు. అతనికి కుడివైపున ఆ చక్కని జిలుగుపట్టు వలువలతో తీరిచిన కురులతో ముంగురులూ అలవోకనడకతో, ఆ యువకవి రామరాజ భూషణుడు.

అతని పక్క కందుకూరి రుద్రయ్య.

అతను వంగి వంగి, తల ఒకపక్కకు ఓరగా వంచి, మాట్లాడుతున్నాడే, ఒక యువకునితో, అతను రామలింగ కవి; ఇంకా రామకృష్ణకవి కాలేదు. అతని నడకలో ఏమి నిర్లక్ష్యం! ఆ విశాల ఫాలమూ ఒక్క సారి మేఘాల్లాగా, ఒక సారి మెరుపుల్లాగా అయిపోయే ఆ కళ్లూ "శారద నీరూపము" అన్నట్లు ఎలా గున్నాడో!

అతనివెనుక రాధామాధవకవి ఎల్లన.

అదుగో, వెనుకనుంచి తొందరగా ముందుకు తోసుకుని భట్టుమూర్తివద్దకు వచ్చినవాడు బండారు లక్ష్మీనారాయణ. రాయలవారి అంతఃపురంలో సంగీతపు గురువు. అతనిచేతిలో గ్రంథం "సంగీత సూర్యోదయం" ఏమో!

అతనితోకూడా వచ్చినవాడు బయకారపు రామయామాత్యుడు అనేగాయకుడూ దండనాథుడూ "స్వరమేళ కళానిధి" ఆస్థాన గాయకులకు వినిపించడానికి వచ్చినవాడు.

అల్లదుగో, కొంచెందూరాన నడుస్తూ, ఏదో ఆలోచిస్తున్నట్లూ, వ్యూహం పన్నుతూఉన్నట్లూ, వేళ్లు తిప్పుతూ వస్తున్నవాడు బొడ్డుచర్ల తిమ్మన్న గారు. ఇటువంటి చతురంగపుటాటగాడు ఆదినాల్లో లేడు. కవీశ్వర దిగ్దంతులనుపించుకొన్న కృష్ణరాయలవారి యొద్దకుపోయి, వారితో చదరంగం ఆడుతూ ఉండే ఈ చిన్న తిమ్మన్నగా రంటేనే, మహారాయలు చాలాసంతోషించి, కొప్పోలు గ్రామం సర్వాగ్రహారంగా ఈయనకు ధారవోసి ఇచ్చారు.

ఇతని ప్రక్కన ఆ పొడుగాటి జుట్లూ, ఆ రంగురంగుల దుస్తులూ వాళ్లూ నట్టువ నాగయ్య, నట్టువ తిమ్మయ్యగార్లు, రాయలవారి సమక్షాన రాయలవారే రచించిన సంస్కృత నాటకం జాంబవతీకల్యాణం ప్రదర్శించడానికి వచ్చారు.

ఇక ఆ పండితకూటంలో వారే, గీర్వాణ కావ్యకర్తలు దైవజ్ఞ విలాస కావ్యకర్తలు కొండవీటి విద్వత్కవి సార్వభౌములు లక్ష్మీధరులవారు. వారు వ్యాసతీర్థులు. అతడు రాజనాథ డిండిముడు. "ఇరుసమయి విళక్కన్" రచించిన తమిళ కవిరాజు, హరిదాసతడు. అతని పక్కనే రాయలవారి ఉత్కళయాత్రను వర్ణించిన కుమార సరస్వతి. చాటువిఠలనాథుడు ఆ కర్ణాటక కవి. ఆ తేజస్సు లిద్దరూ పురందరదాసూ, కనకదాసునూ, కర్ణాటక కవిరాజులు కలిసి నడుస్తున్న ఆముగ్గురూ-గుబ్బి మల్లనార్యుడూ, నంజుడయ్యా, లింగ మంత్రీ.

ఓహో, ఓహో, ఆంధ్రకర్ణాటక తమిళ సాహిత్యాలకు స్వర్ణ యుగం అది.

దక్షిణాపథం అంతా ఒక సుందర సంస్కార బంధం కట్టి పెట్టిన దినాలవి.

*** *** ***

ఊరేగింపు వీథి తిరుగుతుంది.

వీథి దాటినదాకా ఇక్కడ పెద్దన్నగారి గృహ ప్రాంగణంలో గవాక్షంలోనుంచి, వెయ్యికళ్లతో చూస్తూ, గర్వమూ, అడకువా మూర్తికట్టినట్లున్నదే, ఆమె, మహాకవి ఇల్లాలు.

ఊరేగింపు విజయనగర రాజవీథుల్లో ఏలాగున సాగిందో తోవలో రాయలవారికీ మహాకవికీ హారతులు ఎలాగ ఇచ్చారో, శ్రీ శఠకోపయతుల మఠంవద్ద పల్లకీనుంచి దిగి, కవీ, రాజూ, గురుదేవ చరణాలపై ఎలాగ శిరస్సులు ఉంచారో భూలోక దేవేంద్రుల సుధర్మాస్థానంలో, నిండోలగంలో, మనుచరిత్రము ఎలాగ పెద్దన్న గారు పఠించారో పఠిస్తున్నప్పుడు, "ఉదయాచలేంద్రంబు మొదల నెవ్వని కుమారతకు క్రౌంచాచల రాజ మయ్యె" అన్నపద్యంతో గద్గదిక ప్రారంభమై "హితుడవు, చతురవచోనిధి వతుల పురాణాగమేతిహాస కథార్థస్మృతి యుతుడ వాంధ్రకవితా పితామహుడ వెవ్వ రీడు పేర్కొన నీకున్" అన్నపద్యం దగ్గిరికి వచ్చేసరికి మహాకవి కంఠం రుద్ధమై ఎలాగ చదవలేక పోయిందో తర్వాత, పఠనానంతరం, కవిపండితు లందరూ ఆంధ్రకవిత్వ చరిత్రలో నవయుగం మనుచరిత్రతో ప్రారంభమైనదని ఎలాగ కీర్తించారో ఎప్పుడూ ఎవ్వరినీ పూర్తిగా కీర్తించని తెనాలికవే పెద్దనా మాత్యులకు పాదాభివందనం ఎలాగ చేశాడో – ఈ గాథంతా నాటి సాయంకాలము అల్లసాని వారి ఇంట్లో కూర్చున్న వారందరికీ సూరన్న మరీ మరీ వివరిస్తున్నప్పుడు, ఆ ఇల్లాలూ తిరుగుతూ, ఆగుతూ వింటుంది.

ఆ రాత్రి, భార్యా, సూరన్నా, తానూ, ముగ్గురే కూర్చున్నప్పుడు పెద్దన్న గారొకవిశేషం చెప్పారు.

ఉదయం సభ అయిపోయిన తరవాత రాయలవారి రహస్యమందిరం లోకి రమ్మని పెద్దన్నగారికి పిలుపు వచ్చింది. ఆయన వెడతాడు. వెళ్లేసరికి రాయలవారు నిలబడి ఉంటారు. మహాకవి రాగానే మహారాయలు ఆయన్ని తన కౌగిలింతలో గాఢంగా హత్తుకుంటాడు. ఇద్దరి కళ్లల్లో ఒక్కచినుకు కరిగి బుగ్గల మీదికి జారుతుంది. రాయలు మాట్లాడ లేదు. కవి మాట్లాడ లేదు. రాయలవారు అంతఃపురంలోకి వెళ్లిపోతారు. అల్లసానివారు ఇంటికి వచ్చేస్తారు.

ఈ గాథ వింటున్నప్పుడు సూరన్న బుగ్గలు తడిసి పోయేయి.

పెద్దన్నగారి భార్య మనస్సు ఎలా గుందో?

మరునాడు కవులందరికీ అల్లసానివారి ఇంట విందు.

పెద్దన్నగారి భార్యను చూచి, "వంద నలయదు వేవురు వచ్చిరేని అన్నపూర్ణకు నుద్ది యౌ నతని గృహిణి" అంటాడు రామకృష్ణకవి. "మా అక్కగారు ప్రవరుని గృహిణి వంటిదే; కాని, మా బావగారు మాత్రం ప్రవరుడు కాదు; మాయాప్రవరుడు కాని" అని వెంటనే తిమ్మకవి అంటాడు. అందరూ నవ్వుతారు. "అవునా"? అన్నట్లు పెద్దన్న ఆమె వైపు చూస్తాడు. ఆ అదితిదేవి చిరునవ్వుతో వడ్డిస్తూనే ఉంటుంది. రామకృష్ణకవి కళ్లు మెరుస్తాయి.

తర్వాత, పెద్దన్నకు ప్రవరుని మీద కన్నా, వరూథిని మీదే ఎక్కువ ఇష్టం అనీ; వరూథినినీ గంధర్వుణ్ణీ కలిపినదాకా కవిగారికి తోచ లేదనీ, 'అంతగా వేటా యుద్ధమూ ఎలాగ వర్ణించా రండీ, రాయల వారితో వెళ్ళినప్పుడు చూసేరా' అనీ, "ఈ నగరంలో వరూథిని ఏ వీథిని ఉందో చూడాలి, అంత జీవం ఉట్టిపడుతున్నట్లు మాట్లాడిందనీ," "వరూథిని ఎవరో తెలిసినా, ఆమె కిప్పుడు తాతగారి వయస్సే దాదాపు ఉంటుంది. గనక మీకు లాభం లేదనీ,"

ఇలాగ రకరకాలుగా కవులందరూ మాట్లాడతారు. ఎక్కువ మాటలు సూరన్నవి. మధ్య మధ్య ఒక్కొక్క మెరుపు రామకృష్ణ కవిది.

అవి గొప్పరోజులు, ముఖ్యంగా కవులకు.

ఈ కవులకన్న ఆయనకు ప్రియు లెవ్వరు?

అప్పుడు పుట్టి ఉంటే, ఇవన్నీ చూసేవాణ్ణి కదా. ఎందుకు చూడను? అప్పుడు పుట్టి ఉంటే, నేనే పెద్దన్ననై పుట్టి ఉందును!

## అభ్యాసం

### I. వ్యాస రూప సమాధాన ప్రశ్నలు

1. 'రాయలవారి భువన విజయం విద్వజ్జనుల నిలయం' అని నిరూపించండి?
2. 'ఆంధ్ర, కర్ణాటక, తమిళ సాహిత్యాలకు రాయలకాలం స్వర్ణయుగం' – వివరించండి?

### II. సంక్షిప్త రూప సమాధాన ప్రశ్నలు

1. రాయలవారు పెద్దన రాసిన మనుచరిత్ర అందుకున్న తీరుని వివరించండి?
2. పెద్దన గారి భార్యను గురించి రాయండి?
3. బొడ్డుచర్ల తిమ్మన గురించి వివరించండి?
4. దేవులపల్లి కృష్ణశాస్త్రి గురించిన విశేషాలేమిటి?

### III. ఏక వాక్య / పద రూప సమాధాన ప్రశ్నలు

1. రాయలవారి సాహితీ భవనం పేరు తెల్పండి?
2. రాయలువారు రాసిన నాటకం పేరేమిటి?
3. భారత ప్రభుత్వం కృష్ణశాస్త్రిని ఏ బిరుదుతో సత్కరించింది?
4. రాయలవారి విజయనగరం ఏ నదీ తీరాన ఉంది?
5. ఎవరి కాలాన్ని ఆంధ్ర, కర్ణాట, తమిళ సాహిత్యాలకు స్వర్ణయుగం అని అంటారు?
6. రాయలతో చదరంగం ఆడినది ఎవరు?
7. శ్రీకృష్ణదేవరాయల పాలనాకాలం ఏది?
8. 'ఆంధ్ర షెల్లీ' అని ఎవరిని అంటారు?

❖ ❖ ❖

# 3 మహిళోద్యమ జనకుడు : కందుకూరి



**- మల్లాది సుబ్బమ్మ**

## రచయిత్రి పరిచయం

ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రముఖ స్త్రీవాద రచయిత్రిగానూ, స్త్రీ హక్కుల ఉద్యమ నేతగానూ వినుతి కెక్కిన వారిలో మల్లాది సుబ్బమ్మ ప్రముఖులు. వీరు 02.08.1924 న గుంటూరు జిల్లా పోతర్లంకలో జన్మించారు. తండ్రి బంగారు రాజు. వీరిది సనాతన సంప్రదాయ కుటుంబం, పదకొండేళ్ళ వయసుకే వీరి వివాహం జరిగింది. వీరికి ఐదుగురు సంతానం. ఇటువంటి వాతావరణం నుంచి వచ్చిన ఒక స్త్రీ, సామాజిక ఉద్యమ కారిణిగా తనను తాను మలచుకోవడం విశేషం. ఆధునిక స్త్రీ వాద ఉద్యమాలకు రాతల్లోనూ, చేతల్లోనూ ఆలంబనగా నిలవడం మరో విశిష్టత.

'నేను ఫెమినిస్టుని, హ్యూమనిస్టు ఫెమినిస్టుని' అని తనకు తాను గర్వంగా ప్రకటించుకున్న రచయిత్రి మల్లాది సుబ్బమ్మ. ఆంధ్ర దేశంలో జరిగిన సారా వ్యతిరేక ఉద్యమంలో వీరు చాలా చురుకుగా పాల్గొన్నారు. సారాను నిషేధించే వరకు విశ్రమించని ధీరురాలు. 'మల్లాది సుబ్బమ్మ ట్రస్టు'ను స్థాపించి ఆమె తన స్థిరాస్తులను తన పిల్లలకు కాకుండా ఆ ట్రస్టుకు రాసిచ్చారు. దానిని సామాజిక సేవకు అంకితం చేశారు.

మల్లాది సుబ్బమ్మ సామాజిక సేవాకార్యక్రమాల్లో పాల్గొనడమే కాకుండా, సుమారు అరవైకి పైగా రచనలు చేశారు. వీటిలో వివాహం నేడు రేపు, మాతృత్వానికి మరో ముడి, హైందవ స్త్రీలు, మనం-మన సంస్కృతి, హేతువాదం, మూఢనమ్మకాలు నశించేదెలా వంటి సామాజిక, సాంస్కృతిక విమర్శనా గ్రంథాలు కొన్ని ఉన్నాయి. ఇవే కాకుండా చీకటి వెలుగులు, ఈ దేశం నాదేనా?, వంశాంకురం, రుద్రమదేవి, వెలిగిన జ్యోతి, కాంతి కిరణాలు వంటి అనేక నవలలు కూడా రచించారు. ఇదంతా ఒక ఎత్తు అయితే; 'స్త్రీ స్వేచ్ఛ' అనే మాస పత్రికను స్థాపించి, సుదీర్ఘకాలం నిర్వహించారు. ఈ పత్రిక ద్వారా స్త్రీ చైతన్యానికి బహుముఖాలుగా కృషి చేసిన వీరు 15.05.2014న కన్ను మూశారు.

ప్రస్తుత పాఠ్యభాగం 'స్త్రీ స్వేచ్ఛ' (అక్టోబర్ - నవంబర్, 1997) పత్రికలోనిది. 'మహిళోద్యమ జనకుడు : స్త్రీ జనోద్ధారకుడు' అనే వ్యాసానికి సంగ్రహ రూపం.

## పాఠ్యభాగ నేపథ్యం

సంఘ సంస్కర్త, ఆధునిక యుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులు (16.4.1848 - 27.5.1919) గారు. వీరి జన్మస్థలం రాజమహేంద్రవరం. పున్నమ్మ, సుబ్బరాయుడు కందుకూరి తల్లిదండ్రులు. వీరు చేపట్టిన సామాజిక సంస్కరణ కార్య క్రమాలలో అధిక భాగం స్త్రీలకు సంబంధించినవే. కన్యాశుల్కాన్నీ,

బాల్యవివాహాలను రద్దు చేయడం; వితంతువులకు పునర్వివాహం జరిపించడం వంటి కార్యక్రమాల్ని కందుకూరి భుజానికెత్తుకున్నారు. అంతేకాక స్త్రీ విద్య కోసం అవిశ్రాంతంగా కృషి చేశారు. ఈనాడు ఇంతమంది ఆడపిల్లలు విద్య నేర్చుకుంటున్నారు అంటే దాని వెనుక కందుకూరి ఆకాంక్ష మెండుగా ఉందన్న వాస్తవాన్ని మరిచిపోకూడదు. వెల కట్టలేని వీరి మూర్తిమత్వాన్ని ఈనాటి విద్యార్థులకు పరిచయం చేయడం; వారిలో వీరేశలింగం గారి సంస్కరణ స్ఫూర్తిని కల్గింప చేయడం, వారికి సామాజిక బాధ్యత గురించి తెలియచేయడం ఈ పాఠ్యభాగం ప్రధాన ఉద్దేశం.

## పాఠ్యభాగం

**యు**గకర్తలలో మొట్టమొదటగా కందుకూరి వీరేశలింగం గారిని గురించి చెప్పుకోవాలి. "ఇకనుండి నా వనరులను, నా శక్తి యుక్తులను – అంటే మానసిక భౌతిక శక్తులను, ద్రవ్యాన్ని చివరవరకు అవసరమైతే నా ప్రాణాన్ని సైతం స్త్రీజన సంక్షేమానికి వినియోగిస్తాను" అని వీరేశలింగంగారు 'సత్యవాది' అనే తన పత్రికలో వ్రాశారు. బాల వితంతువుల దీనస్థితి, విద్య లేమి, మూఢవిశ్వాస నిర్మూలన, స్త్రీలు సభలలోకి రాకూడదనే సాంఘిక నియమాలు లాంటి ఈ సమస్యలను పరిష్కరించటానికి ఆయన పూనుకున్నారు. అవిరళ కృషి చేశారు. అందుకే వారిని మహిళోద్యమ జనకులు; మహిళాభ్యుదయ పితామహుడు అని అభినందించటం అతిశయోక్తి కాదు. నా కెప్పుడైనా మిక్కుటమైన మనస్తాపం కలిగితే వెంటనే కందుకూరి వారి ఆత్మకథ చదువుతా. అబ్బా! ఒంటరివాడు, అనారోగ్యవంతుడు కేవలం ఒక బడి పంతులు, ఒక్కడు ఆ రోజుల్లో అన్ని ఘనకార్యాలు చేసి ధైర్యంతో నిలబడ్డాడంటే మరి మనం యిన్ని సౌకర్యాలుండి ఇలా వ్యధ చెందడం ఎందుకో! అనే తృప్తి కలిగి అడుగు ముందుకేస్తా. మరి ఆయన ఎంతటి కారణజన్ముడో కదా! అందుకే మాబోంట్లకు ఆయన ఎడ అపార గౌరవం వుంది. సంస్కరణోద్యమాలకు పితామహుడిగా, మార్గదర్శకుడిగా, గురువుగా ఆయనను తలుచుకుంటూ వుంటాం.

కందుకూరివారి సంస్కరణలలో ముఖ్యమైనది, శాశ్వత చరిత్ర గలది స్త్రీ జనోద్ధరణ. ఆయన కార్యాచరణకు ఒక తాత్విక ప్రాతిపదిక వుంది. దానికి ఒక కార్యక్రమం కూడా వుంది. తను విశ్వసించినదానిలో నమ్మకం వున్న వ్యక్తి. ఆయన వ్యక్తిత్వమూ, సంకల్ప బలమూ కల మహామనిషి. కనుక ఆనాడు అతి నిషేధమైన వితంతు వివాహాన్ని, స్త్రీ విద్యను ప్రోద్బలపరిచాడు. కన్యాశుల్కాన్ని వ్యతిరేకించాడు. శాస్త్రాల ఆధారాలతో బాల్య వివాహాలను తిరస్కరించాడు. స్త్రీ విద్యను బలపరిచాడు. "స్త్రీలు విద్యకు తగరు" అని వ్యతిరేకులు అన్నప్పుడు "పురుషులు విద్యకు తగరు" అని ఎగతాళి చేస్తూ 'వివేకవర్ధని'లో వ్రాశాడు. 1874లో ధవళేశ్వరంలోను, 1881లో రాజమండ్రిలోను బాలికా పాఠశాలలను స్థాపించాడు. ముందుగా తన భార్యకు విద్యనేర్పి ఆమెనొక ఉపాధ్యాయినిగా తయారుచేశాడంటే త్రికరణశుద్ధి గల వ్యక్తి కనుకనే తాను ఆచరించి ప్రబోధ చెయ్యటంలో తనకు తానే సాటి అనిపించుకున్నాడు.

కన్యాశుల్క విధానాన్ని ఘాటుగా విమర్శిస్తూ దానిని నరమాంస విక్రయంగా అభివర్ణించాడు. వంశాంకురం కోసం వృద్ధులైన పురుషులు బాలికలను వివాహమాడేవారు. ఇంకా బీదరికంవల్ల ఆడపిల్లలను అమ్ముకునేవారు. ఏడాది వయస్సుకల పిల్లకు ఆనాడు రూ.350లు ధర పలికేది. శాస్త్రాలు ఆధారంతో ఆయన బాల్య వివాహాలను

నిరసించాడు. బాల్యవివాహ నిషేధ శాసనం కావాలని సంఘం ద్వారా ఆందోళన జరిపించాడు. ఆయన బాల వితంతువుల పునర్వివాహానికి చేసిన అనన్య కృషి, నిస్సహాయ స్త్రీలకు రక్షణ, అజ్ఞానంపై, మూఢవిశ్వాసాలపై ఎడతెగని, అంతులేని దాడి తెలుగు స్త్రీల హృదయాలలో ఆయనకు గౌరవ స్థానాన్ని నెలకొల్పాయి. బాల వితంతువులకు వివాహాలు చేయటానికి సంఘాలు పెట్టాడు; వారికొరకు ఆశ్రమాలు నెలకొల్పాడు. విధవా వివాహ దంపతులకు నివాసాలు ఏర్పరచటానికి పనిచేశాడు. ఆ పునర్వివాహితులకు పురుళ్లు పోశాడు. వారి బాగోగులు చూచాడు. వితంతు వివాహాలకూ అహరహం శ్రమించాడు. 1888లో మదరాసు రాష్ట్రంలో 21 శాతం విధవలు వుంటే అందులో 2 శాతం మాత్రమే రజస్వల అయిన తరువాత వితంతువులైన వారున్నారు. వారి పరిస్థితిని గురించి 'రాజశేఖర చరిత్ర'లో వివరించాడు.

స్థిర సంకల్పులై అయిదుగురు సహచరులతో వితంతు వివాహ సంఘ స్థాపన 1879లో రాజమండ్రిలో స్థాపించాడు. ఈ సంఘం ద్వారా వితంతు వివాహ శాసనంలోని లోపాలను ఎత్తిచూపాడు. తనకోసం తాను జీవించటం సామాన్య లక్షణం. క్రాంతదర్శి కందుకూరి పరహితం కోసం బ్రతుకు ధారపోయడం మహోన్నత జీవలక్షణం. అజ్ఞానపు తిమిరం ముసిరినవేళ ఉషోదయ కాంతి కిరణంలా ఉద్భవించిన ఆయన తన శక్తియుక్తులను వినియోగించి చల్లపల్లి బాపనయ్య ప్రోద్బలంతో, పరవస్తు రంగాచార్యుల కరపత్ర దోహదంతో 1879లో రాజమండ్రిలో నిర్బంధ వైధవ్యాన్ని నిరసిస్తూ; వేదాలను, స్మృతులను, విద్యారణ్య భాష్యాల ఆధారంతో తన వాదనను సమర్థిస్తున్నట్లు తన ఉపన్యాసంలో చెప్పుకొన్నాడు. 1879 అక్టోబరు 10న రెండవ ఉపన్యాసంతో ప్రజలలో కొత్త ఆలోచన రేకెత్తింది. వెంటనే వితంతు పునర్వివాహ సంఘాన్ని స్థాపించి 11-12-1881న రాజమండ్రిలో అర్ధరాత్రి వధువును రహస్యంగా తెచ్చి ప్రథమ వివాహాన్ని జరిపించాడు. సనాతనులు ఆయన్ని బహిష్కరించారు. పీఠాధిపతి ఆంక్షలు విధించాడు. దానికి బ్రహ్మాండమైన వ్యతిరేకత వచ్చింది. పురోహితులను, వంటవాళ్లను, మేళగాళ్లను రాకుండా సనాతనులు అడ్డుతగిలారు. వధువును ఎత్తుకెళ్లడానికి ప్రయత్నం జరిగింది. 500 మంది విద్యార్థులు, పోలీసులు ఆయన ఇంటికి కాపలా కాశారు. వెంటనే ఆ దంపతులను సంఘ బహిష్కరణ చేశారు. మదరాసులో కులాతీత విందుకు ఆయన వచ్చాడనే ద్వేషంతో 5గురు మాత్రమే హాజరయినారు. ఆ తర్వాత రాజమండ్రిలో, మదరాసులో వితంతు వివాహ వ్యతిరేక సంఘాలు వెలిశాయి. పైడా రామకృష్ణయ్యగారు ఆయనకు ఆర్థికంగా తోడ్పడ్డాడు. మొక్కవోని ధైర్యంతో 1884 నాటికి 10 పెళ్లిళ్లు చేశాడు. వారికి ఇల్లు, ఉద్యోగం ఇప్పించటమేకాక పురుళ్లు పోసే బాధ్యతకూడా తానే స్వీకరించాడు. వారికి జబ్బులొస్తే సేవ చెయ్యటం, దంపతుల మధ్య పేచీలొస్తే సరిదిద్దటం లాంటి బాధ్యత చేపట్టాడు. కొందరు వరులు కృతఘ్నులైనవారు ఆయన్ను నానా దుర్భాషలాడేవారు. అలా సమాజంపై ప్రేమామృతం చల్లి బదులుగా ద్వేష, విషవాయువులు స్వీకరించటం వారికే చెల్లుతుంది.

ముక్కుపచ్చలారని ముద్దు గుమ్మలను కాసుకాశించి పెళ్లిచేస్తే వెంటనే వారు బాల వితంతువులయి జీవితాంతం వైధవ్యంతో అలమటిస్తుంటే వారి కర్మకు వారిని వదిలెయ్యక వారి నొసట బొట్టు పెట్టి, కట్నకానుకలతో పెళ్లి జరిపిస్తున్నాడని వారి బంధువులు పెరటి ముందు, తలుపులపైన అశుద్ధం పోశారు; నానా దుర్భాషలాడారు.

ఆ దుర్మార్గులు చంపటానికి కూడా వెనుకాడలేదు. ఇంత జరిగినా చలించకపోగా ఆ ధీరోదాత్త దంపతులు విధవా వివాహోద్యమాన్ని ఇంకా పటిష్ఠం చేశారు. తమకు బిడ్డలు కలుగలేదని బాధపడకపోగా అనాథలు, ఆశ్రితులు, బాలవితంతువులే తమ బిడ్డలని చెప్పి గర్వించేవారట.

ఈనాడు ఆధునిక భారతదేశంలో స్త్రీలు పురుషులతో సమదీటుగా తమ న్యాయమైన స్థానాన్ని ఆక్రమించి, చైతన్యవంతమైన నాయకత్వ లక్షణాలు ప్రదర్శిస్తున్నారంటే ఆ గౌరవం వీరేశలింగం లాంటి సంఘసంస్కర్తలకు చెందుతుందనేది నగ్నసత్యం. ఇంకా చెప్పాలంటే స్త్రీ సంక్షేమం కోరే ఆరు ఉత్తమ స్త్రీ చరిత్రలు వ్రాశాడు. ప్రహసనాలను వ్రాసి సనాతన ఛాందస ఆచారాలను ఎగతాళి చేశాడు. సత్యవతీ చరిత్ర లాంటివి పదమూడు స్త్రీల కథలు వ్రాసి అందులో ఆనాటి స్త్రీల దీనస్థితి వర్ణించాడు. ఆరోగ్య ప్రబోధంకోసం శరీరశాస్త్రంపై గ్రంథం వ్రాశాడు. సమాజంలో పేరుకొనిపోయిన అవినీతిని బట్టబయలు చేశాడు. అంటే సాహిత్యం ద్వారా సామాజిక చైతన్యాన్ని ప్రబోధించటం అనే నాంది పలికాడని చెప్పక తప్పదు.

కందుకూరివారి సంస్కరణలలో విధవా వివాహాలేకాక భోగంమేళాల నిషేధానికికూడా పడరాని పాట్లు పడి మార్గదర్శకుడైనాడు. మొదటి విధవా వివాహానికి భోగంమేళం ఇతరుల పట్టుదలవల్లే జరిగింది. కాని ఆ తర్వాత అభ్యంతరం తెలిపాడు. ఆ దుర్మార్గపు ఆచారాన్ని రూపుమాపటానికి తన సునిశిత తర్కశక్తిని, రచనా నైపుణ్యాన్ని వాడి సంస్కృతి పేరుతో భోగంమేళాలను, భోగపు స్త్రీలను ఆదరించిన పెద్దలపై తన హాస్యాన్ని కుమ్మరించి, వారిని ఎగతాళిచేసి, వారిపై జుగుప్సను కలిగించాడు. వారి శీలాన్ని, నడతను ఖండించాడు. నాట్య స్త్రీలను ఉంపుడు గత్తెలుగా ఉంచుకోవడాన్ని, వారిచేత నృత్యాన్ని చేయించడానికి పెద్దలు భయపడే స్థితి సాంఘిక వాతావరణంద్వారా కలిగించాడు. తర్వాత సంస్కర్తల ద్వారా రూపుమాపించాడు. అలాగే దేవదాసీ వ్యవస్థపై విరుచుకుపడ్డాడు.

కళావంతులు అని పిలువబడే ఒక ప్రత్యేక కులానికి చెందిన స్త్రీలకు నాట్యం, సంగీతం, లలిత కళలు నేర్పి, వివాహం లేకుండా దేవునికి అంకితంచేసి వారిని 'దేవదాసీలుగా' గా చిత్రించేవారు. 19వ శతాబ్దంలో వారు రాజులకు, వారి ఉద్యోగులకు ఉంపుడుకత్తెలుగా వుంటూ వారిచ్చిన ఇనాములతో బ్రతికేవారు. అలా ఒక కులాన్ని మొత్తంగా ఆనాడు వ్యభిచారవృత్తి మీద బ్రతకమనే ఆచారం అమల్లో వుండేది. కందుకూరివారికి ఈ చర్య నచ్చలేదు; రోతకలిగింది. వారి సభ్యత, సంస్కారం, న్యాయం ఈ దుష్టచర్యలను ఖండిస్తూ తన పత్రికలైన 'వివేకవర్ధని', 'చింతామణి', 'సత్యవాది' లలో వ్రాయడమేకాక బహిరంగ సభల్లో తీవ్రంగా ఖండించటంవల్ల, ఇంకా ఆయన మిత్రుల చొరవవల్ల క్రమేపి ఈ వృత్తిపై ప్రజల్లో జుగుప్స కలిగింది. కాని ఇది రానురాను వేశ్యావృత్తిగా మారింది. ఈనాటికీ పూర్తిగా ఇంకా నశించలేదు. కారణం తర్వాత. అంత పట్టుదలగా నిలిచి పనిచేసిన ఘనుడు మళ్లా పుట్టలేదుకదా!

రాజ్యలక్ష్మిగారు భార్యగా లభించడంవల్లనే కందుకూరివారి కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడించాయనేది నగ్నసత్యం. ప్రతి ప్రతిభావంతుని వెనుక ఒక స్త్రీ హస్తం వుంటుందనేది అక్షరాల నిజం. భార్యగా తన సంఘసేవకు ఆమె

ఇచ్చిన సహకారం అపూర్వమని, దానిని లోకహితం కొరకే స్వీకరించానని ఆయన తన 'ఆత్మకథ'లో వ్రాసుకున్నాడు. జీవితంలో ఏనాడూ చలించని ధీరుడు ఆమె వియోగంతో తీరని అసహాయతను అనుభవించాడు. ఆమె సమాధికి ప్రక్కనే తన సమాధికి చోటుంచి, ఆ తోటకు "రాజ్యలక్ష్మి ప్రమదావన"మని పేరుపెట్టి అలా తన కృతజ్ఞతను తెల్పుకున్నారు కందుకూరివారు. ఇంకా ఆయన స్థాపించిన ప్రార్థనా సమాజం, సంఘ సంస్కరణ సంఘం, వివేక వర్థిని పత్రిక చాలాకాలం నిరాటంకంగా పనిచేశాయి.

ఎందరు తిట్టిపోసినా, అందరికీ వెలుగునిచ్చే మైనపు వత్తి లాంటి జ్యోతి ఎవరంటే కందుకూరి అని ఆబాలగోపాలం ఒప్పుకోక తప్పదు. బీద కుటుంబంలో పుట్టి, బడిపంతులుగా బ్రతికి, అనారోగ్యంతో అలమటిస్తూ ఎక్కడ ఏ అన్యాయం జరిగినా, ఏ స్వార్థం ఆశించక 'నేనున్నాంటూ' పరుగెత్తే మహాత్యాగి, వదాన్యుడు కందుకూరి కాక మరెవ్వరు? ఇటు సంస్కరణ, అటు సాహిత్య సేవలే కాక సంఘసేవతో జీవించినన్నాళ్ళు ఎడతెరిపిలేని కార్యభారాన్ని వహించిన ధన్యజీవి వీరేశలింగంగారు. అందుకే ఆయనను 'గద్య తిక్కన' అని ఆరుద్ర శ్లాఘిస్తే 'దక్షిణాది ఈశ్వరచంద్ర విద్యాసాగర్' అని రనడే లాంటి సంస్కరణాభిలాషులు అభివర్ణించారు. ఈ సాంఘిక విప్లవకారునికి ఆనాడు తను తలపెట్టిన సంస్కరణలు బహు కష్టమని, అనేక అవాంతరాలు వస్తాయని, తన పోరాటం మత మౌఢ్యులతోనని తెలుసు. అయినా ఆదర్శాలకై నిర్భీతితో నిలిచి పోరాడటమే కాని వెనుకడుగు వెయ్యని కార్యశూరుడు; విరామ మెరుగని కర్మవీరుడు, స్త్రీ విద్యకు తోడ్పడిన విద్యా పోషకుడు. కేవలం మెట్రిక్యులేషన్ చదువుతో 150 రచనలు చేసిన సాహితీ పిపాసి.

19వ శతాబ్దంలో మహిళోద్యమానికి యీనాటి మహిళోద్యమానికి చాలా తేడా ఉంది. ఆనాడు 'స్త్రీ పురుష సమానత్వం', 'స్త్రీలకు అధికారం కావాలి', 'కుటుంబంలో పనిని స్త్రీ పురుషులు పాలుపంచుకోవాలనే' ధోరణులు లేవు. అవి ఆనాటికి అందని ఊహలు. ఆనాడు స్త్రీలకు న్యాయం కావాలనే భావం ఉదయించింది. వారిని కరుణా దృష్టితో చూడాలనే అభిప్రాయం ప్రోదిచేసుకోవడం ఆరంభమయింది. బాల వితంతువులయెడ జాలి, కరుణ, స్త్రీ విద్య యెడ అభిమానం ఆనాడు వెల్లివిరిసాయి. ఆ కాలంలో ప్రజల మానసిక క్షేత్రాలలో యీ భావాల విత్తనాలు నాటిన మహనీయుడు కందుకూరి కనుక ఆయన్ని 'మహిళోద్యమ జనకుడు' అని అభివర్ణించడం కడు సమంజసం.

ఈనాడు సభలలో – స్త్రీ పురుషుల సభలలో – మహిళలు పాల్గొంటున్నారంటే దానికి కారణభూతుడు కందుకూరి అని చెప్పటంలో అతిశయోక్తి లేదు. తను ఏర్పాటుచేసిన సభలలో పురుషులు తమ సతీమణులతో, తల్లులతో, అక్కచెల్లెండ్రతో రావాలని నియమం పెట్టింది ఆయనే. తత్ఫలితంగా సగంమంది పురుషులు తమ కుటుంబ స్త్రీలతో సభలకు వచ్చారు. అది ఆనాటికి విప్లవ చర్య క్రింద లెక్క. ఆ కాలము పందొమ్మిదవ శతాబ్దం అని గుర్తుపెట్టుకుంటేగాని దాని ప్రాముఖ్యత గోచరించదు. ఇప్పటికీ గ్రామాలలో పంచాయతీలు చేసే సభలలోకి స్త్రీలకు కక్షిదారులుగా తప్ప ప్రవేశం లేదు. ఒకవేళ వారు సభకు వచ్చినా సభలో ఉలక్కుండా పలకకుండా

కూర్చుంటారు. స్త్రీ జీవితం వంట యింటికీ పడకటింటికీ మాత్రమే పరిమితం కావాలని ఆనాడు బహుళ సంఖ్యాకులు భావించడమే దానికి కారణం. స్త్రీ పురుషులున్న సభలలోకి ముస్లిం స్త్రీలు ఏనాడు రాలేదు. క్రైస్తవ స్త్రీలు తమ ప్రార్థనాలయమైన చర్చికి తమ పురుషులతో కలిసి వెళ్లినా అక్కడ వారు మాట్లాడరాదనే 'పౌలు' నియమం వుండనే వుంది. అలాంటి కాలంలో స్త్రీలను సభలకు ఆహ్వానించడం, వారిని తప్పక తీసుకొని రావాలని పురుషులకు విజ్ఞప్తి చేయడం సంప్రదాయ వ్యతిరేక ధోరణి. సంప్రదాయాలను బ్రద్దలు కొట్టాలని మూఢాచారాలను ఛేదించాలని భావించి కందుకూరి స్త్రీ జన పక్షపాతిగా ఇలా వ్యవహరించడం అబ్బురం కాదు.

ఇతరుల కష్టాలను తనవిగా భావించే మనస్తత్వం ఆయనది. సామాజిక, మత సంస్కరణకు పూనుకున్నందున తన శక్తి యుక్తులను తగినంతగా సాహిత్య సేవలో వాడలేకపోయానని ఆయన గుర్తించాడు. నిజానికి సాహిత్యంలో ఆయన కృషి అనల్పం, అత్యద్భుతం. ఫ్రెంచి విప్లవకాలంలో పదిమంది కలిసి సృష్టించిన సాహిత్యాన్ని ఒక్క వ్యక్తిగా ఆయన సృజించాడు. ఆయన ఆదర్శవాది మాత్రమే కాదు కార్యవాది కూడా. ఆరంభించిన పని మధ్యలో ఆపడం ఆయనకు ఇష్టం వుండదు. అది ఆయన డిక్షనరీలో లేదు. మహా నిరాడంబర జీవి. తన వ్యక్తిగతమైన ఖర్చుల విషయంలో ఆయనది పిసినారి దృష్టి. కాగా ఒక్క తోట విషయంలో ఖర్చుపెట్టేవాడు. తనకున్నదంతా దానం చేసిన వితరణశీలి. ఆయన మాటలవల్ల చేతలవల్ల ఆయన వ్యక్తిత్వం విశదమవుతుంది. "మనుష్యుడు నీతిని విడిచిన తర్వాత పురుషుడని పిలువబడ దగడు. కార్యసాఫల్యమునకయి మనమెప్పుడు కష్టములతో పెనుగులాడుచునే యుండవలెను" అంటాడు. అనుష్ఠాన బ్రహ్మసమాజకులయినందున ఆచరణకు ఆయన ప్రాధాన్యతను యిచ్చాడు. విశాల భావాలను, జ్ఞానాన్ని, నీతిని ఆయన ఆపేక్షించాడు, ఆచరించాడు. లోకసంగ్రహార్థం తప్ప ఇతరత్రా ఆయనకు కోరికలు లేవు. ఆయన చివరి కోరికలు గమనించండి. నన్నయభట్టు పేర గ్రంథాలయ నిర్మాణం, కవుల చరిత్రను పూర్తిచేయుట, సమగ్ర తెలుగు వ్యాకరణ రచన. స్వార్థం తెలియని ఎంతటి మహోదాత్తుడో!

## అభ్యాసం

### I. వ్యాస రూప సమాధాన ప్రశ్నలు

1. స్త్రీ జనోద్ధరణకు కందుకూరివారు చేసిన కృషిని తెల్పండి?
2. పంతులుగారు పత్రికల ద్వారా సంఘ చైతన్యానికి చేసిన కృషిని వివరించండి?

### II. సంక్షిప్త రూప సమాధాన ప్రశ్నలు

1. కందుకూరి రచనలను తెల్పండి?
2. కందుకూరి సంస్కరణలను పేర్కొనండి?
3. మల్లాది సుబ్బమ్మ సామాజిక సేవను వివరించండి?

## III. ఏక వాక్య / పద రూప సమాధాన ప్రశ్నలు

1. కందుకూరి వితంతు వివాహసంఘాన్ని రాజమండ్రిలో ఎప్పుడు స్థాపించారు ?
2. కందుకూరిని గద్యతిక్కన అని ఎవరు శ్లాఘించారు?
3. మల్లాది సుబ్బమ్మగారు ఎక్కడ జన్మించారు?
4. కందుకూరి సతీమణి పేరేమిటి?
5. కందుకూరి స్థాపించిన ఒక పత్రికపేరు తెల్పండి?
6. 'నేను ఫెమినిస్టుని, హ్యూమనిస్టుని' అని ప్రకటించుకున్నది ఎవరు?

## విశేషాంశాలు

❖ **రనడె – మహదేవ గోవింద రనడె (1842–1901) :** భరతజాతి అభివృద్ధికి కృషి చేసిన విద్యావేత్త, సంఘ సంస్కర్త, అర్థశాస్త్ర ప్రవీణుడు, న్యాయమూర్తి. మహిళాభివృద్ధికి విశేష కృషి చేసిన మహనీయుడు.

❖ **పౌలు నియమాలు :** క్రైస్తవ మతానికి చెందిన ప్రముఖుల్లో సెయింట్ పాల్ ఒకరు. ఈతనినే మనం 'పౌలు' అని వ్యవహరిస్తున్నాం. క్రొత్త నిబంధన గ్రంథంలో పౌలుగురించిన వివరాలు పొందుపరిచి ఉన్నాయి.

సెయింట్ పాల్ అనేక ఎఫిసిల్స్‌ను రచించాడు. వీటినే మనం పౌలు 'లేఖలు' గా వ్యవహరిస్తున్నాం. ఈ లేఖల్లో అనేక నియమాలను పౌలు ప్రస్తావించాడు. వాటిలో మతస్థులకోసం పెట్టిన నియమాలు కొన్ని అయితే; తన కోసం తాను విధించుకున్న నియమాలు మరికొన్ని. భగవంతుడికి భక్తుడు ఏవిధంగా బాధ్యుడుగా ఉండాలో ఈ నియమాలు తెలియ చేస్తాయి. అంతేకాక పెద్దవారికీ–చిన్నవారికీ; యజమానికీ–పనివారికీ; తల్లిదండ్రులకూ–పిల్లలకూ; ఆడవారికీ–మగవారికీ; భార్యకూ–భర్తకూ మధ్య సంబంధాలు ఎలా ఉండాలో, వాటి పరిమితులు ఏమిటో ఈ పౌలు నియమాలు స్పష్టం చేస్తాయి. ఒకనాటి మానవ సంబంధాలనూ, ఆ సంబంధాల మధ్య పెన వేసుకున్న విధి విధానాలనూ, అణచివేతలనూ, ఆధిపత్య, అనాధిపత్యాలనూ ఈ పౌలు నియమాలు ఆవిష్కరిస్తాయి.

❖ ❖ ❖

# 4 కలవారి కోడలూ కలికి కామాక్షి



**- యస్వీ భుజంగరాయశర్మ**

## రచయిత పరిచయం

విద్యాబోధన ద్వారా వేలాదిమంది విద్యార్థులను తీర్చిదిద్దిన అధ్యాపకులు ఎస్.వి. భుజంగరాయశర్మ. వీరు గుంటూరు జిల్లా, తెనాలి దగ్గర ఉన్న కొల్లూరు గ్రామంలో 15.12.1925 న జన్మించారు. రామలక్ష్మమ్మ రాజశేఖరం వీరి తల్లిదండ్రులు. వీరు స్వగ్రామంలోనూ, నెల్లూరు వి.ఆర్. కళాశాలలోనూ, విశాఖపట్నం ఆంధ్ర విశ్వవిద్యాలయం లోనూ విద్యనభ్యసించారు. కొంతకాలం చెన్నై లోని పచ్చయప్ప కళాశాలలో అధ్యాపకులుగా పని చేశారు. ఆ తరవాత కావలి జవహర్ భారతి కళాశాలలో తెలుగు అధ్యాపకత్వం చేపట్టారు. చిరకాలం అక్కడే పనిచేశారు.

పాఠం ఎంత గొప్పగా బోధిస్తారో, పద్యాన్ని అంతగొప్పగా పాడి వినిపిస్తారని భుజంగరాయశర్మ గురించి తెలిసిన వారు ఇప్పటికీ జ్ఞాపకం చేసుకుంటారు. తెలుగు సాహిత్యం, తెలుగు సంస్కృతికి సంబంధించి వీరు అనేక వ్యాసాలు, కవితలు, నృత్య నాటికలు రాశారు. వ్యాసానికి ఎంపిక చేసుకున్న వస్తువు, దానిని విశ్లేషించిన తీరు ఎంతో ఉదాత్తంగా ఉండటం వీరి రచనల్లోని విశిష్టత. వీరు 07.08.1997 న కన్నుమూశారు.

## పాఠ్యభాగ నేపథ్యం

ప్రస్తుత పాఠ్యభాగం 'అక్షర' (డి.ఆర్. అభినందన సంపుటి, కావలి) నుంచి స్వీకరించబడింది. 'కలవారి కోడలు' అనే పాట నిన్నటి తరానికంతటికీ సుపరిచితమైందే. జానపద బాణిలో సాగిన ఈ పాట ఒకనాటి గ్రామీణ సంస్కృతికి దర్పణం పడుతుంది. ఇంట్లో నవారు మంచాలు, వీథిలో అరుగులు, ఊళ్ళో రచ్చబండలు ఉన్న ఒకనాటి గ్రామీణ జీవితాన్ని ఆ పాట ఆవిష్కరిస్తుంది. ఆ పాటను ఆధారంగా చేసుకొని భుజంగరాయశర్మ రచించిన వ్యాసం ఈ పాఠ్యభాగం.

ఉమ్మడి కుటుంబం అంటే ఈనాటి తరానికి అంతగా తెలియక పోవచ్చు. ఆ కుటుంబ సంబంధాలు, ఆ మనుషుల మధ్య ఉండే ప్రేమలూ, ఆప్యాయతలూ, గౌరవాలు ఇప్పుడు కన్పించడం కష్టం. అత్తాకోడళ్ళు, తోడికోడళ్ళు. వదినా మరదళ్ళూ; వారి మధ్య పెనవేసుకున్న బంధాలు, చిన్న చిన్న అరళ్ళు, అలకలూ, చతురోక్తులూ, ఎగిరి పడటాలూ, ఒదిగి ఉండటాలూ వంటివి ఎంతో హృద్యంగా ఉండేవి. అనుభవంలో ఉన్నవారికి అవన్నీ కొన్ని మధురమైన జ్ఞాపకాలు. వీటన్నింటినీ తిరిగి ఇప్పుడు మనం పొందగలిగినా, పొందలేక పోయినా; జీవితంలో మనం ఏం పోగొట్టుకుంటున్నామో ఈనాటి తరానికి తెలియ చేయడం ఈ పాఠ్యభాగం ఉద్దేశం.

# పాఠ్యభాగం

ఎప్పుడో చాలా ఏళ్ళ క్రితం రెండో తరగతి తెలుగువాచకంలో ఓ జానపదులపాట చదివాను. అది ఎందుకో నా గుండె పట్టుకుంది. అప్పట్నించీ అప్పుడప్పుడూ అది జ్ఞాపకం వస్తూ నన్ను మరో లోకంలోకి తీసుకుపోతోంది. నాకు కామాక్షి అనే చెల్లెలుంది. ఆ పాటలో కామాక్షిని వాళ్ళన్నయ్య పుట్టింటికి తీసుకువెళ్ళిన కథ వుంది. అదేదో నాకు సహజంగా జానపదుల పాటల మీదుండే వెర్రి ఇష్టం మూలాన్నో, మరి ఆ పాటలో పాతకాలపు సంపన్నమైన తెలుగు ఉమ్మడికుటుంబం తాలూకా కట్టుబాట్లూ, నమ్మకాలూ, ఆచారాలు, అలవాట్లు చిత్రించబడి వుండడంవల్లనో, అందులో పండితులు తలదాల్చిన అలంకారశాస్త్రాల్లో ప్రతిపాదించబడిన వ్యంగ్య వైభవమంతా సుగంధంలా అలుముకొని వుండడం వల్లనో ఎందుకోమరి ఆ పాట గుర్తొచ్చినప్పుడల్లా శరీరం పులకించి మనస్సుకు రెక్కలొచ్చినట్లుంటుంది నాకు.

ఆ ఫోటోలో కథ రేఖాచిత్రంలా వుంది. ఎన్నో పదాలూ, వ్యాఖ్యలూ చేర్చుకుని దాన్ని వర్ణచిత్రంగా మార్చుకోవాలి. అప్పుడది సజీవంగా బొమ్మ కడుతుంది మనస్సుకు. మన భావనా బలానికి ఆ పాట మంచిపరీక్ష. ఆ పాట ఇలా మొదలైంది.

"కలవారి కోడలు కలికి కామాక్షి
కడుగుతున్నది పప్పు కడవలో పోసి
అప్పుడే వచ్చెను ఆమె పెద్దన్న
కాళ్ళకు నీళ్ళిచ్చి కన్నీళ్ళు నింపె"

కామాక్షిని కలవారికోడలు అనడంవల్ల ఆమె పుట్టింటివారు పేదవారై వుంటారని సులభంగానే ఊహించవచ్చు. లేనివారు వున్నవారితో వియ్యమందడం సాధారణంగా జరిగే పనికాదు. కాని కామాక్షి అత్తవారు చాలా సంస్కారవంతులు. ఆ పిల్ల అందాన్ని చూచి కోడలుగా తెచ్చుకున్నారేగాని ఆస్తులూ, అంతస్తులూ చూసి కాదు.

కామాక్షికి వాడిన 'కలికి' అనే విశేషణం వల్ల ఆమె అందాల బొమ్మ అని తెలుస్తూనే ఉంది. కలవారంటే పంట సిరి కలవారనే అర్థం. వెనకటి రోజుల్లో డబ్బు లెక్కగాదు. పంటచేలూ, పైరుపచ్చా, గొడ్డూగోదా, ఎడతెగనిపాడీ ఇవే లెక్క. పెద్దన్నయ్య వచ్చేసరికి కామాక్షి పప్పు కడుగుతోంది.

వచ్చిన పెద్దన్నయ్య మదురుగుమ్మం దాటి లోపలికి వచ్చేదాక కామాక్షి చూడనే లేదు. అన్నను చూసీచూడగానే ఆమెకు ప్రాణం లేచివచ్చింది. కడవక్కడే వదలి, గబగబా చేతులు కడుక్కుని అన్నకు కాళ్ళకు నీళ్ళిచ్చింది. నీళ్ళిస్తోంటే గిర్రున ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అన్నకు కనపడకుండా ముఖం పక్కకు తిప్పుకుని పైటచెంగుతో కళ్ళద్దుకుంది.

కాళ్ళకు నీళ్ళిచ్చి ముఖం పక్కకు తిప్పుకున్న చెల్లెలి కళ్ళను అన్న గమనించక పోలేదు. ఆ కన్నీళ్ళలో ఎన్ని భావాలు దాగి ఉన్నాయో మన ఊహకందవు. అన్న వచ్చినందుకు కలిగిన ఆనందమంతా ఆ కన్నీళ్ళల్లో వుంది – తాను బిడ్డ నెత్తుకు అత్తవారింటికి వచ్చి ఇన్ని నెలలైనా వచ్చి చూడలేదేమనే నిష్ఠూరమూ ఆ కన్నీళ్ళల్లో వుంది.

ఇంతకాలానికైనా వచ్చాడనే నిస్సహాయమైన తృప్తి కూడా ఆ కన్నీళ్ళల్లో ఉంది. ఏడాది లోపల పురిటిమంచం చూడాలి కాబట్టి తన్నిప్పుడు తీసికెళ్ళడానికి వచ్చాడే కాని లేకపోతే ఇప్పుడొచ్చేవాడా అనే కోపం ఆ కన్నీళ్ళల్లో ఉంది. బహుశా ఏవో పనులుండి నాన్న రాలేకపోయినా, చిన్నన్నయ్యలను పంపించక పెద్దన్నయ్యను పంపించడంలోని గౌరవమూ, నిండుతనమూ, అర్థం చేసుకోవడంవల్ల కలిగిన సంతోషమూ కన్నీళ్ళుగా కారింది.

చెల్లెలి కంటతడి చూచిన అన్న గుండె కరిగింది, పేద ఇంటిపిల్ల. కలవారింట్లో ఎన్ని కష్టాలు పడుతున్నదో అని పాపం అతడారాటపడిపోయాడు. చెల్లెల్ని దగ్గరకు తీసుకుని తన వుత్తరీయపు కొంగుతో కన్నీళ్ళు తుడిచి –

"ఎందుకు చెల్లెలా ఏమి కష్టమ్ము
తుడుచుకో కన్నీళ్ళు ముడుచుకో కురులు
ఎత్తుకో బిడ్డను ఎక్కు అందలము
చేరి మీ వారికి చెప్పిరావమ్మ"

అని ఓదార్చి పుట్టింటికి ప్రయాణం కమ్మన్నాడు. చెల్లెల్ని పుట్టింటికి తీసుకువెళ్ళడానికే నిజానికి అతడొచ్చాడు. వస్తూ 'మేనా'ని కూడా వెంటబెట్టుకు వచ్చాడు. మేనాను దింపిన బోయీలు లోపలికొచ్చి దొడ్లో బావి దగ్గర కాళ్లూచేతులూ కడుక్కుంటున్నారు.

వారిని చూచి సంతోషంగా అన్నను లోపలికి తీసుకెళ్ళింది కామాక్షి. ఇంట్లో అందరూ రకరకాలుగా పరామర్శలు జరిపారు. ఇన్నాళ్ళకా రావడం అని అందరూ అడిగారు. బావగారు రానందుకు వియ్యంకుడు కొంచెం రుసరుస లాడాడు కూడా. మొత్తానికి ఎవరో ఒకరు కామాక్షి పుట్టింటివారు వచ్చినందుకు అందరూ లోలోపల సంతోషంగానే వున్నారు.

అన్న తను వచ్చిన పని చెప్పాడు. పురుడు పోసుకున్న ఆడపడుచు ఏడాదిలోగా మళ్ళా వెళ్ళి పురిటిమంచం చూడాలి. ఇది ఆచారం. ఈ ఆచారాన్ని పాటించడం కోసం అతడు రావడం అందరికీ ఆహ్లాదంగానే ఉంది. కాని పైకిమాత్రం గంభీరంగా ఊరుకున్నారు.

ఇంతలో కామాక్షి అత్తగారికి అల్లంతదూరాన ఓ పక్కగా ఒదిగి నిలబడి

"కుర్చీపీట మీద కూర్చున్న అత్త
మా అన్నలొచ్చారు మమ్మంపుతార?"

అని వినయంగా, భయంగా అడిగింది. అవతల మామగారున్నారు. కాని ముందర మామగారి అనుమతి కోరలేదు కామాక్షి. అత్తగారి అనుమతినే కోరింది. తెలుగువారికి అత్తవారిళ్ళే గాని మామగారిళ్ళు లేవు. అల్లుళ్ళకి పెట్టుపోతలు జరిపేది అత్తగారు, కోడళ్ళను ఆరళ్ళుపెట్టేది అవసరమైనప్పుడు అనునయించేదీ అత్తగారే.

అత్తగారు కామాక్షిని ఓరగంట చూస్తూ లోలోపల మురిసిపోయి,

"మేమెరుగ మేమెరుగ మీ మామనడుగు"

అంది. తాను పుట్టింటికి వెళ్ళడానికి అత్తగారి అనుమతి దొరికినందుకు కామాక్షి లోలోపలే అత్తగారికి దణ్ణం పెట్టుకుంది. 'మేమెరుగ మేమెరుగ మీ మామనడుగు' అని బాధ్యత తన మీద లేనట్లు మాట్లాడ్డంలో అంగీకారమూ ఉంది, మర్యాదా వుంది. తనకు సూచనా వుందని కామాక్షి గ్రహించింది.

అత్తగారు సూచించినట్లు కామాక్షి మామగారి దగ్గరకుపోయి,

"పట్టె మంచము మీద పడుకున్న మామ
మా అన్నలొచ్చారు మమ్మంపుతార?"

అని అడిగింది. మామగారు చేసినన్నాళ్లు వ్యవసాయం చేసిచేసి, కొడుకులు ఎదిగొచ్చాక పొలం పనులన్నీ వాళ్లకప్పగించి రికామీగా ఇంట్లో వుంటున్నారు. సేద్యప్పనులను గురించి కొడుకులేమైనా అడిగినప్పుడు చెప్పడం తప్ప వారికింట్లో చేసే పనులేవీ లేవు. అందుకే వారు పట్టెమంచమెక్కి పడుకున్నారు. ఇప్పుడులేవుగాని వెనకటి రోజుల్లో పట్టెమంచాలు సంపన్నులైన తెలుగువారిళ్ళల్లో ఒకటో, రెండో సాధారణంగా వుండేవి. అవి ఠీవికి సంపదకూ గౌరవానికీ గుర్తు.

పట్టెమంచంమీద సగం నడుంవాల్చి చుట్ట చుట్టుకుంటున్న మామగారు కోడల్ని ఎగాదిగా చూచి,

"మేమెరుగ మేమెరుగ మీ బావ నడుగు"

అనేసి చుట్ట చుట్టుకోవడంలో మునిగిపోయారు. కామాక్షి హమ్మయ్య అనుకుని మామగారి అనుమతి కూడా దొరికినందుకు సంతోషిస్తూ పెద్ద బావగారున్న గది దగ్గరకు కొంచెం జంకుతూ మెల్లగా నడిచి వెళ్లింది. గుమ్మంలో నిలబడి లోపలికొకసారి తొంగిచూచింది. బావగారు వ్యాసపీఠం ముందు కూర్చున్నారు. చదువుతున్నది భారతమని గ్రహించడానికి కామాక్షికి అట్టేసేపు పట్టలేదు. తన అలికిడిని బావగారు గుర్తించి కళ్లెత్తి చూచారు.

"భారతం చదివేటి బావ పెదబావ
మా అన్నలొచ్చారు మమ్మంపుతార?"

అని భయంగా అడిగింది. పెదబావ అనడం వల్ల కామాక్షికి బావగార్లు చాలామంది ఉన్నారని ధ్వని. చినబావలందరూ పొలాలకు వెళ్లారు. పెదబావ భారత, భాగవత, రామాయణాల్లాంటివి చదువుకుంటూ ఇంట్లోనే ఉంటారు.

పెద్దబావగారు తలొంచుకు పుస్తకం వైపు చూస్తూ.

"మేమెరుగ మేమెరుగ మీ అక్కనడుగు" అన్నారు.

చెమటలు పోసిన కామాక్షి చకచకా, వంటింట్లోకి పోయింది. ముఖమూ, చేతులూ తుడుచుకొని తోడికోడలు సరసన చేరి సంతోషంగా "వంటచేసే తల్లి ఓ అక్కగారు/మా అన్నలొచ్చారు మమ్మంపుతార?"
అని అడిగింది. అలా అడిగేప్పుడు ఆమె గొంతు వున్నట్లుండి గద్గదమైంది. అవును, ఆ అక్క తనకు తల్లి తరవాత తల్లి. కాపరానికి వచ్చినప్పటి నుంచి తన్ను వేయి కళ్ళతో కనిపెట్టి వున్న తల్లి. ఆ ఇంట్లో ఎవరి స్వభావాలు ఎలాంటివో? ఎవరితో ఎలా మాట్లాడాలో, ఎవరితో ఎలా మసలుకోవాలో నేర్పిన తల్లి. తాను చేసిన పొరపాట్లు

కప్పిపుచ్చి రహస్యంగా తనకు బుద్ధులు చెప్పిన తల్లి. తోడుకోడళ్ళకుండే అసూయలూ, అనుమానాలూ ఏవీ ఎరుగని తల్లి. అందుకే ఆ తల్లిని విడిచి వెళ్ళే ఆలోచన వచ్చేసరికి కామాక్షికి ఏడుపొచ్చినంత పనైంది. ఆ అక్కగారు కామాక్షిని దగ్గరకు తీసుకుని, చెంపలు నిమిరి, కళ్ళల్లోకి చూస్తూ,

"నేనెరుగ నేనెరుగ నీ వారినడుగు"

అని చెవిలో గుసగుసలాడింది. కామాక్షి సిగ్గుపడి తల వంచుకుంది.

తనవారు ముందు పంచ లోని విశాలమైన అరుగులమీద కొలువుతీరి వున్నారని కామాక్షికి తెలుసు. తన మామగారి సంతానంలో తనవారే చిన్న. అతడంటే ఇంట్లో అందరికీ ముద్దు. కొద్దోగొప్పో బాధ్యతలు అందరికీ వున్నాయి గాని అతడికి మాత్రం ఏ బాధ్యతా లేదు. చుట్టూ పదిమంది స్నేహితుల్ని పోగుచేసుకుని వాళ్లతో ముచ్చట్లాడడమే అతడికి పని. భోగమంటే అతడిదే భోగం. అయితే కామాక్షి ఆ సమయంలో అతణ్ణి పలకరించడం ఎలా!

కామాక్షి పెద్ద గుమ్మంలో చాటుగా నిలబడి, కలకలం కొంచెం తగ్గాక, భర్త దృష్టిని ఆకర్షించి, సంజ్ఞచేసి తన గదిలోకి వెళ్ళింది. భర్త తన వెంటనే గదిలోకి వచ్చాడు. అతణ్ణి పక్కకిలాగి, మెడచుట్టు చేతులుబిగించి,

"రచ్చలో వెలిగేటి రాజేంద్రభోగి
మా అన్నలొచ్చారు మమ్మంపుతార?"

అని గోముగా అడిగింది.

అతడు చాలా సరదామనిషి. కామాక్షి ముఖమంతా ముద్దులతో నింపి

"పెట్టుకో సొమ్ములూ, కట్టుకో చీరలూ
పోయిరా సుఖముగా పుట్టినింటికిని"

అని, మళ్ళీ రచ్చలోకి వెళ్ళిపోయాడు.

రచ్చలోకి వెళ్ళిన రాజేంద్రభోగి అందరినీ ఇళ్లకు పంపి, లోపలికి వచ్చి, కామాక్షి వెనకనే తిరుగుతుంటాడు. మగవారి భోజనాలయ్యాక ఆడవారి భోజనాలప్పుడు కామాక్షి సరసనే కూర్చుని వుంటాడు. బిడ్డనెత్తుకుని మేనాలో కూర్చున్న కామాక్షి కళ్లల్లో చూస్తూ మౌనంగా "ఎల్లుండిపాటికి నేను మీ పుట్టింట్లోనే వుంటాను ఎందుకూ బెంగ" అని కూడా అనుంటాడు.

ఈ పాటలో చెప్పిన విషయాలెన్ని వున్నాయో చెప్పని విషయాలన్ని వున్నాయి. చెప్పని విషయాలు మన వూహకు వదిలిన జాడలూ వున్నాయి. చెప్పిన విషయాలు చాలా క్లుప్తంగా, అందంగా చెప్పడమూ వుంది. జానపదుల కథన ప్రతిభకు ఇదొక మంచి ఉదాహరణ.

ద్విపద తెలుగువారి చిరంతనమైన ఆస్తి. తెలుగువారి పల్లెపదాలూ, స్త్రీల పదాలూ లాంటివి ద్విపద గణాలను అటూ ఇటూ మారిస్తేనో, ముందూ వెనకా కొన్నిటిని కత్తిరిస్తేనో, మరికొన్ని చేరిస్తేనో పుట్టేవే. అందుకే దేశికవితకు ఒరవడి దిద్దడంలో పాల్కురికి సోమనాథుడు ద్విపదనే అపురూపంగా ఎన్నుకున్నాడు. చిరకాలంగా తెలుగువారు తమ సంతోషాలూ, కష్టాలూ, ఆనందాలూ, కన్నీళ్లూ ద్విపదలోనే చెప్పుకున్నారు. ఈ కథ కూడా ద్విపదలోనే నడిచిందని గమనించారా?

## అభ్యాసం

### I. వ్యాస రూప సమాధాన ప్రశ్నలు

1. 'కలవారి కోడలు కలికి కామాక్షి'లోని గ్రామీణ సంస్కృతిని వివరించండి?
2. 'కలవారి కోడలు కలికి కామాక్షి' సారాంశాన్ని వివరించండి?

### II. సంక్షిప్త రూప సమాధాన ప్రశ్నలు

1. 'కలవారి కోడలు కలికి కామాక్షి' అన్నా చెల్లెళ్ల అనుబంధాన్ని తెలియచేయండి?
2. 'కలవారి కోడలు కలికి కామాక్షి' అత్తాకోడళ్ల అనుబంధాన్ని తెలియచేయండి?
3. ద్విపద ప్రక్రియ ప్రాశస్త్యాన్ని గురించి తెలియచేయండి?
4. యస్వీ భుజంగరాయ శర్మ జీవిత విశేషాలను తెలుపండి?

### III. ఏక వాక్య / పద రూప సమాధాన ప్రశ్నలు

1. 'కలవారి కోడలు కలికి కామాక్షి' పాఠ్యభాగ రచయిత ఎవరు?
2. కలవారి కోడలు పేరేమిటి?
3. కలవారంటే అర్థం ఏమిటి?
4. కామాక్షి పెద్దన్నయ్య తనతోపాటు దేనిని వెంట బెట్టుకు వచ్చాడు?
5. పురుడు పోసుకున్న ఆడపడుచు ఏడాది లోపల మళ్ళీ దేన్ని చూడాలి?
6. కుర్చీ పీట మీద కూర్చొన్న వారెవరు?
7. కామాక్షి బావగారు చదువుతున్న గ్రంథం ఏమిటి?
8. దేశికవితకు ఒరవడి దిద్దింది ఎవరు?
9. పాల్కురికి సోమనాథుడు ఏ కవితా ప్రక్రియను ఆదరించాడు?

❖ ❖ ❖

# 5 గాన సుధాకరుడు : మంగళంపల్లి

**- కొడవటిగంటి కుటుంబరావు**



## రచయిత పరిచయం

తెలుగునాట ప్రగతిశీల మేధావిగా, మహా రచయితగా, సాహిత్యోద్యమశీలిగా, తెలుగువారి ఆధునిక సామాజిక, సాంస్కృతిక పురోగమనానికి జీవిత పర్యంతం కృషి సల్పిన రచయిత కొడవటిగంటి కుటుంబరావు.

కొడవటిగంటి కుటుంబరావు 28.10.1909 తేదీన గుంటూరు జిల్లా తెనాలిలో జన్మించారు. సుందరమ్మ, రామచంద్రయ్య వీరి తల్లిదండ్రులు. వీరి బాల్యంలోనే ఆరేళ్ల వ్యవధిలో తల్లిదండ్రులు ఇద్దరూ మరణించారు. పెత్తండ్రి సంరక్షణలో కొడవటిగంటి బాల్యం గడిచింది. స్కూలు ఫైనలు వరకు తెనాలిలో, ఇంటరు గుంటూరు ఏ.సి. కళాశాలలో, బి.ఏ.(ఫిజిక్సు) విజయనగరం కళాశాలలో చదివారు. 1929లో బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఎం.ఎస్సీ (ఫిజిక్సు) లో చేరినప్పటికీ ఆర్థిక సంక్షోభంతో చదువు మధ్యలో ఆగిపోయింది. స్కూలు ఫైనలు చదివే సమయంలోనే వీరికి సంప్రదాయ పద్ధతిలో బాల్య వివాహం జరిగింది.

కొడవటిగంటి దాదాపు యాభైయేళ్ళ కాలంలో పది పన్నెండు వేల పేజీలకు మించిన సాహిత్యం అందించారు. నాలుగు వందలకు పైగా కథలు, దాదాపు ఎనభై గల్పికలు, ఇరవై నవలలూ, వంద దాకా రేడియో నాటికలు, రెండు మూడు సినిమా స్క్రిప్టులు రచించారు. ఆరేడు వందలకుపైగా సాహిత్య, సాంస్కృతిక, వైజ్ఞానిక వ్యాసాలు; ఫీచర్లు, పుస్తక సమీక్షలు, పుస్తక పరిచయాలు ప్రకటించారు.

కొడవటిగంటి ఇతర సాహితీ మిత్రులతో కలసి కొన్ని పత్రికలను నడిపారు. తరువాత వివిధ రకాల ఉద్యోగాలు చేశారు. చాలా సంవత్సరాలు ఆంధ్రపత్రికలో పనిచేసినా, 1952 జనవరి నుండి జీవిత పర్యంతం వరకు 'చందమామ' కు సంపాదకులుగా వ్యవహరించారు. అభ్యుదయ రచయితల సంఘంలోనూ, విప్లవ రచయితల సంఘంలోనూ సభ్యులుగా ఉన్నారు. గొప్ప మార్క్సిస్టు మేధావిగా పేరుపొందిన కొడవటిగంటి 17.08.1980 తేదీన తనువు చాలించారు. ఈ పాఠ్యభాగం విరసం వారు ప్రచురించిన 'కొకు రచనా ప్రపంచం-13 (సంస్కృతి వ్యాసాలు)' నుండి గ్రహించబడింది.

## పాఠ్యభాగ నేపథ్యం

కవిత్వం, సంగీతం, చిత్రలేఖనం, శిల్పం, నాట్యాలను లలితకళలు అంటారు. చతుష్షష్టి కళలలో లలితకళలు ప్రత్యేకమైనవి. "శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి గానరసం ఫణిః" అన్నారు పెద్దలు. సంగీతానికి శిశువులూ, పశువులూ, పాములు సైతం పరవశమౌతాయని అర్థం. 'సంగీత మపి సాహిత్యం సరస్వత్యాః స్తన ద్వయమ్, ఏకమాపాత మధురం అన్యదాలోచనామృతమ్' అని కూడా ప్రతీతి. సంగీత సాహిత్యాలు సరస్వతీదేవి స్తనద్వయంలాంటివి. చంటిబిడ్డలా ఆ రసామృతాన్ని ఆస్వాదించినపుడు ప్రతి ఒక్కరూ అలౌకికానందాన్ని పొందుతారని పెద్దల ఉవాచ.

శాస్త్రీయ సంగీతమంటే 'ఏ కొద్ది మందికి మాత్రమే' అనే అపోహ ఉండేది. దానిని తుడిచిపెట్టి లక్షలాది మంది శ్రోతల్ని తన అభిమానులుగా మార్చుకొన్న ఘనత మంగళంపల్లి బాలమురళీ కృష్ణగారికి దక్కింది. ఈయన 1930 జూలై 6వ తేదీన తూర్పు గోదావరి జిల్లా శంకరగుప్తం గ్రామంలో జన్మించారు. సూర్యకాంతమ్మ, పట్టాభిరామయ్య వీరి తల్లిదండ్రులు. చిన్నతనం లోనే సంగీత మేధావిగా గుర్తింపు పొందారు. తరువాత కాలంలో సూర్యకాంతి, లవంగి, మోహనాంగి, మహతి, ప్రతిమధ్యమావతి లాంటి అనేక రాగాలను సృష్టించారు. వాక్కునూ, గేయాన్నీ బాలమురళి సొంతం చేసుకొని 'వాగ్గేయకారుని'గా ప్రసిద్ధి పొందారు. వీరు 430 బాణీలలో 72 మేళకర్త రాగాలకు ఒక్కొక్క కృతిని రాసి స్వరపరిచారు. సంగీత యుగపురుషుడైన బాలమురళి ఇరవై ఐదు వేలకు పైగా కచేరీలు చేశారు. ప్రముఖ వాగ్గేయకారులైన అన్నమయ్య, క్షేత్రయ్య, త్యాగయ్యల కోవకు చెందినవారు బాలమురళీకృష్ణ అని అంటారు.

బాలమురళి విజయవాడ ఆకాశవాణిలో పనిచేస్తున్నప్పుడు తెలుగునాట అత్యంత ప్రజాదరణ పొందిన 'భక్తి రంజని' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆ ఘనత మంగళంపల్లిదే. వీరు విజయవాడలోని ప్రభుత్వ సంగీత కళాశాలకు ప్రిన్సిపాల్‌గా కూడా పనిచేశారు. సినిమాల్లో నటించడమే కాక దక్షిణాది భాషా సినీ గీతాలను అనేకం ఆలపించారు. గాత్రంతోపాటు వయోలిన్, కంజీర, వేణువు, వీణ, మృదంగం వంటి ఇతర సంగీత వాద్యాల్లోనూ వీరికి ప్రావీణ్యం ఉంది. ప్రముఖ హిందూస్తానీ సంగీత విద్వాంసులతో కలసి 'జుగల్‌బందీ' కార్యక్రమాన్ని వీరే ప్రారంభించారు.

బాలమురళి ఐదు విశ్వవిద్యాలయాలనుండి గౌరవ డాక్టరేట్లు, రెండు విశ్వవిద్యాలయాల నుండి డి.లిట్ పట్టాలు అందుకున్నారు. వందలాది బిరుదులు, వేలాది సత్కారాలు మంగళంపల్లి బాలమురళీకృష్ణను వరించాయి. భారతప్రభుత్వం నుండి పద్మశ్రీ (1971), పద్మభూషణ్, పద్మవిభూషణ్ (1991) పురస్కారాలు; ఫ్రాన్స్ ప్రభుత్వం నుండి 'షెవాలియర్ అవార్డు', ఐక్యరాజ్య సమితి నుండి యునెస్కో అవార్డు, మద్రాసు మ్యూజిక్ అకాడమీ ద్వారా 'సంగీత కళానిధి', జాతీయస్థాయి ఉత్తమ నేపథ్య గాయకుడు, ఉత్తమ సంగీత దర్శకుడు మొదలైన పురస్కారాలు వీరు అందుకున్నారు. బాలమురళిని వరించిన అవార్డులలో ఇవి ముఖ్యమైనవి. 1994లో మంగళంపల్లి ఆంధ్ర ప్రదేశ్ తెలుగు విశ్వవిద్యాలయానికి ప్రోచాన్సలర్‌గా నియమింప బడ్డారు. తిరుమల తిరుపతి దేవస్థానం, శృంగేరి పీఠాలకు; ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలకు ఆస్థాన విద్వాంసులుగా గౌరవింపబడ్డారు. ఇన్ని బిరుదులు, పదవులు, పురస్కారాలు ఆయనను అలంకరించాయి అనడంకంటే ఆ గౌరవాలకే ఆయన అలంకారమయ్యారు అనడం సముచితం. తనకు ఎన్ని పురస్కారాలు వచ్చినా వాటి కంటే ఒకమెట్టు పైనే ఉండేవారు. 'అపర త్యాగయ్య', 'అభినవ అన్నమయ్య'గా ప్రస్తుతింపబడిన బాలమురళి తెలుగువాడు కావటం మనకు గర్వకారణం. సంగీత ప్రపంచానికి ఒక దివ్యానుభవాన్ని కలిగించిన ఈ గాన గంధర్వుడు 22.11.2016న ఏ గంధర్వ లోకానికో చేరుకున్నారు.

కొడవటిగంటి కుటుంబరావు 1971లో ఉత్తమ పురుషలో రాసిన ఈ వ్యాసం ద్వారా మంగళంపల్లి వారి సంగీత కౌశలాన్ని విద్యార్థులకు పరిచయం చేయడం, వారిలో కళాస్ఫూర్తిని పెంపొందించడం ఈ పాఠ్యభాగం ఉద్దేశం.

# పాఠ్యభాగం

నేను మొట్టమొదటిసారిగా బాలమురళీకృష్ణ పేరు వినటం 1941లో. ఆంధ్రపత్రికాఫీసుకు ఒక ప్రసిద్ధగాయకుడు వస్తే నా మిత్రులు నీలంరాజు వెంకటశేషయ్యగారు, “ఈ బాలమురళీకృష్ణ నిజంగా గొప్ప పాటగాడేనా? లేక, కుర్రవాణ్ణి ప్రోత్సహించటానికి అందరూ మెచ్చుకుంటున్నారా?” అని అడిగారు.

“మేమంతా పదిహేనేళ్ళు సాధించి నేర్చుకున్నది అతనికి తొమ్మిదేళ్ళకే వచ్చునండి. అతను సరస్వతీ అవతారం!” అన్నాడా గాయకుడు.

ఆ సరస్వతీ అవతారానికి అప్పటికి పదకొండేళ్ళు. అయితేనేం? అప్పటికే రెండేళ్ళుగా పాటకచ్చేరీలు చేస్తున్నాడు.

తరవాత మరి రెండు మూడేళ్ళకు నేను బొంబాయిలో బాలమురళీ కచేరీ విన్నాను. నాకున్న అల్ప సంగీత జ్ఞానంతో నేను, అతను సమగ్ర గాయకుడని గ్రహించగలిగాను. రాగాలాపన, కీర్తన, స్వరకల్పన, లయ, ఎందులోనూ అతనిలో తడుము కోవటం గాని, వెలితి గాని వున్నట్టు కనిపించ లేదు. అప్పటికి అతనికి పద్నాలుగో ఏడు. నాలుగైదేళ్ళుగా పాటకచ్చేరీలు చేస్తున్నాడు. నలభైఏళ్ళుగా కచేరీలు చేస్తున్న ధీమా అతనిలో కనిపించింది.

## ప్రాడిజీ

అంత చిన్న వయసులో అసాధారణ ప్రజ్ఞాపాటవాలు ప్రదర్శించేవారిని ప్రాడిజీలంటారు. గానం, గణితం, చిత్రలేఖనం, కవనం మొదలైన విద్యలలో ప్రాడిజీలు కనిపిస్తారు. పూర్వజన్మలలో విశ్వాసం వున్నవాళ్ళు వాళ్ల శక్తులు సంచితమంటారు. అలాటి నమ్మకం లేనివాళ్ళకు అవి అంతుబట్టటం చాలా కష్టం.

అయితే ఈ ప్రాడిజీలతో తరచు ఒక చిక్కుంటుంది. యుక్తవయస్కులయేసరికి వాళ్ళు శక్తులన్నీ కోల్పోయి చాలా మామూలుగా తయారవుతారు. ఇంగ్లండులోని రాయల్ ఎకాడమీలో 14 ఏళ్ల లోపు పిల్లలు వేసిన అద్భుత చిత్రాలు కొన్ని వున్నాయట. ఆ చిత్రకారులలో కొందరు పెద్దవాళ్ళు అయాక పిల్లి బొమ్మ కూడా వేయలేక పోయారట!

బాలమురళి ఈ రకం ప్రాడిజీ మాత్రం కాదు. అందుకే తన నలభయ్యో ఏట అత్యుత్తమ కర్ణాటక గాయకుడి హోదాలో వుండి, ముప్పై ఏళ్ళుగా పాటకచ్చేరీలు చేసినందుకు జనవరి 11న మద్రాసులో ఘనమైన సన్మానం జరిపించుకున్నాడు.

## బాల్యం

బాలమురళి తండ్రిగారు పట్టాభిరామయ్యగారు. రాజగురువుల కుటుంబానికి చెందినవారు. పదిమంది అన్నదమ్ములలో నాలుగోవారు. ఆయన కొంతకాలం వేదమూ, కొంతకాలం శాస్త్రమూ చదువుకున్నారు. ఏ

చదువుమీదా బుద్ధి నిలవలేదు. చివరకాయనకు సంగీతం మీద గురి కుదిరింది. సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రులవారి దగ్గర నాలుగేళ్ళు సంగీతం అభ్యసించి, ఫ్లూట్ వాయించటం సాధన చేసి, బెజవాడ చేరి, సంగీత పాఠాలు చెప్పసాగారు.

అప్పుడు ఆయనకు వివాహమయింది. ఆయన మామగారు సుప్రసిద్ధులైన ప్రయాగ రంగదాసుగారు. అధ్యాత్మ రామాయణ కీర్తనలు అద్భుతంగా పాడేవారు. ఆయన కుమార్తె అయిన సూర్యకాంతమ్మ గారు కూడా అధ్యాత్మ రామాయణం పాడేవారు. కాపరానికి వచ్చాక ఆమె భర్త ప్రోత్సాహంతో వీణ నేర్చుకుని, చిన్న చిన్న పాట కచ్చేరీలు కూడా చేశారు.

ఈ దంపతులకు 1930లో తొలి ఏకాదశినాడు బాలమురళి జన్మించాడు. మలి ఏకాదశినాడు, బాలమురళి పుట్టిన 15 రోజులకు, అతని తల్లి కన్నుమూసింది. తరవాత రెండుమూడేళ్ళ పాటు పెత్తల్లిగారు పెంచారు. తరవాత అతను తండ్రి వద్దనే పెరిగాడు.

గురుశిష్య పరంపరలో సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రులవారు త్యాగరాజస్వామికి ప్రశిష్యులు. అందుచేత పట్టాభిరామయ్యగారు ఆ పరంపరలో నాలుగోతరం వారు. అలాగే గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారు కూడా దక్షిణామూర్తి శాస్త్రులవారి శిష్యులే – అయితే పట్టాభిరామయ్య గారికి చాలా సీనియర్.

పట్టాభిరామయ్యగారే బాలమురళికి మొదటి గురువని ఈనాడు అందరూ చెప్పుకున్నా, ఆ సంగతి చాలాకాలం పట్టాభిరామయ్యగారికే తెలీదు. ఆయన వద్ద నూకల చిన సత్యనారాయణ, అక్కాజీరావు మొదలైన శిష్యులే గాక, సన్నాయి వాయించేవాళ్ళూ తదితరులూ సంగీత పాఠాలు చెప్పుకునేవారు. బాల బాలమురళి ఆ పాఠాలు విని పట్టుకున్నాడు. ఏడవ ఏటనే అతనికి అనేక గీతాలు, వర్ణాలూ, కొన్ని కీర్తనలూ వచ్చును.

ఈ సంగతి పట్టాభిరామయ్యగారికి వారి శిష్యుల ద్వారా తెలిసింది. కాని విషయం పూర్తిగా తెలిసినట్టు కనబడదు. ఎందుచేతనంటే బాలమురళిని ఎనిమిదో ఏట ఫస్టుఫారంలో చేర్చారు. అయితే ఆ యేడే బాలమురళిని పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారి దగ్గిర చేర్చి, సంగీతం చెప్పమన్నారు. కుర్రవాడు అదివరకే కొంత తయారు తీరివున్న సంగతి పంతులుగారికి చెప్పలేదు. అందుచేత ఆయన ఏదో చిన్న పాట ప్రారంభించి చెబుతూ సగంలో గ్రామాంతరం వెళ్ళారు.

## ఆ పాట పూర్తి కానేలేదు

ఈలోగా బెజవాడలో దక్షిణామూర్తి శాస్త్రులవారి ఉత్సవాలు జరపటానికి నిశ్చయమయింది. కార్యక్రమంలో పదిమంది పేర్లతో పాటు బాలమురళి పేరు కూడా చేర్చారు.

ఆనాడు తొలి ఏకాదశి. బాలమురళి 9వ పుట్టినరోజు. ఉదయం 8 నుంచి కాబోలు బాలమురళిని ఏ గంటసేపో పాడనిచ్చి, అటు తరవాత భోజనాల వేళ దాకా ముసునూరి సూర్యనారాయణ భాగవతార్ గారి హరికథా కాలక్షేపం అనుకున్నారు.

కాని తొమ్మిదేళ్ల బాలమురళి ఏ రెండున్నర గంటలసేపో పక్కా పాట కచ్చేరి చేసాడు. ఆలాపనా, కీర్తనా, స్వరకల్పనా – సమస్త హంగులతోనూ! వింటున్న పండితులకు మతులు పోయి వుండాలి.

పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారిని మెచ్చుకోవాలి. తమ దగ్గిర సంగీతం నేర్చుకున్న బొట్టికాయ తనతో సమంగా పాటకచేరి చేస్తే మరొక గురువు ఆగ్రహించటానికి ఎన్ని కారణాలైనా వుండవచ్చు. కాని రామకృష్ణయ్య పంతులుగారు ఆనందాశ్రువులు రాల్చి, గురుత్వంను కొనసాగించారు. బాలమురళి ఒక వంక పాటకచేరీలు చేస్తూ, శిష్యరికం చేసి కీర్తనలు నేర్చుకున్నాడు. (ఇలాటి సంఘటన నా ఎరికలో మరొకటే వున్నది. సుప్రసిద్ధ సినీ గాయని లత తండ్రి దీనానాథ్ మంగేష్కర్ గాయకుడిగా అంతులేని కీర్తి గడించినాక వజేబువాకు కోరి శిష్యుడయ్యాడు).

మా గురువులాంటి గురువు – నభూతో న భవిష్యతి! అంటాడు బాలమురళి. ఒక్కొక్క గురుశిష్య సంబంధం మన వంటి పామరులకు సులభగ్రాహ్యం కాదు.

ఈ విధంగా బాలమురళి అణుబాంబు పేల్చినట్టు మొదటి పాటకచ్చేరీ చేసినప్పుడు కుర్తాలం స్వాములవారు విన్నారు. (కుర్తాలం స్వాముల వార్లందరూ తెలుగువారేనట). ఆయన మూలంగా బందరు బుట్టయిపేటలో బాలమురళి రెండో పాటకచ్చేరి జరిగింది. ప్రసిద్ధ విద్వాంసులందరినీ ఆహ్వానించారు. వాగ్గేయకారక హరినాగభూషణం గారు కూడా కచ్చేరికి వచ్చారట.

అయితే, కొద్దిసేపు పాట విని హరినాగభూషణంగారు లేచి వెళ్ళిపోయి, బాలమురళి అభిమానులకూ, సన్నిహితులకూ ఆందోళన కలిగించారట. కాని కొద్దిసేపట్లో ఆయన తన భార్యనూ, పిల్లలనూ వెంటబెట్టుకుని తిరిగి వచ్చారట!

తరవాత 1942లో త్యాగరాజు ఉత్సవాలకు తిరువాయూరు వెళుతూ రామకృష్ణయ్య పంతులుగారు బాలమురళిని వెంట తీసుకు వెళ్ళారు. ఏ కారణం చేతనో ఆయనకు అస్వస్థత కలిగి ఆయన పాడవలసిన సందర్భంలో బాలమురళికి అవకాశం ఇచ్చారట. అన్నివేలమంది ప్రజలలో, అందరు విద్వాంసుల మధ్య బాలమురళి పాట అద్భుత సంచలనం కలిగించిందట. మర్నాడు ఒక నాటుకోటి చెట్టియారు గారు, సంప్రదాయ విరుద్ధంగా బాలమురళి కోసం బహుమతులు తెచ్చాడట!

బాలమురళికి విద్యార్థిగా బడిలో చదవటం అసంభవం కావటం చేత, ప్రైవేటుగా ఇంగ్లీషూ, సంస్కృతమూ చెప్పించారు. అతనికి ముగ్గురు ఆడపిల్లలూ, ముగ్గురు మగపిల్లలూనూ. అతని సమగ్ర జీవితకథ తయారవుతున్నట్టు తెలుస్తున్నది. అందులో కొన్ని అపూర్వ సన్నివేశాలుంటాయనుకుంటున్నాను. ఎందుకంటే బాలమురళి అనేకవిధాల అపూర్వవ్యక్తి.

## గాయకుడు, వాగ్గేయకారుడు, నటుడు

అన్ని విధాలా ప్రతిభావంతుడైన వ్యక్తిని పూర్ణపురుషుడు అంటారు. ఆ మాటకు అందరూ తగరు. ఏదో ఒకటి రెండు అంశాలలో పరాకాష్ఠ అందుకున్నంత మాత్రాన పూర్ణపురుషుడు కాజాలడు.

ఆ పరిభాషలో బాలమురళిని "పూర్ణ గాయకుడు" అనవచ్చు. ఆ మాట అతనికి పూర్తిగా అతుకుతుంది.

సాధారణంగా గానం వృత్తిగా పెట్టుకున్న వాళ్ళు కొంత దాకా అభివృద్ధిలోకి వచ్చి, ఇంక పైకి పోవటం అసాధ్యమనో, ప్రయాస అనో అనుకున్న నాడు విశ్రాంతిలో పడతారు– మూలధనం మీది వడ్డీతో బతికేవాళ్ళలాగ. అలాటి గాయకులు తాము సాధించుకున్న శక్తియుక్తులతోనే జీవిత శేషమంతా తమ వృత్తిని కొనసాగిస్తారు. పెరగని శక్తులు తరగటం జరగవచ్చునని చాలామందికి తెలిసినట్టు కనబడదు.

బాలమురళీకృష్ణలో ఆ 'విశ్రాంతి' ధోరణి ఏ మాత్రమూ కనిపించదు. అవకాశం దొరికినప్పుడల్లా అతని పాట వినే నాబోటివాడికి, అతను రోజు రోజుకు; కాకపోతే, నెలనెలా పెరుగుతున్నట్టు అనిపిస్తుంది. ఏ పదేళ్ళ క్రితమో అతను ఎలాటి స్థాయిలో వున్నాడో, అదే స్థాయిలో అతను నిలిచిపోయినా శ్రోతలు నిరాక్షేపణగా అతనికి బ్రహ్మరథం పట్టగలరు. అలాటి స్థితిలో అతను వామనమూర్తిలాగా ఇంకా ఇంకా ఎందుకు పెరుగుతున్నాడు?

అది డబ్బు కోసం కావటానికి వీలు లేదు. పెరగక పోయినా డబ్బు రానే వస్తుంది. అదీగాక, ఒకసారి నాతో అతను, "ఈ పాటకచ్చేరీలు కాక జరుగుబాటు కావటానికి ఇంకా ఏ మార్గం వున్నా బాగుండును! సంగీతం అమ్ముకోవటం బాధగా వుంది!" అన్నాడు.

పెరగటం తన అంతస్స్వభావం గనక పెరుగుతున్న గాయకులు ఎంతమంది వుంటారు? సంగీతం అమ్ముకోవటం బాధగా వుందని ఏ గాయకుడు అంటాడు? ఈ లక్షణాలు గలవాళ్ళు ఇంకా వుంటే వాళ్ళు విలక్షణమైన గాయకులే!

గాయకుడుగా అతనికి అద్భుతమైన శరీరం వున్నది. అది మందర గాంధారం నుంచి తారాషడ్జమం దాకా పలకటం నేను డజన్లసార్లు విన్నాను. అతని శరీరం అతిరథుడి లాంటిది. ఎలాటి క్లిష్టస్థితిలోనూ క్రమశిక్షణ పొరపాటున కూడా కోల్పోడు. రాగమూ, స్వరమూ, లయా అతనికి బానిసలలా వుంటాయి. వాటిపైన అతను చూపే అధికారం అనన్యమనిపిస్తుంది. అతని సంగీతం అగాధమనిపిస్తుంది. చాలామంది తమ యావచ్ఛక్తినీ ప్రదర్శించినట్టూ, అంతకుపైన పోలేరన్నట్టూ ఎప్పుడన్నా అనిపించవచ్చు. బాలమురళి విషయంలో అలా ఏనాడూ అనిపించలేదు నాకు (నా రసికత యొక్క పరిమితికి కొంత వదిలెయ్యండి). అంటే నాకు అతని 'అడుగు' ఇంతవరకు తగిలినట్టు భావన కలగలేదు.

అతను 72 మేళకర్తల మీదా కీర్తనలు రాశాడనీ, ఇంకా అనేక కీర్తనలూ, పదాలూ, గీతాలూ, వర్ణాలూ, తిల్లానాలూ రాశాడనీ అందరికీ తెలిసినదే. ఇతని వాగ్గేయకారత్వంలో నాకు కలిగిన భావమేమంటే, అనేక రాగాలమీద ఇతని రచనలు అవే రాగాల మీద పూర్వం వున్న రచనల కన్న మంచి కాంపోజిషనులని, మోహన, చారుకేసి, షణ్ముఖప్రియ మొదలైన రాగాలతో ఇతని గేయాలు నాకు సర్వోత్తమమైనవిగా తోస్తాయి. పండితులు నాతో ఎంతవరకు ఏకీభవిస్తారో మరి.

తిల్లానాలు కూడా చాలామంది రాశారు. బాలమురళి తిల్లానాలు విని, మిగిలినవాళ్ళవి విని ఆనందించటం దాదాపూ అసంభవమనిపిస్తుంది. ఈ విషయం నేను కాస్త గట్టిగానే చెప్పగలను.

ఎందుకో నాకు చాలా కాలంగా బాలమురళి సంగీతంలో త్యాగరాజు హృదయం వున్నట్టు అనిపిస్తూ వచ్చింది. ఇటీవల బాలమురళి సన్మానసభలో ప్రసంగిస్తూ సంధ్యావందనం శ్రీనివాసరావుగారు అతన్ని "ఛోటా త్యాగరాజు" అన్నప్పుడు, నేను బొత్తిగా తప్పుదారిన పడలేదేమోననుకున్నాను.

ఈ సందర్భంలో గాయకుడూ, వాగ్గేయకారుడూ అన్నమాటల వెంట 'నటుడు' అన్నమాట కూడా ఎందుకు చేర్చానో చెప్పాలి. అతను స్టేజిమీద త్యాగయ్య వేషమూ, 'ప్రహ్లాద' చిత్రంలో నారదుడి వేషమూ, రేడియో గేయనాటికలలో వివిధ పాత్రలూ ధరించి, జయప్రదంగా నిర్వహించాడని కాదు; అతని సంగీతంలో నటన – అభినయం వున్నది. ఏ కళ అయినా భావస్ఫోరకంగా వుండాలంటే దాని వెంట ఇతర కళలు అనేకం వుండాలి. సంగీతమంటే అచ్చగా పాడటం కాదు; మాటల ద్వారా భావాలను ప్రేరేపించాలి. అది ముఖంతో అభినయించటం కాదు. గొంతుతో అభినయించాలి. ఈ విద్యలో బాలమురళికి మిగిలినవాళ్ళు ఎన్నో మైళ్ళ దూరంలో వున్నారనిపిస్తుంది.

కీర్తన పాడటంలోనే కాదు. ఆలాపనలో కూడా అభినయం చూపగలడు బాలమురళి. అతని స్వరకల్పనలో చిత్రలేఖన సూత్రాలు – చిన్న చిన్న ముగ్గులు కాదు – క్లిష్టమైన కాంపోజిషన్లు కనిపిస్తాయి, వినేవాడికి.

"కర్ణాటక సంగీతం తమిళ దేశం నుంచి ఆంధ్రకు వలసపోయింది. ఇవాళ బాలమురళి, చిట్టిబాబు, ఓలేటి, నేదునూరి, బాలసుబ్రహ్మణ్యశర్మల లాగా కర్ణాటకం పాడగలవాళ్ళు తమిళులలో లేకుండా పోతున్నారు" అన్నాడు ఎస్.వై. కృష్ణస్వామి గారు. అయితే నన్ను పెద్దలు క్షమిస్తే, మన పెద్ద గాయకులందరూ బాలమురళి వద్ద 'గానాభినయం' నేర్చుకోవలసి వున్నది.

అది అలా వుంచి, కర్ణాటక సంగీతం ఆంధ్రులను వరించిందేమోగాని, ఆంధ్రదేశాన్ని ఇంకా వరించినట్టు కనబడదు. బాలమురళికి తమిళ సోదరులు చేసిన సన్మానాల్లో ఎన్నో వంతు ఆంధ్రులు చేస్తారో చూడాలి. తమిళులు బ్రహ్మరథం పడుతున్న తెలుగు నాయకులకు తెలుగు వాళ్ళు ఎటువంటి సన్మానాలు చేస్తారో అది కూడా చూడవలసి వున్నది.

## అభ్యాసం

### I. వ్యాస రూప సమాధాన ప్రశ్నలు

1. 'మంగళంపల్లి బాలమురళీకృష్ణ పూర్ణ గాయకుడు' – వివరించండి?
2. బాలమురళీకృష్ణ సంగీతానికి చేసిన సేవ ఏమిటి?

### II. సంక్షిప్త రూప సమాధాన ప్రశ్నలు

1. 'ప్రాడిజీల'ను గురించి వివరించండి?
2. సూర్యకాంతమ్మ గారిని గురించి తెల్పండి?
3. బాలమురళి మొదటి సంగీత కచేరి గురించిన విశేషాలేమిటి?
4. కొడవటిగంటి కుటుంబరావు గురించి వివరించండి?

### III. ఏక వాక్య / పద రూప సమాధాన ప్రశ్నలు

1. ప్రాడిజీ అంటే ఏమిటి?
2. బాలమురళి తల్లిదండ్రుల పేర్లేమిటి?
3. మంగళంపల్లి నటించిన చలనచిత్రం ఏది?
4. త్యాగరాజస్వామి ఉత్సవాలు ఎక్కడ జరుగుతాయి?
5. బాలమురళి ఎన్ని మేళకర్తల మీద కీర్తనలు రాశాడు?

## విశేషాంశాలు

- **స్వరం :** సంగీతంలో ఏడు స్వరాలుంటాయి. అవి – షడ్జమ, రిషభ, గాంధార, మధ్యమ, పంచమ, దైవత, నిషాద. వీటి సంక్షిప్త రూపాలే స – రి – గ – మ – ప – ద – ని అనే సప్త స్వరాలు. వీటిని అనేక రీతుల్లో మేళవించడం వల్ల రాగాలు ఏర్పడతాయి. ప్రతి రాగంలోనూ సప్త స్వరాలు తప్పనిసరిగా ఉండాలన్న నియమం లేదు.

- **రాగాలు – మేళకర్త రాగాలు :** సంగీత శాస్త్రంలో 'రాగం' అనేది ఒక సాంకేతిక పదం. ఏదైనా ఒక మాధుర్యాన్ని పలికించడానికి ఏర్పాటు చేసుకున్న కొన్ని నియమ నిబంధనల సమాహారం రాగం. స – రి – గ – మ – ప – ద – ని అనేవి సప్త స్వరాలు. వీటి ఆరోహణ, అవరోహణలు ఎలా సాగాలి

అనే దానిని అనుసరించి ఈ రాగాల అస్తిత్వం ఉంటుంది. కర్ణాటక సంగీతంలో ఈ రాగాల సంఖ్య 72. మేళకర్త రాగాలు అంటే ఇవే. వీటిని సంపూర్ణ రాగాలు అని కూడా వ్యవహరిస్తారు. ఈ మేళకర్త రాగాల నుంచి పుట్టిన వాటిని జన్యరాగాలు అంటారు. వీటి సంఖ్య అనంతం.

❖ **వర్ణం :** సంగీత శాస్త్రంలో రాగ సంచారాన్ని వివరించే సాంకేతిక పదం 'వర్ణం'. ఈ వర్ణం స్వర ఉచ్చారణనూ, రాగ లక్షణాన్నీ; రాగంలోని ఆరోహణ అవరోహణ క్రమాన్నీ వివరిస్తుంది. వర్ణాలలో వివిధ రకాలున్నాయి. పల్లవి – అనుపల్లవి – చరణం – స్వరాలు అనేవి వర్ణంలో సర్వసాధారణంగా ఉండే అంశాలు. అభ్యాసకుడు వేరు వేరు గతుల్లో అభ్యాసం చేయడానికి అనుకూలంగా ఈ వర్ణాలను రచించారు. సాధారణంగా గాత్రకచ్చేరీలలో శ్రోతలను ఉత్తేజ పరచడానికి గాయకులు వర్ణాన్ని ఆలపించడం ద్వారానే కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.

❖ **త్యాగరాజు – తిరువాయూరు :** కర్ణాటక సంగీత త్రిమూర్తులలో త్యాగరాజు (4.5.1767 – 6.1.1847) ఒకరు. ముత్తుస్వామి దీక్షితులు, శ్యామశాస్త్రి తక్కిన ఇద్దరు. త్యాగరాజుకు త్యాగయ్య, త్యాగ బ్రహ్మ అనేవి నామాంతరాలు. కర్ణాటక సంగీతానికి త్యాగరాజును మూలస్తంభంగా పరిగణిస్తారు. వీరి జన్మదినాన్ని భారతీయ సంగీత దినోత్సవంగా జరుపుకుంటారు. వేలాది కీర్తనలను రచించిన త్యాగయ్యకు నివాళిగా అశేష సంగీత కళాకారులు ప్రతి సంవత్సరం పుష్య బహుళ పంచమినాడు త్యాగరాజ ఆరాధనోత్సవాలు జరుపుకుంటారు. ఇవి తమిళనాడులోని తంజావూరు సమీపాన గల తిరువయ్యూరులోని కావేరీ నది ఒడ్డున ఉన్న త్యాగయ్య సమాధి వద్ద జరుగుతాయి.

నిజానికి త్యాగరాజు మాతృభాష తెలుగే. వీరి పూర్వీకులది ప్రకాశం జిల్లా, కంభం మండలంలోని కాకర్ల గ్రామం. అక్కడ నుండి తమిళనాడుకు వలసపోవడం వల్ల త్యాగరాజు జీవితం అక్కడ గడిచింది. అయినా త్యాగయ్య కీర్తనలలో అధిక భాగం తెలుగువే. అయినప్పటికీ కర్ణాటక సంగీత ప్రియులు తమిళనాడులోనే అధిక సంఖ్యలో ఉండటం వల్ల వీరి కీర్తనలు అక్కడే అధిక ప్రాచుర్యం పొందడం విశేషం.

❖ **లయ :** సంగీత శాస్త్రంలో వినిపించే మరొక సంకేత పదం లయ. శ్రుతి, లయలు సంగీతంలోని మాధుర్యానికి ఆయువు పట్టులు. కొందరు లయ, తాళాలను అభేదంగా పరిగణిస్తారు.

❖ **పదం :** కీర్తనకు మరొక పర్యాయ పదం – 'పదం'. అయితే, భక్తితో కూడిన కీర్తనలను పదాలుగా పరిగణిస్తారు. భక్తికి సంబంధించిన పాట అని ఈ 'పదానికి' అర్థం చెప్పుకోవచ్చు.

❖ **తిల్లాన :** సంప్రదాయ సంగీతంలో మరో కృతి విశేషం 'తిల్లాన'. పల్లవి – అనుపల్లవి – చరణం అనే మూడు అంగాలు కలిగిన రచన 'తిల్లాన'. ఇందులోని సాహిత్యం జతులతోనూ, స్వరాలతోనూ విరాజిల్లుతుంది. ఇతర ప్రక్రియలకంటే తిల్లానా చురుకుగా ఉంటుంది. ఉద్రేకింప చేసే రచనతో శ్రోతలను రసలోకంలో విహరింప చేయడం తిల్లాన ప్రత్యేకత. ఇది కర్ణాటక సంగీతం లోని విశిష్ట రచనే అయినా; హిందూస్థానీ సంగీతంలోనూ వినిపిస్తూ ఉంటుంది. నృత్య నాటికలలో ఈ 'తిల్లాన' ప్రక్రియను ఎక్కువగా వినియోగిస్తారు.


❖ **తార :** 'తార' అనేది సంగీత శాస్త్రంలో స్వరస్థాయికి సంబంధించిన ఒక సాంకేతిక పదం. సంగీతం స – రి – గ – మ – ప – ద – ని అనే స్వరాల మీద ఆధారపడి ఉంటుంది. ఈ స్వరాలను ఆరోహణ, అవరోహణ క్రమాలలో మూడు స్థాయిల్లో పాడవచ్చు. సాధారణంగా గాత్రంలో కింది స్థాయిని 'మంద్ర' అనీ, మధ్య స్థాయిని 'మధ్య' అనీ, పై స్థాయిని 'తార' అనీ పరిగణిస్తారు. తారము అనే పదానికి తరింప చేసేది అనే పారమార్థిక అర్థం కూడా ఉంది.

## కార్యాచరణ

❖ బాలమురళి పాడిన కీర్తనలను, తిల్లానాలను సేకరించి, వారి గాన మాధుర్యాన్ని విద్యార్థులకు తెలియ చేయవచ్చు. స్వరజ్ఞానం ఉన్న విద్యార్థులను వాటిని పాడేలా ప్రోత్సహించవచ్చు.

❖ ❖ ❖

# 6 మాటతీరు



**- యార్లగడ్డ బాలగంగాధరరావు**

## రచయిత పరిచయం

తాను ధ్రువీకరించుకున్న అంశాన్ని ముక్కుసూటిగా ప్రకటించగల సాహితీవేత్త ఆచార్య యార్లగడ్డ బాలగంగాధరరావు. వీరు కృష్ణాజిల్లా 'దివిసీమ'కు సమీపంలో ఉన్న చల్లపల్లి ఎస్టేటులోని పెదప్రోలు గ్రామంలో 01.07.1940 తేదీన జన్మించారు. వీరి తల్లిదండ్రులు కృష్ణవేణమ్మ, భూషయ్య.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా పనిచేసిన యార్లగడ్డ 'నామ విజ్ఞానం'పై ప్రత్యేక అధ్యయనం చేశారు. దీనికి సంబంధించిన జాతీయ అంతర్జాతీయ స్థాయికి చెందిన అనేక సంస్థల్లో వీరు చిరకాల సభ్యులుగా కొనసాగారు. నామ విజ్ఞానానికి సంబంధించిన వివిధ అంశాలపై అనేక గ్రంథాలను రచించారు. ఒక ఊరికథ (1995), మాట-మర్మం (2000), ఇంటి పేర్లు (2001), అక్షర యజ్ఞం (2001) వంటివి ఈ కోవకు చెందిన గ్రంథాలే. ఇవేకాక క్రీడాభిరామం, పల్నాటి వీరచరిత్ర, రాధికా సాంత్వనం వంటి కొన్ని కావ్యాలను వచనంలోకి అనువదించి, వ్యాఖ్యలు రాశారు. మహాభారతానికి వీరు అందించిన విశేష వ్యాఖ్య బహుళ ప్రాచుర్యం పొందింది. తెలుగు భాషా సాహిత్యాలకు ఎనలేని కృషి చేసిన యార్లగడ్డ 23.11.2016న కన్నుమూశారు. ప్రస్తుత పాఠ్యాంశం యార్లగడ్డ ప్రకటించిన 'మాటతీరు' గ్రంథం (2007) నుంచి ఏర్చి కూర్చినది.

## పాఠ్యభాగ నేపథ్యం

'మాటతీరు' అంటే మాట్లాడే విధానం అని అర్థం. మానవ సంబంధాలన్నీ మన మాటతీరుపైనే ఆధారపడి ఉంటాయి. సుదీర్ఘ కాలంగా మనిషి సంఘజీవిగా మనుగడ సాగించడం వెనుక అనేక అంశాలు వెన్నుదన్నుగా ఉన్నాయి. వాటిలో ఈ మాటతీరు కూడా ఒక బలమైన అంశం. ప్రతి భాషకూ కొన్ని ప్రత్యేక లక్షణాలుంటాయి. నుడికారాలు, జాతీయాలు, సామెతలు వంటివి ఆయాభాషల అస్తిత్వాన్ని ప్రతిష్ఠిస్తాయి. ఈ విషయంలో మన మాతృభాష తెలుగు ఇతర భారతీయ భాషల కంటే మరికొంత విశిష్టంగా ఉంటుంది.

సమాచారాలను చేరవేసుకోవడం లోనూ, మానవ సంబంధాలను మెరుగు పరుచుకోవడం లోనూ మనం అనేక పదాలను అలవోకగా ప్రయోగిస్తూ ఉంటాం. వాటిలో కొన్ని పదాలు పెద్దపెద్ద పండితులకు కూడా అంతుపట్టకుండా ఉంటాయి. అయినా అవి మన వ్యవహారంలో సంలీనమై ఉంటాయి. అందువల్ల వాటిని మనం విడిగా గుర్తించం. అలాంటి వాటిలో మరికొన్ని పదాలు కొన్ని కొన్ని ప్రత్యేక నేపథ్యాలు కలిగి ఉంటాయి. మన సామాజిక - సాంస్కృతిక - చారిత్రక - ఆర్థిక అంశాలతో అవి ముడిపడి ఉంటాయి. వాటి విశేషాలు మనకు

తెలిసినపుడు మన తెలుగు భాష ఎంత లోతైందో, మరెంత మహత్తరమైందో, ఇంకెంత మాధుర్యవంతమైందో విశదమవుతుంది. ఈ తేనె తనాన్ని మనందరికీ పంచడానికీ, మన అనుభవంలోకి తీసుకొని రావడానికీ, మనల్ని ఆలోచింప చేయడానికీ యార్లగడ్డ 'మాటతీరు' అనే గ్రంథాన్ని ప్రకటించారు. అందులో 200 కు పైగా ఈ విశిష్ట పదాలు శాస్త్రీయంగా విశ్లేషించబడ్డాయి. వాటిలోంచి మచ్చుకు కొన్ని పదాలతో ఈ పాఠ్యాంశం రూపొందించబడింది. మన తెలుగు భాషా విశిష్టతల్ని విద్యార్థులకు రుచిచూపించడమే ఈ పాఠ్యభాగం ఉద్దేశం.

# పాఠ్యభాగం

## అతలాకుతలం

రారాని పోరాని సమస్యలతో సతమతమవుతున్న వాడిని, యోగక్షేమాలడిగితే, నా పని అంతా అతలాకుతలంగా వుందనడం తెలిసిందే. అంటే క్రిందుమీదవుతున్నానని చెప్పడం. అతలాకుతలం, ఆ అర్థాన్నే ఇస్తుంది. చూడండి.

ఈరేడు లోకములనే మాట వినేవుంటారు. అంటే రెండు ఏడులు పదునాల్గు లోకములన్న మాట. అవి భూమితో కలిపి పైన ఏడు. భూమి క్రింద ఏడు. వీటినే ఊర్ధ్వ లోకములు, అధోలోకములు అంటారు. ఊర్ధ్వలోకములు 1) భూలోక, 2) భువర్లోక 3) స్వర్లోక 4) మహర్లోక 5) జనర్లోక 6) తపర్లోక 7) సత్యలోక లేక బ్రహ్మలోకములనేవి. అధోలోకములు 1) అతల 2) వితల 3) సుతల 4) రసాతల 5) తలాతల 6) మహాతల 7) పాతాళములు.

ఇందులో భూలోకానికి కుతలమని కూడ పేరు. సంస్కృత నిఘంటువుల్లో చోటు చేసుకోలేదు. అయితే కువలయమనే పదం కన్పిస్తుంది. కుతల మనే పదాన్ని కవులు ఉపయోగించారు. కుతలానికి క్రింద అంటే భూమికి క్రింద వున్నది అతలము. అతలా కుతలమయ్యిందంటే, అతలము పైకి వచ్చిందన్నమాట. అంటే క్రిందు మీదయినదన్నమాట.

## అమ్మబోతే అడవి, కొనబోతే కొరివి

రైతు తాను ఉత్పత్తి చేసిన ధాన్యాన్ని, అపరాలను అమ్మజూపిన వేళ ధరలు పడిపోయి, తనకు కావలసిన వస్తువుల ధరలు ఎక్కువగా వుండి అందుబాటులో లేనపుడు- అంటే ఆదాయానికి వ్యయానికి పొంతన లేని స్థితిలో, తన నిస్పృహ నిరాశలను, అశక్తతను పైవిధంగా వ్యక్తీకరించడం జరుగుతుంది. ఇందులో అడవి, కొరివి పదాలు ఎలా చోటుచేసుకున్నాయి? ఎలాగంటే – వస్తువులను ఎవరికి అమ్మాలి. వాటితో అవసరమున్న జనాలకు కదా! అడవిలో మనుషులుండరు గదా! కనుక అక్కడ అమ్మటమనే ప్రసక్తి లేదు. అంటే అమ్ముదామంటే కొనే వారెవరూ లేరన్నమాట. అంటే జనం వున్నారు. కొనేవారే లేరు. నిజంగా అడవి గాకపోయినా, వస్తువును కొనేవారు లేక, అతగాడికి అది అడవిని తలపిస్తోంది. తనకు కావలసిన వస్తువుల ధరలు మండిపోతున్నాయి.

కొరివి లక్షణం మండటం గదా! దానిని తాకితే చురుక్కుమంటుంది. అలా తనకు కావలసిన వస్తువుల ధరలు, అధికంగా వుండి, తాను అమ్మజూపిన వాటికి ధర లేక కొనేవారు కరవైనపుడు, ఈ పదబంధాన్ని వాడడం జరుగుతుంది.

## ఏరువాక పున్నమి

జ్యేష్ఠ పూర్ణిమను ఏరువాక పున్నమి అనడం తెలిసిందే. ఏరు, వాక పదాల కలయిక ఏరువాక. ఏరు అంటే నది. వాక అంటే వాగు. అంటే ఆ పౌర్ణమి నాటికి ఏరు, వాగులు సాగుతాయి. అంటే వర్షాలు  పడడం వలన ప్రవాహాలు సాగుతాయన్నమాట. అంటే తొలకరి. తొలికారు అంటే మొదటి ఋతువు (వ్యవసాయ సంబంధంగా). అదే తొలకరి అయింది. 'ఏరువాక సాగారోరన్నా, నీ కష్టమంతా తీరునురోరన్నా' అంటే వర్షాలు పడి ఏర్లూ, వాగులు ప్రవహిస్తున్నాయి. నీ కష్టానికి ఫలితం లభిస్తుంది. వ్యవసాయ పనులు ఆరంభించవలసింది అని చెప్పడం, ఈ పౌర్ణమికి కవుళ్ళు నిర్ధారించుకోవడం, పాలేర్లను నియమించుకోవడం జరుగుతుంది. వ్యవహారంలో ఈరా పౌర్ణమి కూడా. కొన్ని ప్రాంతాల వారికి శ్రావణ పౌర్ణమి తొలకరి. దానిని శాసనాల్లో పేరామణి పున్నమి అన్నారు. 'పేర్' అంటే విత్తులు విత్తడం. ఆమణి, శ్రావణం నుండి వచ్చిన పదం. ఇరా అనే సంస్కృతపదానికి నీరు అని కూడా అర్థం. ఇరావత్ అంటే మేఘము. ఇరాంబరము అంటే వడగల్లు. తొలకరి వర్షాలప్పుడే గదా వడగళ్ళు పడతాయి.

## కొంగు బంగారం

ఎవరికైనా, వలసినది అనాయాసంగా, సిద్ధమై లభిస్తూ వుంటే – వాడికేమి వాడికది కొంగు బంగారం, లేదా ముంగొంగు బంగారం అంటూ వుంటారు. కవుల ప్రయోగాలూ వున్నాయి. కాని విషయం తెలిస్తే – పురుషుల విషయకంగా ఆ పదబంధాన్ని వాడుక చేయరు! స్త్రీల విషయంలో, అది కూడా వివాహితల విషయంలో మాత్రమే చెల్లి వచ్చే పదబంధమది. సంగతేమిటంటే – ప్రథమ సమాగమవేళ వరుడు, వధువు కొంగుకు ఒక కాసు బంగారు నాణాన్ని కడతాడు. అది వరుడు, వధువుకు చెల్లించే కట్నం (Bridalprice). దానిని వాడుకునే హక్కు ఆమెకు మాత్రమే వుంటుంది. మరో మాటగా చెప్పాలంటే, దానిని వాడుకునే అవసరం ఆమెకు భర్త గాని, ఇతర కుటుంబసభ్యులుగాని కలుగనీయరాదు. దానిని తిరిగి, ఆమె తన కోడలకు కట్టడానికి కుమారునికి ఇస్తుంది. అలా అది పరంపరగా వెళుతుంది. ఒకరికి మించి కుమారులుంటే, వేరే కొని యిస్తారు. ఆచారం ఇంత కఠినంగా వున్నా ఒక్కొక్కప్పుడు, విధిలేని స్థితిలో ఆమెకు ఆర్థికావసరం కలుగవచ్చును. అప్పుడు అది అడ్డుపడుతుంది గదా! ఏ ఇబ్బందీ లేకుండా ఆ అవసరాన్ని అధిగమించడానికి ఉపయోగపడుతుంది. అందుబాటులో ఉన్న ధనంగా (Ready Money). ఆ కారణంగానే పురుషుని విషయంలో కూడా కొంగు బంగారమనే మాట రెడీమనీ (Ready Money) అనే భావనలో వాడుకలోనికి వచ్చింది.

## చెట్టూ, చేమ

ఏ మొక్కా మొలవని చోటును చెట్టూ చేమలేని చోటు అంటాము. వృక్షమని సంస్కృతంలో దేనినంటామో అది మనకు చెట్టు. చేమ అంటే ఏమిటి. శ్యామ అనే సంస్కృతపదం మన భాషలో చేమ. శ్యామల వర్ణాన్ని మనం చామన చాయ అంటాము. శ్రీరాముని దేహచ్ఛాయ అలాంటిది. అంటే ముదురు ఆకుపచ్చరంగు. చేమ దుంపలు తెలుసుగదా! దీని ఆకుల రంగును బట్టి, ఆ దుంపలకు ఆ పేరు వచ్చింది. చేమ అంటే పచ్చదనం అన్నమాట. చెట్లు పచ్చగా వుంటాయి గదా! చెట్టూ చేమా లేకపోవడమంటే, చెట్లు లేకపోవడమేగాక, కనీసం గడ్డికూడా అక్కడ లేదన్నమాట. గడ్డి వుంటే భూమి పచ్చగా వుంటుంది కదా!

ఇక్కడ ఒక విశేషం. చేమకూర వెంకటకవి అని ఒక కవి వున్నాడు. విజయవిలాసమనే కావ్యం రచించాడు. ఆయన ఇంటిపేరులోని 'చేమకూర'ను, చేమ దుంపల కూరగా భావించి, అతని కవిత్వాన్ని పరామర్శిస్తూ, బాగుందనే ఉద్దేశంతో చేమదుంపల కూర నస అయినా కవిత్వం పసగా వుందనడం జరిగింది. ఇంతకూ ఆయన ఇంటిపేరు, 'చేమకూరు' అనే గ్రామనామం మీదుగా ఏర్పడిందని తెలియక ఇలా వ్యాఖ్యానం చేశారు.

## పంచామృతాలు

పంచామృతాలు అంటే అయిదు అమృతాలు. అమృతం పుట్టడానికి ఒక పెద్ద కథ వుంది. దేవతలకి, రాక్షసులకి యుద్ధం. మరణం లేకుండా ఉండడానికి అమృతం కావలసి వచ్చింది. పాల సముద్రాన్ని చిలికారు. అమృతం పుట్టింది. అదలా వుంచితే, రుచి విషయకంగా, ఏదైనా చాలా రుచిగా వుంది అని చెప్పడానికి అమృతం లాగా వుంది అని చెపుతాము. అక్కడికి మనం అంతకు పూర్వం అమృతాన్ని రుచి చూసివున్నట్లు. ఇదొక బడాయి.

ఏదైనా, మధురమైనదానికి, అంటే తీపికి సంకేతంగా అమృతమనే మాటను ఉపయోగించడం మన అలవాటు. అలాంటి అయిదు మధుర పదార్థాలను కలిపి పంచామృతాలు అంటారు. అవి పాలు, పెరుగు, పంచదార (శర్కర), నేయి, తేనెలు. దేవతారాధనలో, అభిషేకంలో ఇవి ముఖ్యం. ఆ అయిదింటి సమ్మిశ్రమం ఆరోగ్యాన్ని ఇస్తుంది. కేవలం నేయి తేనెల మిశ్రమం విషంతో సమానం.

## పులిహోర

పులిహోర తెలియని వాళ్లుండరు. రాయలసీమలో దీన్నే చిత్రాన్నమంటారు. కన్నడంలో పులియోదర. పసుపు వినియోగం వలన అది చిత్రాన్నమయింది. (రంగు వలన). పుల్లని ఆహారం కనుక పులిహోర. ఆహారానికి వికృతి ఓగిరం. 'గ' కారం దకారమై పులి ఓదర అయింది. ఇది నిజానికి ప్రత్యేకమైన వంట కాదు. రుచిని బట్టి ప్రత్యేకతను సంతరించుకుంది. మిగిలిపోయిన అన్నాన్ని చెడిపోకుండా నిలువ చేసుకోడానికి చింతపండు పులుసు కలిపాము. దాని ఆధిక్యం వలన కలిగే దోషాన్ని నివారించడానికి పసుపు వినియోగించాము. రుచి కొరకు తాలింపు. ఇంకేం. పులిహోర సిద్ధమైంది. మనవాళ్లు ఎంత జాగ్రత్త పాటించారో చూడండి. మరి అన్నం పరబ్రహ్మ స్వరూపం కదా! వృథా చేయరాదు. నిలువ చేయడం వలన రోగకారకం కారాదు. అందుకని పసుపు నూనెల వినియోగం.

'అన్నం బాదిత్య మయంబు' అంటే అన్నం ఆదిత్యుని (సూర్యుని) వలన లభిస్తుంది. ఇక్కడ అన్నమంటే ఆహారమని అర్థం. మరి సర్వానికి సూర్యుడే కదా ఆధారం. అదలా వుంచితే అన్న మంటే వరి అన్నమే అన్నం. మిగతా వాటిని అన్నం అనరాదు. అన్నం తిన్నవారు ఆంధ్రులని ఋగ్వేద ప్రతిపాదనం. పుల్లని ఆహారం పులిహార వ్యవహారంలో పులిహోర అయింది.

## పేదా, సాదా

పేద సాదలపట్ల మన్నన కలిగి ఉండాలి అనడం కద్దు. పేదకు మారుగా బీద కూడ ఉపయోగిస్తాము. సాధారణంగా ఆర్థికశక్తి లోపించిన వారిని పేదలనడం కద్దు, పై పదబంధం ఈ అర్థం లోనే వ్యవహరింపబడుతోంది. అయితే పేద అనేది కేవలం ఆర్థికం తోనే; అంటే ధనలేమి తోనే ముడి పడి వున్నది కాదు. దేనిలో తక్కువైనా పేద శబ్దం ఉపయోగిస్తారు. ముఖ్యంగా కవులు స్త్రీల నడుమును వర్ణించేటప్పుడు అసలు వుందా లేదా అన్నట్లుగా వుంది అని ఆలంకారికంగా చెపుతారు. అలాంటి సందర్భంలో 'పేద' శబ్దాన్ని ఉపయోగించి చెప్పిన కవులున్నారు. అంటే అల్పము, దైన్యము అనే అర్థాల్లో పేద శబ్దం వాడుతున్నట్లు బోధ పడుతుంది. తెలుగులో లేదుగాని, తమిళంలో పదేండ్లలోపు ఆడ పిల్లలను కూడా పేద శబ్దంతో చెపుతారు.

ఇక్కడ మాత్రం ఆర్థిక పరమైన తక్కువతనాన్నే చెబుతోంది. దీనితో జోడించిన శబ్దం 'సాద', సంస్కృత శబ్దం 'సాధు' నుండి వచ్చినది. వీరి జీవనం సంఘపు వితరణపై ఆధారపడి వుంది గనుక పేదసాదల పట్ల ఆదరణ చూపాలి అనే మాట వాడుకలోకి వచ్చింది. అయితే సాధు శబ్దము శాంతత్వానికి మారుగా కూడా ఉపయోగిస్తాము. సాధు జంతువు అన్నప్పుడు క్రూర స్వభావం కానిది అని చెప్పడం. వాడు పరమ సాధువు అంటే, కోపం రాని, లేని వ్యక్తి అన్నమాట.

అయితే తిక్కన్నగారు విరాటపర్వంలో చెప్పిన 'సాదురేగెనేనిన్విను తలపోలమునన గాని నిలువదు' అన్న మాటలో కూడా 'సాదు' శబ్దానికి శాంత స్వభావమనే అర్థం చెప్పడం జరిగింది. నిజానికక్కడ వున్నది 'సాదు' కాదు. సాతు మాత్రమే. సాతు అనేది ఒక రకం కలుపుమొక్క. అది చేలో పడితే దాన్ని నివారింప శక్యంగాదు. సాతు రేగినా బూతు రేగినా ఆగదని సామెత. బూతు కూడా కలుపు మొక్కే... కనుక పదాల అర్థాల విషయంలో చాల మెలకువ వహించాలి.

## యోగక్షేమాలు

'యోగక్షేమమ్ వహామ్యహమ్' అనేది గీతా వాక్యము. కాగా జీవిత బీమా సంస్థవారు, తమ సంస్థ కార్యకలాపాలను ఉద్దేశించే విధంగా, పై వాక్యాన్ని తమ సంస్థ అధికార చిహ్నంలో పొందుపరచుకున్నారు. ఆ సంస్థకు అది తగియున్నది. అదలా వుంచితే. సాధారణంగా మనం ఉత్తరాలు వ్రాసుకునేటపుడు (బంధువులకు, ఆత్మీయులకు) మన కుశలాదికాలు తెలుపుతూ, తిరుగు ఉత్తరంలో వారి యోగక్షేమ సమాచారాలను తెలుప

వలసిందిగా కోరుతూ వుంటాము. ఇలాంటి సందర్భాల్లో ఇతర ప్రాంతీయులు కూడ ఇలాగే వ్రాస్తారో, లేక ఆ అర్థం వచ్చే విధంగా ఇతర వాక్యాల్లో వ్రాస్తారో తెలియదు. కాని మనకు మాత్రం అలా వ్రాయడం పరిపాటి. యోగక్షేమాలనడంలో మనం ఉద్దేశిస్తోంది ఎదుటివారి కుశలాదికాన్ని లేక వారి సుఖసంతోషాలను, లేక రెంటినీ.

కాని యోగక్షేమాలనే రెండు మాటలకు గల అర్థాలు వేరు. యోగం అంటే కూడిక, కూడిన అనేవి నిజమైన అర్థాలు. యోగసాధన లోని యోగ శబ్ద ఉపయోగం తెలిసిందే. యోగమంటే 'వాడికి యోగం పట్టింది' అనే వాక్యంలో అదృష్టమనే భావన వ్యక్త మవుతోంది. యోగమును ఆచరించేవాడు యోగి. దీని వికృతము జోగి. సన్యాసి అనే అర్థంలో ఇక్కడ కుదురుకుంది. ఇక యోగశబ్దంపై ఆయా ఉపసర్గలు చేరితే వియోగం, నియోగం, ప్రయోగం, అభియోగం మొదలైనవి ఏర్పడి వివిధ అర్థాలనిస్తాయి. మనం వాడుక చేసే పదాలకు యౌగికార్థమని, రూఢ్యర్థమని రెండు విధాల అర్థాలుంటాయి. పరిభాష అంటే వాగ్దానం. ఇది యౌగికార్థం. సాంకేతికపదం అనే అర్థం రూఢ్యర్థం. అంటే శబ్దగతమైన నిజార్థం యౌగికార్థం. లోకంలో రూఢిని పొందిన అర్థం రూఢ్యర్థం. మరికొన్ని ఉదాహరణలు చూద్దాము. విప్రుడు అంటే బ్రాహ్మణుడు అనేది రూఢ్యర్థం. శాస్త్ర సిద్ధాంత ప్రవర్తకుడు అనేది యౌగికార్థం. అగ్రజన్ముడు అంటే ముందు పుట్టినవాడు అనేది యౌగికార్థం. బ్రాహ్మణుడు అనేది రూఢ్యర్థం. మగువ అంటే స్త్రీ అనేది రూఢ్యర్థం. మగనాలు (భర్త కలిగినది) అనేది యౌగికార్థం. పదాల అర్థాలు ఎలా వుంటాయో తెలుపడం కొరకు ఇదంతా చర్చింపబడింది. దీనినలా వుంచితే యోగక్షేమాలలోని క్షేమం శుభమనే అర్థాన్నిస్తుంది. ఇది మొత్తం మీద సుఖసంతోషాలు, కుశలాదికము అనే అర్థాల్లో రూఢమైంది.

కాని యోగక్షేమాల యౌగికార్థం వేరు. శుక్లయజుర్వేదం పై పదాలను గూర్చి చేసిన బోధ ఇలా వుంది. దేనినైనా క్రొత్తదాన్ని పొందడం యోగం. దానిని కాపాడుకోవడం క్షేమం అని ప్రతిపాదించింది. నిజానికివే సరియైన అర్థాలు. కాని మనకు ఆ రెండు పదాలు కలసి, ఒక పదబంధమై, వాడుకలో సుఖసంతోషాలకు మారుగా నిలిచింది. అంటే యౌగికార్థ భావన విస్తృతిచెంది, పై భావనలో రూఢినిపొందింది. అర్థసంయోజన విషయం అలా వుంచితే. దీని వ్యవహారం, ఇలాంటి మరికొన్ని పదాల వాడుకవలన, ఆంధ్రులకు వేదాలతో, బ్రాహ్మణాలతో, ఆరణ్యకాలతో వున్న సంసర్గం బోధపడుతోంది. ఇంత సంసర్గముందంటే వాటిలో కొన్నింటి సృష్టిలోనైనా ఆంధ్రుల ప్రమేయముందనడం స్పష్టం.

## రామాయణంలో పిడకల వేట

ఏదైనా ఒక విషయాన్ని గూర్చి తీవ్రంగా, ఏకాగ్రతతో, దానిమీదే దృష్టి నిలిపి చర్చిస్తున్న సమయంలో, అందులో ఒకరు దానికి ఏమీ సంబంధం లేని విషయాన్ని, అప్రస్తుత విషయాన్ని చర్చలోకి తెస్తే; ఇప్పుడు మనం మాట్లాడుతున్న విషయం ఏమిటి? నీవు మాట్లాడుతున్న దేమిటి? నీ గోల అంతా రామాయణంలో పిడకల వేటలాగా వుంది అని, అతన్ని ఆక్షేపించడం జరుగుతుంది. అంటే, అది అసంగతమైన విషయమని చెప్పడం. ఏమిటి ఈ రామాయణంలోని పిడకల కథ? పిడకలు తెలుసుకదా. పేడతో, వంట కొరకు తయారు చేస్తారు. వాటికి రామాయణంతో సంబంధం ఏమిటి?

ఏమీ సంబంధం లేదు. సంబంధం లేదు కనుకనే పై విధమైన ఆక్షేపణ వచ్చింది. అయితే నిప్పు లేకుండా పొగ వస్తుందా? అంటే దీని వెనుక ఏదో చరిత్ర వుండాలి కదా! అదేమిటంటే – బౌద్ధ, జైనాలు బాగా ప్రాచుర్యంలో వున్న కాలంలో ఆ మతస్థులు రామాయణ, మహాభారతాల్లో, తమకు అనుగుణమైన గాథల్ని ప్రవేశపెట్టారు. అసలు వృత్తాంతాన్ని, తమకు అనుకూలించే రీతిలో మలుచుకున్నారు. అందులో భాగంగా బౌద్ధ త్రిపిటకాలను రామాయణ కథలో ప్రవేశపెట్టడం జరిగింది. ఆ పిటకాలు, వ్యవహారంలో పిడకలయ్యాయి. మరి 'వేట' సంగతేమిటంటే, అది వేట కాదు, వేటు. వేటు (పడు) అంటే దెబ్బ. అంతేగాక, దారి (సంభాషణను, వృత్తాంతాన్ని) మళ్ళించడం. అది వేటగా మారి, రామాయణంలో పిడకలవేటగా జన వ్యవహారంలో రూఢమైంది.

## అభ్యాసం

### I. వ్యాస రూప సమాధాన ప్రశ్నలు

1. యార్లగడ్డ తెలియచేసిన ఏవేని నాలుగు ముఖ్యమైన పదాలను వివరించండి?
2. 'మాటతీరు' ప్రాముఖ్యాన్ని వివరించండి?

### II. సంక్షిప్త రూప సమాధాన ప్రశ్నలు

1. మాటతీరు అంటే ఏమిటో వివరించండి?
2. అతలాకుతలాన్ని విశ్లేషించండి?
3. పంచామృతాల గురించి తెలియచేయండి?
4. యార్లగడ్డ బాలగంగాధరరావు గురించిన విశేషాలేమిటి?

### III. ఏక వాక్య / పద రూప సమాధాన ప్రశ్నలు

1. 'నామ విజ్ఞానం'పై ప్రత్యేక అధ్యయనం ఎవరు చేశారు?
2. మానవ సంబంధాలు దేనిపై ఆధారపడి ఉంటాయి?
3. 'మాటతీరు' గ్రంథ రచయిత ఎవరు?
4. మొత్తం లోకాలు ఎన్ని?
5. చేమకూర వేంకట కవి రచించిన కావ్యం ఏది?
6. అన్నం ఎవరి వల్ల లభిస్తుంది?

## కార్యాచరణ

❖ విద్యార్థులచేత ఇటువంటి కొన్ని పదాలను గుర్తింప చేయవచ్చు. వాటికి సంబంధించిన సమాచారాన్ని శాస్త్రీయంగా సేకరించినపుడు, అనేక కొత్త విషయాలు తెలిసే అవకాశం ఉంది.

❖ ❖ ❖

# వ్యాకరణాంశాలు - నైపుణ్యాలు


| | | | | |
|---|---|---|---|---|
| 1. | సంధులు | 93 | - | 96 |
| 2. | సమాసాలు | 97 | - | 100 |
| 3. | లేఖారచన | 101 | - | 105 |
| 4. | పద దోషాలు | 106 | - | 107 |
| 5. | స్థూల అవగాహన | 108 | - | 110 |
| 6. | అనువాదం | 111 | - | 112 |

# 1 సంధులు

'సంధి' అనగా కలయిక. సంధిలో రెండు పదాలు ఉంటాయి. మొదటి పదాన్ని పూర్వపదమనీ, రెండవ పదాన్ని పరపదం లేదా ఉత్తరపదమనీ అంటారు. చిన్నయసూరి 'బాలవ్యాకరణం'లో "పూర్వ పరస్వరంబులకు పరస్వరం బేకాదేశమగుట సంధి" అని నిర్వచించారు. స్వరమనగా అచ్చు. పూర్వ స్వరం అనగా పూర్వ పదంలో చివర ఉండే అచ్చు. అట్లే పర స్వరం అంటే పర పదం మొదట్లో ఉండే అచ్చు. సంధి జరిగినపుడు పూర్వ స్వరం లోపించి దాని స్థానంలో పర స్వరం ఏకాదేశంగా వస్తుందని సూత్రార్థం.

సంధులు ప్రధానంగా రెండు రకాలు.

I. తెలుగు సంధులు.

II. సంస్కృత సంధులు.

**I. తెలుగు సంధులు :** తెలుగు పదాల మధ్య జరిగేవి తెలుగు సంధులు. ఇవి అత్వ, ఇత్వ, ఉత్వ, యడాగమ, సరళాదేశ, గ, స, డ, ద, వాదేశం మొదలైనవి.

**1. అత్వ సంధి :** 'అత్తునకు సంధి బహుళముగానగు". 'అత్తు' అనగా హ్రస్వమైన 'అ' కారం. బహుళము అనగా సంధి నాలుగు రూపాలలో ఉండటం. 1. ప్రవృత్తి – సంధి తప్పనిసరిగా ఉండటం. దీనినే వ్యాకరణ పరిభాషలో 'ప్రవృత్తి' అంటారు. 2. 'అప్రవృత్తి' – అంటే సంధి జరగక పోవడం. 3. వైకల్పికం లేదా విభాష – అనగా సంధి జరగ వచ్చు, ఒక్కోసారి జరగక పోవచ్చు. 4. అన్యకార్యం – అనగా ఒక వ్యాకరణ కార్యం జరగవలసి ఉండగా మరో వ్యాకరణ కార్యం జరగడం.

| | | | |
|---|---|---|---|
| ఉదా : | *1. వంట | + ఆముదం | = వంటాముదం (ప్రవృత్తి) |
| | *2. దూత | + ఇతడు | = దూతయితడు (అప్రవృత్తి) |
| | 3. వేడుక | + ఎల్ల | = వేడుకెల్ల / వేడుకయెల్ల (విభాష) |
| | *4. ఒక | + ఒక | = ఒకానొక (అన్యకార్యం) |

**2. ఇత్వ సంధి :** "ఏమ్యాదులందలి యిత్తునకు సంధి వైకల్పికముగానగు". 'ఇత్తు' అనగా హ్రస్వమైన 'ఇ' కారం. ఏమ్యాదులు అనగా ఏమి, అది, ఇది, అవి, ఇవి, ఏది, ఏవి, మఱి, కి షష్ఠి మొదలైన రూపాలు. వైకల్పికం అనగా సంధి జరిగితే ఒక రూపం, జరగకుంటే మరో రూపం రావడం.

ఉదా : 1. కోరినవి + ఎల్ల = కోరినవెల్ల

2. అది + ఏమి = అదేమి

3. ఎఱిగించి + ఇతడు = ఎఱిగించి యితడు – ఇక్కడ సంధి జరగలేదు.

క్త్వార్థంబైన యిత్తునకు సంధి లేదు. 'క్త్వార్థము' అనగా భూతకాలపు అసమాపక క్రియ. కాబట్టి చివరి పదం 'యడాగమసంధి' అనే చెప్పాలి.

**3. ఉత్వ సంధి :** "ఉత్తునకచ్చు పరంబగునపుడు సంధియగు".

ఉదా : 1. శోకము + ఏల = శోకమేల

2. ఇట్లు + అనియె = ఇట్లనియె

3. ఒకడు + ఐనను = ఒకడైనను

4. కపాలము + ఒక్కటి = కపాలమొక్కటి

**4. యడాగమ సంధి :** "సంధిలేనిచోట స్వరంబుకంటెఁ బరంబైన స్వరంబునకు యడాగమంబగు."

ఉదా : 1. నీ + అనుజులు = నీయనుజులు

2. రోదసి + ఎల్ల = రోదసియెల్ల

**5. గ, స, డ, ద, వా దేశ సంధి :** "ప్రథమ మీది పరుషములకు గ, స, డ, ద, వ లు బహుళముగానగు".

'ప్రథమ' మీది అనగా ప్రథమా విభక్తి ప్రత్యయాలైన డు, ము, వు, లపై వచ్చిన పదాలు; వచ్చి లోపించినవి, ఉప విభక్తులైన ఇ, టి, తి వర్ణాలపై వచ్చిన క, చ, ట, త, పలకు గ, స, డ, ద, వ లు బహుళంగా వస్తాయి.

ఉదా : 1. అట్లు + కావున = అట్లుగావున

2. నగరంబు + చొచ్చి = నగరంబుసొచ్చి

*3. నీవు + టక్కరివి = నీవుడక్కరివి

4. రూపంబు + తాల్చి = రూపంబుదాల్చి

5. బలి + పెట్టి = బలివెట్టి

**6. ద్రుత ప్రకృతిక సంధి (సరళా దేశ సంధి) :**

(అ) "ద్రుత ప్రకృతికము మీది పరుషములకు సరళములగు".

'ద్రుతము' అనగా 'న' కారం. ద్రుతం చివరగల పదాలను ద్రుత ప్రకృతికాలు అంటారు. పరుషములు అనగా వర్గ ప్రథమాక్షరాలు (క, చ, ట, త, ప). సరళములు అనగా వర్గ తృతీయాక్షరాలు (గ, జ, డ, ద, బ).

(ఆ) “ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు, సంశ్లేషలు విభాషనగు”.

‘ఆదేశము’ అనగా ఒక వర్ణాన్ని తొలగించి మరో వర్ణం రావడం. ఇక్కడ మొదట ఉన్న పరుషాలను తొలగించి వచ్చి చేరిన సరళాలు ఆదేశ సరళాలు. బిందువు అనగా అనుస్వారం. అది పూర్ణానుస్వారం కావచ్చు. అర్ధానుస్వారం కావచ్చు. ‘సంశ్లేష’ అంటే మీది హల్లుతో కూడుకొని ఉన్నరూపం. ఉదా : న్గ, న్జ, న్ద మొదలైనవి. విభాష కాబట్టి ఏ రూపమైనా రావచ్చు.

| | | | | |
|---|---|---|---|---|
| ఉదా : | 1. డప్పిన్ | + కూలె | = | డప్పింగూలె |
| | 2. తాల్మిన్ | + చేసి | = | తాల్మిఁజేసి |
| | *3. చేసెన్ | + టక్కులు | = | చేసెండక్కులు |
| | 4. నుడువన్ | + తగునె | = | నుడువందగునె. |
| | 5. తోడన్ | + పుట్టువు | = | తోడంబుట్టువు. |

## II. సంస్కృత సంధులు :

సంధిలోని రెండు పదాలూ సంస్కృత భాషకు చెందినవైతే దానిని సంస్కృత సంధి అంటారు. వీటిలో ముఖ్యంగా మనం నేర్చుకోవలసినవి 1. సవర్ణదీర్ఘ సంధి, 2. గుణ సంధి, 3. వృద్ధి సంధి, 4. యణాదేశ సంధి.

**1. సవర్ణదీర్ఘ సంధి :** “అ, ఇ, ఉ, ఋ లకు సవర్ణములైన అచ్చులు పరమైనపుడు వాటి దీర్ఘములు ఏకాదేశముగా వచ్చును.” సవర్ణము అనగా అదే వర్ణము. ఉదా : ‘అ’ కు అ, ఆ; ‘ఇ’కి ఇ, ఈ లు సవర్ణాలు.

| | | | | |
|---|---|---|---|---|
| ఉదా : | 1. రూప | + అతిశయం | = | రూపాతిశయం |
| | 2. మహా | + ఆత్మ | = | మహాత్మ |
| | 3. కవి | + ఇంద్రుడు | = | కవీంద్రుడు |
| | 4. మృగ | + ఆదులు | = | మృగాదులు |
| | *5. భాను | + ఉదయం | = | భానూదయం |
| | *6. మాతృ | + ఋణం | = | మాతౄణం |

**2. గుణ సంధి :** “ ‘అ’కారమునకు ఇ, ఉ, ఋలు పరమైనప్పుడు క్రమంగా ఏ, ఓ, అర్ అనునవి ఏకాదేశమగును. ఏ, ఓ, అర్ లను గుణములు అంటారు.

‘అకారము’ అనగా హ్రస్వమైన ‘అ’ లేదా దీర్ఘం (ఆ) ఏదైనా కావచ్చు.

ఉదా : 1. నయన + ఇంద్రియం = నయనేంద్రియం

2. హిత + ఉక్తులు = హితోక్తులు

*3. మహా + ఋషి = మహర్షి

**3. వృద్ధి సంధి :** "అ"కారమునకు ఏ, ఐలు పరమైతే 'ఐ' కారమూ, ఓ, ఔలు పరమైతే 'ఔ' కారము. ఏకాదేశంగా వస్తాయి.

ఉదా : 1. ఆత్మ + ఏక = ఆత్మైక

*2. అష్ట + ఐశ్వర్యం = అష్టైశ్వర్యం

*3. మేఘ + ఓఘము = మేఘౌఘము

*4. వన + ఔషధి = వనౌషధి

**4. యణాదేశ సంధి :** ఇ, ఉ, ఋలకు అసవర్ణములైన అచ్చులు పరమైతే క్రమంగా య, వ, రలు ఏకాదేశమగును. య, వ, ర లను 'యణ్ణులు' అంటారు.

ఇ + అసవర్ణాచ్చు = య్

ఉ + అసవర్ణాచ్చు = వ్

ఋ + అసవర్ణాచ్చు = ర్

ఉదా : 1. అతి + అంత = అత్యంత

2. వహ్ని + అస్త్రము = వహ్న్యస్త్రము

*3. మధు + అరి = మధ్వరి

*4. పితృ + అంశ = పిత్రంశ

**గమనిక**

*** గుర్తు ఉన్న పదాలు వాచకంలో లేనివని గ్రహించాలి.**

# 2 సమాసాలు

వేరు వేరు అర్థాలు కలిగిన రెండు పదాలు కలిసి ఒకే పదంగా ఏర్పడితే దానిని 'సమాసం' అంటారు. దీనినే పరవస్తు చిన్నయసూరి బాలవ్యాకరణంలో "సమర్థంబులగు పదంబు లేకపదంబగుట సమాసంబు" అని నిర్వచించారు.

ఉదా : 'రాజు', 'ఆజ్ఞ' అనేవి రెండు వేరు వేరు పదాలు. వాటికి వేరు వేరు అర్థాలున్నాయి. ఆ రెండు పదాలు కలిసి 'రాజాజ్ఞ' అనే సమాసం ఏర్పడుతుంది.

**విగ్రహ వాక్యం :** రెండు పదాలను సమాసంగా చేసినపుడు, ఆ సమాసాల మధ్య లోపించిన విభక్తి ప్రత్యయాలను చేర్చి, సమాసం యొక్క అర్థాన్ని వివరించడాన్ని 'విగ్రహ వాక్యం' అంటారు.

ఉదా : 'రాజాజ్ఞ' అన్న సమాసానికి 'రాజు యొక్క ఆజ్ఞ' అనేది విగ్రహ వాక్యం.

**పూర్వపదం :** సమాసం లోని మొదటి పదాన్ని 'పూర్వపదం' అంటారు.

ఉదా : 'రాజాజ్ఞ' అనే సమాసంలో 'రాజు' అనేది పూర్వపదం.

**ఉత్తరపదం :** సమాసంలోని రెండవ పదాన్ని 'ఉత్తర పదం' లేదా 'పరపదం' అంటారు. పై ఉదాహరణలో 'ఆజ్ఞ' అనేది 'ఉత్తర పదం' లేదా 'పరపదం'.

సమాసాలు ప్రధానంగా మూడు రకాలు. I. తత్పురుషం, II. బహువ్రీహి, III. ద్వంద్వం.

**I. తత్పురుషం :** ఉత్తర పదం యొక్క అర్థం ప్రధానంగా గల సమాసం తత్పురుషం. ఇది వ్యధికరణం, సమానాధికరణం అని రెండు రకాలు.

**1. వ్యధికరణం :** ద్వితీయాది విభక్తులకు మీది పదంతో చేసే సమాసాన్ని 'వ్యధికరణం' అంటారు. ఇదే తత్పురుష సమాసం. ఇవి ప్రథమా తత్పురుషం, ద్వితీయా తత్పురుషం, తృతీయా తత్పురుషం, చతుర్థీ తత్పురుషం, పంచమీ తత్పురుషం, షష్ఠీ తత్పురుషం, సప్తమీ తత్పురుషం మొదలైనవి.

**అ. ప్రథమా తత్పురుష సమాసం :**

ఉదా : * మధ్యాహ్నం – అహ్నము యొక్క మధ్య భాగం.

* నడిరేయి – రేయి యొక్క నడిమి భాగం.

**ఆ. ద్వితీయా తత్పురుష సమాసం :**

ఉదా : కోదండధరుడు – కోదండమును ధరించినవాడు.

**ఇ. తృతీయా తత్పురుష సమాసం :**

ఉదా : పుష్పవర్షం – పుష్పములతో వర్షం.

ధనాధికుడు – ధనము చేత అధికుడు.

**ఈ. చతుర్థీ తత్పురుష సమాసం :**

ఉదా : వేటకుక్కలు – వేట కొరకు కుక్కలు.

భిక్షాపాత్ర – భిక్ష కొరకు పాత్ర.

**ఉ. పంచమీ తత్పురుష సమాసం :**

ఉదా : ఆనంద బాష్పములు – ఆనందం వలన బాష్పములు.

క్రోధోద్రేకి – క్రోధము వలన ఉద్రేకి.

**ఊ. షష్ఠీ తత్పురుష సమాసం :**

ఉదా : మృగశ్రేణి – మృగముల యొక్క శ్రేణి.

కపాల మోక్షం – కపాలమునకు మోక్షం.

**ఋ. సప్తమీ తత్పురుష సమాసం :**

ఉదా : కార్యశూరులు – కార్యమందు శూరులు.

రౌరవబాధలు – రౌరవము నందలి బాధలు.

**ౠ. నఞ్ తత్పురుష సమాసం :** విగ్రహ వాక్యంలో 'కానిది', 'లేనిది' అనే వ్యతిరేక అర్థాన్ని కలిగి ఉంటే దాన్ని 'నఞ్ తత్పురుష సమాసం' అంటారు.

ఉదా : అసత్యము – సత్యము కానిది.

అభాగ్యము – భాగ్యము లేనిది.

**2. సమానాధికరణం :** విశేషణానికి విశేష్యంతో జరిగే సమాసం సమానాధికరణం. 'విశేష్యం' అనగా నామ వాచకం. ఈ సమాసాన్నే 'కర్మధారయం' అని కూడా అంటారు. ఇవి విశేషణ పూర్వ పదం, విశేషణ ఉత్తర పదం, విశేషణ ఉభయ పదం, ఉపమాన పూర్వ పదం, ఉపమాన ఉత్తర పదం అని ఐదు రకాలు.

అ. ***విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం :*** ఈ సమాసంలో విశేషణం పూర్వ పదంగా ఉంటుంది. ఉత్తర పదంలో విశేష్యం ఉంటుంది.

ఉదా : నల్లపూసలు – నల్లనివైన పూసలు.

క్రొత్త నెత్తురు – క్రొత్తదైన నెత్తురు.

ఆ. ***విశేషణ ఉత్తర పద కర్మధారయ సమాసం :*** దీనిలో విశేషణం ఉత్తర పదంలో ఉంటుంది. పూర్వ పదంలో నామ వాచకం ఉంటుంది.

ఉదా : పురుషవరుడు – శ్రేష్ఠుడైన పురుషుడు.

రాక్షసాధముడు – అధముడైన రాక్షసుడు.

ఇ. ***విశేషణ ఉభయ పద కర్మధారయ సమాసం :*** ఈ సమాసంలో పూర్వోత్తర పదాలు రెండూ విశేషణాలై ఉంటాయి.

ఉదా : శీతోష్ణం – శీతమును, ఉష్ణమును

ఉ. ***ఉపమాన పూర్వ పద కర్మధారయ సమాసం :*** దీనిలో ఉపమానం పూర్వ పదంలో ఉంటుంది. ఉత్తర పదంలో నామవాచకం ఉంటుంది. ఉపమానం అనగా పోల్చే వస్తువు.

ఉదా : * చిగురుకేలు – చిగురులాంటి కేలు.

* కమలనయనాలు – కమలము వంటి నయనాలు.

ఊ. ***ఉపమాన ఉత్తర పద కర్మధారయ సమాసం :*** దీనిలో ఉపమానం ఉత్తర పదంలోనూ, నామవాచకం పూర్వ పదంలోనూ ఉంటాయి.

ఉదా : * ముఖ కమలము – కమలము వంటి ముఖము.

* పాదాంబుజములు – అంబుజముల వంటి పాదాలు.

**3. ద్విగు సమాసం :** 'సంఖ్యాపూర్వకం ద్విగువు'. ద్విగు సమాసంలో పూర్వ పదంలో సంఖ్యావాచకాలు, ఉత్తర పదంలో నామవాచకాలు ఉంటాయి.

ఉదా : నలుదిక్కులు – నాలుగు అను సంఖ్యగల దిక్కులు.

ఆరుకోట్లు – ఆరు అను సంఖ్యగల కోట్లు.

**4. సంభావనా పూర్వ పద కర్మధారయ సమాసం :** ఈ సమాసం పూర్వపదంలో సంజ్ఞా నామవాచకాన్ని కలిగి ఉంటుంది.

ఉదా : తుంగభద్రానది – తుంగభద్ర అను పేరుగల నది

నేరేడు పండ్లు – నేరేడు అను పేరుగల పండ్లు

**5. అవధారణ పూర్వ పద కర్మధారయ సమాసం :** దీనిని 'రూపక సమాసం' అని కూడా అంటారు. 'అవధారణం' అంటే 'నిర్ధారించుట' అని అర్థం. 'రూపకం' అంటే ఆరోపించటం అని అర్థం. ఉపమాన ధర్మాన్ని ఉపమేయమందు ఆరోపించటాన్ని 'రూపక సమాసం' అంటారు.

ఉదా : ధైర్యలత – ధైర్యము అనెడి లత.

ప్రకృతి రంగము – ప్రకృతి అనెడి రంగము.

**II. బహువ్రీహి సమాసం :** 'అన్య పదార్థ ప్రధానం బహువ్రీహి' అని నిర్వచనం. అనగా సమాస పదంలోని అర్థం కాకుండా ఇతర (అన్య) అర్థం స్ఫురించడమే బహువ్రీహి. దీని విగ్రహ వాక్యంలో కలది; కలవాడు అనే రూపాలను మనం గమనించవచ్చు.

ఉదా : దశాననుండు – పది ముఖములు కలవాడు.

కంఠేకాలుడు – కంఠమందు నలుపు కలవాడు.

**III. ద్వంద్వ సమాసం :** 'ఉభయపదార్థ ప్రధానం ద్వంద్వం'. అంటే సమాస పదంలో ఇచ్చిన రెండు పదాల అర్థాలు ప్రధానంగా కలిగింది. ఈ సమాసంలోని రెండు పదాలూ నామ వాచకాలై ఉంటాయి.

ఉదా : తల్లిదండ్రులు – తల్లీ, తండ్రీ (లేక) తల్లి మరియు తండ్రి (లేక) తల్లియును, తండ్రియును.

మూడు విగ్రహవాక్యాలూ సరైనవే.

శార్దూలక్రోడములు – శార్దూలము మరియు క్రోడము.

**గమనిక**

*** గుర్తు ఉన్న పదాలు వాచకంలో లేనివని గ్రహించాలి.**

❖ ❖ ❖

# 3 లేఖా రచన

లేఖ అంటే జాబు, ఉత్తరం. లేఖ లిఖిత సంప్రదాయానికి చెందింది. ఒక చోట నుండి మరో చోటుకు, ఒక వ్యక్తి నుండి మరొక వ్యక్తికి సమాచారాన్ని చేరవేయడానికి ఉపయోగపడే రచనా మాధ్యమం లేఖ. 'ఉత్తరం రాయడం ఒక కళ. ఆత్మీయతకు చిహ్నంగా, మర్యాదస్తుల లక్షణంగా, అవసరానికి బంధువుగా, ఆవేశానికి ఆయుధంగా, ప్రేమకు కానుకగా ఉత్తరాలు ఉపయోగపడుతున్నాయి.

**లేఖ స్వరూపాన్ని పరిశీలిస్తే ప్రధానంగా దృష్టిలో పెట్టుకోవలసిన అంశాలు ఇవి –**

1. ఉత్తరం రాసే వారి చిరునామా, తేది.
2. సంబోధన (పిలుపు)
3. ఉత్తరంలో చెప్పదలుచుకున్న ప్రధాన విషయం
4. ముగింపు
5. లేఖ రాసిన వారి సంతకం
6. ఎవరికి రాస్తున్నామో వారి చిరునామా

## 1. ఉత్తరం రాసే వారి చిరునామా, తేది

ఎవరు లేఖను రాస్తున్నారో వారి చిరునామా లేఖ పైభాగంలో కుడి పక్కన రాయాలి. సంక్షిప్తంగా ఉత్తరం ఎక్కడి నుంచి రాస్తున్నామో ఆ ప్రదేశం పేరు రాసినా సరిపోతుంది. లేఖా రచనలో విరామ చిహ్నాలకు ప్రాధాన్యం ఉంటుంది. దాని కింద తేదీని తప్పని సరిగా రాయాలి. చిరునామా రాసేటప్పుడు వారి పేరు తర్వాత కామా, ఊరిపేరు తరువాత కామా, ఆనాటి తేదీ తరువాత ముగింపు చుక్క (ఫుల్‌స్టాప్) ఉండాలి.

## 2. సంబోధన (పిలుపు)

లేఖ ఎవరికి రాస్తున్నామో వారిని సంబోధిస్తూ ఎడమ వైపు రాయాలి. మనం లేఖ రాస్తున్న వారితో ఉన్న అనుబంధాన్ని బట్టి సంబోధన మారుతూ ఉంటుంది. తల్లిదండ్రులకు రాసే సందర్భంలో ప్రారంభంలో భాగంగా –

పూజ్యులయిన నాన్న గారికి / అమ్మగారికి అనీ

స్నేహితులకైతే – ప్రియ మిత్రునికి / ప్రాణస్నేహితునికి / ప్రియమైన రవికి అనీ

పరిచయం లేని వారికి, అధికారులకు – అయ్యా / అమ్మా అని సంబోధించాలి.

అంతగా పరిచయం లేని మిత్రులకు ఉత్తరం రాసేటపుడు పేరుకు ముందు శ్రీ / శ్రీమతి / కుమారి లాంటివి చేర్చాలి. బంధువుల విషయంలో 'ప్రియమైన అన్నయ్యకు / తమ్మునికి / అక్కయ్యకు / మామయ్యకు / చెల్లికి అని పేర్కొనాలి.

మనం ఉత్తరం రాస్తున్న వారికి మనతో ఉన్న అనుబంధాన్ని బట్టి సంబోధన మారుతూ ఉంటుంది.

వివాహిత స్త్రీలకు 'శ్రీమతి', అవివాహిత స్త్రీలకు 'కుమారి', చిన్నపిల్లలకు 'చిరంజీవి' అని సంబోధించి రాయాలి. అధికారులకు రాసే లేఖల్లో గౌరవ్యులైన, మహారాజశ్రీ, మాన్యశ్రీ అనీ సంబోధన అవసరం.

సంబోధన ఉత్తరం ఎడమవైపు ఉంటుంది. దీని తర్వాత కామాను ఉంచాలి.

### 3. ఉత్తరంలో చెప్పదలచుకున్న ప్రధాన విషయం

సంబోధన క్రిందుగా కొంచెం కుడివైపు నుంచి ప్రధాన విషయాన్ని ప్రారంభించాలి. వ్యక్తిగత ఉత్తరాల్లో తమకంటే పెద్దలైన వారికి వందనాలు, నమస్కారాలు; చిన్నవారికి దీవెనలు, ఆశీస్సులు తెలియ చేయాలి. క్షేమ సమాచారాలు ఇచ్చి పుచ్చుకోవడం తెలుగువారి సంప్రదాయం. అధికారిక ఉత్తరాల్లో అవసరం లేదు.

'ప్రధాన విషయం' అంశంలో భాష సరళంగా ఉండాలి. విషయం సూటిగా, సంక్షిప్తంగా ఉండాలి. విషయం విస్తారమైనపుడు పేరాలుగా విభజించి రాయాలి.

### 4. ముగింపు

లేఖ ముగింపులో కుడివైపున అనుబంధాన్ని, గౌరవాన్ని సూచించే పదం రాయాలి. ఉదాహరణకు స్నేహితునికైతే ప్రియమిత్రుడు / ప్రాణస్నేహితుడు వంటి పదాలు, తల్లిదండ్రులకైతే ప్రియ పుత్రుడు / ప్రియ పుత్రిక వంటి పదాలు రాయాలి. వ్యాపార, వ్యవహార, ఆధికారిక లేఖల్లో భవదీయుడు, విశ్వాస పాత్రుడు లాంటి పదబంధాలను ఉపయోగించాలి.

### 5. లేఖ రాసిన వారి సంతకం

ముగింపుకి కొంచెం క్రింద ఉత్తరం రాసేవారు సంతకం చేయాలి. అవసరం మేరకు సంతకం క్రింద కుండలీకరణంలో ఉత్తరం రాసే వారి పూర్తి పేరు విడి అక్షరాల్లో రాయాలి.

### 6. ఎవరికి రాస్తున్నామో వారి చిరునామా

ముగింపు తర్వాత ఉత్తరం రాసిన వారి సంతకం ఉంటుంది కదా. దానికి ఒక గీత క్రింద ఎడమ వైపున ఉత్తరం ఎవరికి చేరాలో వారి పూర్తి చిరునామా పిన్‌కోడ్‌తో సహా రాయాలి. అధికారులకు రాసే ఉత్తరంలో ప్రారంభంలో ఎడమవైపు ఉత్తరం రాసే వాళ్ళ చిరునామా, దాని క్రింద ఎవరికి ఉత్తరం రాస్తామో వారి చిరునామా రాయాల్సి ఉంటుంది.

### పరీక్షలో తీసుకోవలసిన జాగ్రత్తలు

1. పరీక్షల్లో భాగంగా లేఖా రచనలో అభ్యర్థుల హాల్‌టికెట్ నెంబరు, చరవాణి నంబరు, పేరు, చిరునామాలు వ్రాయ కూడదు. వాటి స్థానంలో ××××××× అని రాసి విరామ చిహ్నాలు ఉపయోగించాలి.

2. ఉద్యోగాల కోసం, పత్రికలకు కథలు, కవితలు రాసేటపుడు జవాబు కోసం స్టాంపులు అంటించిన కవరు జత చేయాలి.

# నమూనా లేఖలు

## 1. తల్లి దండ్రులకు లేఖ

స్థలం :×××××××××,
తేది :×× ×× ××××.

పూజ్యులైన అమ్మకీ, నాన్నకీ,

నమస్కారాలు, నేను ఇక్కడ క్షేమంగా ఉన్నాను. మీరు కూడా క్షేమంగా ఉన్నారని భావిస్తున్నాను. నేను బాగా చదువుకుంటున్నాను. చెల్లెలు ఎలా చదువుతుంది?

మా గురువులు చెప్పే పాఠాలు క్షుణ్ణంగా చదువుకుంటున్నాను. ప్రతిరోజూ గ్రంథాలయానికి వెళ్ళి దినపత్రికలు చూసిన తరువాత, అక్కడే కూర్చొని మూడుగంటల పాటు తరగతి పాఠ్యాంశాలను అధ్యయనం చేస్తున్నాను. మార్చిలో పబ్లిక్ పరీక్షలు ఉన్నందున ఎక్కువసేపు కష్టపడుతున్నాను. నాకు మిమ్మల్ని చూడాలనుంది. పరీక్షలు ప్రారంభమయ్యేలోపు మీరు తప్పకుండా రావాలి. నాయనమ్మ, తాతయ్యలకు నా నమస్కారాలు తెలియజేయగలరు. నా స్నేహితులు రాజు, కస్తూరిలను అడిగినట్లు చెప్పగలరు. మీ రాక కోసం ఎదురుచూస్తుంటాను.

నమస్సులతో

చిరునామా
×××××××××××,
×××××××××,
××××××××,
××××××.

మీ కుమారుడు
××××××.

## 2. కళాశాల ప్రధానాచార్యులు గారికి లేఖ

స్థలం :×××××××××,
తేది :×× ×× ××××.

గౌరవనీయులైన ప్రధానాచార్యులుగారికి,
ప్రభుత్వ జూనియర్ కళాశాల,
...............................,
విశాఖపట్నం.

మహోదయులకు!

విషయం : బదిలీ పత్రం (టి.సి.) గురించి విజ్ఞప్తి.

నేను ఈ కళాశాలలో బైపిసి గ్రూపులో 2016 – 18 విద్యా సంవత్సరాలలో ఇంటర్మీడియట్ విద్య పూర్తి చేశాను. మొదటి శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాను. విశాఖపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'బియస్సీ'లో ప్రవేశానికి అనుమతి నిస్తూ ప్రధానాచార్యుల నుండి ఉత్తరం వచ్చింది. కాబట్టి డిగ్రీలో చేరుతున్నందున బదిలీ పత్రం ఇవ్వవలసిందిగా ప్రార్థన.

ధన్యవాదాలు,

భవదీయుడు
××××××××××.

## 3. స్నేహితులకు లేఖ

స్థలం : xxxxxxxxx,
తేది : xx xx xxxx.

ప్రియమైన విద్యకు,

నేను క్షేమం. నువ్వెలా ఉన్నావు? ఎలా చదువుతున్నావు? నేను బాగా చదువుతున్నాను. మా కళాశాలలో కమల, విమల అనే ఇద్దరు ఈమధ్యనే స్నేహితులయ్యారు. ముగ్గురం కలసి బాగా సంతోషంగా కబుర్లు చెప్పుకుంటాం; కలిసే చదువుకుంటాం. మా కళాశాలలో ప్రతి శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొంటాం. నువ్వు చెప్పినట్లుగా ఎన్.సి.సి.లో చేరాను. మా కళాశాలలో వ్యాసరచన, వక్తృత్వపోటీలు నిర్వహించారు. వక్తృత్వపోటీలో ప్రథమబహుమతి లభించింది. క్రీడలలో కూడా 200 మీ. పరుగు పందెంలో రెండవ స్థానం లభించింది. జనవరి 26, గణతంత్ర దినోత్సవం నాడు ఈ బహుమతులు ఇస్తామని ప్రధానాచార్యులు చెప్పారు. ఇటీవలే క్షేత్ర పర్యటనలో భాగంగా మా అధ్యాపకులు 'అమరావతి'కి తీసుకువెళ్లారు. అక్కడ నూతన రాజధాని నిర్మాణం, అమరావతిలోని చారిత్రక ప్రదేశాలను చూసి చాలా విషయాలు తెలుసుకున్నాను.

మనం ఉన్నత విద్య చదవాలని లక్ష్యం పెట్టుకున్న విషయం గుర్తు ఉంది కదా. నేను బాగా కష్టపడుతున్నాను. మా తల్లిదండ్రులు ఎంతో కష్టపడి నన్ను చదివిస్తున్నారు. నేను బాగా చదివి నా తల్లిదండ్రులను బాగా చూసుకుంటాను. నేను చదువుకున్న కళాశాలకు మంచి పేరు తీసుకొస్తాను. నీవు కూడా కష్టపడి చదివి మంచి మార్కులు సాధించగలవని నా నమ్మకం.

ఈ మధ్య మన ఊరికి వెళ్ళావా? మనస్నేహితులు లక్ష్మి, సరస్వతి ఎలా ఉన్నారు? మీ అమ్మా, నాన్నలను అడిగినట్లు చెప్పు. మీ కళాశాల విశేషాలతో నీ ఉత్తరం కోసం ఎదురుచూస్తుంటాను.

ఇట్లు
నీ స్నేహితురాలు
xxxxxxxxxx .

చిరునామా
xxxxxxxxxxx ,
xxxxxxxxx ,
xxxxxxxx ,
xxxxxx.

## 4. అధికారికి లేఖ

స్థలం : xxxxxxxxx,
తేది : xx xx xxxx.

స్థానిక డివిజనల్ ఇంజనీర్ గారికి,
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ శాఖ,
కర్నూలు.

విషయం : ఇంటర్ పబ్లిక్ పరీక్షల సమయంలో విద్యుత్ కోత నివారణ గురించి

అయ్యా/ అమ్మా!

నమస్కారాలు. నేను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాను. మార్చి నెలలో మాకు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభమవబోతున్నాయి. ఇప్పుడే విద్యుత్ కోతలు ప్రారంభించారు. ఫిబ్రవరిలోనే ఇలా ఉంటే మార్చిలో విద్యుత్ కోతలు ఎలా ఉంటాయో అర్థమవుతుంది. గత సంవత్సరం పదవ తరగతి పరీక్షలప్పుడు విద్యుత్ లేకపోవడం వల్ల చదువుకి అంతరాయం కల్గింది. కనీసం ఈ సారైనా విద్యుత్ కోత లేకుండా చూడగలరు. రాత్రి పూట అయినా కోతలేకుండా ఉంటే చదువుకోగల్గుతాము. నాలాంటి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తగిన నిర్ణయం తీసుకోగలరని మనవి.

ఇట్లు
తమ విధేయుడు.
××××××××××

చిరునామా
×××××××××× ,
×××××××××× ,
××××××××××.

## 5. ఉద్యోగానికి దరఖాస్తు లేఖ

స్థలం :×××××××××,
తేది :×× ×× ××××.

శ్రీయుత గౌరవనీయులైన
....................గారికి

విషయం : ఉద్యోగం కొరకు విజ్ఞప్తి
ఉటంకింపు: తేది. ×× ×× ×××× నాటి ఎంప్లాయిమెంట్ వార్తాపత్రికలో ప్రకటన ప్రకారం.

అయ్యా!

నమస్కారం. తేది. ×× ×× ×××× నాటి ఎంప్లాయిమెంట్ వార్తా పత్రికలోని ఉద్యోగప్రకటన ఆధారంగా ఉద్యోగానికి దరఖాస్తు చేస్తున్నాను. మీరు ప్రకటించినట్లుగా కావలసిన విద్యార్హతలు నాకున్నాయి. విద్యార్హతలకు సంబంధించిన పత్రాలను ఈ దరఖాస్తుతో జత పరుస్తున్నాను. వాటిని పరిశీలించగలరని విజ్ఞప్తి.

ఉద్యోగం ఇచ్చినట్లైతే మీ సంస్థకు గౌరవం పెరిగేలా విధులు నిర్వర్తిస్తాననీ, సంస్థ అభివృద్ధికి నిరంతరం సహకరిస్తానని, సవినయంగా మనవి చేస్తున్నాను. నాకు ఈ ఉద్యోగ అవకాశం కల్పిస్తారని ఆశిస్తున్నాను.

కృతజ్ఞతలతో,

భవదీయ,
×××××××××× .

జతచేస్తున్న పత్రాలు :
1. విద్యార్హతల ధ్రువీకరణ పత్రాలు,
2. అనుభవ పత్రం,
3. నివాస పత్రం,
4. జనన ధ్రువీకరణ పత్రం.

❖ ❖ ❖

# 4 పదదోషాలు

భాషా నైపుణ్యాలు నాలుగు. 1. శ్రవణం 2. భాషణం 3. పఠనం 4. లేఖనం. భాషా, నైపుణ్యాలలో చివరది క్లిష్టమైంది లేఖనం. రాసేటప్పుడు చాలా జాగ్రత్త వహించాలి. పదదోషాలు లేకుండా రాయాలి. రాసేటప్పుడు అచ్చులకు బదులు హల్లులు, హల్లులకు బదులు అచ్చులు రాయడం సహజంగా కనిపిస్తుంది. అలాగే మహాప్రాణాలకు బదులు అల్పప్రాణాలు, అల్పప్రాణాలకు బదులు మహాప్రాణాలు రాయడం చేస్తుంటారు. ఇలాచేయడం వల్ల అర్థంలో మార్పు వస్తుందని గ్రహించాలి.

శ, ష, స లను తారుమారుచేసి రాయడం, వట్రుసుడికి బదులు, 'రు' రాయడం, 'రు'కి బదులు వట్రుసుడి రాయడం వంటి దోషాలు ఎక్కువగా లేఖనంలో కన్పిస్తున్నాయి. కొన్నింటిని పరిశీలిద్దాం.

### 1. అచ్చుకి బదులు హల్లులు రాయడం

| అసాధు రూపాలు (తప్పులు) | - | సాధు రూపాలు (ఒప్పులు) |
|---|---|---|
| వుడుత | - | ఉడుత |
| వూరు | - | ఊరు |
| యెలుక | - | ఎలుక |
| వున్నది | - | ఉన్నది |

### 2. హల్లులకి బదులు అచ్చులు రాయడం

| అసాధు రూపాలు (తప్పులు) | - | సాధు రూపాలు (ఒప్పులు) |
|---|---|---|
| ఎంకమ్మ | - | వెంకమ్మ |
| ఎనక | - | వెనక |
| ఇనాయక | - | వినాయక |

### 3. మహాప్రాణాలకు బదులు అల్పప్రాణాలు రాయడం

మహాప్రాణాలు:- వర్గాక్షరాలలో, ద్వితీయాక్షరాలైన ఖ ఛ ఠ థ ఫ, లూ, చతుర్థాక్షరాలైన ఘ ఝ ఢ ధ భ లూ మహాప్రాణాలు

అల్పప్రాణాలు:- వర్గాక్షరాలలో ప్రథమాక్షరాలైన క చ ట త ప లూ, తృతీయాక్షరాలైన గ జ డ ద బ లూ అల్పప్రాణాలు

| అసాధు రూపాలు (తప్పులు)– | | సాధు రూపాలు (ఒప్పులు) |
|---|---|---|
| బోదన | – | బోధన |
| బేదం | – | భేదం |
| ప్రబందం | – | ప్రబంధం |
| బాష | – | భాష |

**4. అల్పప్రాణాలకు బదులు మహాప్రాణాలు రావడం**

| అసాధు రూపాలు (తప్పులు)– | | సాధు రూపాలు (ఒప్పులు) |
|---|---|---|
| భాధ | – | బాధ |
| ఉచ్ఛారణ | – | ఉచ్చారణ |
| జంభుకం | – | జంబుకం |
| శబ్ధం | – | శబ్దం |

**5. శ, ష, స ల తారుమారు**

| అసాధు రూపాలు (తప్పులు)– | | సాధు రూపాలు (ఒప్పులు) |
|---|---|---|
| సివుడు | – | శివుడు |
| స్మశానం | – | శ్మశానం |
| సనివారం | – | శనివారం |

**6. వట్రుసుడికి ( ృ ) బదులు 'రు' రాయడం**

| అసాధు రూపాలు (తప్పులు)– | | సాధు రూపాలు (ఒప్పులు) |
|---|---|---|
| ద్రుశ్యం | – | దృశ్యం |
| క్రుష్ణుడు | – | కృష్ణుడు |

**7. 'రు' కి బదులు వట్రుసుడి రాయడం**

| అసాధు రూపాలు (తప్పులు)– | | సాధు రూపాలు (ఒప్పులు) |
|---|---|---|
| దృతం | – | ద్రుతం |
| కౄారుడు | – | క్రూరుడు |

❖ ❖ ❖

# 5 స్థూల అవగాహన

## 1. మన తెలుగు

తెలుగు భాషకు ఆంధ్రభాష, తెనుగు భాష అనే పేర్లు కూడా ఉన్నాయి. మన తెలుగు కవులు 'దేశ భాషలందు తెలుగు లెస్స' అని తెలుగును ప్రస్తుతించారు. తమిళ జాతీయ కవి సుబ్రహ్మణ్య భారతి మన తెలుగును 'సుందర తెలుంగు' అని కొనియాడారు. క్రీ.శ. 15వ శతాబ్దపు ఇటలీ యాత్రికుడు నికోలో డి కాంటే తెలుగు భాషను 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అని ప్రశంసించాడు. తెలుగు అజంత భాష. కాబట్టి నాద సౌష్ఠవం కలిగి, సంగీతానికి అనుకూలంగా ఉంటుంది. ఈ విధంగా వేనోళ్ళ ప్రస్తుతించబడిన మధురమైన మన తెలుగు భాషను పరభాషా ప్రభావాలతో మనవారే చిన్న చూపు చూడడం చాలా దురదృష్టకర విషయం. తెలుగు భాషను రక్షించుకొని దానికి పూర్వ వైభవాన్ని తీసుకు రావడం తెలుగువారందరి ప్రథమ కర్తవ్యం.

**ప్రశ్నలు :**

1. నికోలో డి కాంటే ఎవరు?
2. తెలుగు భాషకు గల ఇతర పేర్లేవి?
3. తెలుగుభాషను నికోలో డి కాంటే ఏమని కీర్తించాడు?
4. 'సుందర తెలుంగు' అని తెలుగును ఎవరు ప్రశంసించారు?
5. తెలుగువారి ప్రథమ కర్తవ్యం ఏమిటి?

## 2. సావిత్రిబాయి పూలే

ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని ప్రగాఢంగా నమ్మిన మహిళ సావిత్రిబాయి పూలే. ఈమె సామాజికంగా వెనుకబడిన వర్ణాల, నిమ్న వర్ణాల అభ్యున్నతికి కృషి చేసిన జ్యోతిరావ్ పూలే భార్య. భర్తతో కలసి ఈమె 1848 జనవరి 1న పూనేలో దేశంలోనే మొదటిసారిగా బాలికల పాఠశాలను ప్రారంభించారు. కులవ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా ఉద్యమించారు. శూద్రుల, దళితుల, మహిళల సకల హక్కులకోసం పోరాటం చేయటం తమ బాధ్యతగా ఆ దంపతులు విశ్వసించారు. ఈమె మహారాష్ట్రలోని సతారా జిల్లాలో నయాగావ్ అనే గ్రామంలో 1831, జనవరి 3న జన్మించారు. సావిత్రీబాయి 1848లోనే దేశంలో విద్యా ఉద్యమం ప్రారంభించిన మొదటి మహిళా ఉపాధ్యాయురాలు. సావిత్రిబాయి పూలే జన్మదినాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'మహిళా ఉపాధ్యాయ దినోత్సవం'గా ప్రకటించింది.

**ప్రశ్నలు :**

1. సావిత్రిబాయి పూలే ఎప్పుడు జన్మించారు?
2. సావిత్రిబాయి పూలే భర్తపేరేమిటి?
3. సావిత్రిబాయి పూలే జన్మదిన ప్రత్యేకత ఏమిటి?
4. మనదేశంలో మొదటి బాలికల పాఠశాల ఎప్పుడు ప్రారంభమైంది?
5. స్త్రీ విముక్తి ఎలా సాధ్యపడుతుందని సావిత్రిబాయి పూలే భావించారు?

## 3. అవయవ దానం

ప్రాణాలను కాపాడేందుకు లేదా పరిశోధనల నిమిత్తం ఒక వ్యక్తి నుంచి మరొక వ్యక్తికి శరీర భాగాలను అమరుస్తారు. బ్రతికి ఉన్న వారినుంచి కొన్ని శరీర భాగాలను తీయడం ఒక పద్ధతి; చనిపోయిన వారినుంచి కొన్ని శరీర భాగాలను వెలికితీసి మరొకరికి అమర్చడం ఇంకో పద్ధతి. అవయవ దానం ప్రక్రియ కుటుంబ సభ్యుల ఆమోదంతో పూర్తి పారదర్శకంగా జరుగుతుంది. ప్రపంచంలో తొలిసారిగా 1954లో అవయవ దానం చేసిన దాత 'రొనాల్డ్ లీ హెరిక్'. అతి వృద్ధ అవయవ దాతగా స్కాట్లాండ్ దేశానికి చెందిన 107 సంవత్సరాల మహిళ తన కంటిలోని కార్నియాను దానం చేయడం ద్వారా చరిత్రలో నిలిచారు. అవయవ దానాన్ని వ్యాపారంగా నిర్వహించడం చట్టప్రకారం నేరం. ఆగష్టు 13వ తేదీని అవయవ దాన దినోత్సవంగా ప్రకటించి, ప్రపంచ వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

**ప్రశ్నలు :**

1. ప్రపంచంలో తొలి అవయవ దాత ఎవరు?
2. అవయవ దానానికి ఎవరి అనుమతి తప్పనిసరి?
3. అతివృద్ధ అవయవ దాత ఏ దేశానికి చెందినవారు? వారి వయస్సు ఎంత?
4. అవయవ దానాన్ని ఏవిధంగా నిర్వహించరాదు?
5. ఏ రోజును అవయవ దాన దినంగా ప్రకటించారు?

## 4. శంకరంబాడి సుందరాచారి

తెలుగు ప్రజల రాష్ట్ర గీతంగా ప్రసిద్ధి చెందిన 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' అనే గేయాన్ని రచించి, తెలుగు తల్లి వైభవాన్ని కీర్తించినవారు శంకరంబాడి సుందరాచారి. కమలమ్మ, రాజగోపాలాచారి దంపతులకు ప్రథమ సంతానంగా శంకరంబాడి తిరుపతిలో జన్మించారు. విద్యాభ్యాసం పూర్తయిన తరువాత అనేక రకాల ఉద్యోగాలు చేశారు. బాల్యం నుంచే కవిత్వం పట్ల ఆసక్తి పెంచుకున్న సుందరాచారి అనేక కావ్యాలు, వచన రచనలు, పల్లెపదాలు, నాటకాలు రచించారు. హెచ్.ఎం. రెడ్డిగారి 'దీనబంధు' చిత్రం కోసం శంకరంబాడి 'మాతెలుగు తల్లికి' అనే గీతాన్ని రాశారు. అయితే దీన్ని ఆ చిత్రంలో వినియోగించలేదు. 1975లో హైదరాబాదులో

మొదటి ప్రపంచ తెలుగు మహాసభలు జరిగాయి. ఆ సందర్భంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'మా తెలుగు తల్లికి' అనే గీతాన్ని రాష్ట్ర గీతంగా నిర్ణయించింది. ఆ సభలో టంగుటూరి సూర్యకుమారి లండను నుండి వచ్చి ఈ గీతాన్ని ఆలపించారు. ఈ గేయ రచనకుగాను రాష్ట్ర ప్రభుత్వం శంకరంబాడి జీవించినంత కాలం నెలకు రెండు వందల యాభై రూపాయల గౌరవవేతనాన్ని మంజూరు చేసింది. 1957లోనే శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం శంకరంబాడికి 'ప్రసన్నకవి' అని బిరుదునిచ్చి సత్కరించింది.

**ప్రశ్నలు :**

1. 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' గీతాన్ని మొదటగా ఎవరు ఆలపించారు?
2. శంకరంబాడి తల్లిదండ్రుల పేర్లేమిటి?
3. శంకరంబాడికి గల బిరుదు ఏమిటి?
4. మొదటి ప్రపంచ తెలుగు మహాసభలు ఎక్కడ జరిగాయి?
5. శంకరంబాడి సుందరాచారి రచించిన ప్రసిద్ధ గేయమేది?

## 5. తోలుబొమ్మలాట

మన జానపద కళల్లో ఒకానొక విశిష్టమైన కళారూపం తోలుబొమ్మలాట. ఇది క్రీ.పూ. 3వ శతాబ్దం నాటికే చాలా ప్రచారంలో ఉన్నట్లు తెలుస్తుంది. తెల్లటి వస్త్రాన్ని తెరగా అమర్చి, దానిపై దీపం కాంతిలో బొమ్మల నీడలను పడేటట్లు చేసి బొమ్మలాటను ప్రదర్శిస్తారు. ఈ తోలు బొమ్మలు ఆంధ్రదేశంలోని ప్రాచీన ఓడరేవుల ద్వారా భారతీయులతో పాటు విదేశాలకు వెళ్ళాయి. నేడు పాశ్చాత్య దేశాలలో గొప్పగా చెప్పుకొనే ఛాయా ప్రదర్శనలకు ఈ తోలు బొమ్మలే మూలం. మన దేశంలో ఈ ఆటలో భారత, రామాయణ కథలను ఎక్కువగా ప్రదర్శిస్తుంటారు. ఈ ఆటలోని అల్లాటప్పగాడు, బంగారక్క, జుట్టుపోలిగాడు, కేతిగాడు వంటి హాస్యపాత్రలు గ్రామీణుల మనసులపై విశేషమైన ముద్రవేశాయి. వినోదాన్ని, విజ్ఞానాన్ని పంచే ఇటువంటి కళారూపాలను కాపాడుకోవడం మన ప్రస్తుత కర్తవ్యం.

**ప్రశ్నలు :**

1. తోలు బొమ్మలాటలో ఏ కథలు ఎక్కువగా ప్రదర్శిస్తారు?
2. తోలు బొమ్మలాటలు ఎప్పటి నుండి ప్రచారంలో ఉన్నాయి?
3. విదేశాలలోని ఛాయా ప్రదర్శనకు మూలమేది?
4. మన ప్రస్తుత కర్తవ్యం ఏమిటి?
5. తోలు బొమ్మలాటలోని హాస్యపాత్ర లేవి?

❖ ❖ ❖

# 6 అనువాదం

అనువాదం అంటే కేవలం భాషాంతరీకరణ మాత్రమే కాదు. ఆంగ్లం నుండి తెలుగులోకి అనువాదం చేసేటప్పుడు మూలాన్ని అర్థం చేసుకోవడానికి తగినంత ఆంగ్ల భాషా పరిజ్ఞానం అవసరం. తర్వాత మూలంలో ఉండే భావాన్ని తెలుగులోకి మార్చాలంటే తెలుగుభాషతో చక్కని పరిచయం ఉండాలి. అప్పుడే అనువాదం సహజంగా ఉంటుంది. అనువాదం విషయంలో విద్యార్థులు కొన్ని సూచనలు పాటించాలి.

1. ఆంగ్ల మూలాన్ని కనీసం రెండు మూడుసార్లు శ్రద్ధగా చదివి, అందులోని విషయాన్ని అర్థం చేసుకోవాలి.
2. మూలంలోని కఠిన పదాలకు తెలుగులో అర్థాన్ని నిర్ణయించుకోవాలి. ఒకవేళ ఏదైనా ఆంగ్ల పదానికి అర్థం తెలియకపోతే ఆ పదానికి ముందు, తరువాత ఉన్న పదాల ఆధారంగా సంబంధిత వాక్యం యొక్క అర్థాన్ని ఊహించాలి.
3. ఆంగ్ల మూలాన్ని అర్థం చేసుకొన్న తర్వాత అనువాదం చేయడానికి ప్రయత్నించాలి. మూలంలో ఎన్ని పదాలు, వాక్యాలు ఉన్నాయో, అన్నే వాక్యాలు తెలుగులో ఉండాలనే నియమం లేదు.
4. ఆంగ్లంలోని భావానికి అనుగుణంగా చక్కని తెలుగు వాక్య నిర్మాణంతో, నుడికారాలకు అనుగుణంగా అనువాదం చేయాలి.

## అభ్యాసానికి కొన్ని ఆంగ్ల వాక్యాలు

1. Health is Wealth.
   ఆరోగ్యమే మహాభాగ్యం.

2. Speak kind and sweet words.
   మృదువుగా, తీయగా మాట్లాడు.

3. Indian Constitution was written by Dr. B. R. Ambedker.
   డా॥ బి.ఆర్. అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రచించారు.

4. New Delhi is the capital of India.
   భారతదేశానికి రాజధాని న్యూఢిల్లీ.

5. Sardar Vallabhai Patel is the first Home- Minister of India.
   భారతదేశానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ మొదటి గృహ మంత్రి.

6. Smt. M. S. Subbalakshmi is a great musician.
   శ్రీమతి యమ్. ఎస్. సుబ్బలక్ష్మి గొప్ప సంగీత విద్వాంసురాలు.

7. The train had left before I reached the station.

నేను స్టేషన్‌కు చేరుకునే లోపలే రైలు వెళ్ళిపోయింది.

8. He speaks Telugu as well as English.

అతను తెలుగుతో పాటు ఆంగ్లం కూడా మాట్లాడతాడు.

9. C.P. Brown Library is located at Kadapa.

సి.పి. బ్రౌన్ గ్రంథాలయం కడపలో ఉంది.

10. Ramayana was written by Valmiki.

రామాయణాన్ని వాల్మీకి రచించారు.

11. Honesty is the best policy.

నిజాయతీ చాలా ఉత్తమమైన గుణం.

12. A friend in need is a friend indeed.

కష్టాలలో ఆదుకున్న వాడే నిజమైన స్నేహితుడు.

13. The Peacock is our National bird.

నెమలి మన జాతీయ పక్షి.

14. White revolution has increased the milk production.

శ్వేత విప్లవం పాల ఉత్పత్తిని పెంచింది.

15. Mount Everest is the highest peak in the World.

ఎవరెస్ట్ శిఖరం ప్రపంచంలోకెల్లా ఎత్తైనది.

16. Dams are built to reserve water.

నీటిని నిలువ చేయటానికి ఆనకట్టలను నిర్మిస్తారు.

17. The Constitution of India is the longest written Constitution in the World.

భారత రాజ్యాంగం ప్రపంచంలోకెల్లా అతిపెద్ద లిఖిత రాజ్యాంగం.

18. The Earth revolves around the Sun.

భూమి సూర్యుని చుట్టూ తిరుగుతుంది.

19. Amaravathi is the Capital of Andhra Pradesh.

అమరావతి ఆంధ్ర ప్రదేశ్ రాజధాని.

20. All that glitters is not gold.

మెరిసేదంతా బంగారం కాదు.


❖ ❖ ❖

# కథానందనం

## ఉపవాచకం


| | | |
|---|---|---|
| 1. | కుంకుడాకు | 115 - 120 |
| 2. | అంపకం | 121 - 124 |
| 3. | ఊతకర్ర | 125 - 130 |
| 4. | సౌందర్యం | 131 - 138 |
| 5. | ఎచ్చరిక | 139 - 147 |
| 6. | దహేజ్ | 148 - 155 |

# 1 కుంకుడాకు



- చాగంటి సోమయాజులు

## రచయిత పరిచయం

తొలితరం తెలుగు కథకుల్లో ప్రముఖులు చాగంటి సోమయాజులు. వీరు 'చాసో' గా సుప్రసిద్ధులు. ఆధునిక జీవితాన్ని సామాజిక వాస్తవిక దృష్టితో ఆవిష్కరించిన చాసో 17.01.1915న శ్రీకాకుళంలో జన్మించారు. వీరి కన్న తల్లిదండ్రులు కానుకొలను తులశమ్మ, లక్ష్మీనారాయణ శర్మ. చాసో అసలు పేరు కానుకొలను నరహరి రావు. విజయనగరం లోని చాగంటి తులశమ్మ, బాపిరాజు దంపతుల ఇంటికి చాసో దత్త పుత్రుడుగా వచ్చారు. దీనితో వీరి ఇంటి పేరే కాక మనిషి పేరు కూడా మారి పోయింది. కానుకొలను నరహరిరావు కాస్తా చాగంటి సోమయాజులయ్యారు.

చాసో రాసిన కథలు రాశిలో తక్కువే అయినా; వాసిలో ఎక్కువే. వీరు కథకులకే కథకులుగా; కథకుల పాలిటి ఒక గ్రంథాలయంగా; ఒక ప్రయోగశాలగా ప్రస్తుతించ బడ్డారు. వీరి మొత్తం కథలు 40 దాకా ఉన్నాయి. ఇవన్నీ సుప్రసిద్ధమైనవే. వీరి తొలి కథ 'చిన్నాజీ' (1942). వీరి కథల్లో కర్మసిద్ధాంతం (1942), బొండుమల్లెలు (1943), ఎందుకు పారేస్తాను నాన్నా (1944), వాయులీనం (1952) వంటివి బాగా ప్రాచుర్యం పొందాయి.

అభ్యుదయ రచయితల సంఘం స్థాపకుల్లో చాసో ఒకరు. జీవితాంతం అభ్యుదయ వాదిగా జీవించిన చాసో మరణానంతరం తనశరీరాన్ని వైద్యశాస్త్ర పరిశోధనలకు వినియోగించాలని ఆశించారు. 02.01.1994న చాసో చెన్నైలో మరణించినపుడు కుటుంబసభ్యులు వీరి ఆకాంక్షను గౌరవించారు; చెన్నై లోని రామచంద్ర వైద్య కళాశాలకు వీరి పార్థివ దేహాన్ని అందచేశారు.

తెలుగు కథాసాహిత్యంలో తొలిసారిగా మార్క్సిజాన్ని ప్రవేశపెట్టిన వారు చాసో. "ధన స్వామ్యం"లో ధనం ఏవిధంగా మనుషుల్ని అవినీతి పరుల్ని చేస్తుందో, మానవత్వాన్ని ఎలా మంట కలుపుతుందో, బూర్జువా సమాజంలో మనుషులు ఎలా సంచరిస్తారో చాసో కథలు అద్దం పడతాయి. 'కుంకుడాకు' కథలోనూ ఈ దృశ్యమే కన్పిస్తుంది. ఈ సామాజిక వాస్తవాన్ని విద్యార్థులకు ప్రదర్శింప చేయడమే ఈ పాఠ్యభాగం ఉద్దేశం. ఈ కథ 1943 ఫిబ్రవరి, 'అరసం' ప్రత్యేక సంచికలో తొలిసారిగా ప్రచురించబడింది. కొన్ని చాసో కథలు భారతీయ భాషల్లోకేకాక; రష్యన్ భాషలోకి కూడా అనువాదమయ్యాయి. ప్రస్తుత పాఠ్యభాగం 'కుంకుడాకు' 'చాసో కథలు' (రెండవ కూర్పు, విశాలాంధ్ర ప్రచురణలు, 1997) సంపుటి నుంచి స్వీకరించబడింది.

## పాఠ్యభాగం

అప్పలనాయుడు కూతురు పారమ్మ. చినదేముడు కూతురు గవిరి. ఊళ్లోంచి పొలాల్లోకి పోతున్నారు. అప్పలనాయుడు మోతుబరి రైతు. చినదేముడు గోచిపాతరాయుడు. అంచేత పారమ్మ చింకి పరికిణీ కట్టుకుంది. గావంచా పైటేసుకుంది. గవిరి గోచీ పెట్టుకుంది. కంపకట్టా, తట్టా పట్టుకుంది. పారమ్మ మెళ్లో పగడాలున్నాయి. చేతులకీ కాళ్లకీ సిల్వరు కడియాలున్నాయి. గవిరి ముక్కు గోక్కుంది. దాని ముక్కులో రాగి కాడలున్నాయి. పారమ్మ ముక్కుకీ చెవులకీ బంగారపు కాడలున్నాయి.

"సెడ్డ రుసిగా వుంది"! అన్నాది పారమ్మ.

"ఏటి?" అనడిగింది గవిరి.

"ఊరగాయ."

"ఎక్కిడిది?"

"మాయయ్యకి బుగతగోరిచ్చారు."

వాళ్లయ్య అప్పలనాయుడు. అంచేత బుగతలు ఊరగాయ అడిగినా ఇస్తారు. కూర అడిగినా ఇస్తారు.

"నాను రెయ్యిలు నంచుకొన్నాను" అన్నాది గవిరి. అబద్ధమాడింది. గొప్పకి అబద్ధమాడింది. పారమ్మ చింకి పరికిణీని మచ్చరంతో చూసి తన గోచీని తడువుకొంది.

"ఓగొప్ప! ఎవిడికీ తెల్దనుకున్నావు గావాలె, గింజలు నేక రేత్రి మీరగ్గేసుకోనేదు. మాయయ్య సెప్పినాడు. తాగడానికి దప్పికనేదు. రెయ్యిలు నంచుకొంది! రెయ్యిలు!" అని పారమ్మ కిందికీ, మీదికీ చేతులు ఎగరేస్తూ ఎత్తిపొడిచింది.

"నిన్న రేతిరి మీకూ కూడునేదు!"అన్నాది గవిరి. మాటకి మాట అన్నాది.

"నిన్న రేతిరి మాకు కూడు నేదూ? ఓసినీ! ఎవిడు సెప్పినాడు? మాయమ్మనడుగు. రేత్రి మునేళం సేపల పులుసు, వొరన్నం తిన్నాం" అన్నాది పారమ్మ. వాళ్లయ్య ఊళ్లోకి పెద్దనాయుడు. సంతకెళ్లి పులుసులోకి మునేళం, ఇగురికి చందువాలు తెచ్చాడు.

చిన్నబోయి గవిరి కళ్లాలవేపు తిరిగింది. పారమ్మ కూడా చేతులూపుకుంటూ వెంబడించింది. ఊళ్లో బడిపిల్లలు ప్రార్థన మొదలెట్టారు.

"తల్లీ నిన్ను దలంచి" అని మేష్టారందిస్తున్నారు.

"తల్లీ నిన్నుదలంచి!" అని పిల్లలంతా ఒక్కమాటు వూరెగరగొడుతున్నారు.

పారమ్మా, గవిరి గోర్జలోకెళ్లారు. తోవ చూచుకుంటూ జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. గోర్జ వార వేళ్లూ, వూడలూ దించి మొగలి పెండి ఉన్నాది.

"నాను మంగళారం బడికెళతాను. ఆయేల మంచిరోజు. మేష్టేరు గోరు పంపమంటే మాయయ్య పంపుతానన్నాడు" అన్నాది పారమ్మ.

"ఎందుకూ ముష్టి సదువూ?" అన్నాది గవిరి.

"సదువెందుకా? ఇను ఇను! ఎనాగ పాడుతున్నారో!"

"మాయయ్యనీ మేష్టేరుగోరడిగినారు. కూలి సేసుకొనే వోళ్లకి సదువెందుకన్నాడు మాయయ్య."

"అవును. మీయయ్య కూలోడు. మాయయ్య నాయుడు".

గవిరికి గొంతుకలోకి ఏడుపూను, కళ్లలోకి నీళ్లు తోసుకొచ్చాయి.

బలుసుతుప్పలో ఊసరవిల్లి పెద్దచప్పుడు చేసింది. కోరడిలో పచ్చగన్నేరు నిండా పువ్వులు పూసి గోర్జనిండా సగం రాల్చింది. పార నాలుగు పువ్వులు ఏరి తల్లో దోపుకుంది. గవిరి కూడా ఏరుకుని తురుముకుంది. దాని చేతికి ముంతంత ముచ్చటిముడి తగిలింది.

"ఒలే పారా! సూడు, నాకు ముంతంత కొప్పున్నాది. నీ బుర్రమీద ఎంట్రుకలే నేవు" అన్నాది. పారమ్మ చూసింది.

"కొబ్బరిపీచు నాగెందుకు? నా తల సూడు, ఎంత నూన రాసుకున్నానో, నీ తలకి నూనే నేదు!" అన్నాది పార.

బడిపిల్లలింకా గొంతుక చించుకుంటూ ప్రార్థిస్తున్నారు. పార కూనిరాగం తీసింది.

"సరస్వతీ!" అన్నారు బడిపిల్లలు.

"సరస్పతీ!" అన్నాది పార.

"నమస్తుభ్యం!" అన్నారు బడిపిల్లలు.

"నమత్తుబ్బెం!" అన్నాది పార.

"నువ్వు పాడుకుంటూ కూకో, నాను కంపలేరుకోవాలి" అని గవిరి కళ్లాలకి తోవతీసింది. పార వెంటపడ్డాది. గవిరి ప్రాయం ఎనిమిదేళ్లు. కాని దాని నెత్తిమీద కొండంత సంసార భారం వున్నాది. చిన్న దాక నెత్తి మీద పెట్టుకొని కోనేటికిపోయి ఇంటికిపడే నీళ్లలో సగం అదే మొయ్యాలి. తట్ట పట్టుకొని పెండిలంటా, తోటలంటా పోయి ఆకూ అలమా, కర్రా కంపా ఏరి ఇంటికి ఒక పూటకి సరిపడే వంటచెరుకు తేవాలి. ఆ బాధ్యతలని గవిరి మోసివున్నాది.

పక్క పొలాల్లో పెసరకాయలు గుత్తులు గుత్తులున్నాయి. పారమ్మ నాలుగు మొక్కలు పీకి కాయలేరుకు తింటున్నాది. గవిరి కడుపులో కాల్తున్నాది. దానికి ఆవేళ దప్పికలేదు. అంతకు ముందు రాత్రికూడా తిండిలేదు.

"ఓలమ్మ ఆకలేవ్!" అంటూ రాత్రెంతో ఏడ్చింది.

"ఓ లేడవకే, ఇంట్లో ఏటీనేదు!" అని ఓదార్చింది వాళ్లమ్మ. ఏడ్చి ఏడ్చి ఆఖరికి ఆకలినిద్ర పట్టిపోయింది.

గవిరి కూలివాడి కూతురు. పొలాల్లోపడి దొంగతనంగా తినడాన్కి ధైర్యం చాలదు. నాదారులు ఆ రకం చిన్న దొంగతనాలు చేస్తే పెద్ద నేరాలు అవుతాయి. ఉన్నవాళ్లు చేస్తే కమ్ముకుపోతుంది. పారమ్మ చెట్లు పీకి తోవ కడాకూ తింటున్నాది. దానికి నిర్భయం.

"ఆళ్లు సూస్తే టెంకి మాడుతుందిలే!" అన్నాది గవిరి.

"సూసినోడెవడు? సూసినా నానప్పలనాయుడు బొట్టిని. ఆళ్ల మొకం ఏటంటారు?" అన్నాది పార. గవిరి కడుపులో కరకరలాడుతోంది. దాని కళ్లకి సత్తు గిన్నెతో నిండా గిన్నెడు గంజి, నంచుకోడాన్కి ఎండుమిరపకాయ కనపడ్డాయి. ఎక్కణ్ణుంచి వస్తాయి? వాళ్ళయ్య చినదేముడు కూలి ఏమైనా తెస్తే రాత్రికి తిండి, లేకపోతే ఆ రోజు పస్తు పడుకోవలసినదే. గవిరి కళ్లు నీళ్లతో నిండిపోయాయి.

కుంకుడుచెట్టు తోవనిండా ఆకులు రాల్చింది. కుంకుడాకుల్ని చూచి గవిరి ఆకలి మర్చిపోయింది. అన్ని ఆకుల్లోకి కుంకుడాకులు చాలా దళసరివి. నాలుగాకులు ఏరితే తట్ట నిండుతుంది. ఆకులన్నీ తుడిచి తట్టలోకెత్తి నొక్కి కుక్కింది. దాని బాధ్యత ఆ పూటకి అయిపోయింది. తట్ట బరువుగా నిండింది. దాని గుండె తేలికైంది. ఇద్దరూ ఇంటికి తోవతీశారు. పారమ్మ పొలికేకలేస్తూ బయలుదేరింది. కాంభుక్తగారి కల్లాం చేరుకున్నారు. కల్లాం వారనుంచి చింతకింద పడిపోతున్నారు. వాళ్ల ముందు టప్పని ఏదో పడ్డాది.

"ఓలమ్మో తేలు!" అని తుళ్ళిపడి కేకేసింది పార.

"తేలు కాదు పీత!" అన్నాది గవిరి.

ఏ కొంగ నోట్లోంచి పడ్డాదో! గవిరి చింతలలోకి చూచింది. చింతల శిఖరాలు కొంగలతో నిండివున్నాయి. చింతలు తెల్లతామరలని పూసినట్టున్నాయి.

"ఎన్ని సింతకాయలో!" అంది గవిరి. పారమ్మ తలెత్తి చూసింది. దాని నోరూరింది. రాళ్ళు తీసి కొట్టింది. మూడు కాయలు రాలాయి. ఒక కాయ కొరుక్కుని రెండు కాయలు చింకి పరికిణీలో దోపుకొంది.

"ఒలే పారా! నాకో కాయెట్టవు?" అనడిగింది గవిరి.

"నువ్వూ కావలిస్తే కొట్టుకో!" అన్నాది పార.

"ఒలే! ఒలే!" అని గవిరి ప్రాధేయ పడ్డాది.

"అయేటి రాళ్లు!" అని పారమ్మ తోవతీసింది. తలెత్తి చూచింది గవిరి. కొడవళ్ళలాగ ఊగుతూ కాయలు వేళ్లాడుతున్నాయి. గవిరి భయపడుతూ ఒక రాయి విసిరింది. ఆ రాయి దబ్బున కిందపడ్డాది. ఆ చప్పుడికి మరింత భయపడిపోయి నాలుగు పక్కలా చూసింది. పారమ్మ మళ్లా పెసరకాయలకి పొలాల్లో పడ్డాది. గవిరి మరోరాయి విసిరింది. కాయలు రాలకపోయినా పెద్ద ఎండుకొమ్మ చెట్టుమీంచి గలగల మని జారి కిందపడ్డాది.

గవిరి చంకలు కొట్టుకుంది. "అయిదెబ్బ!" అని ఆ కంపమీదికి ఒక్క పిల్లిగంతు వేసింది. కొమ్మని చితుకులుగా విరిచి తట్టమీద పెట్టుకొంది.

"ఎవరక్కడ?" అని కళ్లంలోంచి కేక వచ్చింది. గవిరికా కేక పిడుగులాగ వినపడ్డాది. కళ్లంలోకి చూసింది. ఎదురుగుండా కాంభుక్తగారు నిలబడి ఉన్నారు. ఓచేత్తో నెత్తి గోక్కుంటూ, రెండో చేతినేమి చేయడమో తెలియక గవిరి వింటిల్లి బద్దలాగా వొంగిపోయింది. భుక్తగారు చింతనిప్పులు రాలుస్తూ చూస్తున్నారు.

"పొయినోకి" అని వొణుకుతూ గవిరి చెప్పింది.

భుక్తగారు మీదకెళ్ళాడు. తట్టలో కుంకుడాకు, మీదకి చింతకంపా కనపడ్డాయి. అతను పాంకోడిమీద కాలు ఎత్తాడు. తట్టని సత్తువపూరా "కిక్కు" తన్నేడు. తట్టా ఆకు ఎగిరిపోయాయి. గవిరి గడగడ లాడుతూ తట్ట తీసుకుంది. మళ్లా ఆకు నొర్లుకోపోయింది.

"ఏమే! ఇంకా ఎత్తుతున్నా?" అని ఉరిమాడు. గవిరి ఏరిన ఆ చెత్తకి ఎంత విలువ ఉన్నాదో అతనికి తెలియదు. చినదేముడి సంసారానికి కూతురు గవిరి తెచ్చిపెట్టే ఆ చెత్తకి ఆర్థికంగా ఎంతయినా విలువ ఉన్నాది. ఆ చెత్త ఒక పూట పొయ్యిలోకి చాలు. ఆ సంగతి గవిరికి తెలుసు. ఎనిమిదేళ్ళదే అయినా ఆ బాధ్యతను గవిరి ఎరిగి ఉన్నాది. ఆ చెత్తకోసం దాని ప్రాణం తహతహ లాడిపోయింది.

"బాబుగోరూ! మరెప్పుడూ రాను" అని ప్రాధేయపడ్డాది. భుక్తగారు చుట్టూ చూశారు. ఆయనకి ఆచోకీ దొరికింది.

"ఏమిటీ! ఆ తుప్పవార దాచేవ్?" అనడిగాడు.

"నానేటీ దాచనేదు". అతను చేతికర్రతో తుప్పనెత్తాడు. దానివార తట్టెడు పేడ బైటపడ్డాది. దొంగతనం బైటపడి పోయింది. చేతికర్రతోటొక్కటి వెన్నుమీద వేసి "ఏమిటే అది?" అనడిగాడు.

"అమ్మోయ్! సచ్చిపోనాను. నానుకాదు బాబోయి!" అంటూ ఏడుపు మొదలెట్టింది.

"ఇంకెవరే నువ్వుకాక?" అని మరొక్కటేశాడు. గవిరికి బోధపడలేదు. తనుకాదని చెప్పినా భుక్త తంతున్నాడు. అతనికి చెప్తే తెలియదేమా అని నివ్వెర పడ్డాది.

ఏడుపులోంచి పౌరుష మొచ్చింది. అది దొంగ కాదు. అంచేత ధైర్యమొచ్చింది. ఏడుపు మాని కళ్లెర్రజేసి, "నానుకాదు నా తట్టా సేతులూ సూడు" అన్నాది. దాని తట్టకీ చేతులకీ పేడమరకలు లేవు. కళ్ళంలో పాలేర్లే ఆ పని చేశారు. కాని భుక్తగారి బుద్ధి వికసించలేదు. కర్రతో మరొక్కటేశాడు. అది వక్కాణించి చెప్పినా కొట్టాడు.

"నానుకాదు. ఓలమ్మో నానుకాదు. ఓరి కొడుకో!" అంటూ గవిరి తిట్లు ప్రారంభించి బూతుల్లోపడ్డాది. మహా మహా వాళ్లని పాతీసిన భుక్తగారిని గవిరిగుంట బూతులు తిట్టడం మొదలెట్టింది.

భుక్తగారు పాంకోడు తీసిపెట్టి విసిరాడు. దాని పిక్కమీద ఎమికెకి ఖట్టని తగిలింది. అది బోర్లాపడి మన్ను కరచుకొంది. పీక తెగ్గోసిన కోడి లాగ గిలగిల కొట్టుకొని చుట్టుకు పోయింది. దాంతోటిక భుక్తగారు సంతృప్తి పడి వెళ్లిపోయారు.

ఏడ్చి ఏడ్చి గవిరి కళ్లు తెరచింది. పొద్దు లేచిపోతోంది. బడిలో పిల్లలు ఎక్కాలు వల్లె వేస్తున్నారు.

"మూడేళ్లిరవైయ్యొకటీ!" అంటూ అంతా అరుస్తున్నారు. ఎక్కాలు పాడుతూ వల్లెవేస్తున్నారు.

గవిరి కళ్లాం లోకి చూసింది. ఎవరూ లేరు. కిందని విరజిమ్మివున్న కుంకుడాకుని కూడతీసింది. ఆకు వొదిలితే పొయ్యిలోకి సాధనం లేదు. తల్లీ తండ్రీ పొయ్యిమీదికి తేగలిగినా, తేలేకపోయినా గవిరి పొయ్యిలోకి తెచ్చితీరాలి.

"నీ సింత కంపలెవిడికీ అక్కరనేదు!" అని చింత కంపలు వొదిలేసింది. తట్ట నెత్తిన పెట్టుకొంది. కాలు మండిపోతోంది. అప్పుడు వొంగి దెబ్బని చూసుకుంది. ఎమికమీద పాంకోడు దెబ్బ పెద్ద బొప్పికట్టింది. బొప్పిమీద చిట్లి ఎర్రగా వుంది.

"ఓలమ్మో!" అంటూ మళ్లా ఉక్కిరిబిక్కిరిగా ఏడ్చుకుంటూ గోర్జలోకెళ్లింది. బడిపిల్లలింకా ఎక్కాలు పాడుతున్నారు.

"పదహారార్లు తొంభైయారు!" అని ఒకరు అరుస్తున్నారు.

"పదహారార్లు తొంభైయారు!" అని అంతా కలిసి పాడుతున్నారు.

## అభ్యాసం

**I. వ్యాస రూప సమాధాన ప్రశ్నలు**

1. 'కుంకుడాకు' కథా సారాంశాన్ని రాయండి?
2. 'కుంకుడాకు కథలోని సామాజిక, ఆర్థిక అంతరాలను వివరించండి?

### కొన్ని మాండలిక పదాలు - అర్థాలు

**గావంచా** = స్నానాలు చేసేటప్పుడు కట్టుకోడానికీ, తుడుచుకోడానికీ ఉపయోగించే వస్త్రం. మూడున్నర మూరలు వెడల్పు, ఐదారు మూరలు పొడవు ఉంటుంది. విజయనగరం దగ్గర ఉన్న జొన్నవలస ఈ గావంచాలకు ప్రసిద్ధి. ఉత్తరాంధ్ర ప్రాంతంలోనే కాక గోదావరి తీరంలోనూ ఈ పదం వ్యవహారంలో ఉంది. **బుగత** = భూస్వామి; **రెయ్యిలు** = రొయ్యలు (రైలును కూడా 'రెయ్యలు బండి' అని ఉత్తరాంధ్రలో వ్యవహరిస్తారు); **నేక** = లేక; **అగ్గేసుకోనేదు** = వండుకోలేదు, పొయ్యి రాజేసుకోలేదు; **మానేళం** = ఒక రకం చేప; **చందువాలు** = ఒక రకం చేప; **గోర్జ** = దారి. నీటి ప్రవాహం వల్ల ఈ దారులు ఏర్పడతాయి. బళ్ళు, మనుషుల రాకపోకలకు ఉపయోగపడతాయి. పక్క పక్క గ్రామాలకు వెళ్ళడానికి కూడా ఈ దారులను వినియోగిస్తారు; **పెండి** = కంచెలాంటిది; **మేష్టేరు గోరు** = మేష్టరుగారు, పంతులుగారు; **కోరడి** = కంచె, పెండె; **నాదారులు** = పేదవారు, దరిద్రులు; **టెంకి** = మాడు, తల వెనుక భాగం; **బొట్టె** = కూతురు, చిన్నపిల్ల; **కాంభుక్త** = పేరు; **పాంకోడి** = కర్ర, చెక్క చెప్పు; **సత్తువ పూరా** = శక్తికొద్దీ, బలంకొద్దీ; **వక్కాణించి** = వివరించి; **గుంట** = చిన్నపిల్ల, బాలిక; **పొయ్యిలోకి సాధనం** = వంట చెరుకు, పొయ్యిలోకి పుల్లలు;

**పీక తెగేసిన కోడి, సెడ్డ రుసి** – ఉత్తరాంధ్ర పలుకుబడులు.

❖ ❖ ❖

# 2

# అంపకం

**- సత్యం శంకరమంచి**



## రచయిత పరిచయం

మానవ జీవితంలోని సహజమైన అనుభవాలనూ, అనుభూతులనూ ఉదాత్త కథలుగా మలచడంలో గొప్ప పనితనం ప్రదర్శించిన కథకులు సత్యం శంకరమంచి. వీరు 03.03.1937 తేదీన గుంటూరు జిల్లా అమరావతిలో జన్మించారు. శేషమ్మ, కుటుంబరావులు వీరి తల్లి దండ్రులు.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్ర పట్టాపొందిన సత్యం శంకరమంచి అనేక మంచి రచనలు చేశారు. 'అమరావతి కథలు' సంపుటం ద్వారా గొప్ప కథకులుగా పేరు పొందారు. ఇతర ప్రక్రియల్లోనూ వీరి రచనా సామర్థ్యాన్ని ప్రకటించుకున్నారు. రేపటి దారి, సీత స్వగతాలు, ఆఖరి ప్రేమలేఖ, ఎడారిలో కలువపూలు, కార్తీక దీపాలు, 'హర హర మహాదేవ' అనేవి శంకరమంచి ఇతర రచనలు. ఇవికాక, ఇంతే సంగతులు, తథ్యము సుమతీ, ఎందరో మహానుభావులు అనే శీర్షికలతో కొన్ని పత్రికా రచనలను కూడా అందించారు. షేక్ జాన్సన్ శాస్త్రి, శారదానాథ్, సాయిరాం అనేవి శంకరమంచి కలం పేర్లు. ఉదాత్త రచయితగా విశేష ప్రాచుర్యం పొందిన శంకరమంచి 1987లో కన్ను మూశారు.

శంకరమంచి రచనల్లో 'అమరావతి కథలు'కు ప్రత్యేకగుర్తింపు ఉంది. రాష్ట్ర సాహిత్య అకాడమీ వారు 1979 లో ఈ కథా సంకలనానికి అవార్డును ప్రదానం చేశారు. ప్రఖ్యాత భారతీయ చలనచిత్ర దర్శకులు శ్యామ్ బెనగళ్ అమరావతి కథలను దూరదర్శన్‌లో ధారావాహికంగా ప్రదర్శించడం కోసం చిత్రీకరించారు. ప్రస్తుత పాఠ్యభాగం 'అంపకం' కథ కూడా 'అమరావతి కథలు' సంకలనం లోనిదే.

'అంపకం' కథ తండ్రీ కూతుళ్ళ అనుబంధాన్ని ఆవిష్కరిస్తుంది. కన్నకూతురిని ఎంత అల్లారు ముద్దుగా పెంచుకున్నా; పెళ్ళీడు వచ్చాక పరాయివాడికిచ్చి పెళ్ళిచేయాలి. అత్తగారింటికి కాపురానికి పంపాలి. ఆ సందర్భంలో వధువు తల్లిదండ్రుల అంతరంగం ఎంత ఉద్వేగానికి గురౌతుందో ఆవిష్కరించిన కథ ఇది. సహజమైన ఈ అనుబంధాలను విద్యార్థుల అనుభవంలోకి తీసుకొని రావడం; వారికి తల్లిదండ్రులపై ఉన్న ప్రేమను మరింత గట్టి పరచడం ఈ పాఠ్యభాగం ఉద్దేశం.

# పాఠ్యభాగం

శివయ్య తన ఒక్కగానొక్క కూతురు, సీతని అత్తవారింటికి పంపుతున్నాడు. పొద్దుట్నుంచి ఇల్లంతా మహా సందడిగా ఉంది. శివయ్య కాలుగాలిన పిల్లిలా బజారుకీ, ఇంటికీ ఒకే పరుగు.

'అరటిపళ్ళ గెల వచ్చిందా?'

'అరిసెలు మూట కట్టారా?'

'సున్ని ఉండల డబ్బా ఎక్కడ?' అంటూ ఇల్లంతా కదం తొక్కుతున్నాడు. శివయ్య భార్య పార్వతమ్మకి ఊపిరి సలపటంలేదు. ఎందరమ్మలక్కలు సాయం చేసినా వూరికే హైరానా పడిపోతూ గదులన్నీ చుట్టుముట్టి వస్తోంది.

సీతకి పట్టుచీర కట్టారు. పాదాల నిండా పసుపురాసి, పారాణి పెట్టి, నుదుట పెద్ద బొట్టు పెట్టి, బుగ్గన చాదుచుక్క అద్దారు. తోటి ఈడువాళ్ళు ఆటలు పట్టిస్తుంచే గదిలో పీటమీంచి లేచి ఇవతలకు రాలేదు. అంతా వెళ్ళిపోయినా తలవంచుకు పీటమీదే కూర్చుంది. పాదాలకున్న పసుపు, పట్టుచీర పూసుకుంటుంటే ఆలోచించుకుంటోంది.

"నేను వెళ్ళిపోతున్నాను. అమ్మని, నాన్నని విడిచి వెళ్ళిపోతున్నానా? ..." శివయ్య దొడ్లో వేపచెట్టుకానుకుని బెంబేలయిపోతున్నాడు. "తన తల్లి వెళ్ళిపోతోంది. తన యింటి దీపం వెళ్ళిపోతోంది... తన చిట్టితల్లి, తనని రోజూ పలకరించకపోతే తనకి ఎట్లా గడుస్తుంది?'

పదహారేళ్ళ క్రితం పురిటింట్లో చంటిపాప కెవ్వుమంటే మహాలక్ష్మి పుట్టిందన్నారు. ఆ క్షణం నుంచి శివయ్యకి, పాపకి ప్రాణం లంకె. పార్వతమ్మ పాలిచ్చి ఉయ్యాల్లో పడుకోబెట్టటమే తప్ప, సీత ఎప్పుడూ తండ్రి చేతుల్లోనే ఉండేది. తండ్రి చేతుల మీదే పెరిగింది. నాలుగేళ్ళు వచ్చాక బళ్ళో వేస్తుంటే వూరు వూరంతటినీ పిలిచాడు శివయ్య. పిల్లలందరికీ పలకా, బలపాలు, మిఠాయి పంచి పెట్టించాడు. బడినుంచి రావటం ఓ నిముషం ఆలస్యమైతే పరుగు పరుగున ఎదురువెళ్ళి భుజం మీద ఎక్కించుకుని తీసుకొచ్చేవాడు. వస్తూ వస్తూ సీత బళ్ళో కబుర్లన్నీ చెప్తుంటే శివయ్య ఆనందంగా ఊకొట్టేవాడు.

భోజనం ఎప్పుడూ ఇద్దరూ కలిసి చేయవలసిందే. కూతురికి ఏ కూర నచ్చిందో కనుక్కుని తనూ ఆ కూరే కలుపుకునేవాడు. అన్నాలయాక సన్నజాజి పందిరికింద శివయ్య పడుకుంటే సీత వెళ్ళి తండ్రి పక్కలో దూరేది. తండ్రి వొళ్ళో ముడుచుకు పడుకునేది. తండ్రిని కథలు చెప్పమని వేధించేది. శివయ్య తనకి తోచిన కథ చెప్తుంటే అంతలోనే నిద్రపోయేది. రెండు చేతులా తన్ని కావలించుకుని నిశ్చింతగా నిద్రపోయే కూతుర్ని చూస్తూ, పైనించి రాలుతున్న సన్నజాజి పూలనిచూస్తూ కళ్ళనీళ్ళయిపోయేవాడు శివయ్య.

మరి రేపట్నించి తనెవరికి కథ చెప్తాడు?

సన్నజాజి పూలు ఎవరిమీద రాల్తాయి?

తెల్లవారి నిద్ర లేస్తూనే అమ్మా అని కూతుర్ని పిలిచేవాడు. తన తల్లి ముఖం చూసుకుని ఆపైన లోకం ముఖం చూసేవాడు. స్నానం చేసి దేవుడికి పూజ చేసుకుని కూతురికి ముందు హారతి కళ్ళకద్ది ఆపైన తను అద్దుకునేవాడు.

తనిప్పుడు పొద్దున్నే లేవగానే ఎవర్ని పిలవాలి?

తన పూజకి పూలు, కర్పూరం ఎవరందిస్తారు?

సీత పెద్దదయి సంబంధం కుదిరి పెళ్ళి ముహూర్తం నిశ్చయమైనప్పుడు. తన బతుకులో జరిగే ఒక శుభకార్యం ఘనంగా జరుగుతున్నపుడు, అల్లుడికి కాళ్ళుకడిగి కన్యాదానం చేస్తుంటే తన బతుకంతా ధారపోస్తున్నట్ల నిపించింది శివయ్యకి.

వరండాలో ఎవరో అరుస్తున్నారు. బళ్ళు వచ్చాయి ఇంకా ఆలస్యం ఏవిటని, శివయ్య లేచి ఇంట్లోకి వచ్చాడు. బళ్ళల్లో సామాన్లు సర్దుతున్నారు. తన ఇంటినెవరో దోచుకుపోతున్నట్టుంది శివయ్యకు. ఒకొక్కరే బళ్ళు ఎక్కుతున్నారు. శివయ్య ఏర్పాట్లు ఏవీ చూడ్డం లేదు. గదులన్నీ పిచ్చిగా తిరుగుతున్నాడు. ఒక మూలగా పార్వతమ్మ కళ్ళొత్తుకుంటోంది. ఆవిడకి తిరిగే ఓపిక కూడా లేదు.

ప్రయాణమైన సీత అందరికంటె ఆఖరున వచ్చింది. పట్టుచీర! నగలు! మెళ్ళో గంధం. కాళ్ళకు పసుపు. నడుముకు వడ్డాణం. తండ్రి పాదాలకు వంగి నమస్కరించింది. పాదాలు పట్టుకు వదల్లేదు.

శివయ్య కూలబడి పోయాడు. సీత కళ్ళల్లోకి చూశాడు. "నా గుండె... నా ప్రాణం... నా నెత్తురు... నా రెండు కళ్ళూ నువ్వేనమ్మా... వెళ్ళిపోతున్నావా తల్లీ..." నోటమాట రావటంలేదు. కన్నీటి పొరల్లో సీత కన్పించటం లేదు.

"ఏవిటట్లా ఇదయిపోతావ్! లోకంలో నువ్వే కూతుర్ని కన్నావా... ఇది సహజం. లే లే...." అంటూ ఎవరో లేవదీశారు.

ఇద్దరూ విడిపోయారు...

శివయ్య కళ్ళు తుడుచుకుని, లేని దర్పం తెచ్చుకొని, ఉత్తరీయం భుజాల కిరుప్రక్కలా వేసుకుని బళ్ళ వెనక నడవసాగాడు. మధ్యలో జ్వాలమ్మ గుడిదగ్గర ఆపించి, కూతుర్ని తీసికెళ్ళి తల్లికి మొక్కించి "తల్లీ! నాకు కూతుర్నిచ్చి ఇలా అన్యాయం చేస్తావా..." అన్నాడు.

వూరు దాటింది. ఆగిపోమన్నా వినకుండా శివయ్య బళ్ళ వెనకాలే వస్తున్నాడు. ఒకచోట బండి ఆపించి, అల్లుణ్ణి దింపి, పక్కకు తీసుకెళ్ళి, రెండు చేతులూ పట్టుకుని అన్నాడు. “అయ్యా! నా తల్లిని పువ్వుల్లో పెట్టి పెంచాను. నాగుండెలో పెట్టుకుని సాక్కున్నాను. పిల్లది తెలియక ఎప్పుడన్నా తప్పు చేస్తుంది. అప్పుడు నీకు కోపమొస్తుంది... తప్పు లేదు... తిట్టాలనిపిస్తుంది... సహజమే... ఒక్కోసారి కొట్టాలనిపిస్తుంది... ఫర్వాలేదు... అల్లాటప్పుడు... బాబ్బాబు... నాకు ఒక కార్డుముక్క రాయి... కాకితో కబురంపు. వాలిపోతాను నీ కోపం తీరేదాకా నన్ను తిట్టు... నీ కసి పోయేదాకా నన్ను కొట్టు – బాబ్బాబు తమలపాకు లాంటిదయ్యా నాతల్లి” అంటూ బావురుమన్నాడు. ఆ మాటలకి అల్లుడికి కళ్ళనీళ్ళు తిరిగి ఏమీ చెప్పలేక పోయాడు. చుట్టూ ఉన్నవాళ్ళు ఛ! వూరుకో విడ్డూరం అని సర్ది బళ్ళని పంపించేశారు.

పొద్దుపోయి కాళ్ళీడ్చుకుంటూ ఇంటికొస్తే పార్వతమ్మ స్తంభానికానుకుని కూర్చుని వుంది. ఇల్లంతా బోసి పోయివుంది. మనసంతా ఖాళీగా వుంది – ఎవరూ మాట్లాడుకోలేదు. అన్నం వడ్డిస్తే ముట్టలేదు శివయ్య. పార్వతమ్మ అంది. “మా అయ్య నన్ను ఈ ఇంటికి పంపించినప్పుడు ఈ బాధ పడలేదా! నువ్వు నన్ను సల్లగ సూసుకోలేదా? అట్టాగే నీ కూతుర్నీ సూసుకుంటాడల్లుడు.”

శివయ్య కళ్ళలో ధైర్యం.

“అదో! అది నీ కూతురి కిష్టమైన కూర. కలుపు” అంది పార్వతమ్మ.

ఆమాట వినగానే గబ గబ ఆ కూర కలిపాడు శివయ్య. కాని ముద్ద నోటి కెక్కదే!

## అభ్యాసం

### I. వ్యాస రూప సమాధాన ప్రశ్నలు


1. ‘అంపకం’ ఆధారంగా తండ్రి, కూతుళ్ల అనుబంధాన్ని వివరించండి?
2. ‘అంపకం’ పాఠ్యభాగ సారాంశాన్ని రాయండి?

❖ ❖ ❖

# 3

# ఊతకర్ర

**- పులికంటి కృష్ణారెడ్డి**



## రచయిత పరిచయం

రాయలసీమ జీవన వెతల్ని కథలుగా మలచిన ప్రముఖ కథా రచయిత పులికంటి కృష్ణారెడ్డి. వీరు 30.07.1931 తేదీన చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలంలోని జక్కిదోన గ్రామంలో జన్మించారు. పాపమ్మ, గోవిందరెడ్డి వీరి తల్లిదండ్రులు. వీరిది వ్యవసాయ కుటుంబం.

పులికంటి కృష్ణారెడ్డి కేవలం కథలు మాత్రమే కాదు, కొన్ని కవితలు, లలిత గేయాలు, జానపద బాణీతో కూడిన అమ్మి పదాలు కూడా రాశారు. అంతేకాక కొన్ని దృశ్యనాటికలు, ఇంకొన్ని శ్రవ్య నాటికలు, మరికొన్ని సంగీత రూపకాలు, కొన్ని బుర్ర కథలు కూడా ప్రకటించారు. వీటన్నింటినీ మించి ఆటా పాటా బాగా తెలిసిన గొప్ప జానపద కళాకారుడు.

గూడుకోసం గువ్వలు, పులికంటి కథలు, పులికంటి దళిత కథలు, పులికంటి కథా వాహిని అనేవి కృష్ణారెడ్డి కథా సంపుటాలు, పులికంటి సుమారు 200 దాకా కథలు రచించారు. 'గూడుకోసం గువ్వలు' (1960) వీరి తొలికథ. పులికంటి కథలు కొన్ని ప్రధాన భారతీయ భాషల్లోకి అనువదించబడ్డాయి.

'రాయలసీమ సిన్నోడు'గా తనను తాను చెప్పుకున్నా కథలు రాయడంలో పులికంటి చిన్నోడేమీ కాదు. చెయ్యి తిరిగిన వాడు, తల పండిన వాడు. ప్రస్తుత పాఠ్యభాగం 'ఊతకర్ర' పులికంటి కథావాహిని (2003) లోనిది. తొలిసారిగా ఈ కథ 23.03.1997 ఈనాడు ఆదివారం దినపత్రికలో ప్రచురితమైంది. తెలుగు జీవితాన్ని అతి సన్నిహితంగా పరిశీలించిన పులికంటి 19.11.2007న దివంగతులయ్యారు.

మేధావలస ఫలితాలు కొందరి జీవితంలో ఎంత దయనీయంగా ఉంటాయో చిత్రించిన కథ 'ఊతకర్ర'. డాలర్ల మోజులో దేశంలోని యువత పాశ్చాత్య దేశాలకు వలసలు పోవడం ఈనాడు సర్వసాధారణమైంది. ఫలితంగా వృద్ధాప్యంలో ఇంటి దగ్గర ఉన్న తల్లిదండ్రులు మానసికంగా, శారీరకంగా ఎంతో వేదనకు గురౌతున్నారు. వారి హృదయ విదారక స్థితిని ఈ కథ సజీవంగా ఆవిష్కరిస్తుంది. భవిష్యత్తులో మేధావలసకు సిద్ధమౌతున్న ఈ తరం విద్యార్థులను కుటుంబ సంబంధాలను మెరుగు పరుచుకొనేలా ఆలోచింపచేయడం ఈ పాఠ్యభాగం ఉద్దేశం.

# పాఠ్యభాగం

నేను తండ్రిని. 'తండ్రి!' అని పిలిపించుకొనే అవకాశం కల్పించింది నా భార్య. ఆమె లక్షణంగా ఉంది. మేం ఇద్దరం. మాకు ఇద్దరు. ఒక కొడుకు, ఒక కూతురు. కొడుక్కి పెళ్ళి అయింది. కూతురికీ అయింది. కొడుక్కి ఇద్దరు కూతుర్లు, ఒక కొడుకు. కూతురికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. అందరూ ఉన్నారు. విలాసంగా... వినోదంగా... తమ బతుకులు తమవిగా... తమ పాలిటికదే ఒక స్వర్గంగా. ఎక్కడ? ఎక్కడో సుదూర ప్రాంతాల్లో!... సరికొత్త తీరాల్లో!...

నా గుండె అట్టడుగు పొరల్లో నుండి పుట్టుతుందీ భావం. అయితే అది అక్కడే ఆగదు. పోనీ గొంతుదాకా సాగుతుందా అంటే సాగదు. గొంతుదాకా రానప్పుడు మాటగా మారే ప్రసక్తేలేదు. కానీ ఆ భావం ఒక స్మృతిగా... ఒక ఆవేదనగా... ఒక ఆలోచనగా గుండె అట్టడుగు పొరల్లో నుండి భారంగా లేస్తుంది. సరాసరి మెదడును తాకుతుంది. ఆ దెబ్బతో కళ్ళు పొరలు కమ్ముతాయి. ఆ పొరలను చీల్చుకొని కనుకొలకుల్లో కన్నీళ్ళు!...

అది అంతటితో ఆగిపోదు.

ఆగిపోతే దానిని గురించి ఆలోచించవలసిన అవసరమే ఉండేది కాదు.

కూర్చున్నా... లేచి నడుస్తున్నా... పడుకొని విశ్రాంతి తీసుకొంటున్నా ఈ భావం అలలు అలలుగా లేస్తుంది. అలలైతే ఒక దాని వెంట మరొకటి. భావం ఒక్కటే. ఒకే భావం మాటిమాటికీ మెదడనే ఒడ్డును తాకుతుంది. మళ్ళీ వెనక్కు వెళ్ళిపోతుంది. గుండె అట్టడుగు పొరలకు మెదడుకు మధ్య ఆగకుండా సాగుతున్న ఈ కొట్టుమిట్టాట నిట్టూర్పులుగా మారి ఆ ఇంటిని నింపేస్తే... కనుకొలకుల్లో కన్నీళ్ళు ఆవిరై గాలిలో కలిసిపోతూ!

నాకొక ఇల్లు ఉంది. ఆ ఇంట్లో నిద్రకూ భద్రతకూ, వంటా వార్పుకూ, స్నానానికి పానానికి వేర్వేరుగా గదులున్నాయి. ఏ గదికి తగిన అలంకరణ ఆ గదికుంది. అయితే ఇప్పుడా గదులన్నీ నిట్టూర్పుల దుమ్ములో నిండి పీడకళ కొడుతూ ఉంటాయి.

ఆ రోజు నాకా ఇంట్లో భారంగానే తెల్లారింది. ఆ రోజు మాత్రమే కాదు – గత ఏడాదిగా ప్రతిరోజూ భారంగానే తెల్లారుతూ ఉంది.

ప్రతిరోజూ తెల్లారక ముందే నిద్ర లేస్తాను. కాలకృత్యాలు తీర్చుకొంటాను. రెండు కిలోమీటర్లు తక్కువగాకుండా తప్పనిసరిగా నడుస్తాను. ఇంటికి తిరిగి వస్తాను. స్నానం చేస్తాను. ఆ తర్వాత పత్రిక చేతికి తీసుకొంటాను. ఆ పత్రికను మాత్రం ఎంత సేపని చదువుతాను? ఆకలవుతుంది. అయినా ఎవరున్నారు– కడుపు చూసి కాకపోయినా ఆకలెరిగి అంత టిఫిన్ పెట్టడానికి? అందుకే పత్రిక మీది చూపు వీధి తట్టు మరలుతుంది. ఎవడైనా ఒక పిల్లవాడు ఆ దారిని పోతూ కనిపిస్తే చాలు. పిలుస్తాను. వాడి చేతిలో పావలా పరక లంచం పెడతాను. దగ్గర్లో ఉన్న హోటల్లో నుండి అంత టిఫిన్ తెమ్మంటాను. వాడు ఒకటి తెమ్మంటే ఇంకొకటి తేవచ్చు. రాజీ పడక తప్పదు. నేనే వెళ్ళవచ్చు. వెళ్ళి రావడం సమస్య కాదు. కానీ ఆ ఊళ్ళో బతికిన బతుకొకటి ఏడ్చింది గదా?

ఆకలి రుచి ఎరగని సంగతి కొత్తకాదు.

గంట పదవుతుంది. అప్పుడు వంట మనిషి వస్తుంది. ఆమె వంట మాత్రం చేస్తుంది. అది కూలి సేద్యం. ఏదో తనకు తోచినట్లు, లేదా తెలిసినట్లు అంత ఉడకపెడుతుంది. బియ్యం, పప్పు కూరలు ఉడికి రూపాంతరం చెందితే అవి వంటలు. వాటిని పాత్రల్లో పెట్టి, డైనింగ్ హాల్లో చక్కగా సర్దిపెడుతుంది. ఎవరైతే ఏం పాపం? చాలా జాగ్రత్తగా మూతలు కూడా పెడుతుంది. తన దారిన తాను వెళ్ళిపోతుంది.

నాకు అదే లంచ్!... అదే డిన్నర్!...

లంచ్‌కీ డిన్నర్‌కీ ఒక్కటే తేడా. లంచ్ కొంచెం వేడి మీద ఉంటే ఉంటుంది. అదే డిన్నర్ బాగా చల్లబడి ఒక్కొక్క రోజు పాచి కంపు కొడుతూ ఉంటుంది. అలాంటి సమయాల్లో పేగులను మంచినీళ్ళతో మంచి చేసుకోవడమే తప్పనిసరి.

మనిషికి అరవైయేండ్లు పైబడడమంటే ఊతకర్ర చేతికి రావడమే. జీవిత చరమాంకంలో అడుగుపెట్టిన దశలో మనిషికి ఆలనా పాలనా కరువైతే?... ఆత్మీయతానురాగాలు దూరమైతే?... ఒంటరితనం ఒక దయ్యమై పీడిస్తూంటే?... నిస్సహాయత నిస్సత్తువ నీడలా వెన్నాడుతూ ఉంటే?.. ఒక్క దినం గడవడం ఒక్క యుగం గడిచినట్లుగా భారమైతే?...

ఏటికి ఎదురీదుతున్నట్లే జీవితం!

ఒక్క ఏడాదికిపైగా ఏటికి ఎదురీది ఎదురీది బాగా అలిసిపోయాను. ఇక ఈదడం నా తరం కానిపని. అదే కూర్చొని ఆలోచిస్తున్నాను.

మండు వేసవి. పది గంటలకే సూర్యకిరణాలు సూదులు గుచ్చినట్లు గుచ్చుతున్నాయి. డైనింగ్ హాల్లో కూర్చున్నాను. ఉదయాన ఎవడో పిల్లవాడితో తెప్పించి పెట్టుకొన్న ఇడ్లీలు తిందామని ప్లేట్లో పెట్టుకొన్నాను. తాగడానికి నీళ్ళు కావాలి. కావాలంటే లేచిపోయి తెచ్చుకోవాలి. బతికినంత బతుకూ బతికి ఒక్క లోటానీళ్ళు తెచ్చిపెట్టడానికి ఈ వయస్సులో దిక్కులేక పోయారే? అనుకొనేసరికి మనస్సు పరిపరివిధాల పోతూ ఉంది. దానిదారి దానిదిగా గతంలోకి... చూపులు శూన్యంలోకి... ఇడ్లీల గతి ఈగల జోలికి!...

"ఇడ్లీలు ఆరిపోతా ఉండాయి. వాటి మీద ఈగలు కూడా ముసర్తా ఉండాయి. అంత తినేసి మల్లా కావాలంటే కూసోండయ్యా!" ఇంట్లో అప్పుడే అడుగు పెట్టిన వంట మనిషి హెచ్చరించింది. ఆ మాటతో 'ఆఁ! ఊఁ!' అన్నానే కానీ మనసు స్వాధీనానికి రాలేదు.

ఆమె వంట మనిషి. చెప్పడం వరకే తనపని. ఆ పని చేసింది. అంతటితో తన బాధ్యత తీరిపోయినట్లుగా తన పనిలోతాను. అంత ఉడకబెట్టి పెట్టింది. తనదారిన తాను వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళిపోవడం తెలుస్తూనే ఉంది. ఇడ్లీల మీద ఈగలు ముసురుతున్నాయి. చూస్తున్నాను. ఇంటి ముందు రోడ్డు మీద కార్లు మోటార్లు పంతాలు మీద పరుగులు తీస్తున్నాయి. చెట్టు మీద కాకి అరుస్తూ ఉంది. యాంత్రికంగా సాగిపోతున్న ఈ బాహ్య సంఘటనలేవీ ఆలోచనలకు అంతరాయం కలిగించడం లేదు!.

అవును. ఆ రోజుల్లో నేనేమనుకొన్నాను! ఈ దేశంలో ఒక మేధావిగా పుట్టడమే శాపం అనుకొన్నాను. మేధను గుర్తించి గౌరవించలేని ఈ దేశం ఏ పరిస్థితుల్లోనూ అభివృద్ధి సాధించడం కల్ల అనుకొన్నాను. అందుకే

నా గతి నా బిడ్డలకు పట్టకూడదని శ్రద్ధ తీసుకొన్నాను. నా కృషి వృథా కాలేదు. నా ఆశయం నెరవేరింది. కూతురు డాక్టరుగా, కొడుకు ఇంజనీర్‌గా అమెరికా వెళ్ళడానికి అవకాశం. ఓహ్! నా జీవితమే ధన్యమైనట్లు పొంగి పోయాను. నా బిడ్డలు అమెరికాలో గొప్ప గొప్ప మేధావులతో కలిసి పనిచేయడం ఒక గొప్ప అనుభవం. అంతకు మించిన అదృష్టం. ఆ అనుభవంతో అమెరికాలోనే కాదు దేశదేశాల్లో కూడా వాళ్ళు పేరు పొందవచ్చు. చాలు. ఈ జన్మకీ తృప్తి చాలని సంతోషించాను. గర్వించాను కూడా. అయితే ఏమయింది? పోతే తెలిసింది అవి దూరపు కొండలని. వాళ్ళు కేవలం యంత్రాలుగా మిగిలిపోయారు. యంత్రాలు పనిచేస్తుంటాయి – అలుపూ సొలుపూ ఎరక్కుండా. వాటికి ఆత్మీయతలు, అనురాగాలు ఏమీ అక్కర్లేదు. వాటితో పోటీ పడ్తూ వీళ్ళూ.

పని!... పని!!... పని!!!... డబ్బు!... డబ్బు!!... డబ్బు!!!... ఈ రెండింటితో ముడిపడిందేనా జీవితం? జీవితమంటే యంత్రాల్లా పని చేయడం... యంత్రాల్లా ప్రేమించుకోవడం... యంత్రాల్లా బతకడం... బతకలేనప్పుడు యంత్రాల్లో భాగాలుగా విడిపోవడం!.

ఇంతేనా?

ఈ సంస్కృతి మన సంస్కృతికి చుక్కెదురు కాదా?

ఒక విధంగా ఆలోచిస్తే – ఒక విధంగా కాదు. ఏవిధంగా ఆలోచించినా నేను పొరబాటు చేశాను. ఆ పొరబాటే చేయకుంటే ఇప్పుడిలా బాధపడడానికి ఆస్కారమే ఉండేదికాదు. 'నాన్నా! ఈ వయస్సులో మీరక్కడుండి ఏంచేస్తారు? ఇక్కడికొచ్చేయండి. మీకు కాలం గడిచినట్టు, మాకు తోడున్నట్లు' అని రాస్తే; అంతకంటే భాగ్యం ఏముందని, నేనూ భార్య రెక్కలు గట్టుకొని ఎగిరిపోయాం. అక్కడ కొడుకూ కూతురూ పోట్లాడి మమ్మల్ని పంచుకొన్నారు. ఆమె కొడుకు వద్ద. నేను కూతురు వద్ద.

అక్కడ జీవితం అనుభవిస్తే తెలిసింది. అవి పంజరంలో చిలుకలతో పోటీపడే బతుకులని. లేకుంటే వాళ్ళేదో ఒక భూలోక స్వర్గంలో ఉన్నారన్న తృప్తితోనే ఈ జీవితం కడతేరి పోయేదేమో?

ఆ బతుకులు! ఏం బతుకులో? కాలంతో పోటీపడ్తూ కార్ల మీద పరుగులు. ఎప్పుడు నిద్రలేస్తారో? ఏం తింటారో? ఉరుకులు పరుగులు. తల్లిదండ్రుల దారి తల్లిదండ్రులది. పిల్లల దారి పిల్లలది. మళ్ళీ ఏ సాయంకాలానికో ఇంటి ముఖం చూసేది. అప్పుడు చూడాలి వాళ్ళ ముఖాలను. వాడి వత్తలైన తోటకూర కాడలే నయం. వచ్చీ రావడంతోనే విశ్రాంతి పేరుతో ఎవరి గదుల్లో వాళ్ళు దూరుకొంటారు. ఒక కలిసి భోంచేదమా? కాలక్షేపానికి కబుర్లా? ఒక ముద్దూ ముచ్చటా? ఏమీ లేదు. ఎవరికి వాళ్ళే వాళ్ళ లోకంలో. ఆ రాత్రి ఎవరికి తోచినప్పుడు వాళ్ళు లేచి అంత ఎంగిలి పడతారు. మళ్ళీ తెల్లారుతుంది. తెల్లార్తే ఏముంది? ఎక్కడో కొంపలు మునిగిపోతున్నట్లు ఆశయాల ఆశ్వాసాల్లో ఆశలబిందులు!

అక్కడ గడిచింది ఒక అందమైన జైలు శిక్ష. ఒక ఇరుగూ పొరుగూ లేదు. అటూ ఇటూ తిరుగడానికి లేదు. ఒక మాటామంతీ లేదు. ఆ గదిలో బందీగా ఎంత కాలం? చదువుకోవడానికి పుస్తకాలున్నాయి. చూడడానికి లెక్కలేనన్ని ఛానల్సుతో టీవీలున్నాయి. అయినా ఎంతసేపని చదవగలం? ఎంతసేపని చూడగలం? అందుకే ఉచ్చులు తెంపుకొని వచ్చేశాను. నా భార్య రానన్నా. ఈ గాలికోసరం... ఈ మట్టికోసరం... ఈ స్వేచ్ఛకోసరం!...

మరి వాళ్ళ పిల్లలు? – వాళ్ళు అమెరికాలో పుట్టిన పిల్లలు. ఏగూటి చిలక ఆ గూటి పలుకు. వాడు నా మనవడు. వేలెడెంత లేడు వెధవ. వాడు నన్ను నిలదీయడం? మరిచిపోదామంటే కాలేదే? –

“చూడు తాతయ్యా! మా మమ్మీడాడీ... మా మాతృదేశం చాలా గొప్పది. మా సంస్కృతీ సంస్కారాలు గొప్పవి. ఆచార వ్యవహారాలు అంతకంటే గొప్పవి. వాటిని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు లేదని ఊదర గొడుతుంటారే? మరి అంత గొప్ప దేశాన్ని వదిలిపెట్టి వాళ్ళిక్కడికెందుకు రావాలి?”

“ఆమాట వాళ్ళనే అడగలేకపోయావా?”

“అడిగితే మా కోసరం అంటారు. మా కోసరమే అయినప్పుడు మా దారికి మమ్మల్ని వదిలేయాలి కదా? మేము ఇక్కడే పుట్టాం. ఇది మా మాతృభూమి. మా మాతృభూమిని మేము గౌరవించాల్సిన అవసరం లేదా?”

ఆంగ్లంలో వాడు ముద్దుముద్దుగా వాదిస్తూ ఉంటే నాకు నవ్వు వచ్చేది. వాడికేమని బదులు చెప్పేది?– తల్లిదండ్రుల్లో బిడ్డల భవిష్యత్తుకు సంబంధించిన ఆవేదన ఉంది. పిల్లల వాదనలో బలం ఉంది. ఎవరికి వాళ్ళుగా మౌనంగా నలుగుతున్నారు. మన ఆచార వ్యవహారాలు మింగుడు పడకుండా, అక్కడి వాతావరణంలో మమేకం చెందలేకుండా పిల్లలు సెకండ్ రేట్ పౌరులుగా మిగిలిపోతారేమో అని మధన. నిజానికి ఆ పిల్లలు అటు యిటు కాకుండా మిగిలిన సరికొత్త తరాలు. ఈ సరికొత్త తరాలు తరంకాని తరాలుగా ఏ తీరాలు చేరతారో అని తల్లిదండ్రులు తపించిపోతున్నారు.

హుఁ! ఎంత చిత్రమయిందీ జీవితం! నా జీవిత పోరాటమంతా ‘నా బిడ్డలు!.. నా బిడ్డలు!’ అన్న తపనతో తాపత్రయంలో. అదే నా బిడ్డల ఆరాట పోరాటాలు తమ బిడ్డల కోసరం. ఎవరైనా తమ బిడ్డల్ని గురించి ఆలోచిస్తున్నారేకానీ తాము కూడా ఒకరికి బిడ్డలమన్న సంగతే మరిచిపోతున్నారు. అందుకే ఎందరో నా వంటి అభాగ్యుల జీవితాలు అన్నీ ఉండి అల్లుడి నోట్లో శనిగా మిగిలిపోతున్నారు.

ఒకరోజు ఇలాంటి ఆలోచనలతోనే మనసు గజిబిజిగా ఉండి, ఇంట్లో ఇమడలేక బయటపడ్డాను. తుమ్మెద ఒక పూవు నుండి మరొక పువ్వు మీదికి ఎగిరినంత వేగంగా ఒకదానివెంట మరొక ఆలోచన. ఆ ఆలోచనా వేగాన్ని అందుకోవాలన్నట్లుగా నడుస్తున్నాను. అలా ఎంత దూరం నడిచానో నాకే గుర్తులేదు. ఒంట్లో ఓపిక నశించింది. నిలబడ్డాను. ఎండ మాడు పగలగొడుతూ ఉంది. అటు యిటు చూశాను. బాట పక్కనే చెట్టు. ఆ చెట్టు కిందికి చేరాను. ఆ చెట్టు శాఖోపశాఖలుగా విస్తరించింది. అది ఎంత పెద్ద చెట్టయినా పెంచితే పెరిగిన చెట్టే కదా? – అయితే ఆ చెట్టు నీడనిస్తూ ఉంది.

అక్కడికి కనుచూపు దూరంలో ఒక పల్లె. ఆ ఎండలో అంత దూరం నన్ను ఏ శక్తి లాక్కొని వెళ్ళిందో మరి? తిరిగి ఇల్లు చేరాలికదా అనుకొనేసరికి గుండె గుభేమనింది. అయినా తప్పదుకదా? అదే ఆలోచిస్తూ ఆ చెట్టు కింద కూర్చొని అలుపు తీర్చుకొంటున్నాను. అప్పుడొక సంఘటన నా దృష్టిని ఆకర్షించింది.

ఆ చెట్టు దగ్గరగా బాట పక్కనే కొత్తగా కట్టిన మూడంకణాల ఇల్లు. ఆ ఇంటిని బోదకసువుతో కప్పుతున్నాడొక వ్యక్తి. నిప్పులు చెరుగుతున్న ఎండ. ఆ ఎండకు తోడు కాలిన బోద కసువు కక్కుతున్న వేడి. ఆ మనిషి ఒంటిమీద ధారలు ధారలుగా చెమట. అయినా అతడదేమీ పట్టించుకోవడంలేదు. అది తండ్రి కంటపడింది. కన్నపేగు

మెలిపడింది. దాంతో ఆ ముసలికట్టె ఊతకట్టె మీదికి వంగి తలపైకెత్తి మండేవాడికి అరచేతిని అడ్డంగా పెట్టి కొడుకును చూస్తూ "ఒరే నాయినా! పొద్దు తిరిగిపోతా ఉండాది. ఇప్పుడు ఆడేం మునిగిపోతా ఉండాదిరా? కొంచిం చల్లబణ్ణాక కప్పుకోవచ్చు గదా? దిగిరారా. అంత తినేసి ఒక వక్క కొరికినంతసేపన్నా పడి లెయ్‌రాదంట్రా?" అని బతిమాలుతూన్నాడు.

"అయ్‌పోనీ... ఒకసారిగా అంతా అయ్‌పోనీ. ఈ రోంతకోసరం మళ్ళీదిగి మళ్ళీ ఎక్కాల్నా?" అంటూ తండ్రిమాట పెడచెవినిపెడ్తూ కొడుకు.

కన్నపేగు అభిమానం ఆమాటతో దెబ్బతిన్నట్లుంది. కొంతసేపు కొడుకును రెప్పార్పకుండా చూశాడు. తలపంకించాడు. మెల్లిగా ఇంట్లోకి నడిచాడు. అయితే వెళ్ళినట్లుగానే తిరిగి వచ్చాడు. మూడు నాలుగేండ్ల పసిగుడ్డును చంకనేసుకొని. మనఁవడేమో? వాణ్ణి ఆ మండే ఎండలో నిలబెట్టి ఇంట్లోకి జారుకొన్నాడు. చిదిమితే పాలుగారే పాదాలు. చుర్రుమన్నాయి. పిల్లవాడు కెవ్వుమన్నాడు. అది ఇల్లు కప్పుతున్న మనిషి చెవుల్లో పడింది.

"అయ్యయ్యో! పసిబిడ్డ ఎండన పణ్ణాడే? కొంపలో వాళ్ళంతా యాడ చచ్చినట్లు?" అంటూ గబగబ దిగాడు. బిడ్డను జవురుకొన్నాడు.

అది అంతే! కాకిపిల్ల కాకికి ముద్దు. అయితే ఆ కాకి ఇంకొక కాకికి పిల్లే కదా? ఆ సంగతి గుర్తురాదే? ఈ సంఘటన తండ్రీబిడ్డల మధ్య అనుబంధానికి చక్కని నిదర్శనంగా అప్పుడప్పుడు నన్ను ఊరడించేది. ఉపదేశించేది కూడా!

'పోస్ట్!' అన్న కేకతో నా ఆలోచన తెగిపోయింది. పైకి లేచాను. ఇంటి వాకిట్లోకి నడిచాను. రిజిస్టర్ పార్సల్ చేతపట్టుకొని పోస్ట్‌మన్ – నవ్వుతూ. సంతకం పెట్టి ఆ పార్సల్ తీసుకొన్నాను. విప్పాను.

అది ఊతకర్ర– అమెరికన్ ఊతకర్ర!!...

నేను మరిచిపోయిన నా పుట్టిన రోజును గుర్తు చేస్తూ ఎంతో ఆప్యాయంగా నావాళ్ళు పంపిన పుట్టిన రోజు కానుక. ఊతకర్ర కానుక చాలా అందంగా ఉంది. ఆ కర్ర చేతపట్టుకొంటే నాకెంతో హుందాతనం వచ్చినట్లుంది. అయితే కేవలం అది ఒక కట్టె. అయినా ఆ కట్టె చేతికి ఆధారమై నడిపిస్తుంది. కాటికి మోస్తుంది. ఈ కట్టెను కడతేరుస్తుంది. ఈ కట్టెకు మట్టికి ఉన్న మనసు మనిషికి లేదే? మనసు లేని మనుషులు పంపిన ఈ కట్టెలో ఆత్మీయతలు అనుబంధాలు వెదుక్కొంటూ ఎన్నాళ్ళీ కట్టె?...

ముత్తెమంత కన్నీటి చుక్క మెరిసిపోతున్న ఊతకర్ర మీద పడి జారుతూ!...

## అభ్యాసం

### I. వ్యాస రూప సమాధాన ప్రశ్నలు

1. 'ఊతకర్ర' కథ ఆధారంగా వృద్ధాప్యంలో ఎదురయ్యే కష్టాలను వివరించండి?

2. ఊతకర్ర కథలో రచయితను ఆకర్షించిన తండ్రీ కొడుకుల అనుబంధాన్ని వివరించండి?

❖ ❖ ❖

# 4 సౌందర్యం



**- వాసిరెడ్డి సీతాదేవి**

## రచయిత్రి పరిచయం

కల్పనాసాహిత్య ప్రక్రియల్లో వాసి గడించిన తెలుగు రచయిత్రులలో వాసిరెడ్డి సీతాదేవి ప్రముఖులు, 15.12.1933 తేదీన గుంటూరు జిల్లా, చేబ్రోలులో సీతాదేవి జన్మించారు. రంగనాయకమ్మ, రాఘవయ్య వీరి తల్లిదండ్రులు.

వాసిరెడ్డి సీతాదేవి 100 కి పైగా కథలు, సుమారు 40 దాకా నవలలు రచించారు. 'సాంబయ్య పెళ్ళి' (1952) వీరి తొలి కథ. 'జీవితం అంటే' (1950) వీరి తొలి నవల. వీరి కథలు, నవలలు కొన్ని తెలుగు చలన చిత్రాలుగా తెరకెక్కాయి.

ఆధునిక తెలుగు కథను, నవలను మరొక మెట్టు పైకెక్కించిన సీతాదేవి రచనలన్నీ ప్రధానంగా స్త్రీ జీవితం చుట్టూ తిరుగుతాయి. స్త్రీల పురోగమనాన్నీ, చైతన్యాన్నీ, విముక్తినీ కాంక్షిస్తాయి. వీరి రచనా పాటవాన్నీ, దృక్పథాన్నీ గుర్తించి తెలుగు విశ్వవిద్యాలయం 1996 లో విశిష్ట పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఈ గౌరవాన్ని పొందిన ప్రప్రథమ రచయిత్రిగా సీతాదేవి చరిత్రకెక్కారు. ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమానం 5 సార్లు పొందిన ఖ్యాతి కూడా వీరికే దక్కింది. తెలుగులో వెలువడిన కల్పనా సాహిత్యంపై తనదైన ముద్రను చెరిగి పోకుండా నిలుపుకున్న వాసిరెడ్డి సీతాదేవి 13.04.2007 న జీవితాన్ని చాలించారు.

ప్రస్తుత పాఠ్య భాగం 'సౌందర్యం' 'వాసిరెడ్డి సీతాదేవి సాహిత్యం-3, కథలు' సంపుటం నుంచి స్వీకరించ బడింది. ఈ కథానిక 1979, యువ దీపావళి ప్రత్యేక సంచికలో తొలిసారిగా ప్రచురించబడింది.

మనిషి సౌందర్యం రెండు రకాలు. ఒకటి బాహ్య సౌందర్యం, మరొకటి అంతః సౌందర్యం. మొదటిది శరీరానికీ, రెండోది హృదయానికీ సంబంధించినవి. శరీర సౌందర్యం తాత్కాలికం. హృదయ సౌందర్యం శాశ్వతం. ఈ తాత్త్విక అంశాన్ని గుర్తించలేక మనం జీవితంలో అనేక సమస్యల్ని ఎదుర్కొంటున్నాం. ఈ నేపథ్యంలోనే సీతాదేవి ఈ కథను రచించారు. బాహ్య సౌందర్యం యొక్క అస్తిత్వం హృదయ సౌందర్యం మీద ఆధారపడి ఉంటుంది, హృదయ సౌందర్యం లోపించినపుడు బాహ్య సౌందర్యం వికృతంగా కన్పిస్తుంది. శరీర సౌందర్య పిపాస రోజు రోజుకూ అధికమవుతున్న వర్తమానంలో ఈ సత్యాన్ని విద్యార్థులకు ఉపదేశించడం ఈ పాఠ్యభాగం ఉద్దేశం.

# పాఠ్యభాగం

విజయవాడ వెళ్ళే ఎక్స్‌ప్రెస్ బస్ కదలడానికి సిద్ధంగా వుంది.

ఆదరా బాదరాగా చంద్రం లోపలకు – గేటులో నిల్చున్న వాళ్ళను తోసుకుంటూ ఎక్కాడు.

బస్సంతా ఫుల్‌గా కనిపించింది. జేబులో నుంచి టికెట్ తీసి తన రిజర్వేషన్ నంబరు చూసుకున్నాడు. ముగ్గురు కూర్చునే సీటులో తన సీటు వున్నది. దగ్గిరకు వెళ్ళి నిల్చున్నాడు. ముగ్గురు కూర్చునే సీటులో ఇద్దరు – ఒక ఆడా, ఒక మగా కూర్చుని వున్నారు. చివర్లో కొంచెం చోటు వున్నది. దాదాపు మొత్తం సీటును ఆక్యుపై చేసుకున్న వాళ్ళిద్దర్నీ మార్చి మార్చి చూశాడు చంద్రం.

సన్నగా, తెల్లగా, నాజూకుగా వున్న స్త్రీ కిటికీ దగ్గర కూర్చుని బయటికి చూస్తున్నది. ఆమె వాలకం చూస్తే ఆమె, ఆ పక్కనే కూర్చుని వున్న లావుపాటి నల్లటి బట్టతల ఆసామికీ ఏమీ కానట్టే అన్పించింది చంద్రానికి. చంద్రం సీటు చివర్లో వున్న ఆ కొద్ది స్థలంలో ఒదిగి కూర్చోడానికి ప్రయత్నించాడు. అయినా అతని సగం శరీరం బయటికే వుండిపోయింది. కిటికీ దగ్గరగా వున్న స్త్రీ మరికొంచెం కిటికీ దగ్గరకు జరిగింది. ప్రక్కనవున్న అతనితో చిన్నగా ఏదో అన్నది. స్థూలకాయుడు కొంచెం సర్దుకొని కూర్చోగలిగాడు.

కిటికీ పక్కగా కూర్చున్న ఆమె పేరు రేఖ. రేఖ లాగే సన్నగా పొడవుగా వుంటుంది. ఆ లావాటి పెద్దమనిషి ఆమె భర్త. పేరు సుందర్రావు. సుందర్రావు నల్లగా వున్నా పెళ్ళి నాటికి అంత లావుగా వుండేవాడు కాడు. బట్టతల కూడా లేదు. వివాహం అయి పదేళ్ళు అయింది. ఒకే కొడుకు. వాడికి ఐదేళ్ళు. రేఖ తల్లిదండ్రుల దగ్గిరవుండి చదువుకుంటున్నాడు.

సుందర్రావు కష్టజీవి. పెళ్ళినాటికి పెద్దగా లేదు. క్రమంగా కాంట్రాక్టులు చేసి బాగా సంపాదించాడు. ఎండనక వాననక స్వయంగా నిల్చుని పనులు చేయిస్తాడు. ఈ మధ్య కాలంలో మరీ లావు అయ్యాడు. నలుపురంగు నిగనిగ లాడుతోంది. బట్టతల కూడా వచ్చింది. రేఖ పెద్దగా అతని రూపాన్ని గురించి ఎప్పుడూ ఆలోచించలేదు. ఇద్దరూ పిల్లవాడిని చూడడానికి హైదరాబాదు నుంచి బయలుదేరారు. భర్త టాక్సీలో వెళ్దాం అన్నాడు. కాని ఆమే "ఐదు గంటల ప్రయాణం. ఎందుకు దండుగ. బస్‌లో పోదాం!" అన్నది. కొడుకుని తీసుకొచ్చి పబ్లిక్ స్కూల్లో చేర్పించడానికి బయలుదేరారు. ముందు తనకు టైం లేదన్నాడు. తీరా భార్య బయలుదేరేసరికి తనూ బయలుదేరాడు.

రేఖ బయటకు చూస్తూ కూర్చుంది. అయినా తమ సీట్లో కూర్చున్న ఆ యువకుడు తననూ, తన భర్తనూ మార్చి మార్చి చూస్తున్నట్టు అన్పించింది. రేఖ తలతిప్పి చూసింది. ఆ యువకుడు ఇబ్బందిగా ముఖంపెట్టి రేఖ ముఖంలోకి చూశాడు.

సుందర్రావు సీటు వెనక్కు వాలి నిద్ర పోతున్నాడు. అటూ ఇటూ ఊగుతున్నాడు. అతని తల తనకు తగలకుండా జాగ్రత్త పడుతూ కూర్చున్నాడు చంద్రం. రేఖ భర్తను చూసింది. నోరు తెరిచి నిద్ర పోతున్నాడు.

గురక కూడా పెడుతున్నాడు. రేఖ ఆ యువకుడు చూడకుండా చిన్నగా మోచేత్తో భర్తను పొడిచింది. సుందర్రావు ఉలిక్కిపడి లేచి భార్యకేసి చూశాడు.

'సరిగ్గా కూర్చోండి! బస్ కదిలిందో లేదో పట్టపగలు నిద్రేమిటి?' చిన్నగా అన్నది.

చంద్రానికి ఆ మాటలు విన్పించాయి. ముసి ముసిగా నవ్వుకున్నాడు.

'వెధవ అలవాటు, బస్‌లో కూర్చున్నా కారులో కూర్చున్నా నిద్ర ముంచుకొస్తుంది' అన్నాడు, గొంతు మడతల్లో పట్టిన చమటను అరచేత్తో తుడుచుకుంటూ.

రేఖ వినిపించుకోనట్టు కిటికీలో నుంచి బయటికి చూడసాగింది.

రేఖ తల్లిదండ్రులకు ఒకే కూతురు. ఇద్దరు మగపిల్లలు. తండ్రి బడి పంతులు. రేఖ పది పాసు అయింది. సుందర్రావు వాళ్ళకు దూరపు బంధువు. అప్పుడప్పుడు రేఖ అన్నయ్య కోసం వస్తూ వుండేవాడు. ఆమెకు వివాహం గురించి ప్రత్యేకమైన ఆలోచనలే లేవు. కలలు కనడం కూడా లేదు. తండ్రి 'సుందర్రావును చేసుకోవడం ఇష్టమేనా' అని అడిగినప్పుడు తల ఊపేసింది. ఎవరో ఒకర్ని పెళ్ళిచేసుకోవాలని మాత్రమే ఆమెకు తెలుసు. అంతకంటే ప్రత్యేక అభిప్రాయాలు ఏమీ లేవు.

సుందర్రావుకు రేఖ అంటే ప్రాణం. రెండు మూడు సంవత్సరాలు ఆర్థికంగా స్థిరపడడానికి రాత్రిం బవళ్ళు కృషి చేశాడు.

బస్ సిటీ లిమిట్స్ దాటింది. స్పీడ్ పెంచాడు డ్రైవర్. మళ్ళీ నిద్రలోపడ్డ సుందర్రావు. తల గడియారంలోని పెండ్యులం లాగా ఊగసాగింది. గురక బస్ శబ్దంలో కలిసిపోయినా, పక్కసీట్ల వాళ్ళకు విన్పిస్తున్నది. రేఖ తలతిప్పి చూసింది. చంద్రం ఇబ్బందిగా ఆమె ముఖంలోకి చూశాడు. ఆమె భర్తను చూసింది. నోరు తెరిచి గురక పెడుతున్న అతని ముఖం మీదా, మెడ మీదా చమట చుక్కలు వున్నయ్. రేఖకు భర్త ఒక ఎలుగుబంటిలా కన్పించాడు మొదటిసారిగా.

ముందు సీటులో ఐదేళ్ళ కుర్రవాడు లేచి నిల్చున్నాడు. వెనక్కు తిరిగి మోకాళ్ళమీద కూర్చుని సీటుపైనుంచి గురక పెడుతున్న సుందర్రావును సంతోషంగా చూస్తున్నాడు. రేఖ పిల్లవాడి ముఖంలోకి చూసింది. ఒకసారి తన కొడుకుని జూకు తీసుకెళ్ళింది. వాడు కటకటాల వెనక వున్న జంతువుల్ని అచ్చం ఇలాగే చూశాడు.

రేఖకు ఏదోగా అనిపించింది. బస్‌లో వున్నవాళ్ళంతా తమకేసే చూస్తున్నారనిపించింది.

సుందర్రావు తల చంద్రం తలకు తగిలింది. చంద్రం త్రుళ్ళిపడ్డాడు. ఎదురు సీటు కుర్రవాడు చప్పట్లు కొట్టి కిలకిలా నవ్వాడు. రేఖకు బస్‌తో సహా భూమిలోకి క్రుంగిపోతే బాగుండును అనిపించింది.

చంద్రం తలకు తన తల ఢీ ఇచ్చేసరికి తృళ్ళిపడి లేచి సర్దుకొని కూర్చున్నాడు సుందర్రావు. "సారీ!" అన్నాడు చంద్రాన్ని చూస్తూ. చంద్రం చిరునవ్వు నవ్వాడు రేఖను చూస్తూ.

"మీరు ఇలా కూర్చోండి" అంటూ రేఖ లేచింది. సుందర్రావు కిటికీ పక్కగా కూర్చున్నాడు.

చంద్రం రేఖకు కళ్ళతోనే ధన్యవాదాలు తెలుపుకున్నాడు. అలా సీటు మారుస్తున్నప్పుడు రేఖ వెనక సీట్లో కూర్చున్న వాళ్లందర్నీ పరికించి చూసింది. ఎవరి గొడవలో వాళ్లున్నారు. రిలీఫ్‌గా నిట్టూర్చింది.

బస్ నార్కెట్‌పల్లిలో ఆగింది. సుందర్రావు అరడజను అరటిపళ్ళు కొన్నాడు. రెండు పళ్ళు తుంచి భార్యకు ఇవ్వబోయాడు. 'వద్దు!' అన్నది రేఖ.

"తీసుకోండి!" చంద్రానికి ఇవ్వబోయాడు.

"వద్దండీ!" అంటూనే మొహమాటపడుతూ రేఖ మీదుగా చెయ్యి చాచి ఒక పండు మాత్రం అందుకున్నాడు.

'కాఫీ తాగుతావా?'

'వద్దు!' విసుగ్గా చిన్నగా అన్నది రేఖ.

చంద్రం పండు తినలేదు. కాళ్ళ దగ్గిరగా వున్న బుట్టలో పెట్టాడు.

సుందర్రావు ఐదు పళ్ళూ ఒకదాని తర్వాత ఒకటి తింటూ వుంటే రేఖకు కడుపులో దేవినట్టు అయింది.

రేఖ కొంచెం కుదుట పడ్డది. తను ఇద్దరి మధ్య కూర్చున్నది. బస్‌లో వాళ్లు తనను సుందర్రావు భార్య అనుకోరు. తన పక్కన వున్న యువకుడి భార్య అనుకుంటారు.

ఛ! ఏమిటి తను ఇలా ఆలోచిస్తున్నది?

'మీ పేరు?' అడిగాడు సుందర్రావు చంద్రాన్ని.

చంద్రం పేరు చెప్పాడు.

సుందర్రావు సంచిలోనుంచి పాన్ డబ్బా తీశాడు. కట్టిన పాన్లు పదిదాకా వున్నాయ్. ఒకటి చంద్రానికి అందించాడు. చంద్రం అందుకొని నోట్లో వేసుకున్నాడు. రేఖకు అందించబోయాడు. 'వద్దు'– చాలా విసుగ్గా అన్నది. సుందర్రావ్ పాన్ వేసుకొని జర్దాకూడా వేసుకున్నాడు. 'మీకు జర్దా కావాలా?' చంద్రాన్ని అడిగాడు.

"వద్దండీ! నాకు తమలపాకుల అలవాటుకూడా లేదు. బోర్‌గా వుంది. అందుకే తీసుకున్నాను. మీరు బాగా నిద్రపోయారు."

"అవును! నిద్రపట్టింది. నిద్రపడితే చాలు– వెధవ చమట ఒకటి!" అంటూ జేబులోనుంచి ఇంత లావు కర్చీపు తీసి ముఖమూ, మెడా తుడుచుకున్నాడు.

"ఎంత చమట పట్టిందో చూడు?" అంటూ తడిసిన రుమాలు భార్యకు చూపించాడు. ఆమె అటుకేసి చూడలేదు. చూపులు కిందకు దించుకుంది.

'నెలలో ఇరవై రోజులు ప్రయాణంలోనే వుంటాను. అందుకే ప్రయాణం చేసేటప్పుడు నిద్ర అలవాటయింది'

"మీరు ఏం చేస్తారు? అభ్యంతరం లేకపోతే..." చంద్రం సుందర్రావుతో సంభాషణ పెంచుతున్నాడు.

రేఖ వాళ్ళిద్దరి మాటలు విననట్టే కూర్చుంది.

'చిన్న చిన్న రోడ్లు కాంట్రాక్టు చేస్తాను.'

"అంటే బాగా సంపాదిస్తారన్నమాట!"

"ఆ- ఏదో తమ దయ..."

వెధవ వినయం! మధ్యలో అతని దయ ఏమిటి? మనసులోనే విసుక్కుంది రేఖ.

సుందర్రావు కిటికీలోంచి వంగి జర్దా వేసుకున్న పాన్ తాలూకు ఉమ్మి ఉమ్మాడు. అలా ఉమ్ముతున్నప్పుడూ తీగలా సాగి కొద్దిగా అతని గడ్డంమీదినుంచి షర్టుమీద పడింది. కర్చీఫుతో తుడుచుకున్నాడు. రేఖకు భర్తమీద కోపం వచ్చేస్తున్నది. అసహ్యం వేస్తున్నది. అక్కడినుంచి దూరంగా, అతనికి చాలా దూరంగా పారి పోవాలనిపించింది.

'ఏమిటి మాట్లాడటం లేదు? తలనొప్పిగా వున్నదా? సూర్యాపేటలో కాఫీ తాగుదాం!' అన్నాడు సుందర్రావు భార్యనుద్దేశించి. ఆమె ఉలకలేదు. పలకలేదు. చంద్రం ఆమె భావాలను అర్థం చేసుకుంటున్నట్టు మధ్య మధ్య ఆమెకేసి జాలిగా చూస్తున్నాడు. రేఖ ఇబ్బందిగా కదిలింది.

"ఇప్పుడు బిజినెస్ పనిమీద వెళ్తున్నారా?" చంద్రం అడిగాడు.

'లేదు. అత్తగారింటికి వెళ్తున్నాను. మా బాబు అక్కడే ఉన్నాడు...'

తను మధ్య వుండగా ఇద్దరూ చెరొకవైపునుంచి మాట్లాడుతూ వుంటే రేఖకు చిర్రెత్తుకొచ్చింది. అసహనంగా లేచి నిల్చుంది.

'ఏమిటి? ఏం కావాలి?' భర్త మృదువుగా అడిగాడు.

"మీరు ఇలా కూర్చుని మాట్లాడుకోండి."

రేఖ మళ్ళీ కిటికీ దగ్గర కూర్చుంది. బయటకి చూస్తూ కూర్చుంది. కిటికీకి అతుక్కుపోయినట్టు కూర్చుంది.

బస్ వేగంగా పోతున్నది.

సుందర్రావు మళ్ళీ నిద్రకు పడ్డాడు. ఈసారి శబ్దం కొత్తగా విన్పించి తలతిప్పి చూసింది. నోరు మూసుకొని వున్నది. ముక్కోళ్లు మాత్రం కదులుతున్నయ్. నోరు తెరిచినప్పుడు వచ్చిన గురక శబ్దానికీ, ఈ శబ్దానికీ ఎంతో తేడా వుంది.

ముందు సీటు కుర్రాడు మళ్ళీ లేచి వెనకకు తిరిగి మోకాళ్ళమీద కూర్చుని సుందర్రావును ఆనందంగా చూడసాగాడు.

రేఖ సిగ్గుతో తనలోకి తను ముడుచుకొని పోసాగింది.

తను పది సంవత్సరాలు ఈ భర్తతోనా కాపరం చేసింది?

రోజు రాత్రిళ్ళు తన పక్కన పడుకొని గురక పెడ్తూనే వున్నాడు. కాని తనెప్పుడూ ఆ గురకను ప్రత్యేకంగా పట్టించుకోలేదు. భర్తను వింతగా చూడలేదు. తన భర్త ఇంత ఘోరంగా వుంటాడనే భావం కూడా ఏనాడూ కలగలేదు.

ఆ యువకుడు ఏమనుకుంటున్నాడో? తమ ఇద్దరి దాంపత్యాన్ని గురించి ఆలోచిస్తూ నవ్వుకుంటున్నాడేమో?

రేఖ మెడ నొప్పి పుట్టినా కిటికీ నుంచి తల తిప్పకుండా కూర్చుంది.

సూర్యాపేటలో బస్ ఆగింది.

అందరూ దిగుతున్నారు.

'రేఖా! దిగు, కాఫీ తాగుదాం!' అన్నాడు సుందర్రావు.

రేఖకు అతనితో కాఫీ హెూటల్లోకి వెళ్ళాలని లేదు. "మీరు తాగండి. నాకు అక్కర్లేదు" అన్నది.

"ఇక్కడకు తీసుకొస్తాను. ఇడ్లీకూడా తెస్తాను."

'ఏమీ వద్దంటుంటే!' తీవ్రంగా వున్నది రేఖ కంఠం.

ఓ క్షణం రేఖ ముఖంలోకి చిత్రంగా చూసి కిందకు దిగాడు సుందర్రావు. రేఖ రిలీఫ్‌గా గాలి పీల్చుకుంది.

ముందు సీట్లో కూర్చున్న వాళ్ళను అంతవరకూ రేఖ గమనించలేదు. అతను ఏదో అంటున్నాడు. అతను అందంగా వున్నాడు. ఆమె ఓ మోస్తరుగా వున్నది. 'ఎందుకండీ బస్‌లో కూడా సతాయిస్తారు' అంటున్నది ఏడుపు గొంతుతో.

'నీ ముఖం చూడాలంటేనే అసహ్యం. పిల్లల కోసం... తప్పక...'

'నాకు తలనొప్పిగా వుంది. దయచేసి ఒక కప్పు కాఫీ, ఒక యాస్ప్రిన్ ఇప్పించండి' కణతలు నొక్కుకుంటూ అన్నది. అతను నవ్వాడు. క్రూరంగా నవ్వాడు. సంతృప్తిగా నవ్వాడు. రేఖ అతన్నే చూస్తూ వుండిపోయింది. అతను కొడుకుని తీసుకొని బస్ దిగాడు. ఆమె కళ్ళు తుడుచుకుంది. రేఖకు ఆమెమీద జాలి వేసింది. తన దగ్గిర వున్న శారిడాన్ ఇవ్వాలనుకుంది.

తను ఆమెను చూసి జాలిపడే స్థితిలో వున్నదా? ఆమె భర్త అందంగా వున్నాడు. అదృష్టవంతురాలు. అలాంటి భర్త కోపగించుకుంటే మాత్రం ఏం?

దూరం నుంచి ఒక చేత్తో ఇడ్లీ ప్లేటు, మరో చేత్తో కాఫీ గ్లాసూ పట్టుకొని వస్తున్న భర్తను చూస్తుంటే రేఖకు బస్ నుంచి దూకి పారిపోవాలనిపించింది. హే భగవాన్! ఈ అవతారంతో ఇంకెంత కాలం? బుద్ధి వచ్చింది. తను మరెక్కడికీ బయటికి వెళ్ళదు. దూరంగా నిల్చుని చంద్రం సిగరెట్ తాగుతూ తననే చూడటం గమనించి రేఖ ముఖం తిప్పుకుంది.

'వద్దని చెప్పలేదూ?' కస్సున లేచింది భర్తమీద.

'ఇంకా మూడు గంటలు ప్రయాణం చెయ్యాలి. పొద్దుటనగా టిఫిన్ చేశావు. తీసుకో!' ప్రేమగా అన్నాడు ఇడ్లీ ప్లేటు అందిస్తూ.

'నాకు వద్దంటుంటే? అవతల పారేయ్!' విసుక్కుంది రేఖ.

"నామీద కోపం వచ్చిందా?"

ముందు సీటులో వున్న ఆవిడ వెనక్కు తిరిగి సీటు పైనుంచి ఇద్దర్నీ మార్చి మార్చి చూసింది.

"అక్కర్లేదంటుంటే విన్పించడంలా?" రేఖ విసుగ్గా ముఖం తిప్పుకుంది.

సుందర్రావు బిక్క మొహంవేసి, వెనక్కు తిరిగి, రెండు చేతుల్తో రెండూ పట్టుకొని, కాఫీ హోటల్‌కేసి నడుస్తుంటే, రేఖకు ఎలుగుబంటు వెనక కాళ్ళమీద వెళ్తున్నట్టు అన్పించింది.

అప్రయత్నంగా దూరంగా నిల్చున్న చంద్రంకేసి చూసింది. అతను వెళ్తున్న సుందర్రావును చూస్తున్నాడు. రేఖ శిరస్సు సిగ్గుతో వాలిపోయింది.

'అదేమిటమ్మా! ఆయన పాపం, ప్రేమగా తినమంటూ వుంటే...'

రేఖ గిర్రున తలతిప్పి చూసింది.

ముందు సీట్లో వున్న యువతి అంటోంది –

"భర్త దొరుకుతాడు అందరికీ! కాని ప్రేమించే భర్త దొరకడం అదృష్టం. ఆ అదృష్టం మీ లాంటి కొందరికే లభిస్తుంది."

రేఖ కళ్ళు పెద్దవి చేసి ఆ యువతి ముఖంలోకి చూసింది.

సమాధానం ఎలా చెప్పాలో తెలియలేదు.

అంతలో కొడుకుని వెంటబెట్టుకొని ఆమె భర్త వచ్చాడు.

"కాఫీ ఏదీ?" భార్య అడిగింది.

"నీ మొహానికి నేను బస్ దగ్గరకు కాఫీ మోసుకు రావాలా? ఇంటికెళ్ళాక తాగొచ్చులే. ఇంకా రెండు గంటలేగా?" అన్నాడు ఆమె భర్త.

ఆమె కిక్కురుమనలేదు.

రేఖకు జాలి వేసింది. అతను కొండచిలవలా కన్పించాడు రేఖ కళ్ళకు.

ఇప్పుడు ఆమె కళ్ళకు అతను అందంగా కన్పించటం లేదు. తనే అయితే? ఇలాంటి వాడితో ఒక్కరోజు కూడా కాపరం చేసేది కాదు. ఇంత క్రూయల్టియా?

దూరంగా సుందర్రావు వస్తూ కన్పించాడు. అతని ముఖం చిన్నబుచ్చుకొని వున్నాడు. భర్తనే చూస్తూ వున్నది రేఖ. సుందర్రావు దగ్గరగా వచ్చాడు. ఆ ముఖంలో ఎంతో అలసట కన్పించింది.

పాపం! రాత్రింబవళ్ళు కష్టపడతాడు – ఎవరి కోసం? భార్య కోసం! బిడ్డ కోసం! ఒక్కనాడూ తనను నొప్పించేలా ప్రవర్తించ లేదు. అమృత హృదయుడు! అమాయకుడు!

మనిషికి కావల్సింది హృదయ సౌందర్యం! హృదయ సౌందర్యం లేని బాహ్య సౌందర్యం ఎందుకు? కోసుకు తినడానికా? బాహ్య సౌందర్యం హృదయ సౌందర్యం లోపించినప్పుడు, అది వికృతంగా కన్పిస్తుంది.

భర్త దగ్గరగా వచ్చాడు.అతన్ని చూస్తుంటే రేఖకు జాలి వేసింది. తనమీద తనకే అసహ్యం వేసింది.

"చూడండీ, ఒక సోడా పిలవండి. అర్ధరూపాయికి పల్లీలు తీసుకురండి" అన్నది.

సుందర్రావు భార్య ముఖంలోకి చూశాడు. ఆమె ముఖం ప్రశాంతంగా వున్నది.

బస్ కదిలింది. రేఖ పల్లీలు తింటూ కూర్చుంది. పక్కన కూర్చున్న చంద్రంకేసి చూడలేదు.

సుందర్రావు పాన్ తీశాడు. భార్యకు అందించాడు. ఆమె తీసుకుంది. సుందర్రావు చంద్రానికికూడా పాన్ ఇచ్చాడు.

బస్ వేగంగా పోతున్నది.

సుందర్రావు నిద్రలోకి జారిపోయాడు.

గురక పెడుతున్నాడు.

రేఖ అతని ముఖంలోకి చూసింది.

ఆ ముఖంలో పది సంవత్సరాల తాలూకు కఠిన పరిశ్రమవల్ల కలిగిన అలసట కనిపిస్తున్నది. అలా నిద్ర పోతున్న సుందర్రావు ముఖంలో పసివాడి అమాయకత్వం కన్పించింది.

రేఖ కళ్ళముందు కొడుకు కన్పించాడు.

భర్త గురక విన్పిస్తున్నది.

రేఖకు ఇప్పుడు ఆ గురక అసహ్యాన్ని కలిగించడం లేదు. ఎవరైనా చూస్తున్నారనే సిగ్గు కూడా కలగడంలేదు.

నిర్లిప్తంగా బస్ కిటికీలోనుంచి బయటికి చూస్తూ కూర్చుంది.

## అభ్యాసం

**I. వ్యాస రూప సమాధాన ప్రశ్నలు**

1. 'రేఖ' పాత్ర ఆలోచనా విధానాన్ని విశ్లేషించండి?
2. 'సౌందర్యం' కథ ద్వారా మనుషుల స్వభావాలను వివరించండి?

❖ ❖ ❖

5

# ఎచ్చరిక



- బోయ జంగయ్య

## రచయిత పరిచయం

తీవ్రమైన అణచివేతకూ, అమానవీయ చర్యలకూ గురైనా; మొక్కవోని దీక్షతో ముందుకు సాగిన కథా రచయిత బోయ జంగయ్య. వీరు 01.09.1942 తేదీన నల్గొండ జిల్లా చౌటుప్పల్ మండలం, లింగారెడ్డి గూడెంలో మేనమామల ఇంట్లో జన్మించారు. వీరి స్వస్థలం యాదాద్రి జిల్లా పంతంగి గ్రామం. బోయ జంగయ్య తల్లిదండ్రులు ఐలమ్మ, మల్లయ్య. జంగయ్య ఎన్నో కష్ట, నష్టాలకోర్చి బి.ఏ. పూర్తి చేశారు. జీవనోపాధి కోసం ఎన్నో చిన్న చిన్న ఉద్యోగాలు చేశారు.

బోయ జంగయ్య సాహిత్య ప్రయాణం 1960 దశకంలో మొదలైంది. విద్యార్థి దశ నుంచే వీరు రచనలు చేయటం ప్రారంభించారు. కేవలం కథలేకాక, ఇతర ప్రక్రియల్లోనూ అనేక రచనలు చేశారు. కష్ట సుఖాలు, దేశం కోసం, కొత్త బాటలు, ఆలోచించండి మొదలైన నాటికలను; లోకం, గొర్రెలు, ఎచ్చరిక, దున్న, రంగులు, చీమలు, తెలంగాణా వెతలు మొదలైన కథా సంకలనాలు; నడుస్తున్న చరిత్ర, వెలుతురు, బోజ కవితలు, పంచనామా మొదలైన కవితా సంపుటాలు; జాతర, జగడం, పుట్టుమచ్చ మొదలైన నవలలను బోయ జంగయ్య రచించారు. ఇంకా కొన్ని జీవిత చరిత్రలు, బాలల సాహిత్యం, వయోజన సాహిత్యాన్ని కూడా వీరు ప్రకటించారు.

బోయ జంగయ్య అనేక సన్మానాలు, పురస్కారాలు అందుకున్నారు. 'జాతర' నవలకు 1989లో ఉత్తమ నవలా అవార్డు, 'ఎచ్చరిక' కథా సంపుటికి శ్రీశ్రీ స్మారక స్వర్ణపతకం (1983) లభించాయి. వీరి సామాజిక, సాహిత్య సేవలను గుర్తించి తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారం (2002), గౌరవ డాక్టరేటు (2003) లను ఇచ్చి గౌరవించింది. తెలుగులో కల్పనా సాహిత్యాన్ని ఎంతగానో ఇనుమడింపచేసిన బోయ జంగయ్య 07-05-2016 న కన్ను మూశారు.

మనచుట్టూ కన్పించే జీవన దృశ్యాలు, సామాజిక వివక్షలు, ఆర్థిక దోపిడీలు వంటివి బోయ జంగయ్య కథా వస్తువులు. 'ఎచ్చరిక' కథలోనూ వీటిని మనం గమనించగలం. ఈ కథ ద్వారా వర్గ సమాజంలోని ఆర్థిక దోపిడీ స్వభావాన్ని తెలియచేసి, విద్యార్థి లోకంలో సామాజిక చైతన్యాన్ని కల్గింపచేయడం ఈ పాఠ్యభాగం ఉద్దేశం. ప్రస్తుత పాఠ్యభాగం అరసం (గుంటూరుశాఖ) ప్రచురించిన 'బోయ జంగయ్య' కథల నుంచి స్వీకరించ బడింది.

## పాఠ్యభాగం

**బా**వి దగ్గరనుండి ఎత్తుకొచ్చిన నాగలిని కొట్టంలో దించి తలపాగను సర్దుకుంటూ వస్తున్న పెంటయ్యకు ఏబదేండ్లు. మడత పోసి కట్టిన దొడ్డు ధోతి మోకాలును దాటలేదు. రుమాలులో చెక్కిన మ(్రాకు చుట్ట పుట్టకొక్కులా కనిపిస్తూ వుంది.

కొట్టం దాటి ఇంటిముందున్న పందిరి కింద నిలుచొన్న నర్సిరెడ్డి పటేలు పెంటయ్యను ఉద్దేశిస్తూ –

"నీ కొడుకు జీతం ఉండను అన్నాడంట, నా బాకీ తీర్చి మీ ఇష్టం ఉన్నతాడికి పోండ్ర" అంటూ తాను కప్పుకున్న దుప్పటి మలిచి గోడకు ఆనించి వుంచిన మంచం పట్టెమీద పెట్టాడు.

"తీర్చుకుంటే తప్పుద్దా పటేల" అంటూ నిక్కి పందిరిమీది పగ్గాన్ని అందుకొని చుట్ట చుట్టి చేత పట్టుకున్నాడు.

"ఇది తప్పించుకొనే ఎత్తేర" పెంటయ్య వైపు తిరుగుతూ.

"అట్ల తప్పించుకొనే జల్మ కాదు, ఎవరి రుణం ఎందుకు పడాలె? దేవుడిచ్చిన రెక్కలున్నయి. తినో తినకో కడుపు పట్టుకొని అప్పు తీర్చుకుంట" ఏదో బాధ ముక్కుల్లో నుండి బయటికి రాగా కళ్ళలో నీళ్ళు తిరిగినవి.

"నీవు తీర్సేంత తీర్సితివి, మిగిలింది నీ నించి కాదు."

"ఆడు నేను సెప్పంగ ఇంటలేడాయె! పోతా, పోతా అని ఒక్కటే పాట! ఇగ నేను ఎంజెయ్యాలె సెప్పుండ్రి."

"యాడికిరా పొయ్యేది! ఇక్కడ చేసినా చెయ్యకున్నా నడుసుద్ది. కూరుపట్ల బడ్డా, నీడ పట్టుకాసిన దినబత్తెం ఎక్కసబోదు. వుర్కి వుర్కి పాలు తాగిందానికంటే, నిలబడి నీళ్ళు తాగింది మంచిదిర" ఎన్నికల్లో ఓటరుకు, కార్యకర్త తన అభ్యర్థి గూర్చి నచ్చచెప్పినట్లుగా నర్సిరెడ్డి పటేలు తన జీతగాడైన పెంటయ్యకు చెపుతున్నాడు.

మూడు తరాల నుండే పెంటయ్య, వాళ్ళ తాత, తండ్రి, నర్సిరెడ్డి పటేలు తాత, తండ్రి దగ్గర వ్యవసాయపు పనులు చేసేవాళ్ళు. పెంటయ్య గూడ తన బాల్యం నుండే మొదట పశువుల కాపరిగా వుంటూ తాను ఎదుగుతూ, పొలం పనులన్నీ నేర్చుకున్నాడు. ఆ తర్వాత ఇప్పుడు మొత్తం వ్యవసాయాన్నే చూస్తూ, మిగతా తోటి వాళ్ళతో పనులు చేయిస్తున్నాడు. పెంటయ్య కొడుకు రాములు చిన్నప్పటి నుండి తండ్రి, తాతల్లాగే పసుల దగ్గర, ఆ తర్వాత పొలం, పనులు చేస్తూ వస్తూ ఒక్కసారే–

"ఇక నేను ఈ పనులు చేయను" అన్నాడు. అంతే ఇక పటేలుకు పట్టరాని కోపం వచ్చినా, దాన్ని తమాయించుకొని తన అప్పు చెల్లించమంటున్నాడు. అయినా తాతనాడు, తండ్రినాడు లేని ధైర్యం, ఇంతటి ఆలోచన వీడికెట్లా వచ్చిందా అని తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

"అది గాదురా! మీ తాత, తండ్రి దేశాల మీద పోయి బతికిండ్రా! చెప్పురా? సప్పుదు సెయ్యవ్?"

"నేనేమి సెప్పను పటేల, మా తాత సెప్పితే మా అయ్య యిన్నడు, మా అయ్య సెప్పితే నేనిన్న. ఈనాటి వరకు మీ కాళ్ళ దగ్గరే పడున్న."

"అట్టనే మరి వానికి గూడ జెర సెప్పుర."

"సెప్పి సెప్పి ప్రాణం ముక్కలకొచ్చె, ఏమన్నంటే కయ్న లేస్తుండె"

"సరే మీ ఇష్టం, అప్పు సెల్లగట్టి పొమ్మను" అంటూ పటేలు యింట్లోకి విసురుగ వెళ్ళాడు.

పెంటయ్య అక్కడనుండి కదిలి తన గూడెం పోతున్నాడు. మువ్వల చప్పుడుతో కచ్చడం ఎదురొచ్చి ఆగింది. కచ్చడంలో నుండి తొంగి చూస్తూ–

"ఏంర పెంట బాగున్నావా?" అంటూ అడిగాడు, పట్నంలో చదువుతున్న పటేలు కొడుకు శీన్‌రెడ్డి.

"ఆ ఆఁ బాగానే వున్న" ఎంతో తృప్తిగ ఏదో పొందిన వాడిలా అన్నాడు పెంటయ్య. కచ్చడం కదిలింది.

తన ఇంటివైపు నడుస్తున్న పెంటయ్య తల నిండా ఆలోచనలే. పోరడు ఆనాడు చెపితే యినడాయె–

మనస్సు ఒక్కసారె ఇరవై ఏండ్ల ఎనుకకు పోయింది. అప్పుడు తాను బలంగ బండెద్దులాగ వుండేవాడు. ఆ రోజు పటేలు ఈలాగే మాట్లాడిండు.

తన కొడుకును బడికి పంపిద్దామనుకుంటే–

"ఎందుకురా సదివి ఏమెలగబెడతడు? అరే ఈ భూమి, ఈ యవసాయం ఎవరికిర, చేసుకొని మంచిగ బతక్క" అన్నాడు.

పెంటయ్య దొర కళ్ళలోకి చూశాడు. అది గ్రహించిన దొర–

"నీవు నా కల్ల ఎందుకు చూస్తున్నావో అర్థమైందిర! నా కొడుకును వద్దంటున్నావు, మరి నీ కొడుకును బడికెందుకు పంపుతున్నావని గదా? వానికి వాడి తాత సంపాదించింది వుంది. కాబట్టి సదువుతాడు. వద్దనుకున్ననాడు వచ్చి ఇంట్లో కూర్చుని తింటడు. ఇంకా కావాలనుకుంటే యియ్యాల రేపు ఓటివుందిగ, అందర్కి పనికొచ్చేది. అదే రాజకీయాలు. మరి నీ కొడుకు? మీకు రెక్కాడితేనే గదరా డొక్కాడేది."

పెంటయ్యకు తన పరిస్థితి ఏమిటో అర్థం అయింది. ఆ రోజు అన్నం తినేటప్పుడు భార్యతో చెప్పాడు. ఆమె ఏం మాట్లాడలేదు. ఆమె తొడమీద అప్పటి ఆరేండ్ల రాములు నిద్రపోతున్నాడు. వాడి చేతిలో కాల్చిన చితపాలకాయ అలాగే వున్నది. పెంటయ్య చిప్పలోకి గంజి వొంచి, ఓ పచ్చి మిరపకాయ అందించింది.

అయల్ల అదన్న పిల్లగాణ్ణి తప్పక బడిలో తోల్తా అంటే పంపుదునో ఏమో! అప్పుడి నుండి సదువుకుంటే ఇప్పుడు పెద్ద అమీన్‌సాబో, సదువు పంతులో అయ్యేటోడె.

భోజనం ముగించుకొని, పళ్ళల్లో పుల్లను గుచ్చుకుంటూ పందిట్లో అటు, ఇటు తిరుగుతూ వీడికి ఈ బుద్ధి ఎలా పుట్టిందా అని ఆలోచిస్తున్నాడు నర్సిరెడ్డి పటేలు. తన ఏబదేండ్ల కాలంలో ఇలాంటి పరిస్థితిని ఎన్నడూ చూడలేదు. మూతికి ముండ్లగోరు కట్టిన దూడ, సంకలో పచ్చిగడ్డి మోపుతో రాములు కొట్టుకొచ్చిన బర్రెను చూడగానే తోకాడిస్తూ పరిగెత్తి, తన తల్లి పొదుగు దగ్గర మూతి పెట్టింది. మూతికున్న ముళ్ళు గుచ్చుకోగానే

దూడను కొమ్ములతో నెట్టేసి, గుంజ దగ్గరికెళ్ళి నిలుచుంది. మోపును బర్రె గాడిలో విప్పేసి దోతి కొంగులో కుక్కుకొని తెచ్చిన లేత గడ్డి పోసల్ని దూడముందేసి, దాని మూతికున్న ముల్ల బుట్టిని విప్పాడు. అది తోకాడిస్తూ గడ్డి పరకల్ని మేస్తూ వుంది. దాన్నే దువ్వుతున్న కళ్ళలో కొత్త మెరుపు, మనసులో కొత్త ఆలోచనలు.

'ఇంతకు ముందు బర్రె, దూడను ఎందుకు తన్నింది? దాన్ని పాలు ఎందుకు తాగనీయలేదు? దూడ మూతికి ముల్లగోరు వుంది. ముల్లగోరు ఎవరు కట్టారు? పటేలు. దూడకు ముల్లగోరు, మా నెత్తిన అప్పుల బరువా!'

తప్పించుకుపోయే కోడిపిల్లను గద్ద పొంచి చూసినట్లు రాములునే చూస్తున్న పటేలు–

"ఏంరా జీతం వుండవన్నవట!"

కొట్టంలో నుండి బయటికొస్తున్న రాములు చప్పుడు చెయ్యలేదు.

"నిన్నే సప్పుడు సెయ్యవ్! పోతే పో. సంచిల దుగ్గాని సల్లగుంటే సవాలక్ష మంది. కాని అప్పుంది సూసినావ్, అది సెల్లగట్టి నీవు, నీ అయ్య ఇద్దరు పొంగ్రి... అక్కడ అదే ఆ దుబాయ్‌ల మియ్యాగాడు కూకోబెట్టి కట్టలకు కట్టలే ఖాజాన పంచి పెడతడు."

రాములు చప్పుడు సెయ్యలేదు. ధోతికి అంటుకున్న గడ్డిపోచలని ఏరేసుకుంటూ నిలుచున్నాడు. పటేలుతో ఎన్నడు మాట్లాడలేదు రాములు. ఏమైన ఉంటే తండ్రికే చెపుతుంటాడు.

రాములుకు ఇరవై సంవత్సరాలు దాటినయ్. సన్నగ, నల్లగ వుంటాడు. పటేలు ధోతి కట్టు కంటే కొంచం పైకి, తండ్రి ధోతి కట్టు కంటె కొంచెం కిందికి అతని కట్టు. తండ్రిలా తలపాగ కట్టక పటేల్ కొడుకులా క్రాఫ్ చేయించుకున్నాడు. ఈ మధ్యనే జేబులో ఓ పాత పెన్ను పెట్టుకుంటున్నాడు. ఆ వూరి చదువు పంతులు ఇంట్లో ఎండు కట్టె పుల్లల మోపును ఏస్తూ, రాత్రి పూటల్లా అమ్మ – ఆవు, ఒకటి, రెండు, రెండింటిలో ఒకటి తీస్తే ఒకటి అంటున్నాడు.

అప్పుడే భుజాన అనపకాయతో వచ్చిన పెంటయ్య దగ్గరనుండి దాన్ని తీసుకొని –

"అరె నీవు పోయి ఆ సాతాని పంతులును తీసుకురాపో. ఎనకటి కాగితాలు ఆల్లకు తప్ప ఇంకొకరికి పల్కవు" అంటూ తాను ఇంట్లోకి, పెంటయ్య వీధిలోకి నడిచారు. కొంతసేపయ్యాక పటేలు కాగితాలతోనూ, పెంటయ్య సాతాని పంతులుతోనూ తిరిగొచ్చారు.

"రండి పంతులుగారూ రండి" అంటూ పిల్చి పీట వేసి కూర్చోబెట్టి కాగితాలను ముందేశాడు.

"అంతా క్షేమమే గద. ఏమిటి సంగతి, పత్రాలు మీ వాడికి అర్థం కావు లెండి, వాళ్ళవి ఇంగ్లీషు చదువులు కదా."

"అందుకే మిమ్మల్ని పిలిచింది– కాస్త చూడండి పంతులు! వీళ్ళు లెక్కలకు తొందర పెడుతుండ్రు."

"ఏంద్ర పెంటా! ఎందుకు అంత తొందర! లెక్క దగ్గర తొందర పడొద్దు బిడ్డా!" అంటూ నశ్యాన్ని పీలుస్తు, రాములు వైపు చూస్తూ–

"ఏరా వీడు నీ కొడుకా?" ముక్కు తుడుచుకుంటూ అన్నాడు.

అవునన్నట్టు తల వూపాడు పెంటయ్య.

పంతులు కాగితాల మడతను విప్పుతున్నాడు. మొదటిది రంగు మారి, రాసిన రంగు వెలసి, కదిలిస్తే చినిగేటట్టుందా కాగితం. అది పెంటయ్య తాత పటేలు తాత గార్కి, తన తండ్రి పెళ్ళికి అప్పు తీసుకున్నప్పుడు రాయించిన పత్రం. దాని వయసు పెంటయ్య కంటే ఐదేళ్ళెక్కువ. దాన్ని పటేలుకు, పెంటయ్యకు చూపిస్తూ–

"చూసింద్రా అప్పటి కాగితం, అప్పటి సిరా. అంటే అప్పుడు ఈ ఇంకు ఎక్కడిది ఈ వూళ్ళల్లో, కాసిని బియ్యాన్ని నల్లగ మాడ్చి, పొడిచేసి, నీళ్ళలో కలిసి రాసేది" అంటూ పక్కకు నెట్టాడు.

మరో కాగితం దానికంటే తక్కువ వయసుది. ఇదీ రంగు మారిపోయింది.

ఇది పెంటయ్య తండ్రి పెంటయ్య పెండ్లప్పుడు పటేలు తండ్రి దగ్గర అప్పు తీసుకున్నప్పటి కాగితం. దానిమీద పెంటయ్య వేలిముద్ర కూడా వుంది.

ఇక మూడవ కాగితం. అది మాత్రం ఐదారేళ్ళ కిందిదే. అది పెంటయ్య పెద్దబిడ్డ పెళ్ళికి అప్పు తీసుకున్నప్పటిది. అన్నిటిని పూర్తిగ చదివి వినిపించాడు సాతాని పంతులు. ఆ కాగితాలు పెండ్లిలప్పుడు రాసిచ్చినవే అయినా, వాటి వెనకాల చావుకు, నోముకు, పుట్టుకలకు, పురుళ్ళకు తీసుకున్న చిల్లర అప్పులు కూడా రాసి వున్నవి.

అది విన్న పెంటయ్య "మొత్తం ఎంత బాకంటరు?" అతని శరీరంలో ఏదో కంపనం వచ్చింది. గొంతులో మార్పు వచ్చింది.

"చెయ్యి పంతులు, అసలు, మిత్తి ఎంతో లెక్క చేయండి".

పంతులు కాగితాలను మరోసారి చూసి, ఓ కాగితాన్ని తీసి–

"ఈ కాగితంలో అప్పు రూ. ఇరువై ఐదు హోలి, మిత్తి రెండు కుచ్చాలు నెలకు" అంటూ అరవై ఏండ్ల నుండీ లెక్క కట్టాడు.

"ఇది రెండవ కాగితం – తీసుకున్న రూపాయలు యాభై, వాటి మిత్తి పదింటికి పావలా చొప్పున" అంటూ ముప్పై ఏండ్ల నుండీ లెక్క కట్టాడు.

"ఈ కాగితం 1977 లోనిది. అప్పు రెండు వందలు. మిత్తి నెలకు నూటికి మూడు రూపాయలు" అంటూ మొత్తం లెక్క చేశాడు.

"ఇగ అన్నీ గుండు గుత్త సేసి సెప్పుండ్రి పంతులు" పటేలు.

పంతులు ఒక్కసారి మళ్ళీ నశ్యం పీల్చాడు. పటేలు చుట్ట ముట్టించాడు. పంతులు అన్నీ కలిపి కూడి, కనుబొమ్మలు ముడేసి, పటేలును చూసి, పెంటయ్య వైపు మళ్ళి –

"రెండు వందలు తక్కువ, రెండు వేల రూపాయలుర్ర" అంటూ కాగితాలను ఒకదానిపై ఒకటి పెట్టి వాటిపై పెన్నుంచాడు. పెంటయ్య నోరు తెరిచాడు. రాములు రెప్పవాల్చకుండ కాగితాలవైపు చూస్తున్నాడు. రాములు మదిలో రకరకాల భావాలు కదులుతున్నయి. కాగితాలు ఇన్నేండ్లు ఎందుకున్నట్టు? ఈ యింటిమీద ఆన కురవలేదా? ఈ ఇల్లు ఎప్పుడూ కాలిపోలేదా? పుట్ట పెరిగినట్టు పెరిగిన ఈ అప్పును ఎంసక్క ఇన్నాళ్ళు దాసి పెట్టింది. సరే చేసిన అప్పు తీర్చుతం. మరి మేం చేసిన కష్టం ఎటు పోయినట్టు? ఏట ఇచ్చే మడి గింజలను అప్పు కిందనే మల్లేసి ఎప్పుడు తీసుకోలేదని అయ్య చెప్పిండె! మరి బాకీ ఏం తగ్గ లేదూ?"

అయ్య పెండ్లప్పుడు అమ్మమ్మోళ్ళు ఇచ్చిన ఆవు కట్టి, కోడెను పెట్టి, పూటకు సర్వెడు పాలిస్తుంటే నీకు అవెందుకురా అని తీసుకునే మరి! దాని బాపతు రూపాయలు ఎటు పోయినట్లు?

తాను యిత్తు పాలుకు మేకను సాదితే, తన భాగానికి ఒక మేక పిల్ల వస్తే ఆయాకు, ఈయాకు మేపి ఏడాదిన్నర సాదితే దాన్నీ కోసుకు తినే, దాని పైసలు అప్పుల తగ్గించలేదా?

ఇట్ల అన్నింటిని లెక్క కడితే ఇంక అప్పెక్కడుంటది? అనుకొని ఓ శ్వాస ఒదిలి మళ్ళీ పీల్చి కాస్త ధైర్యం చెప్పుకొని–

"పంతులుగారూ! మేము తీసుకున్న అప్పునే లెక్క చేసింద్రు గానీ మరి మేం తీర్చిన రకం గురించి ఏం చెప్పుతరు?"

"చూదుర కాగితం మీద వున్నది చదివి మీరు విన్నాక లెక్క వేసి చెప్పా. నేను నా సొంతంగా చెప్పలేదుర" మరొకసారి నస్యాన్ని పీల్చాడు.

"కాదు పంతులు, మేము మల్లెసుకున్న మడిగాసం ఎటుబోయినట్టు?"

"మా తాత చేసిన కష్టం, మా అయ్య చేసిన కష్టం, నేను చేసిన కష్టం, ఇప్పటికి మూడు తరాల రెక్కల కష్టం అంతా ఎటు బోయినట్టు? జెర సూదుండ్రి పంతులు, ఏమన్న వొజాత్ పెట్టిండేమో."

పంతులు మళ్ళీ కాగితాల వెనక చూశాడు. కొంత ధాన్యం ఇచ్చినట్టు, వాళ్ళు మళ్ళీ తీసుకున్నట్లు రాసి వుంది. అదే చెప్పాడు.

"గల్ల మల్లేసినా ఏ పురుడుకో, ఏ పండక్కో, మళ్ళా తీసుకుంటనే వుండిరి, వొజాత్ దాకా వచ్చినాది?"

తన తండ్రి యిస్తారి చెప్పిన మాటలు గుర్తొచ్చినవి పెంటయ్యకు. ఈ పటేలు తండ్రి పెద పటేలు పెండ్లపుడు రెండు దున్నలు, ఒక బర్రె ఉన్న సంసారం. తనకు గుర్తు తెలిసే వరకే రెండు దొడ్ల పసులు అయి ఇప్పుడు మూడు దొడ్ల పసులు, ఇరువై ఎకరాల తరి, ఏభై ఎకరాల చెలకాయె. తాను ముల్లు గర్ర పట్టినాకనే రెండు కొత్త బావులను తవ్వించి కరెంటు పెట్టించె. కరెంటు రాక ముందు మోట కొట్టి, కొట్టి నిద్ర అన్నమాట ఎరగమైతిమి.

తండ్రి, తల్లి, తాను భార్య పిల్లలు అందరు రాత్రింబగళ్ళు కష్టించి పనిచేసి గంత వున్న ఆస్తిని ఇంత సేస్తే, ఈనాటికీ తన తండ్రి పెళ్ళి బాకీ తీరదాయె. ఆల్ల ఆస్తి పెరిగితే మాకు అప్పు పెరుగుద్దా? అని ఏ నాలుగు సార్లు అనుకున్నా, ఈ మాట ఒక్కసారే బయటికొచ్చింది.

"ఆల్లకు ఆస్తి పెరిగితే మాకు అప్పు పెరుగుద్దా? నేను, రేపు నాకు పుట్టబోయే పిల్లలు కష్టం చేసినా ఈ అప్పు పెరుగుతూనే వుంటుంది" అన్నాడు రాములు నేలను చూస్తూ పటేలుకు, పంతులుకు వినబడ్డట్టే. ఒక్కసారె పటేలు ఎదరొమ్ముమీన చెయ్యేసి కదిపినట్టనిపించింది.

"అయితే మీ రెక్కల కష్టం వల్లనే మా ఆస్తి పెరిగిందంటరు."

మరి కాకపోతే అన్నట్టు చూశాడు రాములు.

మావానికెరుక లేదులే అన్నట్టు చూశాడు పెంటయ్య.

"సూస్తున్నవా పంతులు, ఈళ్ళ తమాషా."

"ఏంరా పిల్లగ ఏదైనా పార్టీల జేరినావురా?"

"పూటకు లేనోళ్ళకు మాకు పార్టీలెందుకు పంతులు" పెంటయ్య.

"పార్టీ లేదు. గీర్టీ లేదు. వీని బిడ్డ మొగుడు దుబాయ్ పోయిండు. ఇంతో అంతో సంపాయించుకొచ్చిండు. గోసి పోయి ప్యాంటొచ్చింది. సేతికి గడియారం, సంకల రేడియో, అన్ని సూసి ఈన గోసి సదురుకుంటుండు. దుబ్బను సరిగ దున్ననాయన దుబాయ్‌కి పోతాడట."

"పోతే పోయె! మన మేమన్న సాది పెట్టినమా! బాకీ కట్టిపోతే సరి."

"అదేం మాట పంతులు! మనం సాదందే బతికింద్రా, పంటైనా, పాడైనా వాళ్ళు తిన్నంకనే కదా మనిల్లు చేరేది."

"మరింకేంది! బాకీ తీర్చిపో. కానీ అక్కడ మన దేశంలో లాగ కాదురా! ఇక్కడ ఇష్టమున్నది మాట్లాడొచ్చు. ఇష్టమొచ్చిన చోటికి వెళ్ళి బతకొచ్చు. ఇష్టమున్న మతం పట్టొచ్చు. అక్కడ ఇవన్నీ సాగవు. ఎక్కువ మాట్లాడితే ఏటను నర్కినట్టు నరుకుతరట. అక్కడ అంతా తుర్కోల్లేనట" పంతులు.

"ఏ మతం అయితే మాకేంది? కష్టం సేస్తేనే కాదా కడుపు నిండేది?"

"అంటే ఇక్కడ ఆకలితో చస్తున్నర్ర!"

"నోటితో సెప్పాలన పంతులు" రాములు.

"సూసింద్రా పంతులు! ఇగ మీరే సెప్పుండ్రి నాయం."

"ఎక్కడికైనా పో – కష్టం తప్పదు" పంతులు.

కొంతసేపు అందరి మధ్య నిశ్శబ్దం.

ఇంట్లోకి తొంగిచూసి–

"అరె సీన్ రెడ్డీ, దొడ్డి కాడికి పోయి మన ముసలి పయ్యెద్దును చెలకకు కొట్టుకపోక, నడవదని వదిలిపెట్టి పోయింగ్రు. జెరన్ని నీళ్ళు తాపి, ఇన్ని గడ్డిపోసలేసి రా పో" జీతగాళ్ళకు చెప్పలేక తన కొడుకుతో అన్నాడు.

"దాన్నమ్మక యింకెన్నాళ్ళు వుంచుతరే" అంటూ చేతిలో పుస్తకంతో వచ్చి, పుస్తకాన్ని మంచం మీద పడేసి దొడ్డివైపు నడిచాడు.

"రామ రామ! నీకే మెరకరా నాయనా! అది ఎంత కష్టం చేసింది" అంటూ పంతులు వైపు మళ్ళి–

"ఆ ఎద్దును ఏడేండ్ల కింద తొమ్మిదొందలకు కొన్న. పొలాన్ని దున్నడమే కాకుండ బండి లాగింది. బంతి తొక్కింది. దానివల్ల ఎంతో కష్టం కల్సొచ్చిందంటే నమ్ము, అందుకే అది సచ్చిందాక సాది అటెంక బొంద పెడతాం, దాన్ని మాత్రం కోతకమ్మను" అన్నాడు.

"అంతేమరి" పంతులు.

పటేలు మాటలు గూడ రాములు తలలోని ఆలోచనలకు కొత్త రూపమిచ్చినవి. పెంటయ్య కూడా ఆలోచనలో పడ్డాడు.

"అయ్య చెపితే ఇనవు. మన బతుకులు గొడ్డు కన్నా అధ్వాన్నం అన్న సంగతి తెల్సుకున్నవా! తొమ్మిదొందలు పెట్టి ఏడేండ్ల కింద కొన్న ఎద్దు ఎంతో కష్టం చేసింది" పంతులు వైపు మళ్ళి–

"పంతులు గారూ! ఎద్దు కష్టం వల్ల ఎంతో కలిసొచ్చింది. కాబట్టి దాన్ని సచ్చేవరకు సాదాలి, మూడు తరాల నుండి మనుషులు కష్టం చేస్తూనే ఉంటేనేమో ఆసామికి కలిసి రాలేదు. మాకూ అప్పు పెరుగుతూనే వుంది. రేప్పొద్దున్న సచ్చిన్నాడు కూడా మల్ల అప్పే సెయ్యాలె. అంటే ఎద్దు కంటే ఈనమైన బతుకన్నమాట మాది."

పంతులు ఆలోచనలో పడ్డాడు.

పెంటయ్య చీకటి బతుకులో ఈ రోజు పొద్దు పొడిచినట్లయింది. అంతేకాదు, తన కొడుకు రాములే ఓ సూర్యుడిలా కనిపించాడు కళ్ళకు! ఒక్కసారె శక్తినంతా కూడదీసుకొని–

"మా లెక్క సరిగ తేలిందా సరే సరి, అప్పటి వరకు పనిలోకి రాం" అంటూ రాములు, పెంటయ్య అక్కడినుండి వెళ్ళిపోయారు.

భూకంపమొచ్చి తన ఇల్లు, తన భూములు, తన పశువులు అన్నీ అందులో కొట్టుక పోయినట్టు అనిపించిన పటేలుకు నోటి మాట రాక వాళ్ళు పోయినవైపే చూస్తూ బొమ్మలా నిలుచున్నాడు.

## అభ్యాసం

### I. వ్యాస రూప సమాధాన ప్రశ్నలు

1. 'ఎచ్చరిక' పాఠ్యభాగం ద్వారా భూస్వాముల దౌర్జన్యాన్ని వివరించండి?

2. 'ఎచ్చరిక' పాఠ్యభాగ సారాంశాన్ని తెలియజేయండి?

## కొన్ని మాండలిక పదాలు – అర్థాలు

**ఎచ్చరిక** = హెచ్చరిక; **పటేలు** = సామాజికంగా, ఆర్థికంగా పై స్థాయికి చెందిన వారిని గౌరవంతోనో, భయంతోనో పిలిచే సంబోధన – నిజాం పాలనలో పటేలు, పట్వారీ వ్యవస్థకిది ఆనవాలు; **ఉన్నతాడికి** = ఉన్న చోటుకి; **మలిచి** = మడిచి; **జల్మ** = జన్మ; **ఇంటలేదాయె** = వినడం లేదాయె; **కూరుపట్ల బడ్డా** = కునికిపాట్లు పడ్డా; **వుర్కి** = పరుగెత్తి; **సెల్ల గట్టి** = చెల్లుచేసి, తీర్చి; **చితపాలకాయ** = సీతాఫలం; **అమీన్ సాబ్** = పోలీసు అధికారి, సబ్ ఇన్‌స్పెక్టర్; **ముండ్లగోరు** = పాలు తాగే దూడకు మూతికి కట్టడం కోసం ముళ్ళతో తయారు చేసిన బుట్ట; **బర్రెగాడి** = పశువులు గడ్డి మేయడానికి వీలుగా గాడి (చిన్న గోడ) కట్టి నిర్మించిన ప్రత్యేక స్థలం; **దోతి** = దోవతి, పురుషులు కట్టుకొనే పంచె; **దుగ్గాని** = రెండు కాణులు. ఒక కాణికి ఆరు పైసలు; **మిత్తి** = వడ్డీ; **హాలి** = నైజాం కరెన్సీ – బ్రిటీషు పాలకులతో, ప్రభుత్వంతో సంబంధం లేకుండా నిజాం రాజు ఏర్పరచుకున్న ప్రత్యేక కరెన్సీ; **కుచ్చాలు** = కుంచాలు – ధాన్యాన్ని కొలిచే ఒక కొలమానం; **గుండు గుత్త** = పదితో శేషం లేకుండా భాగించడానికి వీలైన సంఖ్య. దీనినే మనం 'రౌండ్ ఫిగర్' అని వ్యవహరిస్తున్నాం; **ఆన** = వాన; **ఆవు కట్టి, కోడెను పెట్టి** = ఆవును, కోడెను తాకట్టు పెట్టి; **సర్వెడు** = శేరెడు – ధాన్యాన్ని కొలిచే ఒక కొలమానం; **యిత్తు పాలుకు** = పండిన పంటను ఆసామి, రైతుకూలి ముందుగా అనుకున్న ప్రకారం భాగం పంచుకోవడం; **మల్లేసుకున్న** = మలుపుకున్న, తిప్పుకున్న; **మడిగాసం** = చేయించుకున్న సేవలకు గాను కులవృత్తిదార్లకు ఫలసాయం పంచడానికి ఆసామి ప్రత్యేకంగా కేటాయించిన మడి. (**గాసం** = గ్రాసం); **వొజాత్** = బదులుగా; **గల్ల** = ధాన్యం; **తరి** = మాగాణి భూమి; **చెలక** = మెట్ట భూమి; **మోట** = కపిల; **పైంటొచ్చింది** = ప్యాంటు వచ్చింది; **ఈనగోసి** = పంట చేతికొచ్చాక (ఈనగాసి నక్కలపాలు అయినట్టన్న సామెత ఉంది); **ఏట** = మేక, గొర్రె; **ముసలి పయ్యెద్దు** = తెల్లని ముసలి ఎద్దు; **బంతి తొక్కడం** = నూర్పిడి సమయంలో పంటను పశువులతో తొక్కించడం; **అటెంక** = ఆ వెనుక, ఆ తరువాత; **బొంద** = పూడ్చి పెట్టడం, సమాధి చేయడం.

❖ ❖ ❖

6

# దహేజ్

- శశిశ్రీ



## రచయిత పరిచయం

తెలుగు కథకుల్లో ఒకానొక విశిష్ట రచయిత శశిశ్రీ. మూడు దశాబ్దాలుగా తెలుగు పాఠకులకు సుపరిచితులైన శశిశ్రీ అసలు పేరు షేక్ బేపారి రహమతుల్లా. శశిశ్రీ అనేది వీరి కలం పేరు. కడప జిల్లా సిద్ధవటంలో 05.12.1957 తేదీన శశిశ్రీ జన్మించారు. షేక్ బేపారి సలీమాబీ, షేక్ బేపారి రసూల్ సాబ్ వీరి తల్లిదండ్రులు.

శశిశ్రీ కేవలం కథకులే కాదు; మంచి కవి, వక్త కూడా. అనేక ప్రక్రియల్లో వీరు రచనలు చేశారు. పల్లవి, శబ్దానికి స్వాగతం, జేబులో సూర్యుడు, కాలాంతవేళ వంటివి విస్తృత ప్రాచుర్యం పొందిన వీరి వచన కావ్యాలు. 'సీమగీతం' అనే పద్య కావ్యాన్నీ; 'మనకు తెలియని కడప' అనే చరిత్ర గ్రంథాన్నీ; 'చూపు' అనే వ్యాస సంపుటాన్నీ; 'దహేజ్', 'రాతిలో తేమ'; 'Tunes of Life' 'రాతి పూలు' అనే కథా సంపుటాలనూ ప్రకటించారు.

ప్రసార భారతిలో న్యూస్ రిపోర్టర్‌గా శశిశ్రీ సుదీర్ఘ కాలం పనిచేశారు. 'సాహిత్య నేత్రం' పత్రికకు సంపాదకులుగా కూడా వ్యవహరించారు. అభ్యుదయ రచయితల సంఘం కార్యవర్గ సభ్యులుగా పనిచేశారు. యోగి వేమన విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులుగా కూడా నియమించబడ్డారు.

వివిధ రంగాలలో అందించిన సేవలకుగాను శశిశ్రీ అనేక పురస్కారాలు అందుకున్నారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నుంచి స్వీకరించిన 'ఉత్తమ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు అవార్డు (2007)', ఉగాది విశిష్ట సాహిత్య పురస్కారం (2010) వీటిలో ముఖ్యమైనవి. అంతర్జాతీయ సంస్థ అయిన యునిసెఫ్ (UNICEF) అవార్డు (2010) ను కూడా అందుకోవడం వీరి ప్రతిభకు నిదర్శనం. ఇవేకాక ఇతర సంస్థల నుంచి కూడా శశిశ్రీ అనేక పురస్కారాలను పొందారు. 'పట్టాభి రామిరెడ్డి లిటరరీ అవార్డు (2008)' 'కొండేపూడి శ్రీనివాసరావు సాహిత్య పురస్కారం (2008)', 'ఉత్తమ సాహిత్య సంపాదకుడు' వంటివి వాటిలో గుర్తించదగినవి. అనతి కాలంలోనే మంచి రచయితగా ప్రాచుర్యం పొందిన శశిశ్రీ 31.03.2015న మరణించారు.

ప్రస్తుత పాఠ్యభాగం 'దహేజ్' 'రాతిలో తేమ' అనే కథా సంపుటి లోనిది. ఈ కథానిక తొలిసారిగా నవ్య వార పత్రిక (27.12.2006)లో ప్రచురితమైంది.

సాధారణ ముస్లిం కుటుంబాలలోని వివాహ వేడుకను, విధి విధానాలను కళ్ళకు కట్టినట్టు చిత్రించిన కథ 'దహేజ్'. 'దహేజ్' అంటే బహుమతి అని సామాన్యార్థం. సాధారణంగా వధూవరులు కొత్తగా కాపురం పెట్టే సమయంలో ఎంతో కొంత వరకట్నంతోపాటు, కుటుంబ జీవితానికి అవసరమైన సమస్త వస్తు సముదాయాన్ని వధువు తల్లిదండ్రులు సమకూర్చ వలసి ఉంటుంది. కొన్ని ముస్లిం కుటుంబాలు ఈనాటికీ అనుసరిస్తూ ఉన్న ఈ విధానానికి 'దహేజ్' అనే వ్యవహారం రూఢి అయింది. కొన్ని ప్రాంతాల్లో దీనిని 'జహేజ్' అని కూడా వ్యవహరించడం ఉంది. 'దహేజ్' పేరుతో మగపెళ్ళివారు ఆడపిల్లల తల్లిదండ్రులను ఆర్థికంగా ఎంత తీవ్రంగా పీడిస్తున్నారో రచయిత ఈ కథలో తెలియచేశారు. కథావస్తువు ముస్లింల జీవితానికి సంబంధించింది కనుక ఈ ఆర్థిక పీడన ముస్లిం కుటుంబాల లోనే ఉంటుందనుకోకూడదు. ఈ కథావస్తువు అన్ని కుటుంబాలకూ వర్తించేదే. ఈ సామాజిక వాస్తవికతను గుర్తింప చేయడం, భవిష్యత్తులోనైనా ఈ ఆర్థిక పీడనకు విముక్తి కల్గించాలన్న స్పృహను కలగచేయడం ఈ పాఠ్యభాగం ఉద్దేశం.

## పాఠ్యభాగం

సుల్తానా – రెహమాన్ పెండ్లి.

మధ్యాహ్నం నిక్కా జరిగింది. ఇప్పుడు రాత్రి 11 గంటలైంది.

"ఇవేం పెండ్లిల్లో ఏమో నాయనా ! మా రోజుల్లో సాయిబుల యిండ్లలో పెళ్ళంటే ఏడు రోజులు సందడి సందడిగా జరిగేది... కాలాలు మారి పోయాయి". మగ పెళ్ళి వారి వైపు ముసలామె బుగ్గలు నొక్కుకుంటూ పక్కావిడతో అంది.

"మీ రోజులు యిప్పుడు ఎక్కడున్నాయ్ అవ్వా ! నా పెండ్లి కాలానికి పెండ్లంటే – ఒకరోజు షుక్రానా రెండో రోజు నిక్కా... ఆ మరుసటి రోజు వలీమా... ఆ తరువాత అయిదు శుక్రవారాలు అయిదు జుమాగీలు జరిగేవి. ఆ పద్ధతి యిప్పుడు లేక పోయే కదా!" అంది మధ్య వయసు పెద్దమ్మ.

"అది కాదు చిన్నమ్మా! మీ కాలంతో యిప్పుడు పోలిస్తే ఎట్లా. ఇప్పుడు ఎవరికి మాత్రం తీరిక వుంది. మీ రోజుల్లో కాలం కాళ్ళతో నడిచేది. ఇప్పుడు విమాన వేగంతో కదా పోతూ వుంది. అందుకే ఒక్క రోజులోనే అన్ని సాంగ్యాలు అయిపోజేస్తున్నారు. కాలంతో పాటు మనం పరిగెత్తక పోతే – ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అయిపోతుంది" పంజాబీ డ్రస్సులో పెదాల రంగు సరి చేసుకుంటూ అంది పెళ్ళి కొడుకు అక్క పర్వీన్.

"అవున్లే తల్లీ! మేం కూర్చోని నీళ్ళు తాగేవాళ్ళం. ఈమె కాలంలో నిలబడి తాగేవాళ్ళు. ఇప్పుడు మీ కాలంలో పరుగెత్తుతూ పాలు తాగుతున్నారు. మంచిదే! రాను రాను యింక ఏం ఏం చూడాల్నో..." అంది అవ్వ.

"ఇక్కడ కూర్చోని ఏం చేస్తారమ్మా... పెండ్లి మంటపం పైకి రండి! వధూవరుల్ని "రసం" చేసి "వారాఫేరీ" చేద్దురు గానీ" పెళ్ళి సంబంధం కుదిర్చిన పేరమ్మ – జులేఖా అంది.

పెండ్లి మంటపం... పూల బారులతో గుబాళిస్తోంది. రంగు రంగుల తగట్ కాగితాలతో తళుకులీనుతోంది. ఎవరి తాహత్తుకు వారు తీసిపోని విధంగా బంగారు నగలు ధరించి... బనారస్ జరీ శారీలలో... పంజాబి లాచా డ్రస్సులతో... మజ్మా, జన్నతుల్ ఫిరదౌస్, గులాబ్ అత్తర్ల గుమగుమలతో వాతావరణం వింత వాసనలు జాడిస్తున్నాయి. రంగు లైట్ల సరాలు... బార్ లైట్లు. ఫోకస్ లైట్లు వెలుగుల్ని కుమ్మరిస్తున్నాయ్.

మంటపమే వేదిక కాగా దానిపైన పూలపందిరి మంచం... రంగుల దోమ తెరతో రాజఠీవి దర్పిస్తోంది.

ఆ పందిరి మంచంపై ఒకవైపు "సర్గా" ముసుగులో పెండ్లి కూతురు... ఇంకొక వైపు పెండ్లి కొడుకు. ఇరుప్రక్కల ఆడపడుచుల కలకల నవ్వులు.

పెండ్లి కూతురు – పెండ్లి కొడుకునకు మధ్య ఎర్రని తెర అడ్డం పట్టారు. వధూవరులు ఒకరి తలపై యింకొకరు బియ్యం తలంబ్రాలు పోసుకున్నారు. తరువాత అడ్డు తెరతీసి – వధూవరులు యిద్దరి తలలపై కప్పారు.

ఎదుట కూర్చున్న వధువు ముఖాన్ని ముసుగులో నుండే అద్దంలో చూడమని వరునికి అద్దమందిస్తూ చెప్పారు. అలాగే చేశాడు. మొదటిసారి తన దుల్హన్ – వధువును చూసినందుకు శుభ సూచకంగా – వరుడు ఆమె చేతికి పత్తేకి అంఘోటి – ఉంగరం ఎక్కించాడు.

మిష్రి – కలకండ ముక్కను ఆడపడుచులు వధువు భుజాల పైవుంచి – దానిని వరునికిచ్చి సగం కొరికించి, ఆ మిగిలిన సగం తీసుకున్నారు. ఎంగిలి చేసిన సగం ముక్క మిష్రి వధువుకు తినిపించారు.

"కలకండ తియ్యగా వుందా... పెండ్లి కూతురు తియ్యంగా వుందా! చెప్పవయ్యా పెండ్లికొడకా!" అంది ఒక ఆడపడుచు.

"కట్నంగా తీసుకున్న 3 లక్షలు తియ్యగా వుందని చెప్పు" గొంతు తగ్గించి చిన్నగా అందొక కొంటెపిల్ల.

"ఏయ్! ఏంటా మాటలు... అవతలికిపో" పెండ్లి కూతురి వైపు నుంచి ఎవరో మందలింపుగా అన్నారు.

వరుడు రెహమాన్ చెవిన ఆ మాటలు పడినాయి. విననట్టు వుండి పోయాడు.

"కలకండ, పెండ్లి కూతురు రెండూ తీపుగున్నాయ్ అని చెప్పు" వరుని వైపు ఆవిడ అంది.

"అట్లెట్లా చెప్తాడమ్మా! అందాల రాశి... నా వధువే తియ్యన అని చెప్పమనండి" అంది వధువు వైపు మరో ఆవిడ.

"నాలుకకు తీపి మిష్రి... బతుకంతకు తీపి నా దుల్హన్" అన్నాడు రెహమాన్.

వరుని నోట కవితా పలుకులు విని ఆడపడచులంతా భళ్ళున పగలబడి నవ్వారు. ఒక్కమారు జుల్వా – శోభన మండపం నవ్వులతో పరవశించింది.

వధూవరులను యిరు వైపుల మహిళా బంధువులు, పడుచు పిల్లలు గొంతులకు తడి గంధం రాసి – 'వారాఫేరి' సాంగ్యం చేశారు. ఆ తంతు కాగానే – వరున్ని మంచం దిగి నిలబడమన్నారు. నించున్న వరున్ని – వధువును భుజంపైకి ఎత్తుకోమన్నారు.

తన దుల్‌హన్‌ని భుజానికెత్తుకోడానికి కొంచెం తటపటాయించాడు రెహమాన్.

"దుల్‌హన్‌ని ఎత్తి – భుజానికెత్తుకున్నావంటే – ఇంక సంసార బరువు సులభంగా మోస్తావు... వూఁ కానీ ఎత్తుకో" అంది పెళ్ళి కుదిర్చిన పేరమ్మ – జులేఖా.

గుండెలనిండా వూపిరి బిగించి – ఒక్క ఎత్తులోనే తన వధువు సుల్తానాను భుజంపైకి తీసుకున్నాడు. అందరి కళ్ళు సంతోషంతో మిలమిల మెరిస్తే – వరుని కళ్ళు – మొహం కాసింత విజయ గర్వాన్ని సూచించాయి.

ఈలోగా ముత్తయిదువ ఒకామె పళ్ళెంలో తడిగంధం తెచ్చింది.

"కుడి అరచేత్తో ఒకసారి ఎడమ అరచేత్తో ఒకసారి గడపమాను యిరుదిక్కుల చేతి ముద్రలు వేయ్ నాయనా!" పేరమ్మ – జులేఖా చెప్పింది.

అలాగే చేశాడు రెహమాన్, భుజంపైన వత్తిగిలి తీగల వాలిన సుల్తాన... నిముషాలు గడిచిన కొద్దీ... బరువు పెరుగుతున్నట్లు అనిపించింది. వరుని నుదిట చిరు చెమట బొట్లు వుబికి వచ్చాయి.

వరునివైపు పెద్దాయన ఒకరు ఆ పరిస్థితిని గుర్తించాడు.

"ఎంతసేపు ఎత్తుకుంటావ్ బాబు! అదో ఆ కుర్చీల్లో నీ దుల్‌హన్‌ని కూర్చోబెట్టి నువ్వూ కూర్చో" సలహా యిచ్చాడు.

వెంటనే ఆ పనిచేసి తేలిగ్గా వూపిరి పీల్చుకున్నాడు వరుడు, కృతజ్ఞతగా ఆ పెద్దాయన్ని చూస్తూ.

"బాగా రాత్రి అయిపోయింది. తొందరగా మీ సాంగ్యాలు పూర్తి కానివ్వండి. దూలా – వరుని ఇంటికి పిల్లను తీసుకొని పోయేది ఎప్పుడు – కార్యం జరిగేది ఎప్పుడు? తెల్లారేదాక సాంగ్యాలే అయితే ఎట్లా!?" వరుని వైపు పెద్దాయన అన్నాడు.

"అన్నీ అయిపోయినాయి లేండి హజరత్! "దహేజ్" తెచ్చి అమర్చినారు. ఒకసారి చూసుకొన్నాక – ఇక సాగనంపడమే కదా! రండమ్మ రండి! దహేజ్ చూస్కుందురు కానీ" పేరమ్మ – జులేఖా హడావుడి చేసింది.

దహేజ్ – కాపురానికి కావల్సిన సామగ్రినంతా వధువు తండ్రి – సులేమాన్ సిద్ధంగా పెట్టించాడు. ఫ్రిజ్, గ్యాస్ సిలెండర్, స్టౌవ్, కిచెన్ స్టాండ్, వంట పాత్రలు స్టీలివి, అల్యూమినియమ్‌వి, వరుని కోసం మోటార్ సైకిల్, బట్టలు పెట్టుకునేందుకు రాజా – రాణి బీరువా, డ్రస్సింగ్ టేబుల్, డైనింగ్ టేబుల్, ఎయిర్ కూలర్, వధువు కోసం మేలైనవి పది, మామూలివి ఇరవై జతల బట్టలు... కాపురం చేసుకోడానికి కావాల్సిన సామగ్రీ అంతా అక్కడ వుంది.

చూసే అమ్మలక్కలకు కళ్ళు జిగేల్ అనిపిస్తున్నాయి. “అమ్మాయి నాయన అన్నీ ఇచ్చినాడమ్మా! పాన్‌దాన్ నించి వకాల్‌దాన్ దాక బిడ్డకు సమకూర్చినాడు. ఏం తక్కువ చేయలేదు. చాలా మంచోనిలా వున్నట్టుంది” వరుని దూరపు బంధువు ఒకామె అంది.

దహేజ్‌లో సామగ్రిని అంతా కళ్ళు అప్పగించి చూస్తున్నారు.

ఇక అల్‌విదా – వీడ్కోలు తంతు జరగాల్సి వుంది.

వధువు తండ్రి సులేమాన్ – వరుని తండ్రి ఫకర్‌దీన్ దగ్గరకు పోయి నమస్కరించాడు. కూర్చున్న ఫకర్‌దీన్ లేచి ప్రతి నమస్కరించాడు.

“ఫకర్‌దీన్ భాయ్... ఇక నా బిడ్డ మీ ఇంటి కోడలైంది. తండ్రి అయినా మావ అయినా మీరే! ఆ బిడ్డకు మీ ఆశీస్సులు ఎప్పుడూ వుండాలని కోరుకుంటున్నాను”, అని చెమ్మగిల్లిన కళ్ళను తుడుచుకున్నాడు సులేమాన్.

“మీరు అంతగా చెప్పాల్నా అన్నగారు. మీ బిడ్డ ఇక మా ఇంటి ‘షాన్’ – పరువుగా చూసుకుంటాం. మీరు నిశ్చింతగా వుండండి!” సేద తీర్చేలా చెప్పాడు ఫకర్‌దీన్.

అక్కడి నుంచి – అల్లుడైన వరుడు రెహమాన్ దగ్గరికి పోయాడు సులేమాన్.

అల్లున్ని ఆలింగనం చేసుకొని – ‘దువా’ చేశాడు. తర్వాత –

“చూడు నాయనా! ఇరవై యేండ్లు నా బిడ్డను ఏ కష్టం రాకుండా, ఏ రోజు కంటతడి పెట్టకుండా సాకినాను. ఇప్పుడు నా బిడ్డను నీ చేత్లో పెట్టినాను. జీవితం కడవరకు నీ వెంట వుండాల్సిన ఆమెని – ఎలా చూసుకుంటావో ఏమో...” అని గద్గదపోయి – జలజల కళ్ళ వెంట నీరు రాల్చుకున్నాడు సులేమాన్.

ఆ మాటలు విన్న – వధువు సుల్తానాకు, అప్పటి వరకు గుండెలో దాచుకున్న బాధ కళ్ళలో నీరయి చెంపలపై జారాయి.

“అబ్బాజాన్! అబ్బాజాన్!!...” అంటూ సులేమాన్ భుజంపై తలపెట్టి తృప్తిమీర పేగుతీపు కదిలేటట్లు ఏడ్చింది.

“బాధపడకు సుల్తానా... బాధపడకండి మామూజాన్! నేను అన్ని సవ్యంగా చూసుకుంటాను కదా! పెద్దలు మీరే డీల పడిపోతే ఎలా చెప్పండి!?” వోదార్పుగా అన్నాడు అల్లుడు రెహమాన్.

“ఏవండి...ముందు ఇలా రండి మీరు...” దహేజ్ అమర్చిన దగ్గర్నించి కేకేసింది – వరుని తల్లి రబియాబీ.

ఆ కేకతో అక్కడి వాతావరణం ఒక్కమారుగా గంభీరంగా మారిపోయింది. ఏం జరిగింది... ఏమైంది అంటూ ఆడ, మగ ఒకరి మొహాలు యింకొకరు చూసుకున్నారు.

ఆడపిల్ల వైపు వారు నిర్ఘాంతంగా చూస్తున్నారు. వధువు తండ్రి సులేమాన్ కళ్ళు పెద్దగా చేసుకొని వియ్యంకురాలి కేక వచ్చిన దిక్కు చూచాడు.

"ఏమే! ఏమైందని గావు కేక పెట్టినావు?" ఆందోళనగా అడిగాడు ఫకర్‌దీన్.

"ఏం కొదవ చేయలేదు... ఏం కొదవ చేయలేదు అంటూనే ఏమండి ఈ పనికిమాలిన తనం. అవతల మన పరువు ఏమై పోవాలో చూడండి" భర్తనుద్దేశించి అంది రబియాబీ.

"ఇంతకు ఏం జరిగిందో చెప్పబ్బా! ఎందుకు నోరు పారేసుకుంటావ్ 'సందావ' – వియ్యంకుల్లో ఏమనుకుంటారో కొంచెం ఆలోచించు" భార్యను శాంతింపచేసే వ్యర్థ ప్రయత్నం చేశాడు ఫకర్‌దీన్.

"ముందు – నిస్‌బత్ (సంబంధం) కుదిర్చిన జులేఖాని ఇలా రమ్మని చెప్పండి! ఈ వైపు తులం బంగారు... ఆ వైపు తులం బంగారు కమీషన్‌గా తీసుకుంటే సరేనా... మాట యిచ్చిన ప్రకారం దహేజ్ యిచ్చినారో లేదో చూసే యింగితం లేకపోతే ఎట్లా?" ధుమధుమలాడుతూ అంది.

ఆ దరిదాపుల్లోనే వుండిన జులేఖా అక్కడికి చేరుకుని–

"ఏమ్మా! ఏం తక్కువైందని హైరాన పడ్తున్నారు – నెమ్మదిగా చెప్పండి" అడిగింది.

"అంతా నా నోర్తోనే చెప్పాల్నా? సంబంధం కుదిర్చిన నీకు, బిడ్డను కాపురానికి పంపిస్తున్న ఆ పెద్ద మనుషులకు తెలియదా!? దహేజ్‌లో యిస్తామని ఏమేం చెప్పారో అవన్నీ వున్నాయో లేదో చూసుకోకుండా పోతే ఎట్లా? గుడ్ల నీళ్ళు పెట్టుకుని చేతులు పట్టుకుంటే – చేసిన లోపం దాచుకుని పోతుందా?" రెచ్చిపోయి నోటికి ఎంతమాట వస్తే అంతేసి మాట అంది రబియాబి.

"అంతేసి మాటలు ఎందుకు లేండి. చెప్పండి. ఏం తక్కువైందో..." జులేఖా అడిగింది.

"ఏం అక్కగారూ! అంత కోపం చేసుకుంటే ఎలా! బంధువుల్లో మా మర్యాద పోదా!? ఏం తక్కువ చేశామో చెప్పండి" వధువు తల్లి జైనబ్ బి ప్రాధేయ పూర్వకంగా అడిగింది.

"ఏందే... ఇంతకు అసలు సంగతి చెప్పక – లేనిపోని గలాట చేస్తున్నావు" భార్యను నిందిస్తూ అడిగాడు ఫకర్‌దీన్.

"ఏముంది... కలర్ టీవీ యీ దహేజ్‌లో ఎక్కడుంది!? కనీసం కలర్ టీవి యివ్వాలని తెలియదా! కడపలో 'రివాజ్' తెలియదా! వాళ్ళేమైనా వేరే ప్రాంతాల్నించి వచ్చిన వాళ్ళా ఏం". మనసులో సంగతి బయట పెట్టింది రబియాబీ.

"దహేజ్‌లో కలర్ టీవీ యిస్తారని – నేను మీతో ఎప్పుడు కూడా చెప్పలేదు. ఇప్పుడు కలర్ టీవి కావాలంటే ఎట్లా చెప్పండి" పెళ్ళి కుదిర్చిన జులేఖా అంది.

"ఏంది! ప్రతిదీ చెప్పాల్నా!? దహేజ్ అంటే చాల్దా! అయినా ఈ రోజుల్లో కలర్ టీవీ లేంది – ఏ ఆడబిడ్డ అయినా కాపురానికి పోతా వుందా చెప్పండమ్మా మీరు..." వత్తాసు కోసం తన వారిని చూస్తూ చెప్పింది రబియాబీ.

"చూడండమ్మా! కలర్ టీవీ గురించి మీ ఆయనతో సంబంధం కుదిరేటప్పుడే మాట్లాడ్డం జరిగింది. కట్నం డబ్బులు 3 లక్షలు తీసుకుని పోయే రోజే మీ ఆయన ఏమన్నారో తెలుసా... ఏం ఫకర్‌దీన్ సాబ్ గుర్తుందా! మీరేం అన్నారో... షైతాన్ కా డబ్బా – అది యిండ్లలో వుంటే కొంప నాశనమైపోతుంది. ఆ వస్తువు మా ఇంటికి అక్కరలేదు అన్నారు గుర్తుంది కదా..." సులేమాన్ అందరూ వినేటట్లు చెప్పాడు.

"నిజమే కానీ, ఈ ఆడోళ్ళు వున్నారే..." అని ఏదో అనబోయే లోగానే వాళ్ళ ఆవిడ ఎత్తుకుంది.

"ఆయనకేం తెలుసయ్యా! రోజంతా బయట వుండే వానికి. నాలుగు గోడల మధ్య వుంటూ బిక్కు బిక్కుమని బతికే మాకు తెలుసు. అయినా మీకేం బుద్ధి పోయిందండి! ఇస్తాం అనే వాళ్ళను అడ్డు చెప్పడానికి" భర్తను మందలించింది.

"దయచేసి ఒక్క అరగంట వోపిక పట్టండి. దహేజ్ పూర్తి చేస్తాను" అని వధువు తండ్రి సులేమాన్ విస విస బయటికి నడిచాడు.

ఆనందంగా... నవ్వులు – కేరింతలు, చతురోక్తులతో సాగిపోతున్న 'జుల్వా' కార్యక్రమం యిలా వున్న పళంగా సీరియసై పోవడం యిరువైపు బంధువులకు నచ్చలేదు. ఎవరంతకు వాళ్ళు గుసగుసలు పోసాగారు.

అరగంట గడవడం, వెళ్ళిన సులేమాన్ రావడం జరిగింది.

"దయచేసి అందరూ రండి!" పిలిచాడు సులేమాన్. ఏం జరుగుతుందో వుత్కంఠతో అంతా చేరారు ఒక చోటికి.

"మేరే మెహర్బాన్ భాయోఁ... బహెనో... మా వియ్యంకురాలు కోరిన కలర్ టీవి ఇది. పెద్దది. కడప ఏడు రోడ్ల సర్కిల్‌లో అంగడి ఇంత రాత్రి అయినా తెరిపించి తెచ్చాను... ఏమ్మా... దహేజ్ సరిపోయిందా... లోటు ఏం లేదు కదా!?" అడిగాడు వియ్యంకురాలు రబియాబీని.

"ఆఁ, సరిపోయింది లేండి, అదేదో ముందే ఏర్పాటు చేసి వుంటే – మధ్యలో నేను చెడ్డదాన్ని కాకపోదును కదా!?" అందామె.

"అవన్నీ వద్దు! మీకు చెందాల్సిన దహేజ్ సరి పోయిందా! ఇంకేమైనా లోపం వుందా? అది చెప్పండి ముందు!" చాలా కటువుగా అడిగాడు సులేమాన్.

"ఇంగేం వుందిలే అయ్యా! సరిపోయింది లేండి" పేరమ్మ – జులేఖా అంది.

"అందరూ వింటున్నారు కదా! మా వియ్యంకురాలు – ఈ పెండ్లి కుదిర్చిన ఆమె అంతా దహేజ్ సరిగ్గా సరిపోయింది అని... తక్కువ ఏం లేదని వప్పుకున్నారు. నిజమే కదా!?" మళ్ళీ గట్టిగా అడిగాడు సులేమాన్.

"అన్నా! మీరు బాధపడినట్లుంది, శాంతించండి! పెండ్లిళ్ళో యిలాంటివి ఏవో ఒకటి జరుగుతాయి. మీరు మనసుకు ఎక్కించుకోకూడదు. ఇంతట్తో వదిలేయండి. అవతల తెల్లారేట్లు వుంది. దూల్హా తన దుల్‌హన్‌ని ఇంటికి తీసుకొని వెళ్ళనివ్వండి" ఫకర్‌దీన్ వీలయినంత అణుకువగా ప్రాధేయపడి చెప్పుకున్నాడు.

“బాధ పడటం కాదు ఫకరద్దీన్ భాయ్! దహేజ్... దహేజ్ సంగతి చెప్తున్నా. మీరు అందరూ అనుకున్నట్లు ఈ దహేజ్ ఇంకా పూర్తి కాలేదు. ఇప్పుడు నేను చేస్తా!

ఇదో ఇది ఎర్ర కఫన్ గుడ్డా!

ఇదేమో తెల్ల కఫన్ గుడ్డా!!

భర్త వుండగా నా బిడ్డ చచ్చిపోతే ఎర్ర కఫన్ గుడ్డా... భర్త పోయాక చచ్చిపోతే ఈ తెల్ల కఫన్ గుడ్డా దయచేసి వాడండి! ఇదే... ఇదే... నేను దహేజ్‌లో మరచి పోయింది! ప్రతి ఆడబిడ్డ తండ్రి గుర్తుంచుకోండి!! దహేజ్‌లో మీ బిడ్డకు కఫన్ కూడా ఇవ్వండి... మరచి పోకుండా ఇవ్వండి” సొమ్మసిల్లి సులేమాన్ క్రింద పడిపోయాడు.

## అభ్యాసం

### I. వ్యాస రూప సమాధాన ప్రశ్నలు

1. ‘దహేజ్’ కథలోని వివాహ సంప్రదాయాన్ని వివరించండి?
2. ‘దహేజ్’ కథా సారాంశాన్ని రాయండి?

### కొన్ని పదాలు - అర్థాలు

**నిక్కా** = పెళ్ళి; **షుక్రానా** = పెళ్ళికి ముందురోజు రాత్రి చేసే కార్యక్రమం- సాంగ్యం లాంటిది; **వలీమా** = మలి పెళ్ళి - పెళ్ళి తరువాత మరుసటిరోజు పెళ్ళి కొడుకు ఇంటి దగ్గర నిర్వహించే విందు భోజన కార్యక్రమం; **రసం** = సాంగ్యం; **పేరమ్మ** = పెళ్ళిళ్ళ పేరయ్యకు స్త్రీవాచకం; **పూలబారు** = పూలదండలు; **తగట్ కాగితాలు** = తళుకులీనే కాగితాలు; **రంగు లైట్ల సరాలు** = వివిధ రంగుల బల్బుల దండలు, వీటినే మనం సీరియల్ లైట్స్ అని వ్యవహరిస్తున్నాం; **బార్ లైట్లు** = ట్యూబులైటులు, ఫోకస్ లైటులు; **సర్గాముసుగు** = పెళ్ళి సమయంలో వేసే ముసుగు; **దుల్హన్** = వధువు; **పత్తేకి అంఘోటి** = ఆకు ఆకారంతో ఉన్న ఉంగరం; **వారా ఫేరి** = దిష్టితీసే సాంగ్యం; **గడపమాను** = గుమ్మం; **దూలా** = దుల్హా, వరుడు; **కార్యం** = శోభనం; **హజరత్** = మసీదులో ప్రార్థన చేయించే మతపెద్ద; **అల్విదా** = వీడ్కోలు; **సాకినాను** = పెంచినాను, పెంచాను; **సందావ** = వియ్యంకులు; **నిస్బత్** = సంబంధం; **రివాజ్** = సంప్రదాయం, అలవాటు; **మేరే మెహర్బాన్ భాయో! బహెనో** = నా ప్రియమైన సోదర సోదరీ మణులారా!; **కఫన్** = శవంపై కప్పే వస్త్రం; **పాన్దాన్** = తమలపాకుల పెట్టె; **వకాల్దాన్** = చేతులు కడిగే పాత్ర; **షాన్** = మర్యాద, గౌరవం, తేజస్సు; **దువా** = ఆశీర్వాదం

❖ ❖ ❖

# మాదిరి ప్రశ్న పత్రం

సమయం : 3 గంటలు | మార్కులు : 100

---

**గమనిక : ప్రశ్న పత్రం ప్రకారం సమాధానాలను వరుస క్రమంలో రాయాలి.**

**I. ఈ క్రింది పద్యాలలో ఒక దానిని పాదభంగం లేకుండా పూరించి, భావం రాయండి.** 1x6=6

1. అన్నకుఁ దండ్రికిన్ ......కృతార్థుఁ డెయ్యెడన్
2. ఎన్నో యేండ్లు....నిక్కం బిందు పాషాణముల్

**II. క్రింది ప్రశ్నలలో ఒక దానికి 20 పంక్తులలో సమాధానం రాయండి** 1x6=6

1. తిన్నడు శివలింగాన్ని తన ఊరికి రమ్మని పిలచిన తీరును తెలుపండి?
2. వేములపల్లి శ్రీకృష్ణ పేర్కొన్న పూర్వపు 'తెలుగోడి' వైభవాన్ని వివరించండి?

**III. క్రింది ప్రశ్నలలో ఒక దానికి 20 పంక్తులలో సమాధానం రాయండి** 1x6=6

1. హాస్యం యొక్క లక్షణాలను తెలుపండి?
2. 'కలవారి కోడలు కలికి కామాక్షి'లోని గ్రామీణ సంస్కృతిని వివరించండి?

**IV. క్రింది ప్రశ్నలలో ఒక దానికి 20 పంక్తులలో సమాధానం రాయండి** 2x4=8

1. 'అంపకం' పాఠ్యభాగ సారాంశాన్ని రాయండి?
2. దహేజ్ కథలోని వివాహ సంప్రదాయాన్ని వివరించండి?
3. కుంకుడాకు కథలోని సామాజిక ఆర్థిక అంతరాలను వివరించండి?
4. రేఖ పాత్ర ఆలోచనా విధానాన్ని వివరించండి?

**V. క్రింది వానిలో రెండింటికి సందర్భ సహిత వ్యాఖ్యలు రాయండి** 2x3=6

1. శునక మధిక భక్తి విడువక చనఁగన్
2. బరికించి దశాననుండు పకపక నగియెన్
3. సవతి బిడ్డలపోరు మనకేలా
4. మానవ రూపం దాల్చింది

**VI. క్రింది ప్రశ్నలలో రెండింటికి సంక్షిప్త సమాధానాలు రాయండి (పద్యభాగం)** 2x3=6

1. నకులుని గుణాలను తెలుపండి?
2. తిన్నడు తెలిపిన పండ్ల రకాలను పేర్కొనండి?
3. భగత్‌సింగ్‌ను గురించి రాయండి?
4. శ్మశానంలోని అభేద భావాన్ని తెలుపండి?

**VII. క్రింది ప్రశ్నలలో <u>రెండింటికి</u> సంక్షిప్త సమాధానాలు రాయండి (గద్యభాగం)** 2x3=6

1. మాటతీరు అంటే ఏమిటో వివరించండి?
2. కందుకూరి వారి సంస్కరణలను తెలుపండి?
3. అపహాస్యం గురించి సంక్షిప్తంగా వివరించండి?
4. బాలమురళి మొదటి సంగీత కచేరి గురించిన విశేషాలేమిటి?

**VIII. క్రింది ప్రశ్నలలో <u>రెండింటికి</u> సంక్షిప్త సమాధానాలు రాయండి (పాఠ్యాంశ కవులు / రచయితలు)** 2x3=6

1. ధూర్జటి గురించిన విశేషాలేమిటి?
2. మల్లాది సుబ్బమ్మ సామాజిక సేవను వివరించండి?
3. శ్రీరంగం నారాయణబాబును గురించి రాయండి?
4. దేవులపల్లి కృష్ణశాస్త్రి గురించి తెలియచేయండి?

**IX. క్రింది వానిలో <u>ఒకదానికి</u> లేఖ రాయండి** 1x5=5

1. మీ ఇంటర్మీడియట్ చదువు గురించి స్నేహితులకు లేఖ రాయండి?
2. విద్యుత్ కోత సమస్యను గురించి సంబంధిత అధికారికి లేఖ రాయండి?

**X. క్రింది పదాలలో <u>నాల్గింటిని</u> విడదీసి, సంధిపేరు సూత్రం రాయండి** 4x3=12

1. అత్యంత  2. సూడిదవెట్టిన  5. నోరెత్తి
3. మహోగ్ర  4. కవీంద్రుడు  6. చేరంబోయి
7. తూలినయట్లు  8. ఆత్మైక

**XI. క్రింది పదాలలో <u>నాల్గింటికి</u> విగ్రహవాక్యాలు రాసి, సమాసాల పేర్లు రాయండి** 4x2=8

1. భక్ష్య భోజ్యములు  2. కార్యశూరులు  5. నలుదిక్కులు
3. రాక్షసాధముడు  4. బ్రహ్మకపాలం  6. నేరేడుపండ్లు
7. నల్లపూసలు  8. వేటకుక్కలు

**XII. క్రింది పదాలలో <u>ఐదింటికి</u> పదదోషాలను సవరించి సరైన రూపాలను రాయండి** 5x1=5

1. క్రుతయుగం  2. స్మశానం  5. సనివారం
3. వుడుత  4. ద్రుశ్యం  6. బేదం
7. ఎనక  8. బాష  9. భాద
10. క్రుష్ణుడు

**XIII. క్రింది ఆంగ్ల వాక్యాలను తెలుగులోనికి అనువదించండి** 5x1=5

1. Mount Everest is the highest peak in the world
2. He speaks Telugu as well as English
3. Ramayana was written by Valmiki
4. Amaravathi is the capital of Andhra Pradesh
5. The train had left before I reached the station

**XIV. క్రింది గద్యాన్ని చదివి ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయండి** 5x1=5

తెలుగు భాషకు ఆంధ్రభాష, తెనుగు భాష అనే పేర్లు కూడా ఉన్నాయి. మన తెలుగు కవులు 'దేశ భాషలందు తెలుగు లెస్స' అని తెలుగును ప్రస్తుతించారు. తమిళ జాతీయ కవి సుబ్రహ్మణ్య భారతి మన తెలుగును 'సుందర తెలుంగు' అని కొనియాడారు. క్రీ.శ. 15వ శతాబ్దపు ఇటలీ యాత్రికుడు నికోలో డి కాంటే తెలుగు భాషను 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అని ప్రశంసించాడు. తెలుగు అజంత భాష. కాబట్టి నాద సౌష్ఠవం కలిగి, సంగీతానికి అనుకూలంగా ఉంది. ఈ విధంగా వేనోళ్ళ ప్రస్తుతించబడిన మధురమైన మన తెలుగు భాషను పరభాషా ప్రభావాలతో మనవారే చిన్న చూపు చూడడం చాలా దురదృష్టకర విషయం. తెలుగు భాషను రక్షించుకొని దానికి పూర్వ వైభవాన్ని తీసుకు రావడం తెలుగువారందరి ప్రథమ కర్తవ్యం.

**ప్రశ్నలు :**

1. నికోలో డి కాంటే ఎవరు?
2. తెలుగు భాషకు గల ఇతర పేర్లేవి?
3. తెలుగుభాషను నికోలో డి కాంటే ఏమని కీర్తించాడు?
4. 'సుందర తెలుంగు' అని తెలుగును ఎవరు ప్రశంసించారు?
5. తెలుగువారి ప్రథమ కర్తవ్యం ఏమిటి?

**XV. క్రింది వాటిలో <u>ఐదింటికి</u> ఏక వాక్య / పద సమాధానం రాయండి (పద్యభాగం నుండి)** 5x1=5

1. ధూర్జటి రచించిన శతకం పేరేమిటి?
2. నంది ఎవరి వాహనం?
3. కాంతం కథలు రాసిందెవరు?
4. విశాలాంధ్ర ఉద్యమానికి గొప్ప స్ఫూర్తినిచ్చిన గేయం ఏది?
5. తిక్కన ఎవరి ఆస్థానకవి?
6. లాహోర్ కుట్రకేసులో ఉరితీయబడిన దేశభక్తుడు ఎవరు?
7. నిటాలేక్షణుడు ఎవరు?
8. సారమేయ రూపాన ఉన్నదెవరు?

**XVI. క్రింది వాటిలో <u>ఐదింటికి</u> ఏక పద / వాక్య సమాధానం రాయండి (గద్యభాగం నుండి)** 5x1=5

1. 'నామవిజ్ఞానం' పై ప్రత్యేక అధ్యయనం చేసిన వారెవరు?
2. దేశి కవితకు ఒరవడి దిద్దింది ఎవరు?
3. త్యాగరాజస్వామి ఉత్సవాలు ఎక్కడ జరుగుతాయి?
4. రాయలవారి సాహితీ భవనం పేరేమి?
5. నారదుని వీణపేరు ఏమిటి?
6. గద్యతిక్కన అని కందుకూరిని ఎవరు శ్లాఘించారు?
7. మంగళంపల్లి నటించిన చలనచిత్రం ఏది?
8. మొత్తం లోకాలెన్ని?

❖ ❖ ❖